"బోధనాభ్యసన ప్రక్రియలు - ప్రణాళికలు - మూల్యాంకన విధానాలు"

# D.Ed. - తెలుగు

# ఛాత్రోపాధ్యాయుల కరదీపిక

GRK

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## రూపొందించినవారు

1) **శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

2) **శ్రీ టి.మహేష్‌బాబు,** ఉపన్యాసకులు, జిల్లా విద్యా శిక్షణా సంస్థ, నిజామాబాద్.

3) **శ్రీమతి వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, పశ్చిమ గోదావరి జిల్లా.

4) **శ్రీమతి యు.బుగ్గమ్మ,** తెలుగుపండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

5) **శ్రీమతి పి.మాధవి,** తెలుగు పండిత్, భారతీయ విద్యాభవన్, హైదరాబాదు జిల్లా.

6) **శ్రీమతి కె.ఆర్.టి.ఎల్.జ్యోతిర్మయి,** ఉపన్యాసకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

7) **శ్రీమతి డి.కనకవాణి,** ప్రొఫెసర్, ఐ.ఎ.ఎస్.ఇ., మాసబ్‌ట్యాంకు, హైదరాబాదు.

## విషయనిపుణులు, ఎడిటింగ్

1) **శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

2) **డా॥ డి.సాంబమూర్తి,,** విశ్రాంత ప్రధానాచార్యులు, ఉపాధ్యాయ విద్యాకళాశాల, వరంగల్.

3) **డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,** ప్రొఫెసర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## సలహాదారులు

1) **ప్రొఫెసర్ కె.సుధీర్‌రెడ్డి,** ఐ.ఎ.ఎస్.ఇ. కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

2) **ప్రొఫెసర్ ఎస్.మహేందర్‌రెడ్డి,** చైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్, కాకతీయ విశ్వవిద్యాలం, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్, శాతవాహన విశ్వవిద్యాలయం.

3) **ప్రొఫెసర్ కె.శివరత్నంరెడ్డి,** ప్రధానాచార్యులు, ఐ.ఎ.ఎస్.ఇ., శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

4) **ప్రొఫెసర్ టి.నిర్మలాజ్యోతి,** చైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

5) **ప్రొఫెసర్ ఎ.రామకృష్ణ,** విభాగాధిపతి, విద్యాశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

## ముఖ్య సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**

సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందుమాట

జాతి భవిష్యత్తు తరగతి గదిలో నిర్మాణమౌతుందని కొఠారిగారు చెప్పారు. అంటే పాఠశాలలు పిల్లల్ని జాతికి ఉపయోగపడే హేతుబద్ధమైన పౌరులుగా తయారుచేసే గురుతరమైన బాధ్యతను పోషించాల్సి ఉంటుంది. పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడం నిర్బంధ ఉచిత విద్యాహక్కుచట్టం 2011 ప్రకారం పిల్లల హక్కుగా మారింది. పిల్లలు ఆలోచించగలగడం, వ్యక్తీకరించడగలగడం, విచక్షణతో వ్యవహరించగలగడం, సబ్జెక్టువారీగా, తరగతివారీగా నిర్ధారించిన సామర్థ్యాలను సాధించగలగడం వంటివి నాణ్యమైన విద్యలో ముఖ్యమైన అంశాలు. వీటిని పొందేలా చేయడం పాఠశాలల బాధ్యత. వీటిని సాధించేలా చేయాల్సింది ఉపాధ్యాయులు.

విద్యా వ్యాపారాత్మకమైన నేటి పరిస్థితుల్లో పాఠశాలలు తమ బాధ్యతను నిర్వర్తించడం, ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తమ విధులను నెరవేర్చడంలో అనేక సవాళ్ళను ఎదుర్కొనేలా ఉపాధ్యాయులు మారాల్సి ఉంటుంది. సమాచారాన్నే జ్ఞానంగా భావించడం, ఈ సమాచారాన్నే పిల్లలకు అందించడం లేదా అర్థం చేయించడమే బోధనకు పరమావధిగా భావించడం, వీటిని జ్ఞాపకం పెట్టుకోవడాన్ని పరీక్షించడమే పరీక్షల ముఖ్య ఉద్దేశంగా మారడం వంటి పరిస్థితుల నుండి నూతన దృక్పథంతో ఆలోచించి ఉపాధ్యాయులు తమనుతాము మార్చుకోవాలి. పాఠశాల వ్యవస్థను మార్చగలగాలి. వీటిని సాకారంచేసే దిశగా ఉపాధ్యాయ విద్య ఎప్పటికప్పుడు ఆధునీకరించబడతాయి.

ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో జాతీయ ప్రణాళిక చట్రం 2005, RTE-2009 ఆధారంగా రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011ను రూపొందించారు. పిల్లలు అర్థవంతమంగా నేర్చుకోవాలని, పిల్లలు జ్ఞాన గ్రహీతలుగా జ్ఞాననిర్మాతలని, తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించగలగాలని, నేర్చుకోవడం అనే పాఠ్యపుస్తకాలకూ తరగతిగదికే పరిమితం కారాదని అన్వేషకులు, ప్రయోగాలు, ప్రాజెక్టుపనులు, ప్రతిచర్యలతో కూడి బోధనాభ్యసన ప్రక్రియలుండాలని, ఇందుకనుగుణంగా విమర్శనాత్మక బోధనా పద్ధతులు, సామాజిక నిర్మాణాత్మక వాదానికి చెందిన బోధనా పద్ధతులు వినియోగించాలని, పిల్లల సామర్థ్యాలను ఆలోచన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అంచనావేసేలా నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాలు అమలు జరగాలని APSCF-2011 లోని కీలక సూత్రాలు తెలుపుతున్నాయి. వీటి ఆధారంగా మన రాష్ట్రంలో ఒకటి నుండి పదవ తరగతి వరకు పాఠ్యప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన విధానాలను ఆధునీకరించారు. రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ వీటిని రూపొందించింది.

ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించే వృత్తిపూర్వక ఉపాధ్యాయ శిక్షణను నిర్వహించే ఉపాధ్యాయ విద్యా సంస్థలు, శిక్షణా సంస్థలు వీటిని ఆకళింపుచేసుకొని ఛాత్రోపాధ్యాయులను తయారుచేయాలి. నూతన పాఠ్యపుస్తకాలపైన, ఆధునిక బోధనా విధానాలపైన, మూల్యాంకన విధానాలపైన, తమ శిక్షణార్థులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ప్రధానంగా నూతన పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా జ్ఞాన నిర్మాణం జరగడానికి వీలుగా ఆధునిక బోధనాపద్ధతులతో కూడిన ప్రణాళికలను రూపొందించుకునేలా శిక్షణ ఇవ్వాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాల్లోని విద్యావిభాగాల వారు రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (SCERT) లోని విద్యావిభాగంతో కలిసి పనిచేయడానికి ముందుకు రావడం, ఈ మార్పులను స్వాగతించడం శుభపరిణామం. విశ్వవిద్యాలయాల్లోని ఆచరణ బృందం, SCERT విద్యా ప్రణాళిక విభాగంలోని సభ్యులు కలిసి ఛాత్రోపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు అనే కరదీపికను ఛాత్రోపాధ్యాయుల కోసం రూపొందించారు. ఈ కరదీపికలో APSCF పరిధిపత్రం సంక్షిప్తసారాంశం, RTE-2009 చట్టం, జ్ఞానం-జ్ఞాననిర్మాణం-తరగతి అన్వయం, నూతన తెలుగువాచకాల ప్రత్యేకతలు, కీలకసూత్రాలు, భాషాభ్యసన వ్యూహాలు-బోధనాసోపానాలు, వార్షిక పాఠ్యప్రణాళిక, పీరియడ్ ప్రణాళికలు, నిరంతర సమగ్రమూల్యాంకనం, బోధనాభ్యాసం మార్గదర్శకాలు, సి.సి.ఇ. రికార్డు మార్గదర్శకాలు మొదలగు అధ్యాయాలు చేర్చారు. కరదీపికలో చివర భాషోపాధ్యాయులకు ఉపయోగపడే రిఫరెన్స్ పుస్తకాల వివరాలు, సంస్థలు, ప్రచురణ సంస్థలు, వెబ్‌సైట్ల వివరాలను కూడా పొందుపరిచారు.

ఛాత్రోపాధ్యాయులు ఈ కరదీపికలోని అంశాల ఆధారంగా బోధనాభ్యాసం సమయంలో రాసే వార్షిక, పాఠ్య, కాలాంశ (పీరియడ్) ప్రణాళికలను ఆధునిక విధానాలకు అనుగుణంగా, రాయగల్గుతారు. అట్లే SAT రికార్డును నిరంతర సమగ్ర మూల్యాంకనానికి అనుగుణంగా మార్చి రాయగల్గుతారు.

ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసకులు. పరిశోధనా దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది. అవసరాలకనుగుణంగా తమనుతాము మార్చుకొని ఫలితాలను సాధించే వ్యక్తులుగా నూతన పాత్రలు పోషించాల్సి ఉంటుంది. ఈ వాస్తవాలను అర్థంచేసుకొని భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగడానికి కృషిచేస్తారని ఆశిస్తున్నాం.

దీని రూపకల్పనలో పాల్గొన్న SCERT లోని విద్యాప్రణాళికా విభాగ సభ్యులకు, పాఠ్యపుస్తక రచయితలకు స్టేట్ రిసోర్సు గ్రూప్ సభ్యులకు, ఉస్మానియా, కాకతీయ, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల ఆచార్య బృందానికి అభినందనలు. భవిష్యత్తులో ఇదే విధంగా విశ్వవిద్యాలయాలు, SCERT తో కలిసి విద్యాభివృద్ధికోసం కృషిచేస్తుందని ఆశిస్తున్నాం.

సంచాలకులు
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్.

తేది : 31-03-2014
స్థలం : హైదరాబాదు

# విషయసూచిక


| వ.సం | అధ్యాయం పేరు | పేజి సంఖ్య |
|---|---|---|
| 1. | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం – 2011 (APSCF-2011) | 5 |
| 2. | నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం – 2009 (RTE-2009) | 13 |
| 3. | జ్ఞానం – జ్ఞాననిర్మాణం – తరగతి గది అన్వయం (Knowledge - Construction of knowledge - Classroom implication) | 28 |
| 4. | నూతన తెలుగు వాచకాల ప్రత్యేకతలు – కీలకసూత్రాలు (Sailient Features & Key Principles of Language Text Book) | 46 |
| 5. | భాషాభ్యసనం – వ్యూహాలు (Language Learning - Strategies) | 54 |
| 6. | బోధనా సోపానాలు (Teaching Steps) | 69 |
| 7. | ఉపాధ్యాయుల తయారీ – ప్రణాళికలు (Teaching Preparation - Plan) | 75 |
| | i) వార్షిక ప్రణాళిక (Year / Annual Plan) | 75 |
| | ii) పాఠ్య ప్రణాళిక (Lesson Plan) | 83 |
| | iii) పీరియడ్ ప్రణాళిక (Period Plan) | 90 |
| 8. | నిరంతర సమగ్ర మూల్యాంకనం (Continuous Comprehensive Evaluation) | 126 |
| | i) నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) | 127 |
| | ii) సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation) | 129 |
| | iii) నమూనా ప్రశ్నపత్రాలు (6, 9 తరగతులు) (Mopdel Question Papers) | 136 |
| 9. | బోధనాభ్యాసం – మార్గదర్శకాలు (Teaching Practice - Guidelines) | 147 |
| 10. | C.C.E. రికార్డు – మార్గదర్శకాలు (CCE Record - Guidelines) | 154 |
| 11. | పఠనీయ గ్రంథాలు | 156 |
| | అనుబంధాలు | 160 |

# 1

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం - 2011 (APSCF - 2011) - కీలక సూత్రాలు

**నేపథ్యం:**

చదువుకోవడం అనేది ఒకప్పుడు గౌరవప్రదమైన కార్యక్రమం మాత్రమే. కానీ ప్రస్తుతం అది ఒక ప్రాథమిక హక్కు కూడా. ఎలిమెంటరీ స్థాయివరకు బడిఈడుగల పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందడం **"ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (RTE-2009)"** ప్రకారం ప్రాథమిక హక్కుగా మారింది. విభిన్న సంస్కృతులు, భాషావైవిధ్యత కల్గిన మనదేశంలో **అందరికీ విద్య**ను అందించడం గురించి భారతరాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. గత ఆరు దశాబ్దాలుగా అందరికీ విద్యను అందించాలని మనదేశంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలుజరిగాయి, జరుగుతున్నాయి కూడా! అయినప్పటికీ ఇంకనూ పలు సవాళ్ళు తెరముందుకు వస్తూనే ఉన్నాయి. వాటిలో బాలకార్మికత, బడిబయట పిల్లలుండడం; నాణ్యతాలోపం; జవాబుదారీతనం లోపించడం; యాంత్రికమైన బోధనాభ్యసన ప్రక్రియలు, ప్రమాణాల పేరుతో, అధిక సమాచార భారంతో బరువెక్కిన పాఠ్యపుస్తకాలు; ఒత్తిడి, ఆందోళన, మార్కులు, ర్యాంకులకు పరిమితమౌతున్న మూల్యాంకన విధానాలు; అడుగంటుతున్న విలువలు, రోజురోజుకు విద్యావ్యాపార ధోరణి పెరుగుతూ క్రమేణా ఉన్నవారు ఒకరకమైన చదువులు, లేనివారు ఇంకోరకమైన చదువులు పొందుతున్న విద్యావాతావరణం, మౌలిక వసతుల కొరత మొదలగు సవాళ్ళను మనం గమనించవచ్చు. ***మన రాష్ట్రం పరిస్థితి కూడా ఇందుకు విభిన్నంగా ఏమీ లేదు. వీటికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుముఖం పట్టుతూ ఉండడం, సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడాన్నే జ్ఞానంగా భావించడం, గిరిజనులు, అల్పసంఖ్యాకవర్గాలు, బాలికలు మొదలగు వర్గాలు ఇతర వర్గాలతో సమానంగా విద్య పొందలేక పోవడమనే అదనపుసమస్యలు కూడా ఉన్నాయి.***

ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో జాతీయ విద్యాప్రణాళిక చట్రం -2005 (NCF - 2005) ను **"భారరహిత అభ్యసనం"** (Learning without burden) అనే నివేదిక ఆధారంగా రూపొందించింది. పిల్లల చదువులు బట్టీ విధానాలకు పరిమితం కాకుండా, అర్థవంతంగా మారాలని, నేర్చుకొన్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో

వినియోగించాలని, నేర్చుకోవడమనేది పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని, ఆందోళన, పోటీతత్వాలను అధిగమించేలా పరీక్షల విధానాలను సంస్కరించాలని **జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005** సూచించింది.

ఈ అంశాలతోపాటు పిల్లలందరు నాణ్యమైన విద్యను పొందడాన్ని చట్టబద్ధం చేస్తూ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (Right to Free and Compulsory Education Act - 2009) అమలులోకి వచ్చింది. **పాఠశాల విద్యలో కీలకమైన వ్యక్తులు ఉపాధ్యాయులు**. ఉపాధ్యాయుల నిర్మాణం పైననే నాణ్యమైన విద్య ఆధారపడి ఉంటుందని **జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రం 2010** ని (NCFTE - 2010) జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (NCTE) రూపొందించింది.

భారంలేని విద్య నివేదిక, జాతీయ విద్యాప్రణాళిక చట్రం (NCF - 2005), విద్యాహక్కు చట్టం (RTE - 2009), జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రా (NCFTE - 2010) ల్లోని ప్రతిపాదనలు, మార్గదర్శకాలను పరిశీలించినపుడు మన రాష్ట్రంలోని పాఠశాల విద్యలో సంస్కరణలు చేపట్టడం అత్యవసరమని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం మనరాష్ట్రంలోకూడా **రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం – 2011** (State Curriculum Frame Work - 2011) రూపొందించడానికి జాతీయస్థాయి విషయనిపుణులు, ఉపన్యాసకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు మొదలగు వారితో ఒక సలహా సంఘాన్ని, ఒక స్టీరింగ్ కమిటీని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసింది. అట్లే వివిధ సబ్జక్టులు, సహపాఠ్యఅంశాలకు చెందిన 18 అంశాలలో ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించి ప్రతిపాదనలతో **ఆధారపత్రాలను రూపొందించడానికి ఒక్కొక్క అంశానికి ఒక ఫోకస్‌గ్రూపును** కూడా ప్రభుత్వం / విద్యాశాఖ నియమించింది. **వాటి వివరాలు:**

**1. విద్యా విషయక ఆధారపత్రాలు** (Position Papers on Subject Areas) :

1.1 భాష – భాషాబోధన – ఆధారపత్రం (Position Paper on Language and Language Teaching)

1.2 ఆంగ్లబోధన – ఆధారపత్రం (Position Paper on English Teaching)

1.3 విజ్ఞానశాస్త్ర విద్య – ఆధారపత్రం (Position Paper on Science Education)

1.4 గణిత విద్య – ఆధారపత్రం (Position Paper on Mathematics Education)

1.5 సాంఘికశాస్త్ర విద్య – ఆధారపత్రం (Position Paper on Social Science Education)

1.6 పరిసరాలు – అభ్యసనం – ఆధారపత్రం (Position Paper on Habitat and Learning)

1.7 కళావిద్య – ఆధారపత్రం (Position Paper on Art Education)

**2. వ్యవస్థాపర సంస్కరణలు** (Position Papers on Systemic Reforms) :

2.1 విద్యా లక్ష్యాలు – ఆధారపత్రం (Position Paper on Aims of Education)

2.2 వ్యవస్థాపర సంస్కరణలు – ఆధారపత్రం (Position Paper on Systemic Reforms)

2.3 ఉపాధ్యాయ విద్య – ఉపాధ్యాయ వృత్తిపర అభివృద్ధి – ఆధారపత్రం (Position Paper on Teacher Education and Teacher Professional Development)

2.4 అభ్యసనం కొరకు మూల్యాంకనం – ఆధారపత్రం (Position Paper on Assessment of Learning)

2.5 విద్యా సాంకేతికత – ఆధారపత్రం (Position Paper on Education Technology)

2.6 విద్యాప్రణాళిక – పాఠ్యపుస్తకాలు – ఆధారపత్రం (Position Paper on Curriculum and Textbooks)

**3. రాష్ట్ర సంబంధిత ముఖ్యమైన అంశాలు** (Position Papers on State concerns) :

3.1 విభిన్న వర్గాల విద్య (ఎస్.సి., ఎస్.టి., మైనార్టీ – బాలికలు – సమ్మిళిత విద్య) – ఆధారపత్రం (Position Paper on Education for Diversities - S.C, S.T, Minority, Girls, Inclusive)

3.2 ఆరోగ్య – వ్యాయామ విద్య – ఆధారపత్రం (Position Paper on Health and Physical Education)

3.3 బాల్యారంభ విద్య – ఆధారపత్రం (Position Paper on Early Childhood Education)

3.4 పని మరియు విద్య – ఆధారపత్రం (Position Paper on Work and Education)

3.5 నైతికత – విలువలు – మానవ హక్కులు – ఆధారపత్రం (Position Paper on Ethics, Values and Human Rights)

రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం – 2011 మరియు 18 ఆధారపత్రాలను రూపొందించడానికి కింది నివేదికలను పరిగణనలోకి తీసుకున్నారు. అవి.

- **రాజ్యాంగ నిబంధనలు భారత రాజ్యాంగ ప్రవేశిక మరియు 73, 74 వ రాజ్యాంగ సవరణలు (Constitutional Amendments).**
- **జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005 (NCF - 2005)**
- **'భారరహిత అభ్యసనం' నివేదిక (GOI - Report on Learning without burden)**
- **ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్రం 2009 (RTE-2009)**
- **ఉపాధ్యాయవిద్య – జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2010 (NCFTE-2010)**.
- **జాతీయ విజ్ఞాన కమీషన్ సిఫార్సులు (National Knowledge Commission Recomendations)**

పై నివేదికలలోని, ప్రతిపాదనలు, సిఫార్సుల ఆధారంగా రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011 (APSCF 2011) కింది సూత్రాలను ప్రతిపాదించింది. వీటి ఆధారంగానే వివిధ సబ్జక్టులు, సహపాఠ్య అంశాలకు చెందిన ఆధారపత్రాలను, విషయప్రణాళికలు (Syllabus), విద్యాప్రమాణాలను రూపొందించారు. అట్లే పాఠ్యపుస్తకాలను ఆధునీకరించి, మూల్యాంకనం మరియు పరీక్షల్లో సంస్కరణలు చేపట్టారు. ఈ క్రమంలో APSCF-2011 ప్రతిపాదించిన రాష్ట్ర దృక్పథాన్ని (Perspectives of the State) మరియు APSCF-2011 కీలక సూత్రాలను (Key Principles) ను పరిశీలిద్దాం.

## మనరాష్ట్ర దృక్పథం (perspective of the State):

- విద్యయొక్క ప్రాథమిక ఉద్దేశ్యం పిల్లలందరినీ బాధ్యతాయుతమైన, హేతుబద్ధమైన, పౌరులుగా (Responsible and Rational Citizens) మలచడం. విద్యాలక్ష్యాలు దీనిపై ప్రధానంగా దృష్టిసారించడం. అట్లే తమ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రశంసిస్తూ, సామాజిక మార్పుకు దోహదపడే వ్యక్తులుగా పిల్లలను తీర్చిదిద్దడం.
- విద్యాప్రణాళిక రూపకల్పనలో పిల్లలయొక్క అవసరాలు, కోరికలు కేంద్రబిందువులుగా ఉండడం.

- పిల్లలు నేర్చుకోవడంలో ఒక జ్ఞానాత్మక క్రమం (Cognitive sequence in learning) ఉంటుంది. విద్యాప్రణాళికను ఈ క్రమం మరియు పిల్లల మానసికస్థాయిల ఆధారంగా రూపొందించడం. ఫలితాలకంటే కూడా వాటిని పొందే ప్రక్రియలను పరిపుష్టి చేయడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం. దీనివల్ల పిల్లలు కేవలం సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడంకంటే వాటిని అర్థవంతంగా గ్రహించడం, విశ్లేషించడం వంటి నైపుణ్యాలను పొందుతారు.
- జ్ఞానమనేది (knowledge) సమగ్రమైంది. దీన్ని వివిధ సబ్జక్టుల పేరుతో విడదీసి ముక్కలు ముక్కలుగా అందించడమనేది కృత్రిమమైనది. జ్ఞానమనేది అనేక సామర్థ్యాలతో (Cognitive abilities) కూడినదనేది నిర్వివాదాంశం. ఒకే అంశాన్ని వివిధ లక్ష్యాల సాధనకోసం అనగా భాషా సామర్థ్యాల సాధనలో, గణిత సామర్థ్యాల సాధనలో, సామాజిక స్పృహను పెంపొందించడానికి, తార్కిక ఆలోచనలను వృద్ధిపరచడానికి, విశ్లేషణలు మరియు నిర్ధారణలు చేయడానికి వినియోగించవచ్చు.
- విద్యాప్రణాళిక అనేది గతిశీలమైనది (Dynamic). ఇది పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదు. ఇది పరిసరాలు, బాహ్యప్రపంచంతో అనుసంధానమై పిల్లలు, ఉపాధ్యాయుల సృజనాత్మకతను పెంచడానికి దోహదపడాలి.
- విద్యా ప్రణాళికతోపాటు, విద్యాపరిపాలన, పాఠశాలకు చెందిన అన్ని కార్యకలాపాలలో వికేంద్రీకరణను (Decentralisation) అమలుచేయాలి.

## APSCF-2011 మౌలిక సూత్రాలు (Key principles)

- పిల్లలు తమకున్న సహజమైన శక్తిసామర్థ్యాల ఆధారంగా నేర్చుకునేలా దృష్టిపెట్టడం.
- పిల్లలభాష మరియు సమాజంలోని వివిధ రకాలైన జ్ఞాన వ్యవస్థలను గౌరవించడం, వాటిని అభ్యసనంలో వినియోగించడం.
- జ్ఞానాన్ని పాఠశాల వెలుపలి జీవితంతో అనుసంధానం చేయడం.
- బట్టీ విధానాలకు స్వస్తిపలకడం. వాటికి బదులుగా పరస్పర ప్రతిచర్యలు (Interactions), ప్రాజెక్టుపనులు, అన్వేషణలు (Explorations), ప్రయోగాలు, విశ్లేషణలు వంటి పద్ధతులద్వారా పిల్లలు అర్థవంతంగా నేర్చుకోవడం.
- నేర్చుకోవడాన్ని పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, పిల్లల సమగ్ర అభివృద్ధికోసం విద్యాప్రణాళిక తగిన అవకాశాలు కల్పించడం. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలలో మార్పులు చేర్పులు చేపట్టడం.
- నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని (Continuous Comprehensive Evaluation) అమలు చేయడం ద్వారా పరీక్షలను సరళీకరించి, బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయడం. పిల్లలు ఎంత నేర్చుకున్నారని తెలుసుకోవడానికి మూల్యాంకనం చేయడానికి బదులు పిల్లలు నేర్చుకోవడానికి దోహదపడేలా మూల్యాంకన విధానాలను సంస్కరించడం (Assessment for Learning).
- విషయప్రణాళికల్లోని విభిన్న అంశాలను సమ్మిళితంచేస్తూ, అర్థవంతంగా నేర్చుకోవడానికి వీలుగా సామాజిక నిర్మాణాత్మక (Social constructivism), విధానాలను తులనాత్మక/ విమర్శనాత్మక (Critical pedagogy) బోధన విధానాల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించడం.
- పిల్లల సంస్కృతి, అనుభవాలు, స్థానిక అంశాలకు తరగతి గదిలో ప్రాధాన్యత కల్పించడం.

రాష్ట్ర దృక్పథం మరియు కీలక సూత్రాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రా (2011) న్ని రూపొందించారు. ఇది కింది అంశాలలో మార్పులను చేర్పులను ప్రతిపాదించింది.

**పాఠ్యపుస్తకాలు:-**

ఇప్పటి వరకు రూపొందిన పాఠ్యపుస్తకాలు సుమారు 10 సంవత్సరాలకొకసారి మార్పులకులోనైనవి. ఐతే మౌలికమైన మార్పులు నామమాత్రంగానే జరిగాయని చెప్పవచ్చు. అట్లే పాఠ్యపుస్తకాల రూపకల్పనకు ఆధారమైన విద్యాప్రణాళిక చట్రం లేదా సబ్జక్టుల వారీగా ఆధారపత్రాలుగానీ గతంలో రూపొందించలేదు. దీని వల్ల పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశాలు మారినవేగాని, విషయాల అమరికలో, అభ్యాసాలలో వైవిధ్యత చోటుచేసుకోలేదు. అట్లే పాఠశాల విద్యకు చెందిన సబ్జక్టుల ద్వారా అశించే లక్ష్యాలు లేదా సబ్జక్టుల స్వభావం, పిల్లల స్వభావం వంటివి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో అంతగా పరిగణనలోకి తీసుకోలేదు. అట్లే పాఠ్యపుస్తకాలు ప్రమాణాల పేరుతో అధిక సమాచారంతో నిండి బరువెక్కాయి. గణితం, విజ్ఞానశాస్త్రం వంటి సబ్జక్టులలో పై తరగతులలోని అంశాలు కింది తరగతులలో చేరాయి. ఇది మానసికంగా కూడా పిల్లలకు భారమైంది. ఐతే రాష్ట్రంలో అమలుజరిగిన APPEP, DPEP, SSA వంటి కార్యక్రమాలవల్ల ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాలలో కొంతవరకు మార్పులు చోటుచేసుకున్నా, ఇది NCF-2005, RTE-2009, APSCF-2011 ప్రకారం మరింత సమగ్రంగా మారాల్సిన అవసరం ఉందని భావించబడింది.

**రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం -2011 అర్థవంతమైన పాఠ్యపుస్తకాలను రూపొందించడానికి కింది ప్రతిపాదనలు చేసింది.**

- భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం వంటి సబ్జక్టులలో పాఠ్యపుస్తకాలు రూపొందించడానికి సబ్జక్టువారీగా ఆధారపత్రాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు పిల్లల్ని ఆలోచింపచేసేలా, పిల్లలు తమకున్న సహజమైన శక్తి సామర్థ్యాలు వినియోగించి నేర్చుకోవడానికి దోహదపడాలి.
- పాఠ్యపుస్తకాలు సమాచారంతో బరువెక్కకుండా, పిల్లలే సమాచారాన్ని సేకరించేలా, ఆ సమాచారాన్ని విశ్లేషించేలా, ముఖ్యభావనలు నిర్ధారణలు చేసేలా అవకాశం కల్పించాలి.
- పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకోవడానికి పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి. ఆ జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించడానికి అవకాశం ఉండాలి.
- పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, అదనపు అభ్యసనం కోసం సంప్రదింపు గ్రంథాలు, మ్యాగజైన్లు, పత్రికలు;' మాజ సభ్యులతో పరస్పర ప్రతిచర్యలు జరిగేలా పాఠ్యపుస్తకాలు అవకాశం కల్పించాలి.
- పాఠ్యపుస్తకాలలోని భాష సరళంగా మారాలి. నేర్చుకోవడానికి భాష ఒక అవరోధంగా ఉండరాదు. బహుభాషిత్వానికి (Multilinguality) పరిగణనలోకి తీసుకోవాలి.
- పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు లింగ వివక్షకు తావివ్వరాదు. పిల్లల ఆత్మవిశ్వాసం పెంచేలా, ఆలోచింపజేసేలా, మానవ హక్కుల పట్ల స్పృహ పెంచేవిగా ఉండాలి. ఇందుకోసం ఆలోచనానైపుణ్యాలు అనగా ప్రతిస్పందించడం (Reflection), విమర్శనాత్మకంగా ఆలోచించడం (Critical thinking), బహుకోణాల్లో ఆలోచించడం (Dialectical thinking), సృజనాత్మకంగా ఆలోచించడం (Creative thinking), భావప్రసారనైపుణ్యాలు (Communication Skills) వంటివి పెంపొందించాలి.

- స్థానిక కళలు, సంస్కృతి, ఉత్పాదక కార్యకలాపాలు, స్థానిక అంశాలు మొదలగునవి పాఠ్యాంశాలుగా ఉండాలి.
- ఆయా సబ్జక్టులకు నిర్ధారించిన విద్యాప్రమాణాలు (Academic Standards), ఆశించిన అభ్యసన ఫలితాలు (Expected learning outcomes) సాధించడానికి వీలుగా అభ్యాసాలు ఉండాలి.
- కృత్యాలు, ప్రాజెక్టు పనులు, అన్వేషణలు, ప్రయోగాలు, బహువిధాలైన సమాధానాలు వచ్చే ప్రశ్నలు (Open ended questions), క్రీడలు, ఫజిల్స్ మొదలగు వాటి రూపంలో ఆలోచింపజేసే అభ్యాసాలు ఉండాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా నేర్చుకునేలా, జట్టుపనుల్లో పాల్గొని నేర్చుకొనేలా, పూర్తితరగతి పనిలో పాల్గొని నేర్చుకునేలా అభ్యాసాలు ఉండాలి (Individual, group, whole class activities).
- సహపాఠ్యాంశాలైన మానవతావిలువలు, నైతికత, కళలు, ఆరోగ్యం, పని మొదలగు అంశాలను కూడా పిల్లలు గ్రహించడానికి వీలుగా పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు మరియు అభ్యాసాలు ఉండాలి.
- పాఠ్యపుస్తకాలు కింది తరగతులకు చెందినదో ప్రమాణాల పునశ్చరణకు అవకాశం కల్పిస్తూనే, తరగతి ప్రమాణాల సాధించడానికి మరియు పై తరగతులకు చెందిన ప్రమాణాలకు అనుసంధానం కలిగిఉండాలి.
- పాఠ్యపుస్తకాలు ఆకర్షణీయంగా, అందంగా ఉండాలి. నాణ్యమైన పేపరు, ముద్రణ, చిత్రాలతో కూడి ఉండాలి.

**బోధనాభ్యసన ప్రక్రియలు (Teaching Learning Processes) :**

బట్టీపట్టడం, వల్లెవేయడం, పుస్తకాలు, గైడ్లు, ప్రశ్నల బ్యాంకులలోని అంశాలను ఎత్తిరాయడం, లేదా యాంత్రికంగా చదవడం వంటి యాంత్రికమైన విధానాలకు బదులు బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలు అర్థవంతంగా నేర్చుకోవడానికి దోహదపడాలి. ఇందుకోసం APSCF 2011 కింది ప్రతిపాదనలు చేసింది.

- పరస్పర ప్రతిచర్యలు (Interactions), స్వీయవ్యక్తీకరణ (Self Expression), ప్రశ్నించడం (Questioning) వంటివి బోధనాభ్యసన ప్రక్రియలలో కీలకం కావాలి.
- ప్రయోగాలు, అన్వేషణలు, కృత్యాలు, ప్రాజెక్టు పనులు, క్రీడలు మొదలగునవి బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం కావాలి.
- బోధనాభ్యసన ప్రక్రియలంటే ఉపాధ్యాయులు వివరించడం లేదా చదివి విన్పించడం కాదు. ఉపాధ్యాయులు పిల్లలు నేర్చుకోవడాన్ని ప్రేరేపించేలా, అభ్యసనంలో పాల్గోనేలా చేయాలి. అవసరమగు సామాగ్రిని ఉపయోగించాలి. ఆ సామాగ్రిని అందుబాటులో ఉంచాలి. అభ్యసన వాతావరణాన్ని కల్పించాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా, తోటివారితో, ఉపాధ్యాయుల ద్వారా, సామగ్రి సాయంతో అభ్యసించేలా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ఉండాలి. పిల్లల అభ్యసన సమయం పూర్తిగా సద్వినియోగం కావాలి.
- పిల్లలందరు తమ ఇంటి భాషలో నేర్చుకోవడానికి అనువైన ఏర్పాట్లు / వాతావరణం ఉండాలి. ఉపాధ్యాయులు పిల్లల భాషను వినియోగించాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ పిల్లల అనుభవాలు, పూర్వజ్ఞానం ఆధారంగా ప్రారంభంకావాలి.
- స్థానిక కళలు, ఉత్పాదక అంశాలు, శ్రమజీవుల అనుభవాలను బోధనాభ్యసన ప్రక్రియల్లో వనరులుగా ఉపయోగించాలి.

**మూల్యాంకనం - పరీక్షలు:-**

పిల్లల ప్రతిభాపాటవాలను అంచనా వేయడానికి ఇప్పటి వరకు కేవలం పరీక్షల పైనే ఆధారపడుతున్నాం. పరీక్షలు కూడా పిల్లల ప్రతిభాపాటవాలను అంచనావేయడానికి బదులుగా పిల్లల్ని దోషులుగా చూపడానికి, న్యూనతకు గురయ్యేలా చేయడానికి, ఒత్తిడి మరియు ఆందోళన పెంచడానికి తోడ్పడుతున్నాయి. ఒకరకంగా పరీక్షలే విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011 కింది ప్రతిపాదనలను చేసింది.

- మూల్యాంకనం మరియు పరీక్షలు పిల్లల ప్రతిభాపాటవాలను కేవలం అంచనావేయడానికి పరిమితం కాకుండా, పిల్లలు నేర్చుకోవడానికి దోహదపడాలి. (Assessment for Learning)
- RTE-2009 సూచించిన విధంగా మూల్యాంకనాన్ని నిరంతరం సమగ్రంగా నిర్వహించాలి. (Continuous and Comprehensive Evaluation - CCE)
- పిల్లల ప్రతిభాపాటవాలను అంచనావేయడానికి కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా ప్రాజెక్టు పనులు, అసైన్‌మెంట్లు, ఫోర్టుపోలియోలు, సెమినార్లు, ప్రదర్శనలు, అనెక్‌డొట్స్, పరిశీలనలు వంటివాటిని కూడా వినియోగించాలి. ఈ అంశాలకు సంవత్సరాంత పరీక్షలలో తగు భారత్వాన్ని కేటాయించాలి.
- మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయాలి.
- పరీక్షలలోని ప్రశ్నల స్వభావాన్ని మార్చాలి. బట్టీని ప్రేరేపించే ప్రశ్నలు, పాఠ్యపుస్తక సమాచారానికే పరిమితమయ్యే ప్రశ్నల స్థానంలో పిల్లలు సొంతంగా ఆలోచించి రాయడానికి, తమ అనుభవాలను వ్యక్తపరచడానికి, బహు విధాలైన సమాధానాలు ఇవ్వడానికి (Open Ended Questions), నిత్యజీవితంతో అన్వయించి రాయడానికి (Application Oriented) వీలుగా ఆలోచింపచేసే ప్రశ్నలు ఉండాలి.
- పిల్లలు తమ జ్ఞానాన్ని ఏమేరకు వినియోగించగలరో అంచనావేయడానికి మూల్యాంకనం తోడ్పడాలి.
- పిల్లలు తమను తాము స్వీయ మూల్యాంకనం చేసుకోవడం, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రగతిని స్వయంగా పరీక్షించడానికి వీలుగా పారదర్శక, బహిరంగ మూల్యాంకన విధానాలను అమలు పర్చాలి.
- బోర్డు పరీక్షల్లో కూడా పాఠశాలలో నిర్వహించిన నిరంతర, సమగ్ర మూల్యాంకన అంశాలకు తగిన భారత్వాన్ని కేటాయించాలి.
- బోర్డు పరీక్షల జవాబుపత్రాలను కోరినప్పుడు తల్లిదండ్రులకు అందచేయాలి. పునర్ మూల్యాంకనానికి వీలుకల్పించాలి.
- సహపాఠ్య అంశాలైన వైఖరులు, విలువలు, పని, ఆరోగ్యం, ఆటలు మొదలగువాటిని కూడా మూల్యాంకనం చేయాలి.

**వ్యవస్థాపరమైన సంస్కరణలు (Systemic Reforms):**

రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం (2011) పైన తెల్పిన అంశాలతోపాటు కింది వ్యవస్థాపరమైన సంస్కరణలను కూడా ప్రతిపాదించింది.

- పరిపాలన మరియు పాఠశాల నిర్వహణలో వికేంద్రీకరణ కోసం పంచాయితీ రాజ్ సంస్థలను భాగస్వాములను చేయాలి. వాటిని బలోపేతంచేయాలి.
- పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుల అధీనంలో పనిచేసేలా ECE కేంద్రాలను ఏర్పాటుచేయాలి. పిల్లల సంరక్షణ, ఆరోగ్య బాధ్యతలను ICDS శాఖ, విద్యాభ్యాసన బాధ్యతలను విద్యాశాఖ స్వీకరించాలి.

- RTE 2009 సూచించిన విధంగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలి.
- పిల్లల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటుచేసి, పాఠశాల నిర్వహణలో వారిని భాగస్వాములను చేయాలి.
- ప్రణాళిక, నిర్వహణ, మానిటరింగ్, నిధుల వినియోగం మొదలగు అన్ని అంశాలలో వికేంద్రీకరణ విధానాలను అమలుపర్చాలి.
- ఉపాధ్యాయ విద్యతోపాటు, ఉపాధ్యాయ సహాయ, సహకార వ్యవస్థలను బలోపేతం చేయాలి.
- పాఠశాల విద్యకు చెందిన వివిధ సంస్థలు (School, School Complex, Mandal Resource Centre, DIET, CTE, SCERT) మరియు వ్యక్తులకు పనితీరు సూచికలు (Performance Indicators) రూపొందించి పని సంస్కృతిని, జవాబుదారీతనం పెంపొందించాలి.
- ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్రాన్ని రూపొందించి అమలుపర్చాలి, ఉపాధ్యాయ విద్యలో సంస్కరణలు చేపట్టాలి.
- మానవతా విలువలు, ఉన్నత వైఖరులను పెంపొందించడానికి తరగతివారీగా పిల్లలకోసం ప్రత్యేక వాచకాలను రూపొందించాలి.
- పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చాలి.

సమాజం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ఆ సమాజం విద్యారంగంలో సంపూర్ణ అభివృద్ధిని సాధించాలి. ఇందుకు పునాది పాఠశాల విద్య. పాఠశాల విద్యను సంస్కరించి, పిల్లలను సమాజాభివృద్ధికి తోడ్పడే వ్యక్తులుగా, హేతుబద్ధమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అవసరమైన నైపుణ్యాలు, విలువలు, వైఖరులు పెంపొందించడానికి రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011 దిశానిర్దేశం చేసింది. ఇందుకోసం రూపొందించిన ఆధారపత్రాల ద్వారా ఆయా విషయాలు మరియు అంశాలలో పలు ప్రతిపాదనలు చేసింది. వీటిని అమలుపరచడానికి వ్యవస్థాపర సంస్కరణల అవసరముంది. ఇందుకోసం అన్నివర్గాల ప్రజలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు మొదలగు వారి నుండి సలహాలు సూచనలు స్వీకరించి అవసరమైన మార్పులు చేర్పులు చేయాలి. తద్వారా రాష్ట్రం విద్యారంగంలో అభివృద్ధిని సాధించి, అగ్రగామిగా రావడానికి ప్రయత్నించాలి.

> ***విద్యార్థులు వారి శక్తికి మించిన ప్రతిభను ప్రదర్శించాలని కోరుకోవడం, ఇతరులతో పోటీపడాలని భావించి పరీక్షలకు సిద్ధం చేయడమనేది విద్యార్థులపై ఒత్తిడిని మాత్రమే పెంచుతాయి తప్ప వారి సర్వాంగీణ వికాసానికి ఏ మాత్రం దోహదపడవు. విద్యార్థుల్లోని సహజమైన సృజనాత్మక శక్తులను పదును పెట్టేలా బోధనను అర్థవంతం చేయాలి. విద్యాప్రణాళికను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలి. వీటితోపాటు యాంత్రికంగా నిర్వహించే పరీక్షలను సంస్కరించాలి.***
>
> ***- భారంలేని విద్య కమిటీ నివేదిక 2003***

# 2

# నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం - 2009 (RTE - 2009) - గుణాత్మక అంశాలు

**నేపథ్యం (Context)**

భారతదేశం సువిశాలమైన దేశం. కోట్లాది మంది ప్రజలున్న దేశం. విభిన్న మతాలు, కులాలు, వర్గాలతో భిన్నత్వంలో ఏకత్వంగల దేశం. ఉత్కృష్టమైన సంస్కృతి, సంప్రదాయాలతో విరాజిల్లుతోన్న దేశం. అతి ప్రాచీనకాలంలోనే నలంద, తక్షశిల వంటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన విశ్వ విద్యాలయాలతో ప్రపంచానికి జ్ఞాన భిక్షను పెట్టిన దేశం మనది. అయితే తదనంతర కాలంలో మన దేశంలోని విద్యా పరిస్థితిని, ప్రజల అభివృద్ధిని విశ్లేషిస్తే గత వైభవాన్ని కోల్పోయినట్లుగా గుర్తించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాల కాలం దాటినా ఇప్పటికీ 100% అక్షరాస్యత అందని ద్రాక్షగానే ఉంది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో దేశ భవిష్యత్తు విద్యారంగంపైననే ఆధారపడి ఉంటుందని విశ్వసించి పిల్లలందరు విద్యను పొందాలని, మన రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో పొందుపర్చారు. ఆ తరవాత మన దేశంలో అక్షరాస్యతా కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం వల్ల అక్షరాస్యతలో కల్గిన అభివృద్ధిని గమనించవచ్చు. అయినప్పటికీ పాఠశాలకు వెళ్ళాల్సిన బడి ఈడు పిల్లలు బళ్ళలో చేరడం, చేరిన వారు కొనసాగడం, వారందరూ అర్థవంతంగా నేర్చుకోవడం, నేర్చుకున్నదాన్ని వినియోగించగల్గడం, ఆనందంగా, అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువైన ప్రోత్సాహకరమైన, స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో కొరవడింది. ఒక దశలో విద్యను పూర్తి చేసిన పిల్లలు ఏమి సాధించాలి? అనే అంశం పట్ల స్పష్టత కొరవడింది. విద్య వ్యాపారాత్మకమై ఉన్న వారికి ఒక రకంగా, లేని వారికి మరో రకంగా లభిస్తుండడం ఆందోళనకు గురిచేస్తున్నది. అధిక సమాచారంతో బరువెక్కిన పాఠ్యపుస్తకాలు, ఒత్తిడి, ఆందోళనలకు గురిచేసే పరీక్షా విధానాలు, పాఠశాలను సమాజం నుండి వేరు చేసే వైఖరులు/ పనితీరు, పిల్లలకు లేదా సమాజానికి జవాబుదారీతనం వహించే లక్షణం కొరవడడం వంటి అంశాలు విద్యావ్యవస్థను అపహాస్యం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో విద్యావ్యవస్థలోని అపసవ్య, అశాస్త్రీయ విధానాలను చాలా సునిశితంగా విమర్శిస్తూ రావలసిన మార్పుచేర్పుల గురించి ప్రొఫెసర్ యశ్‌పాల్ 2003 లో 'భారం లేని విద్య' అనే నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించారు.

దీని ఆధారంగా ఎన్.సి.ఇ.ఆర్.టి. జాతీయ విద్యా ప్రణాళిక చట్రాన్ని (2005) రూపొందించింది. 1986 తరవాత మన దేశంలో అమలైన మంచి కార్యక్రమాలు, వాటి ఫలితాలు (OBB, APPEP, DPEP, SSA మొదలగు కార్యక్రమాలు) అధికారపూర్వకంగా ఒక నివేదిక రూపంలో జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005 ద్వారా వ్యక్తమైనవి. అర్థరహితమైన బట్టీ విధానాలకు స్వస్తిపలికి అర్థవంతంగా నేర్చుకోవాలని, నేర్చుకోవడం పాఠ్యపుస్తకాలకే పరిమితం కారాదని, పిల్లలు తాము నేర్చుకున్న అంశాలు/ జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించాలని, సమాచారం, జ్ఞానం ఒక్కటి కావని, జ్ఞానమనేది పిల్లల అనుభవాల ఆధారంగా ఆలోచన, విశ్లేషణల ద్వారా ఉత్పన్నమవుతుందని, ఒత్తిడికి గురిచేసే పరీక్షల విధానాలను సంస్కరించాలని ఎన్.సి.ఎఫ్-2005 పేర్కొంది. వీటిని సాకారం చేయడానికి విద్యావ్యవస్థలో మౌలికమైన మార్పులు చేర్పులు చోటుచేసుకోవాలని, సమాజ భాగస్వామ్యంతో పాఠశాల విద్య అభివృద్ధిని చెందాలని తెలిపింది.

పాఠ్యపుస్తకాలు ఆలోచనాత్మకంగా, పిల్లల అనుభవాల ఆధారంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించింది. బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల భాగస్వామ్యాన్ని పెంచేలా జ్ఞాన నిర్మాణానికి తోడ్పడేలా ఉండాలని తెలిపింది. ఎన్.సి.ఎఫ్-2005 సూచించిన పలు అంశాలతోపాటు సమాజంలో కొంతమంది పిల్లలు బాల కార్మికులుగా ఉండడం, పాఠశాలల్లో వారి ప్రవేశానికి నియమ నిబంధనలు అడ్డంకిగా నిలవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక హక్కుగా మారిన 'విద్య'ను పిల్లలందరూ పొందడానికి ఉద్దేశించి మన దేశంలో 2009 ఆగస్టు మాసంలో భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన. ఈ చట్టం 26 ఆగస్టు, 2009 భారత రాష్ట్రపతిచే ఆమోదం పొందింది. భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని **'బాలల ఉచిత, నిర్బంధ విద్య హక్కు చట్టం-2009 (Right To Education Act-2009)** అని పేర్కొని 27 ఆగస్టు, 2009 రోజున గెజిట్‌లో ప్రచురితమైంది.

ఆర్.టి.ఇ-2009 చట్టం ఏప్రిల్ 1, 2010 నాటి నుండి అమలులోకి వచ్చింది. భారతదేశ చరిత్రలో ఈ చట్టం మన దేశ ప్రధానమంత్రి జాతినుద్దేశించి ఇచ్చిన ఉపన్యాసం ద్వారా అమలులోకి వచ్చింది. ప్రధానమంత్రి అంటే జాతి, మత, కులాలకు అతీతంగా ఈ దేశపు బాలలందరూ బడిలో చేరి నాణ్యమైన విద్యను పొందడానికి ఈ చట్టం ద్వారా ప్రాథమిక హక్కు కల్పించబడిందని. బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా ఎదగడానికి కావల్సిన జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, విలువలు నాణ్యమైన విద్య ద్వారా వారికి అందించబడతాయని తన సందేశంలో పేర్కొన్నాడు.

ఈ ఘట్టం చారిత్రాత్మకమైనది. 'విద్య'ను ప్రాథమిక హక్కుగా పరిగణించి చట్టాలు చేసిన దేశాల జాబితాలో మన దేశం కూడా చేరింది. ప్రధానంగా ఈ చట్టం వల్ల బడిఈడు కలిగిన పిల్లలు (9-14 సం॥ల వయసు) నాణ్యమైన విద్యను పొందే హక్కును సంపాదించుకున్నారు. నాణ్యమైన విద్యను పిల్లలందరూ పొందడానికి అవసరమైన పాఠశాలల ఏర్పాటు, ప్రభుత్వాల బాధ్యతలు, బడి బాధ్యతలు, ఉపాధ్యాయుల బాధ్యతలు, బడి పాటించాల్సిన నియమాలు, ప్రమాణాల గురించి ఈ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. దీనిలో ప్రధానంగా రెండు రకాలైన అంశాలను గమనించవచ్చు. మొదటివి పరిమాణాత్మకమైన, పరిపాలనాపరమైన, అమలుకు చెందిన అంశాలు. రెండవవి నాణ్యమైన విద్యకు సంబంధించిన అవగాహన, విద్యా ప్రణాళికలకు సంబంధించిన అంశాలు. చట్టం అమలు జరగడం అంటే ఇందుకు అవసరమైన అన్ని అంశాలు ఆచరణలోకి రావడం అని అర్థం. అనగా పిల్లలందరూ బడిలో చేరడం, వారందరూ కొనసాగి నాణ్యమైన విద్యను పొందడానికి అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టడం ద్వారా ఫలితాలు సాధించాల్సి ఉంటుంది.

## చట్టంలోని అధ్యాయాలు, వాటి వివరాలు (Sections in the Act and its details)

ఆర్.టి.ఇ.-2009 చట్టంలోని అధ్యాయాలు, సెక్షన్లు వివరాలు తెలుసుకుందాం.

- ఈ చట్టంలో 7 అధ్యాయాలు, 38 సెక్షన్లు, ఒక షెడ్యూల్ ఉంది.
- ప్రారంభంలో ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టు తేదీ, రాష్ట్రపతిచే ఆమోదం పొందిన తేది, అమలు పరిధి వివరాలు ఉన్నాయి.
- **అధ్యాయం1**లో చట్టం పేరు, పరిధి, అమలు, వివిధ పదాలకు సంబంధించిన అర్థాలు, నిర్వచనాలు ఉన్నాయి. ఉదాహరణకు బడి, పిల్లలు, ప్రాథమిక విద్య, ఎంపిక విధానం వంటి పదాలకు వివరణలు ఉన్నాయి. ఈ వివరాలను 1 నుండి 3 సెక్షన్లలో తెలిపారు.
- **అధ్యాయం2**లో ఉచిత విద్యకు బాలల హక్కు, బడిలో ప్రవేశం, బదిలీ ధ్రువీకరణ పత్రం మొదలగు అంశాల గురించి 4, 5 సెక్షన్లలో తెలిపారు.
- **అధ్యాయం3**లో విద్యావిషయాల్లో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతల గురించి, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటు గురించిన వివరాలు 6 నుండి 11 సెక్షన్లలో తెలిపారు.
- **అధ్యాయం4**లో బడులు, ఉపాధ్యాయుల బాధ్యతలకు సంబంధించిన వివరాలను సెక్షన్ 12 నుండి 28 లలో పొందుపర్చారు. ప్రధానంగా పిల్లలను బడిలో చేర్చినపుడు ఎంపిక విధానానికి గురిచేయరాదని, ఎలాంటి క్యాపిటేషన్ రుసుము వసూలు చేయరాదని తెలిపారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకున్నా పిల్లలను బడిలో చేర్చుకోవాలని, ఒకే తరగతిలో పిల్లలను మళ్ళీ కొనసాగించడం లేదా పాఠశాల నుండి తొలగించడం చేయరాదని, పిల్లలను శారీరకంగా గాని, మానసికంగా గాని వేధించడం, హింసించడం, శిక్షించడం చేయరాదన్న అంశాల గురించి స్పష్టంగా పేర్కొన్నారు. బళ్ళను స్థాపించడం, అవి పాటించాల్సిన ప్రమాణాలు, నియమాలు, ఉపాధ్యాయుల నియామకం, వారి విధులు, బాధ్యతలు మొదలగు అంశాల గురించి వివరించారు.
- **అధ్యాయం5**లో నాణ్యమైన విద్యకు అవసరమైన విద్యా ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు మొదలగు వాటి గురించి సవివరంగా సెక్షన్ 29, 30లలో తెలిపారు. వీటిలో ప్రధానంగా విద్యా ప్రణాళికలను రూపొందించేటపుడు, మూల్యాంకన విధానాలను నిర్ధారించేటపుడు పిల్లల సమగ్ర అభివృద్ధిని, రాజ్యాంగ విలువలను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. వీటితోపాటు బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు, బోధన మాధ్యమం, అభ్యసన వాతావరణం వంటి అంశాల గురించి ప్రస్తావించారు.
- **అధ్యాయం6**లో బాలల హక్కుల సంరక్షణ, పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో సలహా సంఘాల ఏర్పాటు గురించి సెక్షన్ 31 నుండి 34లలో వివరించారు.
- **అధ్యాయం7**లో చట్టం అమలుకు ఆదేశాలు జారీచేసే అధికారాలు, చేపట్టాల్సిన చర్యలు, ప్రాసిక్యూషన్, నియమ నిబంధనలు రూపొందించడం గురించిన వివరాలను సెక్షన్ 35 నుండి 38లలో వివరించారు.
- చట్టం చివర అనుబంధంలో పేర్కొన్న **షెడ్యూల్**లో పాఠశాలకు సంబంధించిన ప్రమాణాలు, నియమాల గురించి సెక్షన్ 19, 25లను దృష్టిలో వివరాలను పొందుపర్చారు. వీటిలో పిల్లల సంఖ్యను బట్టి ఉండాల్సిన ఉపాధ్యాయుల

సంఖ్య, పాఠశాల భవనం, గదులు, వసతి సౌకర్యాలు, సామగ్రి, విద్యా సంవత్సరంలో పాఠశాల పనిదినాలు, బోధనాగంటల సంఖ్య, ఉపాధ్యాయులు వారానికి పనిచేయాల్సిన పనిగంటల సంఖ్య మొదలగు వివరాలను చేర్చారు.

## RTE-2009 – గుణాత్మక అంశాలు – చేపట్టిన చర్యలు

RTE-2009 చట్టం పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడానికి ఉద్దేశించినది. బడిఈడు పిల్లలందరూ బళ్ళలోచేరి పాఠశాలవిద్యను ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పూర్తిచేయాలి. ఈ క్రమంలో వాళ్ళు ప్రతి తరగతికి సంబంధించిన ఆయా సబ్జెక్టుల్లో విద్యాప్రమాణాలను సాధించాలి. అనగా సబ్జెక్టుకు నిర్ధారించిన సామర్థ్యాలను సాధించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన చట్టంలోని కొన్ని ప్రత్యేకమైన సెక్షన్లను, వాటి గురించి చేపటాల్సిన చర్యలను తెలుసుకుందాం.

**సెక్షన్ (4) : RTE-200 చట్టంలోని ఈ సెక్షన్ ప్రకారం బడిఈడు పిల్లలు వారి వయసుకు తగ్గ తరగతిలో చేరి నాణ్యమైన విద్య పొందే హక్కు కలిగి ఉన్నారు.**

బడిఈడు పిల్లలు వారి వయసుకుతగ్గ తరగతిలో చేరే క్రమంలో కొన్ని సందర్భాలలో ఆ తరగతిలో కొనసాగడానికి అవసరమైన కనీస సామర్థ్యాలను కలిగి ఉండకపోవచ్చు. అయినప్పటికీ మిగతా పిల్లలతోబాటు ఆ తరగతిలో కొనసాగి నాణ్యమైన విద్యను పొందే హక్కు వారికి చట్టం కల్పించింది. దీనివల్ల కనీస సామర్థ్యాలను పిల్లలందరూ కల్గి ఉన్నారని నిర్ధారించుకోవడం ఉపాధ్యాయుల బాధ్యతగా మారింది. ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలందరినీ ఆయా తరగతులకు సంబంధించిన కనీస సామర్థ్యాలు సాధించేలా శిక్షణ ఇచ్చిన తర్వాతనే ఆ తరగతికి చెందిన పాఠ్యాంశాల ద్వారా నిర్ధారించిన సామర్థ్యాలను సాధించేలా చూడాలి.

ఇందుకోసం మన రాష్ట్రంలో పిల్లలందరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ సబ్జెక్టుల వారీగా అభ్యాస పుస్తకాలను రూపొందించింది. అట్లే నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించేటప్పుడు ఆయా తరగతులకు అవసరమైన కనీస సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని అభ్యాసాలను చేర్చింది. ఉదాహరణకు భాషావాచకాలలో అభ్యాసాలను పొందుపరిచిన విధానాన్ని పరిశీలిద్దాం.

| తరగతి | కనీస సామర్థ్యాల సాధనకు చేర్చిన అంశాలు |
|---|---|
| 2వ తరగతి | వర్ణమాల పునశ్చరణ, గుణింతాల పునశ్చరణ కోసం ప్రారంభ పాఠాలలో అభ్యాసాలు చేర్చారు. |
| 3వ తరగతి | వర్ణమాల, గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు, పునశ్చరణ కోసం ప్రారంభ పాఠాలలో అభ్యాసాలు చేర్చారు. అచ్చులు, హల్లులు, అల్ప, మహాప్రాణాలు మొదలగు వాటి గురించి వివరాలు కూడా చేర్చారు. |
| 4వ తరగతి | వర్ణమాల ఆధారంగా సరళపదాలు, గుణింతపదాలు, ద్విత్వ, సంయుక్త పదాలతోపాటు, ఉభయాక్షరాల గురించి అభ్యాసాలను ప్రారంభ పాఠాల్లో చేర్చారు. 3వ తరగతిలో నేర్చుకున్న వ్యాకరణాంశాలను పునశ్చరణ కోసం అభ్యాసాలుగా చేర్చారు. |
| 5వ తరగతి | పై విధంగానే 5వ తరగతి ప్రారంభ పాఠాల్లో కూడా పునశ్చరణ అభ్యాసాలను చేర్చారు. |

ప్రాథమిక విద్య పూర్తి అయ్యేసరికి తప్పనిసరిగా పిల్లలు ధారాళంగా చదవడం. అర్థంచేసుకోవడం, ప్రతిస్పందించడం చేయగలగాలి. అట్లే తెలిసిన, విన్న, చూసిన అంశాల గురించి సొంతమాటల్లో రాయగలగాలి. ఇవి చేయగల్గిన పిల్లలు ఏ తరగతిలో చేరినా ఆ తరగతికి సంబంధించిన భాషా విషయాలను సులభంగా అభ్యసించగల్గుతారు, సామర్థ్యాలను సాధించగల్గుతారు. కాబట్టి ప్రాథమికోన్నత స్థాయి అనగా 6, 7 పాఠ్యపుస్తకాల్లో కూడా ప్రారంభ పాఠాలు పిల్లలందరూ కనీసం చదవడానికి, రాయడానికి, సరళపదాలు, గుణింతపదాలు, ద్విత్వ, సంయుక్త పదాలకు సంబంధించిన అభ్యాసాలను, సొంతమాటల్లో రాసే అభ్యాసాలున్నాయి. ప్రాథమిక స్థాయిలో అభ్యసించిన ప్రాథమిక వ్యాకరణాంశాల పునశ్చరణ కూడా ఉంది. 8, 9 తరగతులలో కూడా కింది తరగతుల్లో నేర్చుకున్న వ్యాకరణాంశాలను పునశ్చరణగా ప్రారంభించి నూతన అంశాలను అనుబంధంగా చేర్చారు.

కాబట్టి భాషాబోధనలో ఉపాధ్యాయులు కేవలం సిలబస్ పేరుతో పాఠాలను యాంత్రికంగా పూర్తిచేయడంపై దృష్టిపెట్టకుండా నిర్దేశించిన సామర్థ్యాల సాధనపై దృష్టిపెట్టాలి. ఇందుకనుగుణంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలను సూచనలకనుగుణంగా వినియోగించాలి.

**అధ్యాయం-5లోని సెక్షన్ 29 (1), (2)లోని అంశాలు, విషయప్రణాళిక, మూల్యాంకన విధానాలకు ఉద్దేశించినవి. వీటిలోని అంశాలను పరిశీలిద్దాం.**

a) రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

b) పిల్లల సర్వతోముఖాభివృద్ధికి వీలుకల్గించాలి.

c) పిల్లల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించాలి.

d) పిల్లల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులను అభివృద్ధి చేయాలి.

e) పిల్లలను కేంద్రంగా చేసుకొని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన, కనుగొనుట మొదలగు శిశుకేంద్రీకృత విధానాలు, కృత్యాధార పద్ధతులను అనుసరించాలి.

f) ఆచరణలో సాధ్యమైనంత వరకు బోధనామాధ్యమం బాలల మాతృభాషగా ఉండాలి.

g) భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తంచేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడంలో సహాయపడాలి.

h) జ్ఞానాన్ని పిల్లలు అర్థం చేసుకున్న విధానం, దాన్ని అన్వయించే సామర్థ్యాలపై నిరంతర సమగ్ర మూల్యాంకనం జరగాలి.

**30 (1) ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలు ఎటువంటి బోర్డు పరీక్షకు హాజరు కారాదు. 30(2) ఎలిమెంటరీ విద్య పూర్తిచేసినవారికి ధృవీకరణ పత్రాలు జారీచేయాలి.**

పైన తెల్పిన అంశాలలోని వివిధ విషయాల గురించి చర్చిద్దాం.

## 1. పిల్లల సర్వతోముఖాభివృద్ధి :

పిల్లలందరూ శారీరక, మానసిక, సాంఘిక, నైతిక, ఉద్వేగ రంగాలలో అభివృద్ధిచెందినప్పుడే సర్వతోముఖాభివృద్ధిని సాధించినట్లు. ఇందుకోసం పిల్లలు పాఠ్య విషయాలతోపాటు సహపాఠ్య విషయాలను కూడా అభ్యసించాల్సి ఉంటుంది. మన

రాష్ట్రంలో RTE-2009 చట్టం అమలులోకి వచ్చినందున సహపాఠ్య విషయాలను కూడా పాఠ్యవిషయాలతో సమానంగా అభ్యసించడానికి తగు చర్యలు చేపట్టారు. ఇందుకోసం కింది విషయాలను పిల్లలు అభ్యసించాల్సి ఉంటుంది. అవి :

| ప్రాథమిక స్థాయి | ఉన్నత స్థాయి |
|---|---|
| ♦ ప్రథమ భాష (మాతృ భాష) | ♦ ప్రథమ భాష (మాతృ భాష) |
| ♦ ద్వితీయ భాష (ఆంగ్లం) | ♦ ద్వితీయ భాష (హిందీ / తెలుగు / ఉర్దూ) |
| ♦ గణితం | ♦ తృతీయ భాష (ఆంగ్లం) |
| ♦ పరిసరాల విజ్ఞానం | ♦ గణితం |
| ♦ వ్యాయామ, ఆరోగ్యవిద్య | ♦ విజ్ఞాన శాస్త్రం |
| ♦ విలువలు, జీవన నైపుణ్యాలు | ♦ సాంఘిక శాస్త్రం |
| ♦ పని, కంప్యూటర్ విద్య | ♦ వ్యాయామ ఆరోగ్యవిద్య |
| ♦ కళలు, సాంస్కృతిక విద్య | ♦ విలువలు – జీవననైపుణ్యాలు |
| | ♦ పని, కంప్యూటర్ విద్య |
| | ♦ కళలు, సాంస్కృతిక విద్య |

పాఠశాల అనేది పిల్లల సమగ్ర ఎదుగుదలకు ఏర్పాటు చేసిన కేంద్రం. పిల్లల్లో ఏదో ఒక సామర్థ్యాన్ని అభివృద్ధిపరచడం ద్వారాగాని లేదా కొన్ని విషయాలకే పరిమితమై వాటిని సాధించడంవల్లగాని విద్య యొక్క లక్ష్యం నెరవేరదు. బాలల ఇష్టాలు, ఆసక్తులను గుర్తించి, అందుకు అవసరమైన కార్యకలాపాలను పాఠశాలల్లో నిర్వహించినప్పుడే బాలల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది.

ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలు, విషయప్రణాళికలు రూపొందించారు.

## 2. రాజ్యాంగ విలువలు :

మన రాజ్యాంగం విలువలకు పెద్ద వనరు. రాజ్యాంగ పీఠికలో సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం మొదలగువాటి గురించి ప్రస్తావించారు. అట్లే పౌరుని విధులు, బాధ్యతలు, హక్కుల గురించి ప్రస్తావించారు. విద్యాప్రణాళికలు, విషయప్రణాళికలు రూపొందించేటప్పుడు వీటిని పరిగణనలోకి తీసుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. ఇందుకనుగుణంగా నూతన పాఠ్యపుస్తకాలు రూపొందించారు.

భాషా వాచకాల్లో మానవతావిలువలు, దేశభక్తి, సంస్కృతి సంప్రదాయాలు, సామాజిక స్పృహ, నైతిక విలువలు, వంటి ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యాంశాలను ఎంపికచేసి పొందుపరిచారు. పిల్లల్లో విలువలు పెంపొందించేలా చేయడానికి ప్రశంసాపూర్వకమైన వైఖరిని కలిగి ఉండడం వంటి సామర్థ్యాన్ని కూడా భాషా సామర్థ్యాలలో చేర్చి అభ్యాసాలలో పొందుపరచారు.

## 3. జ్ఞానం :

జ్ఞానం అంటే సమాచారమని భావిస్తుంటాం. కాని జ్ఞానం, సమాచారం రెండూ ఒకటి కావు. గతానుభవాల ఆధారంగా ఆలోచించినప్పుడు ఉత్పన్నమయ్యే భావనలను లేదా అవగాహనను జ్ఞానమని అంటారు. (NCF-2005

ప్రకారం) జ్ఞానమనేది ఒక్కొక్క సబ్జెక్టులో ఒక్కో రకంగా ఉంటుంది. భాషలో జ్ఞానం అనేది విభిన్న వ్యవహార రూపాల్లో ఉంటుంది. అనగా కథ, పాట, సంభాషణ, గేయం, ఆత్మకథ, వ్యాసం, లేఖ, సంపాదకీయం, నాటకం మొదలగు రూపాల్లో ఉంటుంది. కాబట్టి భాషాభ్యసనం వల్ల పిల్లలు విభిన్న వ్యవహార రూపాలను అర్థం చేసుకోవాలి, వాటిని తిరిగి ఉత్పత్తి చేయగల్గాలి. అనగా కథలను చెప్పడం, రాయడం, పొడిగించడం, గేయాలు, కవితలు, పాటలు వంటివి రాయడం, కరపత్రాలు, పోస్టర్లు తయారుచేయడం మొదలగునవి చేయగలగాలి. ఇందుకోసం వీటిని 'సృజనాత్మక వ్యక్తీకరణ' అనే పేరుతో భాషాసామర్థ్యాలలో చేర్చారు. పాఠ్యపుస్తకాలలో ప్రతి పాఠంలో సృజనాత్మక వ్యక్తీకరణకు చెందిన అభ్యాసాలను పొందుపరిచారు.

### 4. సామర్థ్యాలు / ప్రమాణాలు :

సామర్థ్యం అనగా చేయగలిగే సమర్థతను కలిగి ఉండడం లేదా సాధించగలగడం. ఇందుకోసం ప్రతి సబ్జెక్టులో సాధించాల్సిన సామర్థ్యాలను నిర్ధారించినారు. తరగతి వారీగా, సబ్జెక్టు వారీగా నిర్ధారించిన సామర్థ్యాలను సాధించినప్పుడు పిల్లలు నాణ్యమైన విద్యను పొందినట్లుగా భావించాలి. సామర్థ్యాలనే గతంలో లక్ష్యాలు – స్పష్టీకరణలు, ఆశించిన అభ్యసన ఫలితాలు లేదా పిల్లలకు రావలసినవి అనే పేర్లతో పిలిచేవారు. ప్రస్తుతం వీటిని సాధించాల్సిన సామర్థ్యాలు లేదా విద్యాప్రమాణాలు అనే పేరుతో పిలుస్తున్నారు. భాషలో పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలను లేదా ప్రమాణాలు దిగువ విధంగా ఉన్నాయి.

1. ఆలోచించి ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, వినడం – అర్థంచేసుకోవడం, ప్రతిస్పందించడం
2. ధారాళంగా చదవడం, అర్థంచేసుకోవడం, ప్రతిస్పందించడం
3. స్వీయరచన (ఆలోచించి సొంతమాటల్లో రాయడం)
4. పదజాల వినియోగం (పదాలను అర్థంచేసుకొని వినియోగించడం)
5. సృజనాత్మక వ్యక్తీకరణ
6. ప్రశంసాపూర్వకమైన వైఖరులు కలిగి ఉండడం
7. భాషను గురించి తెలుసుకోవడం (వ్యాకరణాంశాలు)

పైన తెల్పిన భాషాసామర్థ్యాలు సాధించడానికి వీలుగా అన్ని భాషావాచకాలలో సంవత్సరాంతానికి ఆ తరగతికి సాధించాల్సిన సామర్థ్యాల జాబితాను చేర్చారు. అట్లే ప్రతీ పాఠంలో ఆయా సామర్థ్యాలు సాధించడానికి వీలుగా సామర్థ్యాల వారీగా అభ్యాసాలను చేర్చారు.

### 5. నైపుణ్యాలు :

నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తోంది. ఇందుకోసం పిల్లలు కొన్ని నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. అవి :

అ) ఆలోచనా నైపుణ్యాలు (Thinking Skills)

ఆ) భావ ప్రసార నైపుణ్యాలు (Communication Skills)

ఇ) సాంఘిక నైపుణ్యాలు (Social Skills)

ఈ) స్వయం నిర్వహణా నైపుణ్యాలు (Self Management Skills)

ఉ) పరిశోధనా నైపుణ్యాలు (Research Skills)

అ) **ఆలోచనా నైపుణ్యాలు (Thinking Skills)**

సాధారణంగా మనకు భాషల్లో భాషానైపుణ్యాలు, విజ్ఞానశాస్త్రంలో ప్రక్రియా నైపుణ్యాలు వర్గీకరణ, పోల్చడం, ప్రయోగాలు, భావప్రసార నైపుణ్యాలు, పరికల్పనలు, అన్వేషణలు నిర్ధారణ మొదలగువాటి గురించి కొంత అవగాహన ఉంది. నైపుణ్యాలు అనేవి మానసికపరమైనవి. అనగా ఆలోచనాత్మకమైనవి. ఆలోచించే విధానంలో వైవిధ్యతను ప్రదర్శించే నైపుణ్యం కల్గి ఉండడాన్ని ఆలోచన నైపుణ్యాలు (thinking skills) అంటారు. ఇవి ప్రధానంగా నాలుగు రకాలు.

- **ప్రతిస్పందించడం (Reflection) :** అభిప్రాయాలు చెప్పడం, ఇష్టాయిష్టాలు చెప్పడం
- **హేతుబద్ధంగా లేదా విమర్శనాత్మక ఆలోచించడం (Rational / Critical Thinking) :** కారణాలు వివరించడం, ఎందుకు? ఎలా? మొదలగు అంశాలను వివరించగల్గడం. సకారణంగా వ్యక్తీకరించడం.
- **బహుకోణాల్లో ఆలోచించడం (Dialectical Thinking) :** అంటే ఏ విషయం గురించైనా విభిన్న కోణాల్లో చెప్పగలగడం, సమర్థిస్తూ మాట్లాడడం, విభేదిస్తూ మాట్లాడడం; ఏదైనా విషయాన్ని - అంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రయోజనాలను చెప్పగలగడం అట్లే పరిమితులను కూడా చెప్పగలగడం.
- **సృజనాత్మక ఆలోచన (Creative Thinking) :** అంటే నూతన ప్రతిపాదన చేయగల్గడం ,కొత్తవి సృష్టించడం, తన నిర్ణయాన్ని ప్రకటించడం అంటే తానే ఆస్థానంలో ఉంటే ఏం చేస్తాడు? అని స్థిరంగా/ ఆత్మ విశ్వాసంతో చెప్పగలగడం. అట్లే సృజనాత్మకంగా వ్యక్తీకరించడం.

నేర్చుకోవడం అనేది ఆలోచించడం ద్వారానే జరుగుతుంది. అభ్యసనం జరగాలంటే విద్యార్థులను ఆలోచింప చేయాలి. గత అనుభవాల ద్వారా ఆలోచించడం వల్ల జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

జ్ఞానాన్ని పొందడానికి ఆలోచించాలి. ఆలోచించడం ద్వారానే అవగాహన, వినియోగం, విశ్లేషణ, సంశ్లేషణ, మూల్యాంకనం అనే అత్యున్నత నైపుణ్యాలను సాధించవచ్చు. పాఠ్యపుస్తకాలలో ఇందుకనుగుణంగా అభ్యాసాలు ఉన్నాయి. పాఠం గురించి, రచనాశైలి గురించి, కవి ఆంతర్యం గురించి స్వీయ అభిప్రాయాలు చెప్పడం, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ కారణాలు చెప్పడం, వివరించి రాయడం అనే అంశాలకు సంబంధించిన ప్రశ్నలను వినడం - మాట్లాడడం, స్వీయరచన, ధారాళంగా చదవడం, సృజనాత్మక వ్యక్తీకరణ వంటవి సంబంధించిన అభ్యాసాలలో పొందుపర్చారు.

ఆ) **భావప్రసార నైపుణ్యాలు (Communicative Skills)**

- బాగా వినటం. ఆలోచించి మాట్లాడటం.
- చదివింది అవగాహన చేసుకొని ప్రతిస్పందించడం.
- స్వీయరచన : చదివిన, విన్నదానిపై అవగాహనతో వ్యాఖ్యానించడం. చర్చించడం.
- హావ భావాలతో భావవ్యక్తీకరణ చేయడం. భాషావాచకాల ప్రధాన ఉద్దేశాలలో భావప్రసార నైపుణ్యాలు సాధించడం ఒకటి. అభ్యాసాలన్నీ ఇందుకు ఉద్దేశించినవే!

**ఇ) సాంఘిక నైపుణ్యాలు (Social Skills)**

- ఎదుటివారిని గౌరవించడం.
- బాధ్యతలు వహించడం.
- ఇతరులతో కలిసి పని చేయడం, పంచుకోవడం.
- సమాజంలో, సమూహంలో తన ధర్మాన్ని నిర్వర్తించడం.
- ఆత్మ విశ్వాసం, నమ్మకం కల్గిఉండటం.
- కుటుంబ జీవనం, కుటుంబ సంబంధాలపై ప్రేమానురాగాలు కనబరచడం. ఇందుకు జట్టుపనులు, ప్రాజెక్టుపనులతో కూడిన అభ్యాసాలు పాఠ్యపుస్తకంలో ఉన్నాయి.

**ఈ) స్వీయ నిర్వహణ నైపుణ్యాలు (Self management Skills)**

- మానసిక చలనాత్మక నైపుణ్యాలు (కాళ్ళు, చేతులు, వేళ్ళతో వివిధ పనులు చేయటం)
- సమయ పాలన (Time management)
- ఆరోగ్యమైన జీవన (Healthy life styles) శైలులు
- ఆశించిన రీతిలో పిల్లల ధనాత్మక (సకారాత్మక) ప్రవర్తన

**ఉ) పరిశోధనా నైపుణ్యాలు (Research Skills)**

అన్వేషించుట ద్వారా తెలుసుకోవటం. అవి:

- ప్రశ్నించడం.
- ప్రశ్నల ఆధారంగా పరిశీలనలు చేయడం.
- సమాచార సేకరణ.
- సేకరించిన సమాచారాన్ని నమోదుచేయుట, విశ్లేషించుట.
- కనుగొన్న విషయాలు నివేదిక రూపంలో రాయుట, ప్రదర్శించుట.

ఇందుకోసం ప్రతి పాఠంలో ప్రాజెక్టు పనులున్నాయి. వీటి కోసం పిల్లలు పరామర్శ పుస్తకాలు చదవడం, ఉపాధ్యాయులను సంప్రదించడం ద్వారా సమాచారాన్ని సేకరిస్తారు. నమోదుచేస్తారు. విశ్లేషించి నివేదికలు రాస్తారు.

## 6. వైఖరులు (Attitudes/ dispositions)

వ్యక్తులు తమ పరిసరాలు మరియు సమాజంపట్ల కనబరచే ప్రవర్తనలు, వెల్లడించే అభిప్రాయాలు, అనుభూతులను వైఖరులు అంటారు.

**వ్యక్తులు ప్రదర్శించే ముఖ్యమైన వైఖరులు :**

- ♦ బాధ్యత తీసుకోవడం (Responsibility)
- ♦ కలిసి పనిచేయడం (Working together)
- ♦ ఉత్సాహం, ఉత్సుకతను ప్రదర్శించడం (Curiosity)

- తదానుభూతి కల్గియుండడం (Empathy)
- సహనం, ఓర్పు కల్గియుండడం (Patience)
- గౌరవం చూపడం (Respectness)
- స్వతంత్రత (Independence)
- క్షమ (forgiveness)
- ప్రేమానురాగాలు (Love, affection)
- ప్రోత్సహించడం, ప్రశంసించడం (Encouragement, appreciation)
- నిజాయితీ (Honesty)
- శ్రమకు గౌరవమివ్వడం (Dignity of labour)

విద్య అనేది జాతీయ అభివృద్ధిని, సాంఘిక అభివృద్ధిని సాధించేది. పాఠశాల పిల్లల అంతర్గత శక్తులను గుర్తించి వారిలో శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక, విలువలు, నీతినియమాలను అభివృద్ధి చేయడం ద్వారా పిల్లల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. పైన తెలిపిన వైఖరులను పెంపొందించడానికి ప్రశంసాపూర్వకమైన వైఖరి కల్గిఉండడం అనే సామర్థ్యాన్ని అభ్యాసాలుగా అన్ని పాఠాలలో చేర్చారు.

### 7. శిశుకేంద్రీకృత విద్య (Child Centred Education)

చదువు అనేది శిశుకేంద్రంగా పిల్లలు నేర్చుకునేవిధంగా కొనసాగాలి. అంటే పిల్లల అనుభవాలకు, వారి ఆలోచనలకు క్రియాశీల భాగస్వామ్యానికి పెద్దపీట వెయ్యాలి. ఇందుకోసం ఉపాధ్యాయులు పిల్లల మానసికాభివృద్ధిని, వారి అభిరుచులను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని బోధనాభ్యసన ప్రక్రియలను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలి. ఇవి వైవిధ్యభరితంగా ఉండి, పిల్లల భౌతిక, సాంస్కృతిక, సామాజిక మాధ్యమాలకు ప్రాధాన్యతనిచ్చేవిగా ఉండాలి. పిల్లల అభిప్రాయాలకు విలువనిచ్చేవిగా ఉండాలి. తరగతి గదులలో బోధన సందర్భంగా పిల్లలు ప్రతిక్షణం చురుకుగా పాల్గొంటూ తమంతటతాము నేర్చుకునే అవకాశాలు అందిపుచ్చుకోవడంపై దృష్టిపెట్టాలి. ఉపాధ్యాయులు సలహాదారుగా, మార్గదర్శిగా, సౌలభ్యకర్తగా వ్యవహరించాలి.

### 8. స్నేహపూరిత వాతావరణం (Child Friendly Environment)

పిల్లలు ఆనందంగా, ఆహ్లాదకరంగా నేర్చుకోవాలి. భయం, ఒత్తిడిలేని స్వేచ్ఛాయుత వాతావరణం ఉన్నచోట పిల్లల్లో వికాసం బాగా జరుగుతుందని మనందరికి తెలిసిందే. పిల్లల అభిప్రాయాలకు, అభిరుచులకు తగిన స్థానం కల్పించినప్పుడు మాత్రమే వారు ఆహ్లాదకరంగా, ఆనందంగా చదువగల్గుతారు. శిశుకేంద్రీకృత బోధనాభ్యసన ప్రక్రియలను అనుసరించి అభ్యసనంలో పిల్లలు చురుకుగా పాల్గొనేలా చేయాలి. ఇటువంటి వాతావరణం తరగతి గదిలో కల్పించినప్పుడు మాత్రమే అది స్నేహపూరిత వాతావరణం అని చెప్పవచ్చు.

**స్నేహపూరిత వాతావరణ లక్షణాలు :**

- భయం లేకుండా పిల్లలకు స్వేచ్ఛనిచ్చి, తమకు తెలియని అర్థంకాని విషయాలను జంకు లేకుండా పిల్లలు అడిగేలా వాతావరణం ఉపాధ్యాయుడు కల్పించడం.
- పిల్లలందరూ అభ్యసనంలో భాగస్వాములవడం.

- స్థాయికి తగిన బోధనాభ్యసన ప్రక్రియలను అనుసరించడం.
- ఉత్సాహం, ప్రేరణ, ఆసక్తిని కలిగించేవిగా కృత్యాలు ఉండడం.
- మార్గదర్శిగా, సలహాదారుగా, సౌలభ్యకర్తగా, స్నేహితుడిలా ఉపాధ్యాయుడు వ్యవహరించడం.
- తోటివారి ద్వారా నేర్చుకునే అవకాశం పిల్లలకు ఉండడం.
- అందరు పిల్లల అభిప్రాయాల్ని గౌరవించడం.
- ఒత్తిడి, దండనలేని భయరహిత వాతావరణాన్ని కల్పించడం.
- తమ అనుభవాలు, భావాలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం పిల్లలకు ఉండడం.
- అభినందన, ప్రోత్సాహం, ప్రేరణ వంటి వాటికి అవకాశం ఉండడం.

## 9. అభ్యసనం లేదా నేర్చుకోవడం (Learning)

పలువురు 'అభ్యసనం' అంటే పుస్తకంలోని సమాచారాన్ని ఏదో ఒక పద్ధతి ద్వారా పిల్లలకు అందించడం, ప్రశ్నల ద్వారా ఆ సమాచారాన్ని రాబట్టడం అని భావిస్తారు. దీనివల్ల చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు కేవలం చెప్పడం, విద్యార్థి విని అర్థంచేసుకొని గుర్తు పెట్టుకోవడం జరుగుతోంది. వాస్తవంగా అభ్యసనమంటే జ్ఞాన నిర్మాణం జరగడం. అవసరమైనప్పుడు, సందర్భోచితంగా ఈ జ్ఞానాన్ని వినియోగించగల్గడం.

ఆధునిక విద్యావేత్తలు, పరిశోధకులు పిల్లలందరిలోనూ అభ్యసించే శక్తి ఉందని నిరూపించారు. దీని ప్రకారం పిల్లలు స్వంతంగా జ్ఞానాన్ని నిర్మించుకోగలరు. పిల్లలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచి వారి పూర్వజ్ఞానం, పూర్వానుభవాల సమన్వాయంతో జ్ఞానాన్ని నిర్మించుకోనేందుకు సంధానకర్తలుగా సౌలభ్యకర్తలుగా (ఫెసిలిటేటర్) ఉపాధ్యాయులు పనిచేయాలి.

సంప్రదాయంగా అందరూ భావిస్తున్నట్లు ఉపాధ్యాయులే జ్ఞానదాతలు కారు. పిల్లలు స్వయంగా జ్ఞాన నిర్మాతలు. ఉపాధ్యాయుని సూచనల ప్రకారం నడుచుకొనే 'మరమనుషులు' కారు అన్న అభిప్రాయం ఈనాడు విద్యావేత్తలలో ఉంది.

పై అంశాలను పరిశీలిస్తే సమాచారాన్ని పూర్వానుభవాలతో సంధానం చేసుకొని తమ సామర్థ్యాలకు పదును పెట్టుకొని సందర్భానుసారం వాటిని వినియోగించే శక్తిని పెంపొందించుకోవడమే అభ్యసనం అని చెప్పవచ్చు.

### పిల్లలు ఎలా నేర్చుకుంటారు?

### (How children learn?)

- పిల్లలు కేవలం వినడం లేక చదవడం ద్వారానే కాకుండా అనేక ఇతర పద్ధతుల ద్వారా కూడా నేర్చుకొంటారు. అనగా అనుభవాల ఆధారంగా ఆలోచించడం, పరిశీలించడం, జట్టుపనుల్లో పాల్గొనడం (Experience), పనులు, కృత్యాలు చేయడం (learning by doing) ప్రయోగాలు చేయడం (experimentation), చర్చలు (discussions), జరపడం (Discussions), ప్రశ్నించడం (questioning), ప్రతిస్పందించడం (reflection), వినడం (listening), ఇతరులతో కల్సి పనిచేయడం, ఆలోచించి స్వంతంగా రాయడం (expressing one self) మొదలగు వాటి ద్వారా నేర్చుకొంటారు.

- ఉత్సాహంగా నేర్చుకోవడం పిల్లలందరికీ స్వాభావికంగానే ఉంటుంది. నేర్చుకోవడం పాఠశాలలోనే గాకుండా పాఠశాల వెలుపలి వాతావరణంలో కూడా జరుగుతుంది. అభ్యసనాన్ని మెరుగుపరచాలంటే తప్పనిసరిగా తరగతి గది అభ్యసనాన్ని బడి వెలుపలి కృత్యాలతో, అనుభవాలతో అనుసంధానం చేయాలి.

- అర్థాన్ని గ్రహించడం, అవగాహన చేసుకోవడం, తార్కికంగా ఆలోచించడం, సమస్యలను సాధించడం, అన్వేషించడం, కనుగొనడం, చర్చించడం మొదలగు వాటి ద్వారా అభ్యసనం సమర్థంగా జరుగుతుంది.

- అభ్యసనం అర్థం కావాలంటే తగిన ప్రశ్నల ద్వారా పిల్లలను ఆలోచింప చేయాలి. కృత్యాలు, సమస్యలు, ప్రాజెక్టులు ఇచ్చి వాటి పిల్లలను మాట్లాడించాలి. చేసింది, నేర్చుకొన్నది రిపోర్టుల రూపంలో రాయమనాలి. తరగతి గదిలో ప్రదర్శించి చర్చకు పెట్టాలి. ఇలా చేస్తే పిల్లలు సంతోషంగా, బాగా నేర్చుకొంటారు. ఇటువంటి పనులలో వైవిధ్యం, సవాలు (challenge) ఉంటుంది. విసుగుదల ఉండదు. పనులు చేయడం ద్వారా నేర్చుకుంటారు. కావున ఏకాగ్రత ఉంటుంది. పిల్లలు ఇష్టంగా చేయడం వల్ల అభ్యసనంలో, ఉత్సాహంగా పాల్గొంటారు. సులభంగా తెలియకుండానే నేర్చుకోవడం జరుగుతుంది. పనుల్లో నిమగ్నం అవుతారు కాబట్టి అల్లరి చేయడం మొదలగు క్రమశిక్షణా సమస్యలు ఉత్పన్నం కావు.

- అభ్యసనం అనేది పరిశీలనల ద్వారా, సమాజంలోని వివిధ వ్యక్తులతో జరిపే పరస్పర చర్యల ద్వారా, తోటి వారి ద్వారా, చర్చల ద్వారా జరుగుతుంది.

- నేర్చుకోవడానికి ముఖ్యమైనది తరగతి గది వాతావరణం, అనగా భయరహిత వాతావరణం. పిల్లలఎడ భద్రత, ప్రేమ ఆప్యాయత కనబరచాలి. ఉపాధ్యాయుడు పిల్లలతో కలిసిపోయి వారు నేర్చుకునేటట్లు చేయాలి. వ్యక్తిగతంగా చెప్పడం, తెలియని విషయాలను అడగమని చెప్పాలి. పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి.

- నేర్చుకొనేటప్పుడు తప్పులు జరగడం సహజం. పిల్లల తప్పులను ఎత్తి చూపడం, నిందించడం, ఇతరులతో పోల్చడం, కించపరచడం వంటివి చేయకూడదు. పిల్లలు చేసిన వాటిలో తప్పొప్పులను గుర్తించాలి. ఒప్పులను మొదట అభినందించాలి. వారు చేసిన తప్పులను పిల్లలే సరిదిద్దుకునేలా తరగతిలో చర్చ నిర్వహించాలి. సరైనది ఏదో ఉపాధ్యాయుడు వివరించి, పిల్లల్ని తాము రాసిన వాటిని సరిపోల్చుకోమని అనాలి. దీని వల్ల పిల్లలు నేర్చుకొనే ప్రక్రియలో చురుకుగా పాల్గొంటారు. అదే పనిగా తప్పులు వెదికి 'X' లు పెట్టి ఎత్తిచూపినంత మాత్రాన, ఆ తప్పు ఎందుకు జరిగిందో గుర్తించలేరు. తప్పులు దొరలుతాయన్న భయంతో/ న్యూనతా భావంతో మాట్లాడటానికి, తెలియజేయడానికి, ప్రదర్శించడానికి జంకుతారు.

## 10. కృత్యాలు

కృత్యమనగా నేర్చుకోవడానికి ఆలోచనతో చేసే పని. ఆలోచించడానికి అవకాశం లేకున్నా లేదా నేర్చుకోవడానికి దోహదపడకున్నా ఆ పనిని కృత్యమని భావించరాదు. పుస్తకాల్లో చూసిరాయడం, గైడ్లలో చూసి రాయడం, వల్లె వేయడం, దిద్దడం, బట్టీపట్టడం, ఉపాధ్యాయుడు చెప్పినది మౌనంగా వినడం, నల్లబల్లపై రాసిన అంశాలను ఆలోచనారహితంగా రాసుకోవడం వంటివి కృత్యాలు కావు. సాధారణంగా తరగతిగదిలో ఇవి చోటు చేసుకుంటూ ఉంటాయి. వీటిని చూసి కృత్యాల ద్వారా నేర్చుకుంటున్నారని భావించడం జరుగుతూ ఉంటుంది. ఇది సరైనది కాదు.

ఉదా : కింది కృత్యాలను పరిశీలించండి.

1. వినాయకచవితిని హిందువులు జరుపుకుంటారు కదా! ఇలా ఇంకా ఏ ఏ పండుగలను ఇతర మతాలవారు జరుపుకుంటారు? ఆ రోజు ఏం చేస్తారు? వినాయకచవితి పండుగతో పోల్చి కింది పట్టికలో రాయండి.

| వినాయకచవితి రోజు చేసేవి | ఇతర పండుగలనాడు చేసేవి |
|---|---|
| | |

2. సూదిని చాలా జాగ్రత్తగా పట్టుకొని వచ్చారు కదా! మరి మీరు వేటిని తెచ్చేటప్పుడు జాగ్రత్తగా తీసుకొస్తారు?

పై కృత్యాలను పరిశీలించారు కదా! వీటి గురించి పిల్లలు తప్పనిసరిగా ఆలోచించాల్సి ఉంటుంది. అట్లే వీటిని చేసినందువల్ల పిల్లల్లో చదివే సామర్థ్యం, చదివినదాన్ని అవగాహన చేసుకోవడం, సృజనాత్మకత అనే సామర్థ్యాలు పెంపొందుతాయి. కాబట్టి ఈ విధంగా ఆలోచనకు, అభ్యసనానికి అవకాశమున్న పనులను మాత్రమే కృత్యాలుగా భావించాలి. ఇలాంటి కృత్యాలను పాఠ్యపుస్తకంలో సామర్థ్యాల వారీగా పొందుపరిచారు.

## కృత్యాలు - రకాలు

ఉదా : కింది కృత్యాలను పరిశీలించండి.

1. పాఠంలో తోట ఎలా ఉంటుందో తెలుసుకున్నారు కదా! మరి మీరు పెంచే తోట ఎలా ఉంటుందో ఊహించండి. మీ తోట చిత్రాన్ని గీయండి. మీ తోట గురించి చిన్న కవిత/ గేయం రాయండి.
2. మీ పాఠశాలలో జరుపుకునే జెండా పండుగకు మీ తల్లిదండ్రులను, గ్రామస్తులను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను తయారు చేయండి.
3. ప్లాస్టిక్ వినియోగం గురించి అఖిల్ సమర్థిస్తూ మాట్లాడాడు. సలీమ వ్యతిరేకిస్తూ మాట్లాడింది. మరి మీరైతే ఏం మాట్లాడతారో చెప్పండి.

పై మూడు ప్రశ్నలను పరిశీలించండి. వీటిలో ఏది వ్యక్తిగతంగా చేసేది? ఏది తోటివారితో చర్చించి రాసేది? ఏది పూర్తి తరగతిలో చర్చించేది? గమనిద్దాం.

పై మూడు ప్రశ్నలలో మొదటి ప్రశ్నను పరిశీలిస్తే పిల్లలు సొంతంగా ఊహించి చిత్రాన్ని గీయాలి. దాని గురించి రాయాలి. ఇది వ్యక్తిగతంగా రాయాల్సి ఉంటుందని అర్థమవుతుంది కదా! కాబట్టి, దీన్ని వ్యక్తిగత కృత్యంగా పరిగణిస్తాము.

రెండవ ప్రశ్నలో పిల్లలు ఆహ్వాన పత్రికలు తయారు చేయాలి. ఇది రాయడానికి ఇతరుల సహకారం అవసరం. కాబట్టి, పిల్లలు తోటివారితో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఇలా తోటివారితో కలిసి పని చేయడాన్ని జట్టు కృత్యాలు అంటారు.

మూడో ప్రశ్నను పరిశీలిస్తే జవాబును సొంతంగా ఆలోచించి వ్యక్తిగతంగా రాయాల్సి ఉంటుందని తెలుస్తున్నది కదా!

పై మూడు ప్రశ్నల ద్వారా కృత్యాలు మూడు రకాలుగా ఉంటాయని అర్థం చేసుకోవచ్చు. అవి :

వ్యక్తిగత కృత్యాలు (Individual Activities)

జట్టు కృత్యాలు (Group Activities)

పూర్తి తరగతి గది కృత్యాలు (Whole Class Activities)

పాఠ్యపుస్తకాల్లో ప్రతి పాఠంలో కూడా వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి గది కృత్యాలు ఉన్నాయి. వీటిలో వినడం, మాట్లాడడానికి సంబంధించిన అభ్యాసాలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాల్సి ఉంటుంది. ధారాళంగా చదవడం, స్వీయరచన, పదజాలం, వ్యాకరణాంశాలకు సంబంధించిన అభ్యాసాలను పిల్లలు వ్యక్తిగతంగా చేయాల్సి ఉంటుంది. అనగా వీటికి వ్యక్తిగతంగా ఆలోచించి జవాబులు రాయాలి. సృజనాత్మకత, ప్రశంస, అర్థాలు తెలుసుకోవడం, ప్రాజెక్టుపనులు మొదలగు వాటిని తోటివారితో కలిసి జట్టు కృత్యాలుగా చేయాలి. పాఠ్య బోధన సమయంలో పాఠంలోని అభ్యాసాలను పైన తెలిపిన విధంగా నిర్వహించాల్సి ఉంటుంది.

ఈ విధంగా కృత్యాల ఆధారంగా పిల్లలు నేర్చుకొనేలా చేయడాన్ని కృత్యాధార పద్ధతి అంటారు.

## 11. కనుగొనడం

కనుగొనడం అనగా నూతన విషయాన్ని గుర్తించడం, లేదా ఆవిష్కరించడం. భాషలో విశ్లేషణల ద్వారా కీలకాంశాలను గుర్తించడం, రచనా శైలులను గుర్తించడం, రచనల్లోని అలంకారాలను, భాషా సౌందర్యాన్ని గుర్తించడం వంటివి భాషభ్యసనంలో కనుగొనడంగా భావించవచ్చు. ఇందుకనుగుణంగా అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా : గేయంలో కవి వేటిని, వేటితో పోల్చాడో చెప్పండి.

## 12. అన్వేషణలు

అన్వేషణ అనగా వెతకడం అని అర్థం. భాషాభ్యసనంలో పదాలను, వాటికి అర్థాలను, భావానుగుణమైన వాక్యాలను, సందర్భోచితమైన వాక్యాలను, జాతీయాలను, సామెతలను, సందేశాత్మక అంశాలను, చదువుతున్న అంశాలలో గుర్తించాల్సి ఉంటుంది. తద్వారా పిల్లల్లో అన్వేషణా శక్తి పెరుగుతుంది. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలలో ధారాళంగా చదవడం, పదజాలం, ప్రాజెక్టు పనులలో అన్వేషణ శక్తి పెంపొందించేలా అభ్యాసాలను పొందుపరిచారు.

## 13. నిరంతర సమగ్ర మూల్యాంకనం

పిల్లల అభ్యసనాన్ని కేవలం పరీక్షల ద్వారా మాత్రమే తెలుసుకోగలమనే అభిప్రాయం విద్యారంగంలో అవాంఛనీయ ధోరణులకు, ఆందోళనకర పరిస్థితులకు దారి తీసింది. మార్కులు, ర్యాంకులతో పిల్లల్లో అనారోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచింది. ఈ పరిస్థితులను నివారించడానికి నిరంతర సమగ్రమూల్యాంకనం చేయాలని RTE-2009 సూచించింది.

పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించగలిగే శక్తిని మూల్యాంకనం చేయాలని చట్టంలో పేర్కొన్నారు. కాబట్టి, మూల్యాంకనం చేసే అంశాలు, మూల్యాంకనంలోని ప్రశ్నలు, సాధనాలు అన్నీ కూడా మారాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకనుగుణంగా మన రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలుపరచాలన్న నిర్ణయం ప్రభుత్వం తీసుకొంది. నిరంతర మూల్యాంకనంలో భాగంగా నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని (Formative

Evaluation) నిర్వహించాలి. దీంతోపాటు సామర్థ్యాల ఆధారంగా ఆలోచింపజేసే అన్వయించే ప్రశ్నలతో కూడిన మౌఖిక రాత పరీక్షలతో సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని (Summative Evaluation) నిర్వహించాలి. పాఠ్య విషయాలతో పాటు, సహ పాఠ్య విషయాలను కూడా సబ్జెక్టులుగానే పరిగణించి మూల్యాంకనాన్ని సమగ్రంగా నిర్వహించాలి. ఈ వివరాలను చివరి అధ్యాయంలో సమగ్రంగా తెలుసుకుంటారు.

**ముగింపు**

మన రాష్ట్రంలో 2010 ఏప్రిల్ మాసం నుండి RTE చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో చర్చించిన గుణాత్మక అంశాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళికను (State Curriculum), విషయ ప్రణాళికలను (Syllabus), విద్యా ప్రమాణాలను (Academic Standards) రూపొందించారు. వీటి ఆధారంగా 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను శిశుకేంద్రీకృతంగా ఉండేలా, కృత్యాధారపద్ధతిలో బోధించేందుకు వీలుగా రూపొందించారు. కాబట్టి నూతన పాఠ్యపస్తకాలను అర్థం చేసుకొని ఆశించిన రీతిలో ప్రణాళికా బద్ధంగా బోధించడం ద్వారా పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించవచ్చు... నాణ్యమైన విద్యను పొందడం పిల్లలకు హక్కు అయితే అందించడం ఉపాధ్యాయుల బాధ్యత.

*జాతీయ విద్యావ్యవస్థకు జాతీయ పాఠ్యప్రణాళికాచట్రం ప్రాతిపదిక. దీనిలో సాధారణ మౌలికాంశాలతోబాటు సరళత **(Flexible)** కల్గిన ఇతర అంశాలు కూడా భాగమవుతాయి. ఈ సాధారణ మౌలికాంశాల్లో భారతీయ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, రాజ్యాంగ విధులు, బాధ్యతలు, ఇతర అంశాలు భాగమై జాతి గుర్తింపుకు తోడ్పడతాయి. ఇవి బోధనాంశాల సరిహద్దులను చెరిపివేసి భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని, సాంస్కృతిక వైభవాన్ని సమానత్వం, స్వాతంత్ర్యం, లౌకికతత్త్వం, స్త్రీపురుష సమానత్వం, పర్యావరణ పరిరక్షణ, సామాజికరుగ్మతల నిర్మూలన, పరిమిత కుటుంబ భావన, శాస్త్రీయదృక్పథాన్ని పెంపొందించుట లాంటి పలు అంశాల సమాహారంగా ఉంటాయి. అన్ని విద్యావిషయక కార్యక్రమాలు లౌకికభావనను బలపరచేవిగా ఉండాలి. భారతదేశం అన్ని కాలాల్లోనూ ప్రపంచ శాంతికోసం, ప్రపంచ దేశాలమధ్య సదవగాహనకోసం, లోకులమధ్య సద్భావనలకోసం వసుధైక కుటుంబమన్న భావనను ప్రచారం చేసింది. విశ్వసించింది. ఇంతటి మహోన్నత సంప్రదాయదృక్పథాన్ని మన విద్యావ్యవస్థ మరింత పటిష్ఠం చేయాలి. మన బాలబాలికల్లో ప్రపంచ దృక్పథాన్ని పెంపొందించగల్గాలి. తద్వారా అంతర్జాతీయ భావన, శాంతియుత సహజీవనం అనే పవిత్ర ఆశయాలకు యువతరం కట్టుబడేటట్లు చేయాలి. ఈ సద్భావనను మీరకుండా జాగ్రత్తపడటం అందరి బాధ్యతగా గుర్తించాలి. సమానత్వాన్ని పెంపొందించాలంటే, అందరికీ సమానావకాశాల కల్పన జరగాలి. ఈ సమానావకాశాల కల్పన కేవలం అందుబాటులో మాత్రమే కాక విజయానికి మార్గాల ఎంపికలో కూడా జరగాలి. ఈ విధమైన మౌలిక విషయప్రణాళిక ద్వారా సమానత్వభావన ఎడ నిబద్ధత అవసరమన్న స్పృహను మన యువతరంలో కల్గించాలి. ఈ ఫలితంగా సామాజిక పరిసరాలు, యాదృచ్ఛికమైన పుట్టుకవల్ల సంభవించిన సంక్లిష్టతలను, ప్రతికూలతలను నిర్మూలించడం మనందరి ధ్యేయం కావాలి.*

***– జాతీయ విద్యా విధానం 1986***

# 3

# జ్ఞానం - జ్ఞాననిర్మాణం - తరగతి గది అన్వయం (Knowledge - Construction of knowledge - Classroom implication)

## 1. జ్ఞానం అంటే ఏమిటి?

జ్ఞానం అంటే సమాచారం కాదు. జ్ఞానం అనేది ఒకరు ఇస్తే ఇంకొకరు పుచ్చుకునేది కాదు. జ్ఞానం అనేది బట్టీపట్టడం, పునశ్చరణ చేయడం, ఉన్నది ఉన్నట్టుగా అప్పజెప్పడం కాదు. జ్ఞానం అనేది పిల్లల మదిలో జరిగే మానసిక ప్రక్రియల ద్వారా ఉత్పన్నమయ్యే భావన. ఇది అనుభవాల నుండి, ఆలోచనల నుండి వ్యక్తీకరింపబడే అంశం. ఎలా ఆలోచించాలో, ఎలా పరిశీలించాలో, ఎలా విశ్లేషించాలో, ఎలా ప్రతిస్పందించాలో, ఎలా వ్యక్తీకరించాలో అనే విషయాలను జ్ఞానం ఆవిష్కరిస్తుంది. పిల్లలు తమ అనుభవాలు, ఆలోచనలతో విషయాలను పరిశీలించడం, గుర్తించడం, సంబంధాలు ఏర్పరచడం, సాధారణీకరణ చేయడం, నిర్ధారణకు రావడం, పూర్వజ్ఞానాన్ని నూతన సందర్భాలలో, తదుపరి అభ్యాసాలలో ఉపయోగించడం వంటివి చేయగలగడమే ప్రకటితమైన జ్ఞానానికి నిదర్శనం.

పిల్లలు తమ పరిసరాలు, చుట్టూ ఉన్న ప్రపంచంతో మమేకమై పరస్పర ప్రతిచర్యలు, అన్వేషణలు, ప్రతిస్పందించడం, కనుగొనడం, పాల్గొనడం వంటివి చేయడం ద్వారా అర్థవంతమైన భావనలను పొందుతారు. ఇదే జ్ఞానం అవుతుంది.

'జ్ఞానం'లో చేరే అంశాలు, మనం 'విద్యాలక్ష్యాలుగా భావించేవాటిని' ప్రతిబింబిస్తాయని NCF పేర్కొంది. విద్యాలక్ష్యాలు పిల్లలను విమర్శనాత్మకంగా ఆలోచించేలా, పరిశీలించేలా, విశ్లేషించేలా, హేతుబద్ధంగా ఉండేలా, నమూనాలను గీయగల్గేలా, వైవిధ్యభావాలపట్ల, జీవనంపట్ల స్పందించేలా చేయాలని పేర్కొంటోంది. అందువల్ల జ్ఞానాన్ని ముక్కలుగా అందించడం సాధ్యపడదు. జ్ఞానం ఆలోచనలు, అనుభూతుల సంగమం. అంటే నిజమైన జ్ఞానం పిల్లలలో ఎట్లా పరిశీలించాలో, ఎలా విశ్లేషించాలో అమూర్త లేక హేతుబద్ధతగల, పరిస్థితులపట్ల తాను ఎలా అనుభూతి చెందాలో, ఎలా కనికరం కలిగిఉండాలో వైవిధ్యభావాలపట్ల ఎలా సున్నితత్వం కల్గిఉండాలో అన్న విషయాలు సమ్మిళితం కావాలి. అందువల్ల విద్యాలక్ష్యం

విద్యార్థికి సమాచారాన్ని ముక్కలు ముక్కలుగా చెంచాతో తినిపించినట్టుకాకుండా విద్యార్థి ఆలోచనా నైపుణ్యాలకు మెరుగుపెట్టినట్టుగా ఉండాలి.

అందువల్ల జ్ఞానమనేది సమాచారం కాదు అని చెప్పగలం. 'జ్ఞానం' అనేది విద్యార్థికి ఇవ్వబడేది కాదు. **ఇదొక స్వయంచోదక శక్తి, అనుభవం ద్వారా సముపార్జించబడేది. నూతన సమాచారంపట్ల పిల్లలు ఆచరణాత్మక నిర్ణయాత్మక అవగాహన కలిగినప్పుడు మాత్రమే సముపార్జించబడుతుంది. పిల్లలకు సరైన సమయంలో అవసరమైనంతమేర స్థాయికి తగినట్లుగా సహాయం కావాలి.** పిల్లలు తాము భాగస్థులయిన ఈ ప్రపంచంలో చురుకైన పాత్ర పోషించి తమంతట తామే జ్ఞానాన్ని సముపార్జన చేయాలి. అయితే పిల్లలకు విషయాన్ని బదలాయింపు చేసి జ్ఞప్తికి చేసిన విషయాలను ప్రశ్నలద్వారా ఉన్నదున్నట్లుగా తిరిగి చెప్పించడం జ్ఞానం కాదు. ఇది పిల్లలను విద్యావంతులు చేయడంగా భావించరాదు. మనం జ్ఞానాన్ని ఎలా సంపాదించాలని నిర్వచించామో అది పిల్లలను ఆలోచింపజేసేలా, ప్రతిస్పందింపచేసేలా అమూర్త, భావనలను అర్థంచేసుకునేలా, వ్యక్తపర్చేలా చేయగల్గాలి. కేవలం బట్టీయంగా ఉండరాదు. పిల్లలు తమ భావనలను సమాచారాన్ని విశ్లేషించి సాధారణీకరించేలా ఉండాలి. విద్యాబోధన ఇందుకు ప్రేరేపించేలా, ప్రోత్సహించేలా ఉండాలి.

జ్ఞానం అనేది నియత కాలంలో పూర్తిగా ఇవ్వగలిగేదే అయితే పిల్లల మేథస్సులోకి సమాచార రూపంలో వ్యవస్థీకృతంగా బదిలీ చేయవచ్చు. విద్య మానవ మేథోభండాగారాన్ని నింపే వ్యవస్థ అయితే విద్యార్థి పరోక్షగ్రాహకుడుగానే మిగిలిపోతాడు. విద్యను నింపడం అనేది అభ్యసనమయితే పిల్లల జ్ఞానచలనాత్మక రంగంలో పరిశీలన, అనుభూతులు ప్రతిబింబించేతత్వం, భాగస్వామ్య ప్రవర్తనలు నష్టపోతాయి. జ్ఞానం వ్యక్తిగతమైనది. ఇది సంకుచిత పరిధి దాటి విశ్వజనీనమైనది అని NCF-2005 పేర్కొంది.

జ్ఞానాత్మక రంగం ప్రత్యేక పదజాలం, భావనలు, సిద్ధాంతాలు, వర్ణనలు, పద్ధతులను కలిగి ఉంటుంది. మానవుల కృత్యాలు, అభ్యసన సాధనాల విశాల చట్రంలో సాంఘీక జీవనం, సంస్కృతి ఉంటుంది. వృత్తిపనులైన నేత, వడ్రంగం, కుమ్మరం, వ్యవసాయం, దుకాణ నిర్వహణ వీటితోబాటు దృశ్యకథలు, క్రీడలు విలువైన జ్ఞానాత్మక రూపాలను కల్గిఉంటాయి. జ్ఞానాత్మక రంగం యొక్క ఈ రూపాలు ఆచరణాత్మక స్వభావాన్ని, అర్థం చేసుకున్న తీరును విశదం చేస్తాయి. వాటిలో చాలా వరకు అభివృద్ధి చెందిన సామర్థ్యాలు ఉంటాయి. స్వయం సామర్థ్య జ్ఞానం సామూహిక కృషి, ప్రశంసలు, వైఖరులు, పట్టుదల, క్రమశిక్షణలు జ్ఞానంలో భాగంగా ఉంటాయి.

## 2. జ్ఞానం Vs సమాచారం

తరగతిగదిలో పాఠ్యపుస్తకాలు సమాచారాన్ని సమకూరుస్తాయి. ఈ సమాచారాన్ని పొందే క్రమంలో తమకున్న పూర్వజ్ఞానాన్ని వినియోగించుకుంటూ తెలుసుకున్న సమాచారం ఆధారంగా పిల్లలు జ్ఞాన నిర్మాణం చేసుకోవాలి. ఈ దిశలో మన ఉన్నత పాఠశాలలు, మన పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులుగా మనం ఆలోచించాలి. ఇందుకోసం మనం సమాచారం, జ్ఞానం, పునరుక్తి జ్ఞాన నిర్మాణం, గ్రహించడం వంటి అంశాల గురించి తెలుసుకోవాలి.

వ్యక్తి ద్వారా కాని, పుస్తకాల ద్వారాగాని, సామాగ్రి ద్వారాగాని విషయాన్ని పొందినట్లైతే అది సమాచారం అవుతుంది. పొందిన సమాచారాన్ని తనదైన శైలిలో అవసరంలేనిది వదిలివేయడం లేదా సవరించుకోవడం, అవసరమైన కొత్త సందర్భాలలో పూర్వజ్ఞానాన్ని సృజనాత్మకంగా అన్వయించుకోవడం చేయాలి. ఇది జ్ఞాన నిర్మాణ ప్రక్రియ ఔతుంది.

తరగతిగదుల్లో ఉపాధ్యాయులు దేనికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి? సమాచారానికా? లేక జ్ఞాన నిర్మాణ ప్రక్రియలకా అన్న ప్రశ్నలకు సరైన సమాధానాలేవో ఆలోచించండి.

సాధారణంగా తరగతిగదుల్లో ఉపాధ్యాయులు చెప్పిన విషయాలనే పిల్లలు పదే పదే వల్లెవేస్తుంటారు. అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తుంటారు. పుస్తకంలో ఇచ్చిన సమాచారాన్ని, అందించిన సమాచారాన్నే తిరిగి అప్పచెప్తుతుంటారు. దీన్నే పునరుక్తి (Repetetion) అంటారు. ఇది జ్ఞాన నిర్మాణానికి దోహదం చేస్తుందా? పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరగాలంటే మనం ఏం చేయాలి? కేవలం సమాచారాన్ని బట్టీపట్టడం కాకుండా అవసరమైన సందర్భాల్లో సందర్భోచితంగా సృజనాత్మకంగా, తనదైన శైలిలో వినియోగించుకోవడం జరగాలి. అలా జరగాలంటే ఉపాధ్యాయులు ఏం చేయాలి? ఆలోచించండి.

**పిల్లలు తమంతట తాముగా తమకి తెలిసిన పూర్వజ్ఞానాన్ని వినియోగించుకొని కొత్త సందర్భాలలో నూతన విషయాలను ఆవిష్కరించడాన్ని జ్ఞాన నిర్మాణం అనవచ్చు.**

**ఉదాహరణకు ఆరో తరగతిలో తెలుగు ఉపాధ్యాయుడు కొన్ని పదాలు ఇచ్చి వాటిని స్వంత వాక్యాలలో ఉపయోగించి నల్లబల్లపై రాశాడు. పిల్లలని రాసుకోమన్నాడు పరీక్షలలో ఆ పదాలే ఇచ్చినప్పుడు పిల్లలంతా ఒకేవిధంగా టీచర్ రాయించినట్లుగానే జవాబులు రాశారు. ఇది జ్ఞాన నిర్మాణం అవుతుందా? దీనిని ఏం అంటారు?**

**ఒకవేళ అవే పదాలను తమ సొంతమాటల్లో నూతన సన్నివేశాలలో చక్కగా ఉపయోగించి రాసినట్లైతే, పిల్లలు అర్థవంతంగా సందర్భోచితంగా అవసరాలకనుగుణంగా ఆ పదాలకు చెందిన జ్ఞానాన్ని నిర్మించుకున్నట్లే.**

పిల్లలు స్వయంగా పాల్గొంటూ జ్ఞానాన్ని నిర్మించుకునే క్రమంలో టీచర్లు క్రియాశీల భాగస్వాములు కావాలి. నేర్చుకునే క్రమంలో పిల్లలు సహజ వాతావరణంలో, అభ్యసన ప్రక్రియల్లో పాల్గొంటూ జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఇలా నిర్మించుకోవడంలో ఆలోచనలు, పూర్వ అనుభవాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. పిల్లలు ప్రశ్నించడం, బడిలో నేర్చుకున్న దానిని వెలుపలి అనుభవాలతో అన్వయించుకోవడం, సమస్యలకు వివిధ కోణాల్లో చక్కగా స్పందించడం. అభిప్రాయాలను అద్భుతంగా వ్యక్తీకరించడం వంటి సందర్భాలలో జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. జ్ఞానం ఒకరు అందించేది కాదు. ఇది సృష్టించబడేది. పిల్లల మదిలో జరిగే ప్రక్రియల ద్వారా ఇది ఉత్పన్నమవుతుంది. ఈ జ్ఞానం ఒక్కో విషయంలో, సందర్భంలో వివిధ రూపాలను కలిగి ఉంటుంది.

జ్ఞాన నిర్మాణం, సమాచారం మొదలగు అంశాల గురించి జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005 ఏం చెబుతుందో చూద్దాం.

**క్రమబద్ధమైన అనుభవమే జ్ఞానం. ఇది భాష ద్వారా, భావనా రూపాలుగా ఏర్పడి అర్థాన్ని సృష్టిస్తుంది. ఫలితంగా మనం జీవిస్తున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. జ్ఞానాన్ని మనం ఆచరణ పద్ధతులుగా లేదా ఆలోచనలతో కూడిన శారీరక నైపుణ్యంగా కూడా భావించవచ్చు. ఇది వస్తూత్పత్తి ద్వారా సమాజ పురోగమనానికి దోహదంచేస్తుంది. చారిత్రక క్రమంలో మానవులు వివిధ ఆలోచనలు, భావాలు**

**గల విజ్ఞాన మూర్తులుగా, వస్తూత్పత్తి చేయగల సమర్థులుగా పరిణితి చెంది మరింత జ్ఞానాన్ని నిర్మించుకున్నారు. పిల్లలందరూ ఈ జ్ఞాన సంపదను తమంతట తామే పునరుత్పత్తి చేసుకోవాలి. మరింత సమర్థంతంగా ఈ ప్రపంచంలో వ్యవహరించేందుకు కావాల్సిన మరిన్ని ఆలోచనలు దీనివల్ల వారికి లభిస్తాయి. పిల్లలు ఈ జ్ఞానోత్పత్తి క్రమంలో ఎలా భాగస్వాములు కావాలో నేర్చుకోవాలి. ఉత్పత్తి క్రమంలో కూడా వారు భాగస్వాములు కావాలి. ఈ రూపంలో జ్ఞానాన్ని కేవలం ఉత్పత్తిగా చూడక అలాగాక జ్ఞానాన్ని తయారుచేసిన ఉత్పత్తిగా భావించినట్లైతే అది సమాచార రూపంలోకి మారి పిల్లల మెదళ్ళలోకి దూరిపోతుంది. అప్పుడు అభ్యాసకులు కేవలం సమాచార గ్రహీతలుగా మారతారు. అభ్యసనంలో వారి ప్రమేయమేమి ఉండదు. దీనికి భిన్నమైన దృక్పథం ఉంటే ప్రపంచాన్ని పరిశీలిస్తూ, ప్రపంచంపట్ల స్పందిస్తూ, ప్రపంచంలో పనిచేస్తూ, భాగస్వాములవుతూ నేర్చుకునేవాళ్ళుగా పిల్లల్ని చూడగలం.**

### 3. జ్ఞాన నిర్మాణం అంటే?

పిల్లలు సహజ అభ్యాసకులు. తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆసక్తితో అన్వేషించడం, ప్రతిస్పందించడం, ఆలోచించడం, విశ్లేషించడం ద్వారా తమదైన శైలిలో జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకొంటారు. అలాగే తమ జ్ఞానాన్ని సృజనాత్మకంగా ఆవిష్కరించగల శక్తిసామర్థ్యాలు పిల్లలకు బాల్యం నుండే ఉంటుంది.

జ్ఞానం కలిగి ఉన్న పిల్లలు తాము చూసిన, విన్న, చదివిన, పాల్గొన్న అంశాల నుండి పొందిన అనుభవాలను పలువిధాలుగా, నూతనంగా, సృజనాత్మకంగా వ్యక్తీకరించగల్గితే జ్ఞాన నిర్మాణం జరిగినట్లు భావించాలి.

జ్ఞాన నిర్మాణం అంటే అభ్యసనమే.

ప్రతి తరం, సమాజం ద్వారా తాము పొందిన జ్ఞానాన్ని ముందుతరానికి అందించడానికి తమకంటూ ఒక ప్రత్యేక జ్ఞాననిధిని ఏర్పరచుకుంటూ అర్థవంతమైన జ్ఞాన నిర్మాణానికి తోడ్పడుతుంది. ఈ జ్ఞానాన్ని అనుభవాల ద్వారా అర్థంచేసుకోవడం, జ్ఞాన సంస్కృతిని ఆకళింపు చేసుకోవడం ద్వారా అనియత, స్వేచ్ఛావాతావరణాలలో పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఈ జ్ఞాన నిర్మాణంలో సామాజిక పరిసరాలతో మమేకమై, అందుకు ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో తప్పులుచేస్తూ, చేసిన తప్పులను వారికి వారే సరిదిద్దుకుంటూ పిల్లలు జ్ఞాన నిర్మాణం చేసుకుంటారు. ఇవన్నీ అత్యంత సహజంగానే పిల్లలు చేయగల్గుతారు.

అర్థవంతమైన అభ్యసనం అనేది ఒక ఉత్పాదక ప్రక్రియ. ఇది కేవలం సమాచారాన్ని వెలికి తీసే ప్రక్రియకాదు. ఆలోచించడం, భాషారూపంలో వ్యక్తీకరించడం, కృత్యాలు నిర్వహించడం వంటివి అభ్యసనాంశాలు. పిల్లలు చాలా విషయాలను గుర్తుంచుకుంటారు కాని అర్థం చేసుకోలేరు. నిజజీవిత సన్నివేశాలతో అన్వయించలేరు. అందుకే జ్ఞాపకం ఉంచుకోవడమే జ్ఞానమనే భ్రమ నుండి ఉపాధ్యాయులు బయటపడాలి.

భావనల అభివృద్ధి అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. ఆ భావనలమధ్య సంబంధాలను ఏర్పరచుకుంటూ, వాటిని అవగాహన చేసుకుంటూ వాటికి కారణాలు, ఫలితాలను అన్వేషిస్తూ, తమ వైఖరులను, ఉద్వేగాలను, విలువలను సమ్మిళితం చేసుకుంటూ వ్యక్తీకరించడం ద్వారా జ్ఞాన ఆవిష్కరణ జరుగుతుంది.

ఇలా పిల్లలు తమ జ్ఞానాన్ని ఆవిష్కరించడానికి తోడ్పడేవి ఆలోచన, భాష. ఇవి విడదీయరాని అంశాలు. ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు.

GRK

భాషాపరంగా జ్ఞానం అంటే పిల్లలు తాము విన్న, చూసిన, చదివిన అంశాల నుండి, అనుభవాల నుండి వివిధ ప్రక్రియారూపాలలో సృజనాత్మకంగా ప్రదర్శించడం.

ఇందులో వినడం, ధారాళంగా అంశాల గురించి మాట్లాడడం, చదవడం, ప్రశ్నించడం, ఆలోచించడం చర్చించడం, ప్రతిస్పందించడం, వ్యక్తీకరించడం, ప్రశంసించడం, అర్థం చేసుకోవడం. ఉన్నత వైఖరులు కలిగి ఉండడమనేవి ఇమిడి ఉంటాయి.

అభ్యసనమనేది బడిలోనూ, బడివెలుపల, నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది. ఇది పరస్పర ప్రతిచర్యలద్వారా అభివృద్ధి చెందుతుంది.

జ్ఞాన నిర్మాణంలో పిల్లలే ఊహించడం, ప్రకల్పనలు చేయడం, అన్వేషించడం, పరిశోధించడం, ప్రశ్నించడం, చర్చించడం, సిద్ధాంతీకరణ చేయడం, ప్రతిస్పందించడం, సమూహాలలో పనిచేయడం మొదలగునవి కీలక పాత్రపోషిస్తాయి. జ్ఞాన నిర్మాణంలో ఈ ప్రతిచర్యలు ముఖ్యభూమిక పోషిస్తాయి. పిల్లలు విశ్లేషించడానికి, వ్యాఖ్యానించడానికి, ఇతరులలో కలిసి నేర్చుకోవడానికి ఈ ప్రతిచర్యలు తోడ్పడతాయి. ఆలోచించడం, ఆలోచనలను వ్యక్తీకరించడం, జ్ఞాన నిర్మాణంలో ముఖ్యమైనది.

స్వయంగా భాగస్వాములై పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకొనే క్రమంలో ఉపాధ్యాయులు క్రియాశీల భాగస్వాములు కాగల్గితే వారి ప్రాధాన్యత పెరుగుతుంది. నేర్చుకొనే శిశువులు తనకుతాను పాల్గొంటూ జ్ఞాననిర్మాణం చేసుకుంటారు. ప్రశ్నించడం, బడిలో నేర్చుకున్నదాన్ని బయట అనుభవాలతో అన్వయించుకోవడం, మౌనంగా ఉండకుండా ఒక ప్రశ్నకు పలురకాలుగా స్పందించడం ఇవన్నీ చిన్న విషయాలుగా కన్పించవచ్చు, కానీ పిల్లల అవగాహన పెరగడంలో ఆలోచించడంలో ఇవి చాలా కీలకమైన మెట్లు. పిల్లలకు తరచుగా తమ అనుభవాల నుంచిగానీ, ప్రసారమాధ్యమాల నుంచిగానీ కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయి. ఉపాధ్యాయునికి నచ్చేవిధంగా వాటిని చెప్పడం పిల్లలకు చేతగాకపోవచ్చు – పూర్తిగా తెలిసినదానికి, దాదాపు తెలిసిన దానికీ మధ్య ఒక అంతరం ఉంటుంది. అక్కడే జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. ఈ జ్ఞానం నైపుణ్యాలుగా రూపాంతరం చెందుతుంది. పాఠశాల వెలుపల, ఇంటిలో, సమాజం మధ్యా పనిచేసే క్రమంలో ఈ సామర్థ్యాలు పదునెక్కుతాయి. వీటిని మనం గౌరవించాలి.

## 4. భాషలో జ్ఞానం ఏ ఏ రూపాల్లో ఉంటుంది?

భాషలో గతానుభవాల ఆధారంగా, తమకున్న అంతర్గత శక్తులతో, ఆలోచించి పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఇది వివిధ వ్యవహార రూపాల్లో ఉంటుంది. భాషా వ్యవహార రూపాలు, వాగ్రూప లిఖిత రూపాల్లో ఉంటాయి. సంభాషించడం, ఉపన్యసించడం, వాదించడం, చర్చించడం, ప్రశ్నించడం, వర్ణించడం ..... వంటివి వాగ్రూపాలైతే, తెల్సినదాని గురించి రాయడం, వ్యాసం రాయడం, లేఖ రాయడం, దరఖాస్తు రాయడం, కరపత్రం రాయడం, ప్రకటనలు రాయడం, కథలు, పాటలు, గేయాలు రాయడం వంటి లిఖిత రూపాల్లో భాషాజ్ఞానం ఉంటుంది. అది ఆయా వ్యక్తుల మదిలో జరిగే ప్రక్రియలవల్ల గతానుభవాల పునాదులపై ఉత్పన్నమవుతుంది.

## 5. జ్ఞానం Vs అభ్యసనం

ఎన్నో అభ్యసన సిద్ధాంతాలున్నప్పటికీ ఈ సంక్లిష్ట ప్రక్రియను అర్థంచేసుకోవడంలో ఉపాధ్యాయుల అవగాహనలో స్వల్ప భేదం ఉంది. ప్రవర్తనావాదులు చెప్పినట్లు పిల్లలు ఖాళీబకెట్టు అనీ, ఏమీ రాయబడని నల్లబల్ల అనే విషయాలను

NCF 2005 మరియు APSCF 2011 నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాయి. పిల్లలు పుట్టుకతోనే అనేక నిగూఢ సామర్థ్యాలను కల్గిఉంటారు. కాని పిల్లలు వైయక్తికంగా ఎంత కృషిచేసినా మొత్తం అభ్యసనం జరగదు. పిల్లలు బోధనలో లీనంకావడానికి అమలు చేయడానికి వీలుపడే పథకాన్ని శ్రద్ధతో ప్రణాళిక రూపొందించుట అత్యవసరమని APSCF భావిస్తుంది. అంతేకాకుండా – అభ్యసన వనరులైన గ్రంథాలయం, అంతర్జాలంతోపాటు పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చుట్టూఉన్న సమాజం భాగస్వామ్యంతో శ్రద్ధతో కూడిన ప్రణాళిక అమలు అత్యవసరమౌతుంది. పిల్లలు పాఠశాలకు వచ్చేముందే తమ అంతఃచేతనలో విషయ జ్ఞానాన్ని కల్గిఉంటారు. తల్లిదండ్రుల పెంపకం, పరిసరాలు పిల్లల జ్ఞానానికి తొలి ప్రాతిపదికలవుతాయి. ఇక భాషాపరంగా కూడా సంక్లిష్ట భాషా నిర్మాణాలను సమాజపరంగానే నేర్చుకొని ఉంటారు. అయినా పాఠశాల ఒక నియత విద్యాకేంద్రంగా పిల్లలు వర్ణనాత్మక వివరణాత్మక జ్ఞానరంగాన్ని స్వీకరిస్తారు. సామాన్యశాస్త్రం, గణితశాస్త్రం భాషలు, పరిసరాల విజ్ఞానం వంటి విషయాలలో ఉపాధ్యాయుల, సమవయస్కుల, తల్లిదండ్రుల క్రియాశీలక జోక్యం లేనిదే పిల్లల జ్ఞానరంగం పరిపూర్ణవికసితంకాదు. పిల్లల ఈ పరస్పరచర్యలు సాధ్యపడడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని APSCF ప్రతిపాదిస్తుంది. అభ్యసనం నిరంతర ప్రక్రియ. ఈ వ్యవస్థ సరిగా కొనసాగించకపోతే విద్యలో అపరిపక్వత చోటుచేసుకుంటుంది. ఈ విధానం పిల్లలు వల్లెవేసే పద్ధతిని వ్యతిరేకిస్తుంది. పిల్లలు పుట్టుకనుంచి తమకుగల అభ్యసనశక్తితో పరిశీలన, గుర్తించుట, వర్గీకరించుట మొదలైన వాటిని పరిసరాల నుంచి నేర్చుకొని విభిన్న రీతుల్లో వ్యక్తీకరిస్తారు, కొనసాగిస్తారు. మూడు సంవత్సరాల పిల్లల సామర్థ్యాలను విశ్లేషించినట్టయితే భాషను వ్యాకరణ దోషరహితంగా ప్రయోగించడమే కాకుండా, సందర్భోచితంగా తగిన పద్ధతిలో వినియోగిస్తారు. ఇది అభినందించాల్సిన అంశం. దురదృష్టమేమంటే ఉపాధ్యాయులు ఈ సత్యాన్ని అంగీకరించరు. వారిని ప్రవర్తనావాదులుగా ఒక దృష్టాంతం నుంచి మరొక దృష్టాంతంలోకి వాళ్ళు తీసుకొని వెళ్తారు. అనుకరణ, అభ్యాసం ద్వారా మాత్రమే భాష లభిస్తుందని అపోహపడతారు. పిల్లలను కేవలం సమాచార గ్రహీతలుగా పరిగణించి తాము జ్ఞానదాతలని భావిస్తారు. ఇది క్రియాశీలక, ఆచరణాత్మక నిరంతర అభ్యసన విధానానికి భిన్నమైనది. పిల్లల జ్ఞాన నిర్మాణానికి ఈరకమైన వాస్తవ భిన్న అవగాహనలను దూరంచేసుకోవాలి. ఇందుకు సున్నితంగా అర్థవంతమైన సందర్భోచిత పరిస్థితులను ఉపయోగించాలి. పై అంశాల ఆధారంగా కింది భావనలను రాబట్టవచ్చు.

- ఒత్తిడి, భారం లేని పరిస్థితులలోనే పిల్లల్లో అభ్యసనం జరుగుతుంది.
- ఆరోగ్యకరమైన అభ్యసన వాతావరణంలోనే పిల్లలు అమిత ఆసక్తితో సూక్ష్మ పరిశీలనలు చేస్తారు.
- పిల్లల అభ్యసనంలో విమర్శలు, తప్పులు ఎంచడాన్ని తగ్గించాలి.
- పిల్లలు అభ్యసనం ద్వారా తమ పొరపాట్లు తామే తెలుసుకొని సరిదిద్దుకునేలా చూడాలి.
- విభిన్న సందర్భాలలో తాము సముపార్జించిన జ్ఞానాన్ని పిల్లలు వినియోగిస్తారు.

## 6. జ్ఞాన నిర్మాణం ఎప్పుడు జరుగుతుంది?

### a) పూర్వభావన / పూర్వరంగం (Pertext)

ఏ పాఠ్యాంశం గురించైనా భావన గురించైనా పిల్లల్లో పూర్వజ్ఞానం లేదా అనుభవాలు లేదా అవగాహన ఉందా అని నిర్ధారించుకోవాలి లేకపోతే కల్పించాలి.

**b) తపన కల్గించడం (Urge creation)**

పిల్లలు ఏ విషయాన్నైనా, ఎంత ఇబ్బంకరమైనా అవసరం ఉంటే తమకోసం తాము పాల్గొంటారు, నేర్చుకుంటారు. కాబట్టి వారిలో తపనను (Urge creation) రగిలించాలి. అవసరం ఉంటే తపన కల్గుతుంది. ఆసక్తి ఏర్పడుతుంది. భావోద్రేకాన్ని పెంపొందించడంవల్ల కూడా తపన కల్గుతుంది.

**c) మానసిక ప్రక్రియ (Mental Process)**

జ్ఞాన నిర్మాణంలో మానసిక ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తోంది. పిల్లలందరూ జన్మతః నేర్చుకోగల్గే సామర్థ్యాన్ని కల్గి ఉంటారు. పిల్లలు అందరు పోల్చడం, వర్గీకరించడం, విశ్లేషించడం, సంశ్లేషించడం, జ్ఞాపకం ఉంచుకోవడం, పునరుక్తి చేయడం, నిర్ధారించడం, వ్యక్తపర్చడం, గుర్తించడం, సాధారణీకరించడం, ఊహించడం, కల్పనాశక్తి వంటి అంతర్గత సామర్థ్యాలను కల్గి ఉన్నారన్న విషయం ఇంతకు ముందే మనం చర్చించుకున్నాం. వీటి వల్ల పిల్లల మనస్సుల్లో అనేక చర్యలు జరుగుతాయి. పిల్లల మెదళ్ళలోని నాడీకణజాలం ఉత్తేజానికి లోనైనప్పుడు వాటిలో పరస్పర చర్యలు, ప్రక్రియలు చోటుచేసుకొంటాయి. కొత్త బంధాలను ఏర్పరచుకొంటాయి. ఈ సందర్భంలో ఉత్పత్తయ్యే అంశాన్ని మనం 'జ్ఞానం' అని పిలుస్తుంటాం. ఈ నాడీ కణజాలం (Neurons) ఉత్తేజమవ్వాలంటే ఆసక్తి, తపన, భావోద్రేకానికి లోనుకావడం అవసరం. తద్వారా జ్ఞాననిర్మాణం జరుగుతుంది. అలా కాకుండా శ్రోతగా కేవలం సమాచారాన్ని గ్రహిస్తే నాడీకణజాలం ఉత్తేజం పొందదు. కేవలం సమాచారాన్ని నిక్షిప్తం చేసుకుంటుంది. దీనివల్ల ఎలాంటి అనుభవాలు కలుగవు. ఆ కారణాన జ్ఞాన నిర్మాణం కూడా జరగదు.

కాబట్టి పిల్లలు తమ అంతర్గత శక్తులను వీలైనంతమేర వినియోగించుకునేలా, మానసిక ప్రక్రియలు జరిగేలా చూడాలి. ఇందుకు అవసరమగు వాతావరణం కల్పించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. పిల్లలు భయరహితమైన స్వేచ్ఛాపూరిత వాతావరణంలో మాత్రమే తమ అంతర్గత శక్తులను వినియోగించగల్గుతారు.

**d) ఆలోచింపజేయడం**

జ్ఞాన నిర్మాణంలో ఇది మరొక కీలకాంశం. సాధారణంగా ఆలోచించడానికి బదులు, విభిన్న కోణాల్లో ఆలోచింపజేయడంవల్ల పిల్లలు జ్ఞానాన్ని సృష్టించుకోగల్గుతారు.

**e) ప్రోత్సహించడం, అవకాశం కల్పించడం, పిల్లల్ని భాగస్వాములను చేయడం కూడా జ్ఞాన నిర్మాణ క్రియలో అతి ముఖ్యమైన అంశాలు**

## 7. జ్ఞాన నిర్మాణం జరగడానికి తరగతి గది వాతావరణం ఎలా ఉండాలి?

**కింది పేరా చదవండి**

**విద్య పోస్టు ద్వారానో, ఉపాధ్యాయుడి ద్వారానో చేరవేసే వస్తువు కాదు. నిజమైన విద్య పిల్లల భౌతిక, సాంస్కృతిక క్షేత్రంలో సృష్టించబడుతుంది. దాగి ఉంటుంది. తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో, తోటి పిల్లలతో, సమాజంతో నెరపే ప్రతిచర్యల ద్వారా అది క్రమ వికాసం పొందుతుంది. ఇలాంటి విద్య పటిష్ఠంగా, ఫలప్రదంగా ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుల పాత్రను, ఔన్నత్యాన్ని మనం గుర్తించాలి. స్థిరపరచాలి. జ్ఞానసముపార్జన ఎప్పుడూ పరస్పరాశ్రితంగా ఉంటుంది. పెద్దలకంటే పిల్లలు బాగా పరిశీలిస్తారు. బాగా గ్రహిస్తారు. జ్ఞానాన్ని సృష్టించడంలో వాళ్ళకున్న సామర్థ్యాన్ని, పాత్రను మనం గుర్తించాలి. నాకున్న ఈ కొద్ది అవగాహన పిల్లలతో మాట్లాడ్డం వల్లనే లభించిందని అనుభవంతో చెబుతున్నాను.**

**ప్రొ. యశ్‌పాల్, జాతీయ పాఠ్యప్రణాళిక-2005**
**సారథ్య సంఘం అధ్యక్షులు**

బాక్సులోని అంశాన్ని చదివారు కదా! ఒకసారి ఆలోచించండి. సమాచారాన్ని పొంది, దాన్ని స్వల్పకాలం పాటు నిల్వ ఉంచుకొనే జ్ఞాపకాన్నే జ్ఞానంగా భావిస్తుండడం నేడు మనం చూస్తున్నదే! దీన్నే అవగాహన అని కూడా పరిగణించడం జరుగుతోంది. వాస్తవంగా జ్ఞానం అనేది సృష్టించబడేది. ఆలోచనల ద్వారా ఉద్భవించేది. ఈ జ్ఞానాన్ని సృష్టించుకోవడంలో మన పిల్లలకున్న శక్తి అపారమైనది. పొందే అనుభవాల ద్వారా, ఆలోచనల ద్వారా పిల్లలు ఎంతో జ్ఞానాన్ని సృష్టించుకుంటున్నారు.

పిల్లలు బడివెలుపల లేదా బడికి రాకముందు జరిపే ప్రతిచర్యల ద్వారా, తమ అంతర్గత శక్తుల ద్వారా ఈ జ్ఞానాన్ని సృష్టించుకొంటున్నారు. కేవలం సమాచారాన్ని గ్రహించడం మాత్రమేకాక ప్రశ్నించడం, ఆలోచించడం, ప్రతిచర్యలు జరపడం, ద్వారా తమకున్న జ్ఞానపరిధిని మరింత విస్తృతపర్చుకుంటారని ఇంతకు ముందు అధ్యాయాల్లో చర్చించుకున్నాం. ఐతే ఈ ప్రక్రియలకు లేదా ఈ విధానాలకు మన తరగతి గదుల్లో ఏ రీతిలో స్థానం ఉందా? అసలు అవకాశం ఉందా? పిల్లలు తమకున్న జ్ఞానం ఆధారంగా దాన్ని మరింత విస్తృతపర్చుకోవడానికి అవకాశం ఉందా? జ్ఞాననిర్మాణం జరగడానికి వీలయ్యేరీతిలో మన తరగతి గది ప్రక్రియలు ఉండాలంటే, మనం ఏం చెయ్యాలి? లేదా మన తరగతి గది ప్రక్రియలు ఎలా ఉండాలి? ఆలోచించండి!

**అ) జ్ఞాన నిర్మాణం – ప్రస్తుత పరిస్థితి విశ్లేషణ**

ప్రస్తుతం మన తరగతిగదుల్లో అనుసరిస్తున్న బోధన–అభ్యసన ప్రక్రియలు జ్ఞాన నిర్మాణానికి తోడ్పడుతున్నాయా? ఆలోచిద్దాం! మన తరగతిగదుల్లో ఏం జరుగుతున్నది? తరగతిలో, ఆయా పాఠ్యాంశాలను ఎలా బోధిస్తున్నారు? ఉపాధ్యాయులు చదవడం, వివరించడం, కొంత అభ్యాసం చేయించడం, తిరిగి ప్రశ్నించడం సాధారణంగా జరుగుతోంది. ఇవి నిత్యం చూస్తున్న బోధనాభ్యసన ప్రక్రియలకు చెందిన తీరుతెన్నులు లేదా అనుభవాలు. ఈ ప్రక్రియల్లో జ్ఞాన నిర్మాణానికి ఉన్న ప్రాధాన్యత ఎంత? జ్ఞాన నిర్మాణానికి పై ప్రక్రియలు ఏ రీతిలో సహకరిస్తాయి? ఆలోచించండి.

ఒకరకంగా చెప్పాలంటే, ప్రధానంగా ప్రస్తుతం మన తరగతిగదుల్లో సమాచారాన్ని అందించడం, దాన్ని జ్ఞాపకం పెట్టుకోడానికి తోడ్పడే విధానాలపై దృష్టి పెట్టడం, ఎంతమేరకు జ్ఞాపకం పెట్టుకున్నారో పరీక్షించడం వంటివి బోధనాభ్యసన ప్రక్రియల్లో కీలకాంశాలయ్యాయి. జ్ఞాపకం ఉంచుకోవడమే పరమార్థంగా మన విధానాలు ఉన్నాయనేది వాస్తవం! దీనివల్ల జ్ఞాన నిర్మాణానికి అవకాశం లభించడంలేదని చెప్పవచ్చు.

**జ్ఞాపకం ఉంచుకోవడం మాత్రమే జ్ఞానం కాదు అని మనం నమ్మితే, మరేం చేయాలనే ఆలోచనలకు శ్రీకారం చుట్టవచ్చు. అదే సర్వస్వం అని నమ్మి దాని చుట్టే పరిభ్రమిస్తే, జ్ఞాన నిర్మాణానికి సమాధికట్టిన వారమవుతాం!**

కాబట్టి సమాచారం అందించే వ్యక్తులుగా ఉపాధ్యాయులు, దాన్ని స్వీకరించే వారుగా పిల్లలు, వీటిని పటిష్టపరిచే విధానాలు బోధనాభ్యసన ప్రక్రియల్లో చోటుచేసుకునే పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉందన్న వాస్తవాన్ని గుర్తిద్దాం! దీని నుంచి ఎలా బయటపడాలో, ఆలోచిద్దాం!

**ఆ) కొన్ని సన్నివేశాలు – విశ్లేషణ**

కింద కొన్ని తరగతిగది సన్నివేశాలు ఉన్నాయి. వీటిని పరిశీలిద్దాం! విశ్లేషించుదాం!

**సన్నివేశం-1**

అది ఆరవ తరగతి. ఉపాధ్యాయిడు తెలుగులోని సుభాషిత రత్నావళి పాఠంలోని పద్యాలు కింది విధంగా బోధించాడు.

పద్యం రాగయుక్తంగా పాడింది. పిల్లలను తనవలె పాడమంది. నూతన పదాలకు అర్థాలు రాయించింది. పద్యాల భావాలను నల్లబల్లపై రాసింది. పిల్లలంతా దాన్ని తమతమ నోటుబుక్కుల్లో రాసుకొన్నారు. ఆ తర్వాత పద్యాల గురించి కొన్ని ప్రశ్నలు అడిగింది. పిల్లలు సమాధానాలు చెప్పారు.

**సన్నివేశం-2**

మరొక పాఠశాలలో అది కూడా ఆరవ తరగతే! మరొక ఉపాధ్యాయిడు ఎలా బోధించాడో, పరిశీలిద్దాం!

- ఉపాధ్యాయుడు మొదట పిల్లలను వారికి తెల్సిన పద్యాలను పాడమన్నారు. ఆ తర్వాత పద్యాల గురించి పిల్లలచే మాట్లాడించాడు. పద్యాలంటే ఇష్టమేనా? ఎందుకిష్టం? వారికి తెల్సిన పద్యాల్లో ఏ పద్యం బాగా నచ్చిందో చెప్పమన్నాడు. అని ఇలా ................ మాట్లాడించాడు. తదుపరి సుభాషిత రత్నావళిలోని మరికొన్ని పద్యాలను పాడుదామా అని అడిగాడు. దానికి పిల్లలంతా సరేనన్నారు.
- పిల్లలను నాలుగు జట్టులుగా విభజించాడు.
- ఒక్కొక్క జట్టుకు ఒక పద్యం కేటాయించాడు.

  మొదటి జట్టుకు 'లావు గల వాని కంటెను ______________ సుమతీ'

  రెండో జట్టుకు 'వినదగునెవ్వరు చెప్పిన ______________ సుమతీ'

  మూడో జట్టుకు 'ఉపకారికి నుపకారము ______________ సుమతీ'

  అట్లే నాల్గో జట్టుకు ఇనుము విరిగెనేని ______________ వినురవేమ'
- పిల్లల్ని ఆయా జట్లల్లో చర్చించుకొని పద్యాన్ని రాగయుక్తంగా పాడుటను అభ్యాసం చేయమన్నాడు.
- తర్వాత ఒక్కొక్క పద్యాన్ని జట్లల్లో చర్చించి రాగయుక్తంగా పాడమన్నాడు.
- ఆ తదుపరి తనుకూడా, రాగయుక్తంగా పాడాడు.
- ఏ జట్టువారు బాగా పాడారు? అని చర్చించాడు.
- పిల్లలను జట్లలోనే కూచొని తెలియని పదాలను రాయమన్నాడు. ఆ పదాలకు అర్థాలు తెలిస్తే రాయమన్నాడు. ఒక వేళ తెలియకుంటే నిఘంటువు చూసి రాయమన్నాడు.
- పిల్లలు తాము ఆలోచించి, చర్చించి పదాలకు రాసిన అర్థాలను చార్టుపై రాసి ప్రదర్శించమన్నాడు.

- అన్ని జట్లవారు చెప్పిన తర్వాత, ఒక్కొక్క పిల్లవాడిని, మొదటి పద్యం, 'లావుగల వానికంటెను ______ సుమతీ' భావాన్ని సొంతమాటల్లో రాయమన్నాడు.
- ఆ తర్వాత ఒకరి నోటుబుక్కును మరొకరికి ఇవ్వమన్నాడు. చదివించాడు.
- ఎవరు బాగా రాశారో చర్చించాడు.
- ఇలాగే మిగతా పద్యాల భావాలను కూడా పిల్లలే చర్చించి రాసేలా చూసాడు, చెప్పించాడు.

పై రెండు సన్నివేశాల్లో దేనిలో బోధనాభ్యసన ప్రక్రియ బాగా అన్పించింది? ఎందుకు? ఏ సన్నివేశంలో పిల్లలు ఆలోచించడానికి ఎక్కువ అవకాశం లభించింది? జ్ఞాన నిర్మాణానికి ఏ సన్నివేశంలో అవకాశం లభించింది? ఆలోచించండి.

సాధారణంగా ప్రస్తుతం అనుసరించే బోధనాభ్యసన ప్రక్రియలు మొదటి సన్నివేశంలోవి. వాస్తవానికి మొదటి సన్నివేశంలో, పిల్లలకు ఆలోచించడానికి, పూర్వ భావనల ఆధారంగా, పిల్లలు తమంతటతాముగా జ్ఞాన నిర్మాణం చేసుకోవడానికి అవకాశం లభిస్తున్నదా? అనుభవాల ప్రాతిపదికగా అభ్యసనం జరుగుతున్నదా? ఆలోచించండి! పిల్లలకు సమాచారాన్ని అందించడంకంటే, వారు ఆలోచించుకొని తమంతటతాముగా జ్ఞానం నిర్మించుకునేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఉండాలి. రెండవ సన్నివేశాన్ని విశ్లేషిస్తే, ఈ విషయం బోధపడ్తుంది.

మన తరగతిగదుల్లో ఏ విషయానికి చెందిన బోధనాభ్యసన ప్రక్రియనైనా కింది బోధనా క్రమంలో నిర్వహిస్తే జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

**a) పూర్వభావనల నిర్మాణం (Pertext)**

తమకున్న జ్ఞాన పరిధిని విస్తృతపర్చుకోవడానికి, పూర్వఅనుభవాలు లేదా భావనలు కల్గిఉండడం అవసరం. అంటే పిల్లలు గ్రహించే విషయానికి చెందిన పూర్వావగాహన లేదా పునాది ఉండడంపై జ్ఞాన నిర్మాణం ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. కాబట్టి ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలకు ఉన్న పూర్వానుభవాలు ఏమిటి? ఏ మేరకు ఆయా అంశాలపై అవగాహన కల్గిఉన్నారో పరిశీలించాలి. ఉదా: మనం గోల్ఫ్ ఆటకు చెందిన వార్త చదివితే ఎలా ఉంటుంది? అదే క్రికెట్ ఆటకు చెందిన వార్త చదివితే ఎలా ఉంటుంది? ఏది బాగా అర్థమవుతుంది? ఎందుకు? ఆలోచించండి.

క్రికెట్‌కు చెందిన పూర్వ జ్ఞానం లేదా, అవగాహన పిల్లలకు ఉంటుంది కాబట్టి, ఆ వార్తను చదివితే, పిల్లలు బాగా అవగాహన చేసుకోగల్గుతారు. అదే గోల్ఫ్‌ను గురించి చదివితే అంత బాగా అర్థంకాకపోవచ్చు. దీనికి కారణం గతానుభవంగానీ, అవగాహనగానీ లేకపోవడం అని చెప్పవచ్చు.

కాబట్టి జ్ఞానం అనేది అంతకు ముందు ఆయా వ్యక్తులకున్న అనుభవాల మీద, అవగాహనల మీద, ఆలోచనల మీద నిర్మించబడుతుందని పేర్కొనవచ్చు. మొదట పూర్వజ్ఞానం ఉన్నాయా లేదా? అని నిర్ధారించాల్సి ఉంటుంది. ఒకవేళ అటువంటి పునాది, పూర్వభావనలు లేదా అనుభవం లేదా అవగాహన లేనట్లయితే, వీటిని నిర్మించాల్సి ఉంటుంది. అంటే ఉదాహరణకు గోల్ఫ్ వార్తను చదవడానికి ముందు, దానిపై చర్చారూపంలోని అనుభవాన్ని కల్గించి, విషయాన్ని అవగాహనపర్చిన పిదప ఆ అంశాన్ని చదవమంటే, అవగాహన చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఉపాధ్యాయులు ఏ విషయంలోనైనా జ్ఞాన నిర్మాణం చేయించడానికి, దానికి చెందిన పూర్వభావనల గురించి పరిశీలించి, నిర్ధారించుకొన్న తర్వాతనే అభ్యసన కార్యక్రమాలను నిర్వహించాలి. ఇందుకోసం పాఠ్యపుస్తకాలలోనే పాఠాల ప్రారంభంలో ఉన్ముఖీకరణ చిత్రం / సన్నివేశం వంటివి చేర్చారు. పిల్లలతో పాఠ్యాంశ ఇతివృత్తానికి సంబంధించిన అంశం గురించి చర్చ నిర్వహించడం, మేధోమథనం వంటి పనులన్నీ పూర్వభావనల నిర్మాణం కిందకేవస్తాయి.

**b) పూర్వభావనలతో, పాఠ్యాంశ భావనలను సంధానం చేయాలి**
**(Contextualisation of pretest with texual part)**

అభ్యసన సన్నివేశాలు నిర్మాణాత్మకంగా ఉండాలంటే పూర్వభావనలను లేదా భావనల పూర్వ రంగాన్ని, పునాదులను గుర్తించాల్సి ఉంటుంది. దీని ఆధారంగా పాఠ్యాంశభావనలను నిర్మించుకునేలా చేయాలి. రెండో సన్నివేశంలో ఏంజరిగిందో ఒక్కసారి అవలోకించండి. పిల్లలకు తెల్సిన పద్యాలను పాడించడం, వాటి ఆధారంగా, పాఠ్యాంశంలోని పద్యాలను రాగయుక్తంగా పాడమనడం జరిగింది. పిల్లలు తామే చర్చించుకొని, పద్యానికి రాగాన్ని నిర్ణయించడం, నిర్ధారించుకొని పాడడం జరిగింది. అంటే గతానుభవాల పునాదుల ఆధారంగా జ్ఞాన నిర్మాణం జరిగింది. ఒకవేళ పిల్లలకు పద్యాలను ఎలా రాగయుక్తంగా చదవాలో తెలియకుంటే, మొదట ఇది చేయగల్గేలా చూడాల్సి ఉంటుంది. ఆ తర్వాత పద్యాలను రాగయుక్తంగా పాడమనవచ్చు. ఇలా పూర్వభావనలను, అనుభవాలను పాఠ్యాంశభావనలతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పాఠానికి సంబంధించిన ఇతివృత్తం, సందేశం, వ్యవహారరూపాల గురించిన చర్చల ద్వారా, పాఠ్యాంశ ఉద్దేశం, నేపథ్యాల ద్వారా పాఠంలోని విషయానికి పూర్వభావనలకు మధ్య సంబంధాన్ని స్థాపించాలి.

**C) జ్ఞానాత్మక శిక్షణ (Cognitive apprentiship)**

పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకోవడంలో ఉపాధ్యాయులు తమ సహకారాన్ని, సహాయాన్ని అందించాల్సి ఉంటుంది. అంటే పిల్లలు ఆలోచించడానికి ప్రోత్సహించాలి. వారి ఆలోచనలను క్రమబద్ధీకరించాలి. ఉదా: పద్యాన్ని పాడడంలో ఎన్ని రీతుల్లో పాడవచ్చో విన్పించి, వారిని మరికొన్ని రీతుల్లో కూడా పాడమని ప్రోత్సహించాలి.

పిల్లలే పాఠాన్ని చదవడం, అర్థాలు గ్రహించడం, తోటి వారితో చర్చించడం, ఉపాధ్యాయులతో చర్చించడం వంటి చర్యల ద్వారా పిల్లలకు జ్ఞానాత్మక శిక్షణ ఇవ్వాలి. పిల్లలే పాఠాన్ని చదవడం, పాఠ్యాంశ చిత్రాన్ని పరిశీలించడం, దానిద్వారా భావాన్ని ఊహించడం, పాఠంలోని విషయంతో చిత్రాన్ని పోల్చడం ద్వారా జ్ఞానాత్మక శిక్షణ పొందుతారు. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలలో విద్యార్థులకు సూచనలను పొందుపరచారు. పఠనకృత్యాలు, అర్థగ్రహణం కోసం ఇచ్చిన అంశాలు జ్ఞానాత్మక శిక్షణకు సంబంధించినవి.

**d) భాగస్వామ్య అభ్యసనం (Collaborative Learning)**

పిల్లలు స్వభావరీత్యా తమతోటి వారితో గడపడానికి ఇష్టపడతారు. ప్రాథమికోన్నత స్థాయిలో ఐతే పిల్లలు కేవలం కల్సిఉండడమేగాదు, తమ అనుమానాలను, సమస్యలను కూడా తోటివారితో చర్చిస్తారు. నివృత్తి, పరిష్కారాల కోసం ప్రయత్నిస్తారు. ఒకరకంగా చెప్పాలంటే పిల్లలు ఎన్నో విషయాలను తమ తోటివారి ద్వారా అభ్యసిస్తారని. గత అధ్యాయంలో కూడా చర్చించుకున్నాం. జ్ఞాననిర్మాణంలో ప్రతిచర్యల పాత్ర గురించి కూడా మాట్లాడుకున్నాం. అంటే, పిల్లలు తమ తోటివారితో చర్చలు జరపడం ద్వారా నేర్చుకొంటారని జ్ఞానాన్ని నిర్మించుకుంటారని చర్చించుకున్నాం!

కాబట్టి బోధనాభ్యసన ప్రక్రియలు భాగస్వామ్య అభ్యసనానికి అవకాశం కల్పించాలి. అంటే పిల్లలు తమతోటి వారితో చర్చించడం, మాట్లాడడం, కల్సి ఆలోచించడానికి అవకాశాలు కల్పించాలి. ఇందుకోసం జట్టు పనులను నిర్వహించాలి. ఏ విషయం గురించైనా, ప్రశ్నలివ్వడం, ఆలోచించమనడం, లేదా ప్రశ్నించమనడం, కృత్యాలు ఇచ్చి చేయమనడం, సమస్య ఇచ్చి సాధించమనడం వంటివి జట్టులో చేయించవచ్చు. తద్వారా భాగస్వామ్య అభ్యసనం చోటు చేసుకొంటుంది. భాగస్వామ్య అభ్యసనం వల్ల ప్రజాస్వామిక విధానాలను ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా కల్సిపనిచేయడం, కల్సి ఆలోచించడం, సమస్యాసాధన, ఆత్మవిశ్వాసం వంటివి కూడా పెంపొందుతాయి. పిల్లలు తమతోటి పిల్లలతోనే గాదు, ఉపాధ్యాయులతో

కూడా చర్చిస్తుంటారు. కాబట్టి భాగస్వామ్య అభ్యసనంలో పిల్లలేకాదు, ఉపాధ్యాయులు కూడా భాగస్వాములే! ప్రధానంగా బోధనాభ్యసన ప్రక్రియల్లో పాఠ్యాంశ విషయం గురించి చర్చించేటప్పుడు, అభ్యాసాలను చేసేటప్పుడు పిల్లలంతా భాగస్వాములయ్యేలా చూడాలి. ఆలోచింపజేసే ప్రశ్నలద్వారా, బహుళ సమాధానాలు వచ్చే ప్రశ్నల ద్వారా పిల్లలంతా మానసికంగా భాగస్వాములయ్యేలా, ఆలోచించించుటను ప్రోత్సహించాలి. వ్యక్తిగత, పూర్తి, జట్టుకృత్యాలు అందుకు ఉద్దేశించినవి. పిల్లలు పాల్గొనే ప్రాజెక్టుపనులు, చర్చలు, పూర్తి తరగతి గది కృత్యాలు, జట్టుకృత్యాలు మొదలగునవన్నీ భాగస్వామ్య అభ్యసనాన్ని పెంపొందించడానికి దోహదపడతాయి.

### e) బహుళ ప్రతిస్పందనలు, ఆలోచనలకు రూపాన్నివ్వడం (Multiple manifestations)

పిల్లలు వ్యక్తిగతంగా ఏమి ఆలోచించగలరో దానికి ఒక రూపాన్ని ఇవ్వగల్గాలి. అంటే, వారు తమ ఆలోచనలను బహిర్గతపర్చాలి. దీన్నే వ్యక్తిగతమైనదిగా చెప్పవచ్చు. అట్లే జట్టు పనుల్లో పాల్గొని భాగస్వామ్య అభ్యసనం వల్ల కూడా తమ ఆలోచనలను క్రమబద్ధీకరించుకుంటారు. విభిన్న కోణాల్లో ఆలోచించగల్గుతారు. ఈ ఆలోచనలకు రూపాన్నిచ్చి, వ్యక్తపర్చగల్గాలి. ఇలా బహిర్గతమయ్యే జ్ఞానం వివిధ వ్యవహార రూపాల్లో ఉంటుంది. జ్ఞాన నిర్మాణం ఒక క్రమపద్ధతిలో జరుగుతుంటుంది, వ్యక్తమవుతుంటుంది. పాఠ్యాంశ విషయం గురించి చర్చ జరిపేటప్పుడు కీలకపదాలు, సందేశాత్మక వాక్యాలు, విలువలకు సంబంధించిన అంశాలగురించి బహుళ ప్రతిస్పందనలు వచ్చేలా ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. అందరితో మాట్లాడించాలి. వాటిని క్రోడీకరించాలి. ఇందుకు పాఠాలలోని స్వీయరచన, సృజనాత్మక వ్యక్తీకరణ, ప్రశంస వంటి అభ్యాసాలు మరింత దోహదపడతాయి.

### f) నిర్ధారణ

పిల్లలు తరగతి గదుల్లో వ్యక్తిగతంగా ఆలోచించడం, జట్లలో ఆలోచించడం, వాటిని వ్యక్తపర్చడం వల్ల జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. దాన్ని వివిధ రూపాల్లో బహిర్గతపరుస్తుంటారు. ఇది వస్తు స్వభావాలను బట్టి వివిధ విషయాలలోని జ్ఞాన భాండాగారంలోకి వెళ్తుంది. ఈ క్రమంలో పిల్లలు తామేం గ్రహించారో, తమకు తాము నిర్ధారించుకోగల్గాలి. ఇలా నిర్ధారించుకోగల్గినప్పుడే బోధనాభ్యసన ప్రక్రియలు ఫలప్రదమైనట్లుగా భావించాలి. చదివిన అంశం గురించి, విన్న అంశం గురించి విశ్లేషించడం, అభిప్రాయాలు చెప్పడం, నిర్ధారణలకు రావడం, సమాచార పట్టికలు నింపడం వంటివి ఇందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. పిల్లలు రాసిన అంశాల గురించి, స్వీయ రచనలోని ప్రశ్నలకు సమాధానాలు, సృజనాత్మక వ్యక్తీకరణలను తరగతిలో చర్చించాలి. వీటిని ఉపాధ్యాయుడు పూర్తి తరగతిలో చర్చ ద్వారా సరిదిద్దాలి. ఇలా సరిదిద్దిన వాటి ఆధారంగా పిల్లలు తాము రాసిన వాటిని పోల్చుకొంటారు. తాము ఎలా రాయగల్గారు? ఏమి అర్థం చేసుకొన్నారో నిర్ణారణకు వస్తారు. అట్లే పాఠం పూర్తయిన తర్వాత తాము ఏమేంచేయగలరో, ఏమేం చేయలేరో స్వీయ మూల్యాంకనం అభ్యాసం ద్వారా నిర్ధారణకు రాగలగుతారు.

## 8. తరగతి గది అన్వయనం

### అ) జ్ఞాన నిర్మాణం – విద్యాప్రణాళిక అనువర్తనాలు (Implication of the curriculum)

విద్యా వ్యవస్థలో పిల్లలు, ఉపాధ్యాయులు కీలకమైనవ్యక్తులు. పిల్లలు చేసే రకరకాల పనులు, పరస్పర చర్యలు పిల్లల అభ్యసనాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లలను జ్ఞాన నిర్మాతలుగా భావించినప్పుడు ఉపాధ్యాయులలో, పాఠ్యపుస్తకాలలో, బోధనాభ్యసన ప్రక్రియలలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకోవాలి. విద్యయొక్క లక్ష్యం పిల్లలను పరీక్షలకు తయారుచేయడం కాదు. పిల్లల జ్ఞాన నిర్మాణానికి ఈ బోధనాభ్యసన ప్రక్రియలు తోడ్పడాలి. ఇవి అనేక రకాలైన అనుభవాలను కల్పించాలి. పిల్లలు పాఠశాలకు వచ్చే వరకే కొంత జ్ఞానాన్ని కల్గిఉంటారు. దీని ఆధారంగా తరగతి బోధనాభ్యసన ప్రక్రియలుండాలి. పిల్లల భాష ఈ ప్రక్రియల్లో కీలకమైంది. తరగతిగదిలో పిల్లల భాష జ్ఞాన నిర్మాణానికి ఉపయోగకరంగా ఉండాలి. భాషా తరగతిలో కథలు, గేయాలు, లయబద్ధమైన పాటల వంటి వ్యవహారరూపాలలో భాషాసముపార్జన జరగాలి. ఇవి భాషను పిల్లలకు అలవరుస్తాయి.

**ఆ) పాఠ్యపుస్తకాల పాత్ర**

ప్రస్తుత పాఠ్యపుస్తకాలు అధిక సమాచారంతో నిండి విద్యార్థుల అంతర్గతశక్తుల వికాసానికి, జ్ఞాన నిర్మాణానికి అంతగా సహకరించుటలేదన్నది పలువురి అభిప్రాయం. ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడం విమర్శనాత్మక ఆలోచనా విధానానికి స్థానం లేకుండా పోయింది. విద్య కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం అయింది. మంచి చెడుల విచక్షణ చేయుటకు కూడా అంతగా ప్రాధాన్యత లభించలేదు. ఈ పరిస్థితి తప్పుడునమ్మకాలకు, ఊహాజనితాలకు దారిచూపుతుంది. ఈ విషయంలో పాఠ్యపుస్తకాల పాత్ర ఎంత ముఖ్యమైందో తెలుసుకోవాలి. పాఠ్యపుస్తకాల ద్వారా ఏ విలువలు పిల్లలకు అవసరం. జ్ఞాన నిర్మాణానికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలను ఎలా రూపొందించాలి? పిల్లలకు చాలా ఉపయోగకరంగా పాఠ్యపుస్తకాలను ఎలా తయరుచేయాలి? అనేవి చాలా కీలకమైన విషయాలని గుర్తించాలి. పాఠ్యపుస్తకనిర్మాణంలో ఈ విషయాల పట్ల స్పష్టత చాలా అవసరం. విద్యా, విషయ ప్రణాళికలను అమలుజరిపే సాధనం పాఠ్యపుస్తకం అని అందరికీ తెలిసిన విషయమే. విద్యాలక్ష్యాలను సాధించడంలో బోధనాభ్యసన ప్రక్రియలకు మార్గనిర్దేశనం చేయడంలో పాఠ్యపుస్తకాలు తమవంతు పాత్రను నిర్వహించాలి.

> **మౌఖిక, మౌఖికేతర సాంప్రదాయిక కళలు అనేకం సమాజంలో ఉన్నాయి. ఇవి సమాజంలోని అట్టడుగు సమూహాలయిన తెగలలో, గిరిజనులలో, స్త్రీలలో ఉన్నాయి. వీటన్నింటిని పాఠ్యప్రణాళికలో అంతర్లీనం చేయాలి. దీనివల్ల వారి ఆలోచనా ద్వారం తెరచినట్లవుతుంది. వీటి సాయంతో వారిలో విస్తారమైన పరిష్కారాలను, నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించవచ్చు. తద్వారా ఆయా అంశాల్లో కొత్తదనాన్ని నింపుటలో తోడ్పడినవారమవుతాం. పాఠశాల అనేది అక్షరాస్యులకు విశేషగుణం కల్గినది అయినప్పటికీ సంప్రదాయక, నిరక్షరాస్యులను నిర్లక్ష్యం చేసేదిలా ఉండకూడదు. పాఠశాల అన్నిరకాల మౌఖిక నైపుణ్యాలు, సంప్రదాయాలు, కళలకు ప్రాధాన్యతనివ్వాలి - NCF-2005, పేజి 27.**

ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాప్రణాళికా పరిధి పత్రంలో పాఠ్యపుస్తకాల గురించి కింది ప్రతిపాదనలున్నాయి.

- పిల్లల అభ్యసనం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకూడదు.
- పిల్లల గతానుభవాలను, పూర్వజ్ఞానాన్ని, అంతర్గత శక్తులను ఉపయోగించడానికి, స్థానిక పరిసరాలతో కలిసి పనిచేయుటకు పాఠ్యపుస్తకాలు విస్తృత అవకాశాలను కల్గించాలి.
- పాఠ్యపుస్తకాలు పిల్లల్లో ఆలోచనా నైపుణ్యాలు పెంపొందింపజేసి హేతుబద్ధంగా విచక్షణతో వ్యవహరించేందుకు సహకరించాలి.
- విషయ పరిజ్ఞానంతోపాటు, పని అనుభవం, స్థానిక కళలు, సాహిత్యం, జానపద విజ్ఞానం మొదలైన సామాజిక జ్ఞానాంశాలతోపాటు స్థానిక సమాజ శాస్త్రీయ ఆచరణలను ప్రతిబింబించేలా, పాఠ్యపుస్తకాలు ఉండాలి.
- జ్ఞాననిర్మాణ విధానాలు, వాస్తవిక సూత్రాల ఆధారంగా జరిగిన వాటి నిరూపణలు పిల్లలు అవగాహన చేసుకోవాలి. పాఠ్యపుస్తకం అందుకు దోహదపడాలి.
- సమాజంలోని వివిధ వర్గాల సాంఘిక నియమాలు, వారి జ్ఞానపద్ధతులు పాఠ్యపుస్తకాలలో ప్రతిబింబించాలి.
- బడుగు, అణగారిన వర్గాల సామాజిక నేపథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు పాఠ్యపుస్తకాలలో ప్రతిబింబించాలి. ఉన్నత వర్గాల వారి భావనలు వీరిపై రుద్దకూడదు. పాఠ్యపుస్తకాలు ఇలాంటి అన్ని సమస్యలపై శ్రద్ధ వహించాలి.
- పాఠ్యపుస్తకాలు శిశుకేంద్రంగా ఉండాలని అందరూ అంటారు. విద్యార్థుల ఆసక్తులు, అభిరుచులు, అభ్యసనాశైలి, వాటి మూలాలు, నేపథ్యం - పాఠ్యపుస్తకాలను అభివృద్ధిపర్చడంలో కీలకాంశాలు కావాలి.

- కృత్యాధారంగా పాఠ్యపుస్తకాలుండాలి. కృత్యాధార బోధన అనేది ఆచారప్రాయం మాత్రంగా మిగిలిపోకూడదు. చాలా సందర్భాలలో కృత్యాలనేవి అర్థరహిత యాంత్రిక ప్రక్రియలకు దారితీస్తున్నాయి. కృత్యమనేది ఆలోచనను రేకెత్తించేలా ఉండాలి కానీ అక్షరాన్ని దిద్దించడమో, పాఠాన్ని చదివించడమో, సామగ్రిని విద్యార్థిముందు పడేయడమో కాదు. కృత్యం విద్యార్థిలో ఆలోచన రేకెత్తించాలి. అభ్యసనను అర్థవంతంగా చేయాలి. భవిష్యద్దర్శినిగా కార్యకారణ హేతువులను కనుగొనేదిలా ఉండాలి. మన రాష్ట్ర విద్యాప్రమాణాలు, రాష్ట్ర విద్యాప్రణాళికా పరిధి పత్రం 2011 ప్రకారంగా విద్య సహకార భావనను, శాంతిని, విలువలను, మానవహక్కులను గౌరవించాలి. పాఠ్యపుస్తకం మానవ హక్కులను గౌరవించి పిల్లలలో నైతిక ప్రవర్తనను పెంపొందించేదిగా ఉండాలి.
- పిల్లలు సమకాలీన పరిస్థితులను అవగాహన చేసుకోవాలి. ప్రచారసాధనాల్లో వచ్చే సమస్యలను పిల్లలు విశ్లేషించి అర్థం చేసుకోగలగాలి. పాఠ్యపుస్తకాలు ఇలాంటివాటికి దోహదపడాలి.
- విద్య ద్వారా సమాజంలోని విభిన్నవర్గాలు అభివృద్ధి చెందాలి. ఏదో ఒక వర్గానికే చెందిన జ్ఞానం పాఠ్యపుస్తకంలో ఉండకూడదు. అణగారిన వర్గాలయిన స్త్రీలు, దళితులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, అన్నిరకాల అల్పసంఖ్యాక వర్గ ప్రజలకు ఇబ్బందికరంగా పాఠ్యపుస్తకం ఉండకూడదు.
- ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో విద్య ఒక వ్యాపారకృత్యమైంది. విద్య పేరుతో అనవసర ప్రచార ఆకర్షణలతో ప్రజలు దోపిడీకి బలిఅవుతున్నారు. విద్య అనేది పిల్లలను సమాజ సంక్షేమం కోసం పనిచేసే బాధ్యతాయుతమైన పౌరులను తయారుచేస్తుందా? లేక వైద్యులను, ఇంజనీర్లను, ఇతర ఉద్యోగులను తయారుచేస్తుందా? అన్న ప్రశ్నలు సమాజం అడుగుతోంది. సమాజంలోని భిన్న వర్గాలకు భిన్న వాంఛలు ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలు తమకన్నా మెరుగైన అభివృద్ధి చెందాలని కోరుకుంటారు.

  పై కీలక సూత్రాలాధారంగానే పాఠ్యపుస్తకాలు రూపొందించబడ్డాయి.

**వస్తువుకు సమాజంలో గల విలువను గుర్తించి (సాంఘిక, సాంస్కృతిక, సౌందర్య, ఆర్థిక ప్రాముఖ్యతలు కలిగి) వడ్రంగి తన కళానైపుణ్యంతో వస్తు నిర్మాణం చేస్తాడు. వస్తులభ్యతా జ్ఞానం, వస్తు తయారీలో నాణ్యత, వస్తువు ధర, వస్తు ఉత్పత్తికి తగిన జ్ఞానం, ప్రారంభం నుంచి చివరిదాకా నిర్మాణ ప్రణాళిక మరియు అమలుజరిపే జ్ఞానం, సొంత నైపుణ్యాల ఉపయోగం, ఇతరుల నైపుణ్యాలను అనుకూలంగా మలచుకునే నైపుణ్యం, అవసరమైన పనిముట్ల నిర్వహణ, నాణ్యతపట్ల, సృజనపట్ల, శ్రేష్టతపట్ల ఉత్తమ ఉత్పత్తిపట్ల దృఢమైన నిర్ణయం కల్గిఉంటాడు.**

**కబడ్డి వంటి క్రీడ భౌతిక దేహదారుఢ్యంతోపాటు, క్రీడానియమాల జ్ఞానాన్ని, తన సొంత తాహతును, శారీరక నైపుణ్యజ్ఞానాన్ని వ్యక్తీకరించే ప్రణాళికను, జట్టు సహకార భావనను, ఇతర జట్టులను అంచనావేసే, గెలిచే వ్యూహరచన చేసే జ్ఞానాన్ని కల్గిఉంటుంది. – NCF-2005, పేజి 26.**

**ఇ) బోధనాభ్యసన ప్రక్రియలు ఎలా ఉండాలి?**

జ్ఞాన నిర్మాణానికి NCFలో ఇవ్వబడిన steps ఆధారంగా బోధనాభ్యసన విధానాలను నిర్ణయించడమైనది.

అనుభవాలు మరియు పూర్వజ్ఞానం ద్వారా సమవయస్కులయిన పిల్లలు, జట్లలో పరస్పర జ్ఞానవినిమయం చేసుకుంటారు. వారు వ్యక్తిగతంగానైనా, సమూహంలోనైనా పరస్పర చర్చలద్వారా అవగాహనను పొందుతారు. ముందంజ వేయగల్గుతారు. జ్ఞానాత్మక భవిష్యద్దర్శనాన్ని సుగమనం చేయగల్గుతారు. ప్రశ్నించి కారణాలు తెలుసుకోవడం వల్ల హేతుబద్ధ దృక్పథాన్ని, భావాత్మక అవగాహనను అలవర్చుకుంటారు. వారు చర్చద్వారా అవగాహనకు సంబంధించిన కార్యకారణ సంబంధాలను వివరిస్తారు. ఈ విధానాన్ని అనుసరించి పిల్లలు తమదైన స్వంత అవగాహనతో జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. ఈ విధానంలో 'పరిపూర్ణ మార్పు'కు ఉపాధ్యాయుల పాత్ర అవసరమౌతుంది. పిల్లల అనుమానాలను నివృత్తి చేయడానికి వారితో సహ

అభ్యాసకునిగా ఉంటూ చర్చలకు నాయకత్వం వహించడానికి, అన్వేషణాత్మకంగా ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. ఉపాధ్యాయుడు పిల్లలతో కలిపి పనిచేస్తూ, వారిని భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, వ్యక్తీకరణలద్వారా, తన వైఖరులను చెపుతూ బోధనాభ్యసనంలో కీలకాంశాలను తెలియజెప్పాలి. అప్పుడే ఉపాధ్యాయులు తామూ పరిశోధకులుగా సహకార అభ్యాసకులుగా సూచనలిచ్చేవారిగా రూపొందగలరు.

ప్రధానంగా భాషలో బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల్ని ఆలోచింపజేయుటకు, వ్యక్తీకరింపజేయుటకు తోడ్పడాలి. వాటి సృజనాత్మక వ్యక్తీకరణకు తోడ్పడాలి. ఇందుకు పాఠంలోని విషయానికే పరిమితమై, దాన్నే వివరించడం వల్ల ప్రయోజనం ఉండదు. చదివిన విషయాన్ని అర్థంచేసుకొన్న పిల్లలు ఆ తర్వాత చర్చలో పాల్గొనాలి. అంశాలను విశ్లేషించగలగాలి. ఆయా అంశాలపై తమ అభిప్రాయాలు చెప్పగలగాలి. కవి / రచయిత ఉద్దేశాన్ని గ్రహించగలగాలి. సమకాలీన అంశాలతో అన్వయించగలగాలి. ఇవి జరిగేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఉండాలి. కాబట్టి పాఠంలోని విషయం గురించి పిల్లలు ముందుగానే చదివి చర్చలో పాల్గొనడానికి సిద్ధం చేయాలి. చర్చలు, కృత్యాలు, అన్వేషణలు, ప్రతిచర్యలతో కూడి బోధనాభ్యసన ప్రక్రియలను ఉపాధ్యాయులు అనుసరించాలి.

**జ్ఞాననిర్మాణ ప్రక్రియలో ప్రతిస్పందన బోధన (Reflective teaching) అవసరం.**

ప్రతిస్పందించే బోధన లక్షణాల గురించి జాన్ డ్యూయా (John Deway) కింద విధంగా సూచించారు.

1) **ఉద్దేశ్యాలు, పర్యవసానాలు :** బోధనలో పిల్లలు ప్రత్యక్ష సంబంధం కలవారుగా, ఉద్దేశాల పర్యవసానాన్ని గుర్తించేవారుగా మరియు సాంకేతిక పరిపూర్ణులుగా తీర్చిదిద్దుతుంది.
2) **చక్రీయ పద్ధతి (Cyclical method) :** బోధన చక్రీయ, సర్పిల పద్ధతులు కలిగి ఉంటుంది. ఉపాధ్యాయుని బోధనలో మూల్యాంకనం, పునశ్చరణ, నిరంతరంగా జరుగుతుంది.
3) **అన్వేషణ సామర్థ్యం (Competence in Classroom Inquiry) :** ఈ బోధనలో అన్వేషణ సామర్థ్యం అవసరం దీనిలో దత్తాంశ సమాచార సేకరణ, విశ్లేషణ, మూల్యాంకనం, ప్రతిస్పందన, ప్రణాళిక రచన, సౌకర్యాల కల్పన వంటి చర్యలు ఉంటాయి.
4) **బోధనపట్ల వైఖరి (Attitude towards teaching) :** ప్రతిస్పందిత బోధనకు విశాల భావనావైఖరి, బాధ్యతాయుతమైన సహృదయం అవసరమౌతుంది.
5) **ఉపాధ్యాయుల నిర్ణయాత్మకత (Teacher Judgement) :** ప్రభావశీలమైన బోధనకు టీచింగ్‌కు ఉపాధ్యాయుల నిర్ణయాత్మకత ఆధారమౌతుంది. ఈ నిర్ణయాత్మకత ఉపాధ్యాయుల క్రమశిక్షణతో కల్గిన అంతర్‌దృష్టిపై, వారి స్వయంప్రతిస్పందనలపై పాక్షికంగా ఆధారపడి ఉంటుంది.
6) **సహచరులతో అభ్యసనం (Learning with Colleagues) :** సహచరులతో సంభాషణ, అనుభవాలను దాచుకోవడం సహకారం ద్వారా ప్రతిస్పందిత బోధన జరుగుతుంది. వృత్తిపర అభ్యసనం పెంపొందుతుంది.

**ఈ) విమర్శనాత్మక బోధనశాస్త్రం, అనువర్తనాలు (Critical pedagogy, its implications)**

వివిధ సామాజిక అంశాలపై, భావనలపై అవగాహనకు, మూలకారణాల అవగాహనకు పిల్లలచే లోతుగా ప్రశ్నింపచేయాలి. చర్చలు చేపట్టాలి. (Arguments) వాదన అంశాలపై సామూహికంగా ఆలోచింపచేయాలి. ఉదా॥

విమర్శనాత్మక (విశ్లేషణాత్మక) బోధన విధానం. విద్యార్థులు తమపై ఉపాధ్యాయుల పెత్తనాన్ని ప్రశ్నించేట్లు చేసి సందేహాలను, అపనమ్మకాలను నివృత్తిచేయడానికి దోహదపడుతుంది. విద్యార్థిలో విమర్శనాత్మక చేతనకు దోహదకారి అవుతుంది. Ira Shore (1992) ప్రకారం "విద్యార్థి రాయడం, మాట్లాడడం వంటి వాటికే పరిమితం కాకుండా, వాటి అర్థాల పరిధిని దాటి తులనాత్మకంగా, చైతన్యంతో ఆలోచిస్తాడు. విద్యార్థి అపోహలు, ఊహాజనితభావనల నుంచి బైటపడి మేధోసంపత్తిని పెంచుకుంటాడు. ఆయా అంశాల అంతరార్థాలు, వాటి మూలకారణాలు, సాంఘిక పరిస్థితులను, చర్యలయొక్క

పర్యవసానాలను, వస్తువులను, సంఘటనలను, ప్రక్రియలను, అనుభవాలను, ప్రణాళిక, పాఠ్యవిషయం, నియమాలు, బహుళ ప్రచారసాధనాలు లేదా వ్యవహారాల గురించి పిల్లలు అవగాహన చేసుకొంటాడు.

విమర్శనాత్మక బోధనాశాస్త్రం ముఖ్య ఉద్దేశం విద్యార్థిలను సమర్థంగా, శక్తివంతునిగా తయారుచేయడమే, వారికి స్వేచ్ఛ ఇవ్వడమే. వ్యాకులత నుండి, బాధల నుండి విముక్తులను చేయడమే. అందువల్ల విద్యార్థులలో జ్ఞాన నిర్మాణమందు సంప్రదాయక బోధనాపద్ధతుల పాత్ర అతి పరిమితమైంది. ఇతరుల సంస్కృతిని గౌరవించడం, తమకు తామే, ప్రపంచాన్ని విభిన్న దృక్కోణాలలో విమర్శనాత్మకంగా పరిశీలించడం కూడా విద్యాలక్ష్యాలలో ఒకటి. విమర్శనాత్మక బోధనశాస్త్రం పిల్లల అణగారిన పీడిత ప్రజల సంస్కృతిని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది.

ఈ శాస్త్ర సహచరుల సాయంతో అణగారిన పీడితవర్గాల కుటుంబాల పిల్లలు వారి వారి సంస్కృతి, చరిత్ర, వారి వైవిధ్య ప్రవృత్తులు, మతం, వారసత్వాలక్షణాలను క్షుణ్ణంగా తెలుసుకుంటారు. వారసత్వ విలువల సంక్రమణ ప్రభావాన్ని వారి జీవితాలపై కల్గిస్తుంది. వారు సమర్థులు కావడానికి దోహదపడుతుంది.

విద్య అనేది ఓ విధంగా రాజకీయ కోణం కలది. ఈ విమర్శనాత్మక బోధనశాస్త్రం విద్య చుట్టూ పరిభ్రమించే రాజకీయ వ్యవహారాలపట్ల పిల్లలు, ఉపాధ్యాయులను అప్రమత్తులను చేస్తుంది. ఇది రాజకీయ భావనలను అర్థంచేసుకునేలా చేస్తుంది. సమాజాన్ని అర్థంచేసుకొనే శక్తినిస్తుంది.

**విమర్శనాత్మక బోధనశాస్త్రం అనువర్తనాలు :**

- జ్ఞాననిర్మాణానికి విమర్శనాత్మక బోధనాశాస్త్రం ఒక వ్యూహంగా పనిచేస్తుంది.
- ప్రతిస్పందిత ఆలోచనా నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు, బహుకోణాల్లో విశ్లేషించే ఆలోచనా నైపుణ్యాలు విమర్శనాత్మక బోధనాశాస్త్రంలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ నైపుణ్యాలను పెంపొందించడానికి బోధనాభ్యసన ప్రక్రియలు దోహదపడాలి.

  ఉదా : తరగతిలో కవి పద్యం ఎందుకు రాసి ఉంటాడు? పద్యం రాయడం వెనుకగల దృష్టికోణం ఏమిటి? కవి రచనల వల్ల నాటి సామాజిక పరిస్థితి ఎలా ఉండేదని భావిస్తున్నారు? ఈ పాఠంపట్ల మీ అభిప్రాయాలు ఏమిటి? మీరైతే ఏంచేస్తారు? వంటి ఆలోచింపజేసే పనుల ద్వారా పిల్లలలో విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించవచ్చు.
- విద్యార్థులకు జీవితానుభవం, స్వీయజ్ఞానం ఉంటాయని, అవి జ్ఞాన నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తాయన్న విషయం ఉపాధ్యాయులు తెలిసికొనియుండాలి. తప్పనిసరిగా ఏ పాఠం బోధిస్తున్నా, ఆ ఇతివృత్తానికి సంబంధించిన పూర్వభావనల పట్ల అవగాహనను పరిశీలించాలి. వారి అనుభవాలను చెప్పించాలి.
- విద్యావ్యవస్థ వైఫల్యాలను లేదా పాఠశాల విద్యార్థుల వైఫల్యాలను నిందించడమో లేక వారు తరగతిగదికి తెచ్చిన జ్ఞానాంశాలపై విమర్శచేయుట కూడదు. పిల్లలు అనుభవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తరగతిగదుల్లో కూడా కీలక ప్రశ్నలు అడగడం, మేథోమథనం జరపడం, భావనల చిత్రాలను నిర్మించడం ద్వారా పిల్లల అనుభవాలకు స్థానం కల్పించవచ్చు.
- ఉపాధ్యాయుడు - విద్యార్థి, విద్యార్థి - ఉపాధ్యాయుడు అన్న భావన ఉపాధ్యాయుడు కూడా నేర్చుకోవాలన్న అంశాన్ని నొక్కి చెప్తుంది. నేర్చుకున్న వ్యక్తి మాత్రమే బోధించగల్గుతాడన్న భావన బలపడాలి. ఉపాధ్యాయులంటే కేవలం విషయాన్ని అందించేవాడుగానో, బోధకుడిగానో పరిమిత పాత్ర పోషించరాదు. పిల్లలను ఆలోచింపజేయాలి. తాను కూడా ఆలోచించాలి. పిల్లలు స్వేచ్ఛగా ప్రశ్నించే అవకాశాలు కల్పించాలి. పిల్లల ప్రశ్నల ఆధారంగా తానుకూడా ఆలోచించాలి.. పిల్లలతో కలిసి పనిచేయాలి. తద్వారా ఉపాధ్యాయుడి ద్వారా పిల్లలు, పిల్లలద్వారా పిల్లలు, పిల్లలద్వారా ఉపాధ్యాయుడు నేర్చుకొనే వాతావరణం నెలకొంటుంది.

- **విమర్శనాత్మక బోధనా ప్రక్రియలను అమలుజేసే ఉపాధ్యాయుడు కింది విధంగా ఉంటాడు.**
- ఉపాధ్యాయులు వృత్తిపట్ల గౌరవభావం కల్గిఉంటాడు.
- ఉపాధ్యాయులు విద్యార్థియొక్క సంస్కృతి, పూర్వజ్ఞానం, భాషాసామర్థ్యాలను తెలుసుకొనుటకు ప్రాధాన్యతనిస్తాడు.
- ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ప్రతిభావంతులైన పరిశోధకుడులు కావాలి.
- అభ్యసన సమాహారం అనేది ఒక సమస్యా పరిష్కార పద్ధతి. ఇందులో సమస్యలను గుర్తించుట, పరిష్కార మార్గాలను అన్వేషించుట, ఆచరణ ప్రణాళికల రూపకల్పన, దాని అమలు, మూల్యాంకనం అనేవాటిని అమలుపరుస్తారు.
- తాను ఆలోచిస్తూ, పిల్లలను ఆలోచింపజేస్తాడు. లోతైన చర్చలు నిర్వహిస్తాడు. తన అభిప్రాయాలను రుద్దడు.

**ఉ) సామాజిక నిర్మాణాత్మక వాదం (Social Constructivism)**

వివిధ విషయాలు, అంశాలపై మన భావలను సమాజంలోని వ్యక్తులతో చర్చలద్వారా, పరిశీలనలద్వారా కలిసి చెయ్యడం ద్వారా నేర్చుకున్నవే. మన జ్ఞానం, సామాజికంగా, వివిధ వ్యక్తులతో పరస్పర చర్చలు, కలిసి పనిచేయడం, పరిశీలనల ద్వారా పొందినదే. ఉదా॥ విలువలు మరియు ఇతరులతో ఎలా మాట్లాడాలి? సమాజంలో ఎలా నడచుకోవాలి? ఇంట్లో బాధ్యతలు మొదలగునవి.

సామాజిక నిర్మాణాత్మకవాదం అనేది సామాజికశాస్త్ర సిద్ధాంతాలపట్ల అవగాహన కల్గిఉండుట. ఇది సాధారణ తాత్త్విక జ్ఞాననిర్మాణాన్ని వాస్తవిక జీవితానికి అన్వయిస్తుంది. విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి అభ్యసనంలో ఒక చిన్న 'భాగస్వామ్య సంస్కృతిని, అవగాహనను నిర్మించుకుంటారు'. "విద్యార్థి ఇలాంటి సంస్కృతియందు నిమగ్నుడై వివిధ దశలలో ఆ సంస్కృతియందు భాగస్వామి అగుటకు ప్రయత్నిస్తాడు" అని Lev Vygotsky (1896-1934) అన్నారు.

బోధన అభ్యసన అనువర్తనాల విషయమై విద్యామనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు సామాజిక నిర్మాణాత్మక వాదాన్ని అధ్యయనం చేశారు. నిర్మాణాత్మకత అనేది పిల్లల పురోభివృద్ధి సాధనకు సంబంధించిన సిద్ధాంతాలలో (ప్రవర్తనావాదం, సామాజిక అభ్యసన సామాజిక నిర్మాణం) ప్రముఖమైనది. ఇది Jean Piaget ప్రతిపాదించిన సంజ్ఞానాత్మక పురోభివృద్ధి సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. Piaget ప్రతిపాదించిన నాలుగు అభివృద్ధి దశల సిద్ధాంతం నిర్మాణాత్మకతగానే గుర్తింపుపొందింది. ఈ వాదంలో పిల్లలు తమంతట తాము ప్రాపంచిక అవగాహనను పెంచుకుంటారు. సామాజిక నిర్మాణం పిల్లల వికాసంలో ఇతర అంశాలను, సంస్కృతిని ఇముడ్చుకొంటుంది.

Vygotsky's తన రచనలయిన Mind in Society (1930, 1978) Thought and Language (1934, 1986)లో పిల్లల నిర్మాణాత్మక స్వభావాన్ని గూర్చి Piaget తో ఏకీభవించాడు. బోధనాభ్యసనంలో విద్యార్థి కేంద్రీకృత తరగతి ఉండాలన్న భావనకు సామాజిక నిర్మాణాత్మక సిద్ధాంతం ఆధారం. తరగతిగదిలో విద్యార్థులచే సామూహిక చర్చలు జరపడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. దీని ద్వారా విద్యార్థి సాధారణీకరించడానికి, తరగతియందు అభ్యసన బదలాయింపు జరపడానికి మరియు మౌఖిక భావ ప్రసరణకు గొప్ప పునాదులు నిర్మించుకుంటాడు. స్వీయ క్రమశిక్షణలో, స్వీయ నిర్ణయాలతో కృత్యాలలో పాల్గొనుటలో ఆసక్తిని పెంచుకుంటాడు. విద్యార్థులలో ఉన్ముఖీకరణను, సామూహిక నైపుణ్యాలను, సమస్యా పరిష్కార సామర్థ్యాలను ఈ చర్చలు పెంపొందిస్తాయి. ఈరకమైన అభ్యసనం నేర్చుకున్న విషయాలను విద్యార్థులు మాట్లాడుతుంటె ఆ విజ్ఞాన అనుభవాలు తొలగిపోకుండా ఉంచుతుంది. కాబట్టి బోధనాభ్యసన ప్రక్రియలు ఇందుకనుగుణంగా మారాలి. చర్చించడం, జట్టుపనులు నిర్వహించడం, పిల్లలు పరిశీలనలు చేయడం, రిఫరెన్సు పుస్తకాలు చదవి అభిప్రాయాలు చెప్పడం, చర్చల్లోపాల్గొనడం, ఇతరుల నుండి సమాచారాన్ని సేకరించడం వంటివి బోధనాభ్యసన ప్రక్రియల్లో చోటుచేసుకోవాలి.

**ఊ) ఉపాధ్యాయుని పాత్ర**

ఇంతవరకు జ్ఞాన నిర్మాణం, జ్ఞాన రూపాలు, జ్ఞాన నిర్మాణ పరిస్థితులు గురించి తెలుసుకున్నాం. నిర్మాణాత్మక అభ్యసనం అంటే మన అభ్యసన సన్నివేశాలు జ్ఞాన నిర్మాణానికి దోహదపడాలి. ఇది జరగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది. ఉపాధ్యాయులు అభ్యసనంలో సహభాగస్వాములు. తాను కేవలం బోధకులుగా, వాహకులుగా, సమాచారం అందించే వ్యక్తులుగా మారకూడదు. పిల్లల్లో జ్ఞాన నిర్మాణం జరపడానికి సరైన అభ్యసన వాతావరణాన్ని కల్పించాలి. ప్రోత్సాహకులుగా వ్యవహరించాలి, పిల్లలతో కలిసిపాల్గొనాలి. పిల్లలు పూర్తిగా మానసికంగా అభ్యసనలలో నిమగ్నమయ్యేలా చూడాలి. పిల్లలు వారి ఆసక్తుల ఆధారంగా అభ్యసన ప్రక్రియల్లో నిమగ్నమయ్యేలా చూడాలి. దురదృష్టవశాత్తు పలు సందర్భాలలో లక్ష్యాత్మకత పేరుతో ఉపాధ్యాయులు సరళత, సృజనాత్మకతపై దృష్టిపెట్టరు. తరచుగా పాఠ్యపుస్తకాలలోని సమాధానాలు తప్ప, ఇతర సమాధానాలేవి కూడా సరైనవి కావని భావిస్తారు. పలు కోణాల్లో సమాధానాలుంటే వాటిని ఎలా అంగీకరించాలి? అని వాదిస్తారు. ఈ విధమైన వితండవాదం అభ్యసనాన్ని, దాని అర్థాన్ని పరిమితం చేస్తుంది.

మన విద్యాబోధన, ఆచరణ కేవలం పాఠ్యపథకాలకే పరిమితమైంది. ఇదికూడా కేవలం మదింపు చేయదగిన ప్రవర్తనల సాధన కోసమే. ఈ దృష్టిననుసరించి పిల్లలను శిక్షణ పొందే ప్రాణులుగానో లేదా మనం రూపొందించే కార్యక్రమాన్ని నిర్వహించే ఒక కంప్యూటరుగానో భావిస్తున్నాం. దీనివల్ల పాఠ్యాంశాలలోని జ్ఞానాంశాలను ముక్కలు ముక్కలుగా చేసి నేరుగా కంఠస్థం చేయించడం, లేదా ఏవో కొన్ని కృత్యాలు చేయించి, వారి జ్ఞాపకశక్తికి పరీక్ష పెట్టడం జరుగుతోంది. బోధన అనేది హెర్బార్షియన్ సోపానాలకు పరిమితమై మూసపోసిన విధంగా మారుతున్నది. ఈ విధానం మారాలి.

బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల ఆసక్తులు, స్థాయి, వైవిధ్యతలకు అనుగుణంగా కృత్యాలతో కూడి ఉండాలి. అభ్యసనంలో పిల్లలందరూ భాగస్వాములయ్యేలా సరైన వ్యూహాలను అనుసరించాలి. విద్యార్థులు ఆలోచించే విధంగా, సవాళ్ళను ఎదుర్కొనే విధంగా ఏం అభ్యసిస్తున్నారో తానేం గ్రహించే విధంగా, ఉపాధ్యాయులు పాఠ్యపథకాలను సిద్ధం చేయాలి. తరగతిలో ఉపాధ్యాయులు చెప్పినదాన్ని విద్యార్థులు తిరిగి అప్పచెప్పడం వంటి ధోరణిని నివారించాలి. విద్యార్థులందరూ పాల్గొనే వైయక్తిక కృత్యాలు, జట్టు కృత్యాలు, మొత్తం తరగతి కృత్యాలు పాఠ్యపథకాలలో చోటుచేసుకోవాలి. విద్యార్థులు స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి, వ్యక్తీకరణతోపాటు వారి మధ్య ప్రతిచర్యలు జరపడానికి అవకాశాలు కల్పించాలి.

ఉపాధ్యాయులు పిల్లలపై అధికారాన్ని చెలాయించకుండా వారి భిన్న వ్యక్తీకరణలను, అభిప్రాయాలను వినాలి, మన్నించాలి. పాఠశాల తరగతులను ఇందుకు ఆటంకం కలిగించని భద్రతా ప్రపంచంగా మార్చవచ్చు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ వైయక్తిక, సామూహిక అనుభవాలను ఏ విధమైన భయసంకోచాలు లేకుండా ఇచ్చిపుచ్చుకోగలిగితే సొంతంగా అభ్యసించడానికి అవకాశాలుంటాయి. పిల్లలు తమకు లభించిన జ్ఞానాన్ని విమర్శనాత్మకంగా ప్రశ్నించగలగాలి. అవి పాఠ్యపుస్తకాలలోని విషయాలు కూడా కావచ్చు. తమ చుట్టూ ఉన్న సాహిత్య వనరుల్లోది కావచ్చు. పిల్లలు తాముపొందిన జ్ఞానాన్ని తమ పరిసరాలలోని అనుభవాలతోపోల్చి, వ్యాఖ్యానించడం ద్వారా విమర్శనాత్మక దృక్పథాన్ని అలవర్చుకునేలా ప్రోత్సహించాలి. ఇందుకనుగుణంగా పాఠ్యపథకాలను / యూనిట్ పథకాలను రూపొందించుకోవాలి. మూసపోసిన విధానాలకే పరిమితమై బోధనాభ్యసనాలను అనాసక్తి కలిగించేవిగా మార్చకూడదు.

**ముగింపు :**

పిల్లలు సమాచార గ్రహీతలుగా కాకుండా జ్ఞాన నిర్మాతలుగా మారాలి. ఇందుకు దోహదపడే రీతిలో పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు ఉండాలి. వీటిని సాకారంచేసేలా ఉపాధ్యాయులు సౌకర్యకర్తలుగా, సహ అభ్యాసకులుగా ఎదగాలి. పిల్లలకు కేవలం సమాచారం అందించే వ్యక్తులుగా కాకుండా పిల్లలను ఆలోచింపజేయడం, సమకాలీన పరిస్థితులతో అన్వయించడం, విశ్లేషించడం, ప్రతిస్పందింపజేయడం వంటి వాటిపై దృష్టిపెట్టాలి. తద్వారా ఆలోచనాత్మక, జ్ఞానాత్మక సమాజాన్ని నిర్మించగలం.

4

# నూతన తెలుగు వాచకాల - ప్రత్యేకతలు - కీలకసూత్రాలు (Salient Features & Key Principles of Language Text Book)

విద్యార్థుల్లో జ్ఞాననిర్మాణమే ప్రధానలక్ష్యంగా విద్యావిధానం ఉండడం అవసరం అని N.C.F-2005 మనకు చెప్తున్నది. దీని ఆధారంగానే ఆర్.టి.ఇ-2009 చట్టం రూపుదిద్దుకొంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఉన్నత ప్రమాణాలు గల విద్యను విద్యార్థులకు అందించి తద్వారా విద్యార్థుల్లో జ్ఞాననిర్మాణం చేయడమే రాష్ట్ర దృక్పథం. దీని కొరకై రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణా సంస్థ నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన చేపట్టింది. పిల్లల్లో ఉండే సహజశక్తి సామర్థ్యాలు వెలుగులోకి తీసుకొచ్చేలా, వాళ్ళ ఆలోచనలు స్పష్టంగా వ్యక్తమయ్యే విధంగా నూతన తెలుగు వాచకాలను రూపొందించింది.

ఈ పాఠ్యపుస్తకాలు APSCF-2011 మార్గదర్శకాలననుసరించి రూపొందించటం జరిగింది. సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వ ప్రశంస, సామాజిక మార్పుకు దోహదపడే విధంగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తయారవడానికి అనుగుణంగా పాఠ్యపుస్తకాల రూపకల్పన జరిగింది. ఇలా రూపొందిన పాఠ్యపుస్తకాల తాత్త్వికతను అవగాహన చేసుకోవటం చాలా ముఖ్యం ఈ తాత్త్వికఅవగాహన ఉన్నప్పుడే వాటి ఆచరణ సాధ్యమౌతుంది. అప్పుడే ఫలితాలు పొందగలుగుతాం.

**పాఠ్యపుస్తక తాత్త్వికాంశాలు :**

రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం -2011లోని కీలక సూత్రాల ఆధారంగా పాఠ్యపుస్తక రూపకల్పన జరిగిందని ముందే చెప్పుకున్నాం.

**కీలక సూత్రాలు :**

## 1) తమకున్న శక్తి సామర్థ్యాల ఆధారంగా పిల్లలు నేర్చుకోవడానికి అవకాశం :

- ఇందుకోసం తెలుగు పాఠ్యపుస్తకంలో పిల్లలు తమ అనుభవాలను చెప్పేలా తమ భాషను వినియోగించుకొనేలా ఉన్ముఖీకరణ చిత్రం ఉంది. తమ ఆసక్తులను ప్రదర్శించేలా అభ్యాసాలు ఉండడం. ఇందుకోసం ముఖ్యంగా సృజనాత్మకత అభ్యాసాలు తోడ్పడతాయి.

  ఉదా: వినాయకుడి బొమ్మను లేదా ఇంకా ఏదైనా బొమ్మను మట్టితోచేసి రంగులు వేసి ప్రదర్శించండి. వినాయకునిపై సొంతంగా ఒక పాట రాసి ప్రదర్శించండి. (4వ తరగతి వినాయకచవితి పాఠం)

- పిల్లలందరూ మాట్లాడడం, పాడగలగడం, అభినయం చేయగలగడం, ప్రశ్నించడం, చర్చించడం, చిత్రాలు గీయడం వంటి సామర్థ్యాలను కొంతమేరకు కలిగి ఉంటారు. వీనిని కొనసాగించేలా పాఠ్యపుస్తకంలో అభ్యాసాలు ఉన్నాయి.

  ఉదా: 1. పాఠంలోని పద్యాలను రాగంతో భావయుక్తంగా పాడండి. భావాలు చెప్పండి. (ఆణిముత్యాలు-4వ)

  2. తోట కనులకు, చెవులకు విందు కలిగిస్తున్నది అని విన్నారు కదా! దీన్ని సమర్థిస్తూ మాట్లాడండి. (మాతోట - 5వ తరగతి)

## 2) తాము పొందిన జ్ఞానాన్ని పిల్లలు దైనందిన జీవితంలో ఉపయోగించడం :

- పిల్లలు మాట్లాడడం, చదవడం, రాయడం వంటి పనులను లేదా చేయగలిగిన సామర్థ్యాలను సందర్భోచితంగా అవసరంమేరకు వినియోగించగలగాలి. అంటే తమకు అవసరమైన లేఖలు రాయడం, పుస్తకాలు చదివి అర్థం చేసుకోవడం, ప్రశ్నించడం, సమాచారాన్ని తెలుసుకోవడం, తెలిసిన వాటిని రాసుకోవడం లాంటివి చేయగలగాలి. ఇందుకు అనుగుణంగా అభ్యాసాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా పదజాలం, భాషను గురించి తెలుసుకుందాం ప్రశంస అభ్యాసాలు తోడ్పడుతాయి.

  ఉదా: 1. మీరు నిన్నటిరోజున ఏమేం చేశారో దినచర్య రూపంలో రాయండి. (త్రిలింగాలు-5వ తరగతి)

  2. మీ స్నేహితునికి కోపం ఎక్కువ దాన్ని తగ్గించుకోమని కోపం వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ, మీరు మీ స్నేహితునికి ఏమి చెబుతారో చెప్పండి. (మారిన అలవాటు-4వ తరగతి)

## 3) పిల్లలు పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా సమాజం ద్వారా, పరిసరాల ద్వారా, పఠన సామగ్రి ద్వారా నేర్చుకోవడం :

- సామెతలు, సూక్తులు, వార్తాసేకరణలు చేయడం, శతకపద్యాలు / గీతాలు / గేయాలు, కథలను, ప్రసిద్ధుల చరిత్రలు సేకరించడం, బాలసాహిత్యం చదవడం, తెలిసిన కవుల గురించి సమాచారాన్ని, రచనల గురించి చదవడం, ప్రశంసాత్మక కృత్యాలు పూర్తిచేయడం, ప్రాజెక్టుపనులు చేయడం చేయాలి. వీటన్నింటికి అవకాశాలు కల్పిస్తూ అనేక అభ్యాసాలు పుస్తకాల్లో ఉన్నాయి.

ఉదా: 1. మన దేశ గొప్పదనాన్ని తెలిపే ఏవైనా పాటలను / గేయాలను / కవితలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి. (జాతీయజెండా - 4వ తరగతి)

2. జనవరి మాసంలో హైద్రాబాద్‌లో ఎగ్జిబిషన్ పెడతారు. ఈ వివరాలను వార్తాపత్రికల ద్వారా లేదా ఇంటర్నెట్ ద్వారా సేకరించండి. మీరు సేకరించిన విషయాలను తెలియజేయండి. (ప్రయత్నిస్తే... - 5వ తరగతి)

3. చదువు ఆనందించులో ఇచ్చిన కథలతోపాటు ప్రాజెక్టుపనులలో గ్రంథాలయాన్ని సంప్రదించడం, పఠనసామగ్రి సంప్రదించడం వంటివి చేర్చారు.

**4) బట్టీ విధానాలకు బదులు అర్థవంతమైన రీతిలో ప్రతిచర్యలు, కృత్యాలు, అన్వేషణల ద్వారా పిల్లలు నేర్చుకోవడం :**

- ఇందుకోసం పాఠ్యపుస్తకంలో వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి కృత్యాలు ఉన్నాయి. ఇవి వివిధ సామర్థ్యాల ఆధారంగా ఉన్నాయి. ఆలోచించి రాయడం, చదవడం, అవగాహన చేసుకోవడం, సృజనాత్మక వ్యక్తీకరణ, పఠనకృత్యాలు అర్థసంగ్రహణం, పదజాల కృత్యాలు అనే సామర్థ్యాలు అభ్యాసాల రూపంలో ఉన్నాయి.

ఉదా: 1. 'పిల్లలూ! ఇవి చేయండి' అభ్యాసాలు.

2. కింది గళ్ళలోని అక్షరాలలో కొన్ని పక్షుల పేర్లు దాగి ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి. (చిలుక సందేశం - 4వ తరగతి).

3. రాజు, రాణి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడ ఏమేమి చూసి ఉంటారో రాయండి. (మాటల ప్రయాణం - 4వ తరగతి).

**5) స్వీయ భాషను, తమ స్థానిక కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఉత్పత్తుల ఆధారంగా పిల్లలు నేర్చుకోవడం:**

- పాఠ్యపుస్తకాల్లో వివిధ భాషా రూపాలు ఉన్నాయి. అయితే ప్రతి అభ్యాసంలో పిల్లలు సొంతంగా వారి మాటల్లో రాయడాన్ని ప్రోత్సహించేలా సూచనలు ఉన్నాయి.
- వివిధ పండుగలు, సామెతలు, సూక్తులు, వివిధ సాహిత్య రూపాలు, సంస్కృతి సంప్రదాయాలు వంటివి పిల్లలే తెలుసుకునేలా పాఠాలు, అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా: 1. 'సునీతకు ఆత్మవిశ్వాసం ఎక్కువ' దీని గురించి మీ అభిప్రాయం చెప్పండి. (చక్రాల కుర్చీ - 4వ తరగతి)

2. చిత్రంలో ఉన్నవి మీతో మాట్లాడితే ఏమి మాట్లాడుతాయో చెప్పండి. (నేను మీ ప్రియనేస్తాన్ని - 5వ తరగతి)

- స్థానిక కళలకు సంబంధించినవి

ఉదా: 1. సక్రూ బొమ్మలు గీయడం ఎలా నేర్చుకున్నాడో? ఎవరైనా ఏదైనా పనిని ఎలా నేర్చుకుంటారు? (పల్లె చిత్రం - 4వ తరగతి)

2. రాము వాళ్ళ నాన్న సుత్తి, పట్టుకార్లను, వాళ్ళ అమ్మ బొమ్మలను తయారుచేసి అమ్మేవారు కదా! మీ స్నేహితుల అమ్మానాన్నలు జీవనాధారం కోసం ఏ ఏ పనులు చేస్తారో రాయండి. (బొమ్మ గుర్రం - 4వ తరగతి)

- సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించినవి

ఉదా: 1. చిత్రం ఆధారంగా 'బోనాలు' పండుగ ఎలా జరుపుకుంటారో ఊహించి చెప్పండి.

2. క్రిస్మస్, రంజాన్ పండుగలకు సంబంధించిన కథలు.

3. మీరు చూసిన ఏదైనా పెళ్ళి ఊరేగింపు గురించి చెప్పండి.
(గోపీ డప్పు కథ – 5వ తరగతి)

## 6) ఇతర కీలక సూత్రాలు :

### అ) ఆలోచనలు, వ్యక్తీకరణలకు ప్రాధాన్యం :

నూతన పాఠ్యపుస్తకాలు విద్యార్థుల ఆలోచనలను పెంచేందుకు వీలుగా, వారి వారి ఆలోచనలను స్పష్టంగా వ్యక్తీకరించడానికి వీలుగా ఉన్నాయి.

- ఉన్ముఖీకరణ చిత్రాలు, పాఠ్యాంశ చిత్రాలు పిల్లల్ని ఆలోచింపజేసి స్వేచ్ఛగా భావవ్యక్తీకరణకు తోడ్పడేలా ఉన్నాయి. ఇందులో పిల్లలు కథను ఊహించడం, పాత్రల మధ్య సంభాషణలను ఊహంచడం, పాత్రల స్వభావాలను చెప్పడం వంటివి ఉంటాయి.
- పాఠ్యాంశ బోధనలో కూడా పాఠానికి సంబంధించిన కీలక భావనలపై ఆలోచింపజేయడం, చర్చించడం ఉంటాయి. ఉదా:– తరవాత ఏం జరుగుతుందో ఊహించండి (ఎలుక విందు – 4వ తరగతి) ముగింపును ఆలోచింపజేయడం వంటివి.
- అభ్యాసాలలో వినడం, ఆలోచించి సొంతమాటల్లో చెప్పడానికి సంబంధించిన ప్రశ్నలు, స్వీయరచన ప్రశ్నలు, సృజనాత్మకత, ప్రశంసకు చెందిన అభ్యాసాలు ఆలోచింపజేసేవిగా స్వేచ్ఛా వ్యక్తీకరణకు తావు ఇచ్చేవిగా ఉన్నాయి.

ఉదా: 1. మీ గ్రామంలో పచ్చని పొలాలను, చెట్లను చూసినప్పుడు మీకేమనిపిస్తుందో రాయండి. (చిలుక సందేశం – 4వ తరగతి)

2. మీరు చదివిన ఏదైనా ఒక పుస్తకం గురించి సమీక్ష రాయండి. దాంట్లో ఏ ఏ విషయాలు ఉన్నాయి. దాంట్లో నచ్చినవి, నచ్చనివి ఏవో రాయండి. (నేను మీ ప్రియనేస్తాన్ని – 5వ తరగతి).

3. విద్యుత్తు ఆదాచేసినట్లే మనం ఇంకా వేటిని ఆదాచేయాల్సిన అవసరం ఉంది? ఎందుకు? (వృథాచేయం – 5వ తరగతి).

### ఆ) సృజనాత్మకత, కాల్పనికత, భాషాభిరుచి పెంపొందించడం :

పిల్లల్లో సృజనాత్మకత, కాల్పనికత, భాషాభిరుచి పెంపొందించడానికి పాఠాలు ఉన్నాయి. ప్రతి పాఠంలో అభ్యాసాలు కూడా ఉన్నాయి. ఉదా।। ప్రయత్నిస్తే, మనసుంటే మార్గం ఉంది. పల్లె చిత్రం, ఎలుకవిందు, నేను మీ ప్రియనేస్తాన్ని – వంటి పాఠాలు, గేయాలను పొడిగించడం, కథలను ఊహించడం, బొమ్మలు తయారుచేయడం, మాస్కులు తయారుచేయడం, సంభాషణలు రాయడం, నాటకీకరణ చేయడం వంటి సృజనాత్మకత అభ్యాసాలు పాఠ్యపుస్తకంలో పొందుపరచారు. భాషాభిరుచిని పెంపొందించడానికి 'చదువు – ఆనందించు' శీర్షికన కథలను అందించడంతోబాటు, వివిధ వ్యవహార రూపాలలో పాఠాలను పొందుపరిచారు. ప్రాజెక్టుపనులు భాషాభిరుచికి తోడ్పడే విధంగా ఉన్నాయి.

GRK

**ఇ) భాషావినియోగానికి అధిక ప్రాధాన్యం :**

భాష అనేది భావ వ్యక్తీకరణకు, భావం గ్రహించడానికి ఉపయోగించే సాధనమని మనకు తెలుసు. అయితే ఈ భాషా వినియోగమనేది వివిధ రూపాల్లో ఉంటుందనే విషయం మనం గ్రహించాలి. పిల్లలు తాము ఇంటివద్ద నేర్చుకున్న భాషను, జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని వాళ్ళను ఆలోచింపచేయడానికి, అభిప్రాయ వ్యక్తీకరణ చేయడానికి, సృజనాత్మకంగా వ్యక్తీకరింప చేయడానికి, వివిధ వ్యవహారాల రూపాలను వినియోగింపచేయడానికి నూతన పాఠ్యపుస్తకాలు మార్గదర్శకాలుగా రూపొందించబడ్డాయి. భాషలో ఉండే పదజాలం, నిత్యవ్యవహారంలోని భాషా నిర్మాణసంబంధ అంశాలు అంటే వ్యాకరణం ఎలా ఉంటుందో ఎలా వినియోగించాలో తెలుసుకోవడానికి భూమికగా పాఠ్యపుస్తకాలను రూపొందించారు.

ఉదా : "ఇవిచేయండి" శీర్షికలోని వినండి–మాట్లాడండి, స్వీయరచన, సృజనాత్మకత, పదజాలం, భాషాంశాలు అనేవి భాషావినియోగసంబంధాన్ని సూచించేవే.

ప్రతి పాఠంలోని కీలకపదాలు, కీలకవాక్యాలు, నిత్యజీవితంలో భాషావినియోగానికి ఉపయోగపడ్తాయి. వీటిపై అభ్యాసాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

**ఈ) మొత్తం పాఠ్యపుస్తకం విద్యాప్రమాణాల సాధనకు దోహదపడడం :**

సాధారణంగా మనంచేసే ప్రతిపనికి ఒక ప్రయోజనం ఆశిస్తాం. అలానే మనం పాఠ్యపుస్తకాన్ని బోధించటంవల్ల కూడా ఓ ప్రయోజనాన్ని ఆశించాలి. అదే విద్యాప్రమాణాల సాధన. ప్రస్తుత పాఠ్యపుస్తకాలు ఏడు రకాల విద్యాప్రమాణాల సాధనకు తయారైనాయి. అవి :

- i) **వినడం–మాట్లాడడం :** విద్యార్థి అవగాహనతో వినగలగాలి – విన్న విషయాన్ని అవగాహనతో అర్థంచేసుకొని స్పష్టంగా చెప్పగలగాలి.
- ii) **చదవడం–అవగాహనతో రాయడం :** ఇచ్చిన విషయాన్ని అవగాహనతో చదువుతూ, అర్థంచేసుకొని అడిగిన విషయాన్ని గురించి స్పష్టంగా రాయగలగాలి, గుర్తించగలగాలి.
- iii) **స్వీయరచన :** అడిగిన విషయం గురించి తనసొంత ఆలోచనలతో తన అభిప్రాయాలను, విమర్శలను, విశ్లేషణలను ఆధారంగా చేసుకొని జవాబులు రాయగలగాలి.
- iv) **పదజాలం :** భాషావినియోగానికి ఉపయోగపడే జాతీయాలు, సామెతలు, అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి–వికృతులు, వ్యుత్పత్త్యర్థాలు మొదలగువాటిని సాధించటానికి అవసరమైన అభ్యాసాలు ఉన్నాయి.
- v) **సృజనాత్మకత :** తెలుగు భాషా వ్యవహార రూపాలను పిల్లలు వాళ్ళ శక్తి సామర్థ్యాల మేరకు సృష్టించగలగాలి. ఒక కథ, గేయం, కరపత్రం, లేఖ, సంభాషణ మొదలగు ప్రక్రియలను సృష్టించటానికి అనువుగా అభ్యాసాలు ఉన్నాయి.
- vi) **ప్రశంస :** విద్యార్థుల్లో ద్వేషభావాన్ని రూపుమాపి ఉత్తమ పౌరులుగా రూపొందించడానికి 'ప్రశంస' అనే సామర్థ్యం ఉంది.
- vii) **వ్యాకరణాంశాలు :** భాషా నిర్మాణానికి సంబంధించిన వ్యాకరణాంశాలు, భాషా భాగాలు, వాక్యనిర్మాణాలు – భేదాలు, సంధులు సమాసాలు, అలంకారాలు, ఛందస్సు మొదలగు అంశాలు ఉన్నాయి. దీనికి పాఠ్యపుస్తకాలు చక్కగా ఉపయోగపడతాయి.

ఇవే కాకుండా సామర్థ్యాల సమాహారంగా ప్రాజెక్ట్ పనిని కల్పించే విధంగా పాఠ్యపుస్తకాలు ఉన్నాయి.

**ఉ) పరస్పర ప్రతి చర్యలకు కేంద్రంగా ఉండడం :**

పాఠ్యపుస్తకంలోని అర్థసంగ్రహణం, వినడం–మాట్లాడడం, స్వీయరచన, ప్రాజెక్ట్‌పనులు పరస్పర ప్రతిచర్యలకు కేంద్రంగా ఉంటాయి.

ఉదా : అర్థసంగ్రహణంలో తన మిత్రులతోను, ఉపాధ్యాయునితోను చర్చిస్తారు. వినడం–మాట్లాడడంలో మిత్రులతో జట్లుగా చర్చించే అవకాశం ఉంది. స్వీయరచనలో కూడా జట్లుగా ఏర్పడి సమాధానాలను కూర్చాల్సి ఉంటుంది. ప్రాజెక్ట్‌పనులలో కొన్ని సామూహిక కృత్యాలుగా ఉన్నాయి.

**ఊ) తోటివారి ద్వారా, అదనపు సామాగ్రిద్వారా, సమాజసభ్యుల ద్వారా నేర్చుకోవడానికి దోహదపడడం :**

తోటి విద్యార్థులతో చర్చించిగాని, పాఠ్యపుస్తకేతర సామాగ్రి సంపాదించటం ద్వారా, సమాజంలో ప్రముఖులను కలవడంవల్ల, వివిధ సంస్థలతో సంపర్కం ఏర్పడడంవల్ల విద్యార్థులు అదనపు జ్ఞానం పొందే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణమైన అభ్యాసాలున్నాయి.

పిల్లలు తోటి విద్యార్థులతో నేర్చుకునేలా పఠనకృత్యాలు, జట్టు కృత్యాలు, ప్రాజెక్టు పనులను పాఠ్యపుస్తకంలో పొందుపరిచారు. ప్రాజెక్టు పనులలో సమాజ సభ్యులను కలవడం విషయాలను సేకరించడం అదనపు సామగ్రిని సేకరించుకోవడం అనేవి నేర్చుకోవడానికి దోహదపడ్తాయి.

**ఎ) ఉన్నతవైఖరులు, మానవత్వపువిలువలు – సంబంధాలు పెంపొందించడానికి ఉద్దేశించినవిగా ఉండడం :**

పిల్లల్లో ఉన్నత వైఖరులు, మానవత్వపు విలువలు, మానవ సంబంధాలు పెంపొందించేలా పాఠాలను ఎంపిక చేయడం జరిగింది.

ఉదా : సహవాసం (5వ తరగతి) బొమ్మ గుర్రం (4వ తరగతి), ఎవరు బాధ్యులు (4వ తరగతి), ప్రయత్నిస్తే (5వ తరగతి), ఆణిముత్యాలు (4వ తరగతి), వృథాచేయం (5వ తరగతి) మనసుంటే మార్గం ఉంది (5వ తరగతి).

ఉన్నత వైఖరులను, పెంపొందించడానికి ప్రత్యేకంగా 'ప్రశంస' పేరుతో అభ్యాసాలను చేర్చడం జరిగింది.

ఉదా: 1. మీ గ్రామంలోని పోస్ట్‌మ్యాన్ సేవలను ప్రశంసిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి. (మాటల ప్రయాణం – 4వ తరగతి).

2. సీతాకోకచిలుకలు వంటివి మన ప్రకృతిలో ఉన్న కీటకాలు, పక్షులు ఉన్నాయి. సెల్‌ఫోన్ టవర్లు, అధికవేడి, మనం వాడే పురుగుమందులు, వాతావరణ కాలుష్యం వల్ల నశించిపోతున్నాయి. వేసవికాలంలో పక్షులు తాగడానికి నీరు దొరకక చనిపోతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని పక్షులు, కీటకాలను కాపాడడానికి మీరైతే ఏంచేస్తారో సొంతమాటల్లో రాయండి. (సీతాకోక చిలుకలు – 5వ తరగతి)

**ఏ) సోపానక్రమంలో బోధించడానికి వీలుగా పాఠాల అమరిక ఉండడం :**

నేర్చుకోవడమంటే జ్ఞాననిర్మాణం జరగడం. ఇందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలు ఉండాలి. బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ కూడా జ్ఞాననిర్మాణానికి అనుగుణంగా నిర్వహించబడాలి. ఒక పాఠం బోధించడం అంటే అందులోని విషయాన్ని చెప్పివదిలేయడంగాక 'ఉన్ముఖీకరణ' నుండి 'నేనివిచేయగలనా?' వరకు 'చెప్పడం – చేయించడం' జరగాలి. అందుకనుగుణంగా పాఠాన్ని అమర్చడం జరిగింది. అదెలా ఉందో చూడండి.

| | | | |
|---|---|---|---|
| 1. | ఉన్ముఖీకరణ | – | 'ఆలోచించండి – చెప్పండి' శీర్షికతో చిత్రాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు. ఇది పూర్వ భావనల నిర్మాణానికి (Pretext) సంబంధించినది. |
| 2. | పిల్లలూ! ఇలా చేయండి (అర్థసంగ్రహణ) | – | పిల్లలు పాఠ్యాంశాన్ని చదివి భావాన్ని గ్రహించడం, ఊహించడం, చర్చించడం దా&్వరా జ్ఞాననిర్మాణానికి శిక్షణపొందడాన్ని ఉద్దేశించి ప్రతి పాఠంలో పాఠం ప్రారంభం పేజీలో సూచనలు ఉన్నాయి. ఇది జ్ఞానాత్మక శిక్షణకు ఉద్దేశించినది.. |
| 3. | విషయావగాహన–చర్చ | – | పాఠ్యాంశవిషయం (వివిధ వ్యవహారరూపాల్లో) |
| 4. | పిల్లల అవగాహన–పరిశీలన | – | పిల్లలను ఆలోచింపజేయడం, బహుళ ప్రతిస్పందనలను రాబట్టడానికి చర్చలు జరగడానికి ఉద్దేశించినది. "ఇవిచేయండి" శీర్షికతో సామర్థ్యాల సాధనకై అభ్యాసాలు పిల్లల జ్ఞానినిర్మాణానికి ఉద్దేశించిన ప్రశ్నలు, కృత్యాలు, ప్రాజక్టుపనులు ఉంటాయి. వీటిలో పాల్గొనడంద్వారా భాగస్వామ్య అభ్యసనం జరుగుతుంది. |
| 5. | స్వీయమూల్యాంకనం | – | నేనివిచేయగలనా? స్వీయ మూల్యాంకనానికి ఉద్దేశించినది. పిల్లలు నిర్ధారణకు రావడానికి ఇది తోడ్పడుతుంది. |

**ఐ) బహుముఖ విశ్లేషణ, విమర్శన సామర్థ్యాన్ని పెంపొందిచేలా ఉండడం :**

విద్యార్థులు ఒక విషయం గూర్చి, సమస్యగూర్చి అనేక కోణాల్లో ఆలోచించడం, వాటిని విశ్లేషణ చేసుకోవడం లేదా విమర్శన చేయగలగడం లేదా సమీక్ష చేయగలగడం లాంటి సామర్థ్యాలు పెంపొందించడానికి అనువుగా అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా: 1. ఇప్పుడంతా ప్లాస్టిక్ యుగమే బాబూ! అని కాగితపు సంచి అంది కదా! ఈ పరిస్థితి మార్చాలంటే మనమేం చేయాలో రాయండి. (చిన్నారికల – 4వ తరగతి)

2. గేయానికి స్వతంత్ర్యోత్సవం అనే పేరు సరైందేనా? ఎందుకో చెప్పండి. (స్వతంత్రోత్సవం – 5వ తరగతి)

**ఒ) సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తి కలిగించడం :**

పిల్లలు తమ పరిసరాలను సమాజాన్ని, కాలాన్ని పరిశీలిస్తూంటారు. ఆ పరిశీలనలతో వారి జ్ఞానాన్ని పెంచుకుంటూంటారు. అలా పెంచుకోవడంలో పాఠ్యపుస్తకం కూడా ప్రముఖ పాత్ర పోషించే విధంగా నూతన పాఠ్యపుస్తకాలున్నాయి. వారికి సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తిని రేకెత్తించే విధంగా పాఠాలు, అభ్యాసాలు ఉన్నాయి. పాఠాలలోని విషయాలను సమకాలీన అంశాలకు, పరిస్థితులకు అన్వయించగలగాలి. ఆలోచించగలగాలి. సమాజాన్ని అర్థం చేసుకోగలగాలి. తద్వారా జ్ఞానాన్ని వృద్ధి పరచుకోవాలి.

ఉదా॥ వృథాచేయం, రామన్నకథ పాఠాలు (5వ తరగతి)

చిన్నారికల, ఎవరు బాధ్యులు పాఠాలు (4వ తరగతి)

**ఓ) విద్యార్థుల స్వీయ మూల్యాంకనానికి అవకాశం కల్పించడం. దీనికొరకు ప్రతిపాఠంలో 'నేనివిచేయగలనా?' అనే శీర్షిక ఉంది.**

- పాఠ్యపుస్తకం తాత్వికతను తెలిపేలా "ముందుమాట" ఉంది.
- పాఠ్యపుస్తక వినియోగం ఎలా ఉండాలనే విషయం గురించి ఉపాధ్యాయులకు 'కరదీపిక' "ఉపాధ్యాయులకు సూచనలు" ఉన్నాయి.
- పిల్లలకు పాఠ్యపుస్తక ఉపయోగం గూర్చి తెలుసుకోవడానికి "విద్యార్థులకు సూచనలు" ఉన్నాయి.
- పాఠ్యపుస్తకం పూర్తయ్యేసరికి పిల్లలు ఏ సామర్థ్యాలను సాధించాలో తెలుసుకోవడానికి "ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు" అనే శీర్షిక కింద సామర్థ్యాల జాబితా ఇవ్వడం జరిగింది. అందుకనుగుణంగా సామర్థ్యాల వారీగా పాఠాల్లో అభ్యాసాలు "ఇవిచేయండి" శీర్షిక కింద ఇవ్వడం జరిగింది.
- "పదాలు-అర్థాలు" శీర్షిక పాఠ్యపుస్తకం చివర ఇవ్వడం జరిగింది. ఇది నిఘంటువు చూసే అలవాటు పెంపొందించటానికి స్వయం అధ్యయనానికి అలవాటుపడేలా చేయడానికి దోహదపడుతుంది.

**7) పాఠాలు – ఇతివృత్తాలు – ప్రక్రియలు – కృత్యాలు :**

ఆయా పాఠ్యాంశాలను కింది ఇతివృత్తాల ఆధారంగా ఎంపిక చేశారు.

- భాషాభిరుచి, ప్రకృతి, నైతిక విలువలు, సామాజిక స్పృహ, సామాజిక విలువలు, మానవసంబంధాలు, నైతిక విలువలు, మానవతా విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, పఠనాభిలాష, జాతీయ సమైక్యత, కళలు – దర్శనీయ స్థలాలు, కృతజ్ఞత, ప్రకృతి పరిశీలన, సమయస్ఫూర్తి, పర్యావరణం, హాస్యం, పిల్లల ఆసక్తులు, పిల్లల స్వభావం, జీవవైవిధ్యం, పిల్లల శక్తులు, వికలాంగుల మనోభావాలు, శాస్త్రీయత మొదలగునవి

- **పాఠాలు వివిధ ప్రక్రియల్లో – అనగా వివిధ వ్యవహార రూపాల్లో ఎంపికచేశారు.**

  కథ, కథానిక, గేయం, గేయకథ, సంభాషణ, ఆత్మకథ, వ్యాసం, లేఖ, పద్యం, శతకం మొదలగు వ్యవహార రూపాల్లో / ప్రక్రియల్లో పాఠాలు ఉన్నాయి.

- **వివిధ కృత్యాలు :**

  వివిధ కృత్యాల సమాహారమైన ప్రాజెక్టుపనులను ప్రతి పాఠంలో చేర్చారు. ఈ ప్రాజెక్టుపనులవల్ల పిల్లలకు సందర్భోచితంగా భాషాసామర్థ్యాలను వినియోగించే శక్తి లభిస్తుంది.

  వ్యక్తిగత కృత్యం, జట్టు కృత్యం, పూర్తి తరగతి కృత్యాల వారీగా ఉన్నాయి. పిల్లలు వ్యక్తిగతంగా ఆలోచించడం, జట్లలో చర్చించడం ద్వారా భాగస్వామ్య అభ్యసనానికి అనగా కలిసి పనిచేయడం, ఆలోచించడం, నిర్ధారణకు రావడం జరుగుతుంది. కృత్యాలన్నీ పిల్లలను ఆలోచింపజేయడానికి, భాగస్వామ్యం పెంచడానికి, జ్ఞాననిర్మాణానికి తోడ్పడే రీతిలో ఉన్నాయి.

ఇప్పటివరకు చెప్పుకొన్న అంశాలన్నీ అవగాహన చేసుకున్నట్లైతే పాఠ్యపుస్తకాల తాత్త్వికత అర్థమైనట్లే. ఈ తాత్త్వికతనే మనలను విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపయోగపడుతుంది అనే విషయాన్ని గుర్తుంచుకొని మనం ముందుకెళ్ళాలి.

**ముగింపు :**

ఆర్.టి.ఇ.–2009, ఆంధ్రప్రదేశ్ విద్యా ప్రణాళిక–2011 ప్రకారం నూతన భాషావాచకాలు రూపొందించారు. ప్రధానంగా ఇవి ఆలోచింపచేయడం, వ్యక్తీకరించడం, సృజనాత్మకత, విలువలు, వైఖరులు పెంపొందింపచేయడానికి ఉద్దేశించినవి. విమర్శనాత్మక, హేతుబద్ధచింతనతో, విచక్షణా జ్ఞానంతో వ్యవహరించేలా చేయడానికి ఈ పాఠ్యపుస్తకాలు దోహదపడతాయి. ఇందుకనుగుణంగా ఇతివృత్తాలు, పాఠ్యాంశాల ఎంపిక, అభ్యాసాలకూర్పు ఉన్నాయి. వీటిని ప్రణాళికాబద్ధమైన బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నిర్వహించి ఫలితాలు సాధించాలి.

# 5

# భాషాభ్యసనం – వ్యూహాలు
# (Language Learning - Strategies)

భాషలో జ్ఞానం అనేది వివిధ ప్రక్రియా రూపాలలో ఉంటుంది. పిల్లలు భాషను పొందే క్రమంలో వివిధ స్థాయిల్లో జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. సహజంగా, సందర్భోచితంగా, అర్థవంతమైన సన్నివేశాల్లో పిల్లలు పాల్గొనడం ద్వారా జీవజాలం, వస్తుజాలంతో పరస్పర ప్రతిచర్యలు జరపడం ద్వారా మాటల అవసరం కలిగి పదాలు, పదబంధాలు, వాని అర్థాలు, వాక్యాలు, రచనలు సృష్టించగలగడమే భాష విషయంలో జ్ఞాన నిర్మాణం అంటున్నాం. సాధారణంగా వివిధ రూపాలలో అంటే కథ, నాటిక, పద్యం, చర్చించడం, వ్యాఖ్యానించడం, వర్ణించడం, విమర్శించడం, ఏకపాత్రాభినయం, ఇలా అనేక రూపాల్లో భాషా జ్ఞానం వ్యక్తపరచబడుతుంది. ఈ నేపథ్యంలో పిల్లలందరూ జ్ఞాన నిర్మాణం చేసుకోవడానికి వీలుగా ఇప్పుడు అనుసరిస్తున్న పాఠ్యపథకాలను, బోధనా వ్యూహాలను ఆధునీకరించాలా? అని ఆలోచించాలి. జ్ఞాన నిర్మాణం జరగాలంటే బోధనా వ్యూహాలలో మార్పు అవసరం.

భాషాజ్ఞానాన్ని వివిధ ప్రక్రియా రూపాలలో అందిస్తున్నప్పుడు తగిన బోధనా వ్యూహాలను ఎంపికచేసుకొని అమలు చేసినప్పుడే అవి ఆశించిన ఫలితాలను అందిస్తాయి. భాషాబోధనలో లక్ష్యసాధన దిశగా నిర్వహించదగిన కొన్ని బోధనా వ్యూహాలను చూసేముందు భాషాస్వభావం. పిల్లలు ఎలా నేర్చుకుంటారో గమనించండి.

**భాష – స్వభావం – పిల్లలు నేర్చుకునే విధానం :**

భాషకు నిర్వచనాలు అనేకం. 'భాషింపబడేది భాష', 'భాషా వద వ్యక్తాయాం వాచి' అంటే వ్యక్తీకరణకు ఉపయోగపడేది భాష. 'భాష్' అనే ధాతువు వ్యక్తీకరించే విషయాలను గురించి చెబుతుంది, అని అర్థం. పరస్పర భావ వినిమయం కోసం చేసే వాగ్వ్యవహారమే భాష – ఇది ఇప్పటి వరకూ ఆమోదయోగ్యంగా ఉన్న నిర్వచనం. కానీ ప్రపంచవ్యాప్తంగా భాషపై జరుగుతున్న పరిశోధనల ఫలితాల ఆధారంగా కొత్తగా వస్తున్న దృక్పథాల నేపథ్యంలో ఏ నిర్వచనమూ సమగ్రమూ సంపూర్ణమూ కాదని గ్రహించాలి.

ప్రస్తుతం భాషను కేవలం భావ వినిమయ సాధనంగా మాత్రమే చూడటం లేదు. అది ఆలోచనలకు సాధనం, వికాసానికి దోహదకారి, సృజనాత్మకతకు సహాయకారి, ఆలోచనలకు ప్రేరకం... ఇలా భాష పోషించే పాత్ర అనంతంగా ఉంటుంది.

ఆలోచనలకు - భాషకు విడదీయరాని సంబంధం ఉంది. భాష ముందా? ఆలోచన ముందా? అనే విషయంలో ఇప్పటికీ పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. నిజానికి ఇది విత్తుముందా? చెట్టుముందా? వంటి ప్రశ్న మన ఆలోచనా ప్రక్రియలకు భాష స్పష్టమైన రూపాన్ని ఇస్తుంది. 'వికాసానికి దోహదకారి' అన్నప్పుడు కూడా - దాంట్లో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి. ఆలోచన - భాష విడదీయరానివి కాబట్టి సృజనాత్మక వ్యవహారం జరగడానికి భాష అవసరం తప్పనిసరి. వ్యక్తిత్వ వికాసంలోనూ భాష పాత్ర ముఖ్యమైనది.

భావ వినిమయానికి వాహిక భాష అనే నిర్వచనంలో 'వినిమయం' అంటే సంభాషణ జరపడం అనే పరిమితార్థంలోనే దాన్ని ఉపయోగిస్తున్నాం. కానీ వినిమయంలో సాధికారికంగా మాట్లాడడం, సందర్భోచితంగా మాట్లాడడం, ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, స్పష్టంగా మాట్లాడడం వంటి అనేక అంశాలు ఉన్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని భాషా ప్రాధాన్యాన్ని గుర్తించాలి.

వాగ్రూపంలో ఉంటేనే భాష అనేది మరో అభిప్రాయం. ఇది భాషకున్న ఒక పార్శ్వం మాత్రమే! ఈ రోజుల్లో మూగ, చెవిటి వారి కోసం 'సంకేత భాషలు (సైన్ లాంగ్వేజెస్) అందుబాటులోకి వచ్చాయి. ఇవేవీ వాగ్రూపంలో ఉండవు. కానీ వాటిలో పదజాలం ఉంది, వీటికో వ్యాకరణం ఉంది. కాబట్టి దీన్ని కూడా భాషగానే పరిగణించాల్సి ఉంటుంది.

**స్వభావం :**

ఒక నిర్వచనంలో బంధించడానికి తేలికగా లొంగని భాష స్వభావం ఏమిటి? అని ప్రశ్నించుకున్నప్పుడు దానిలో అంతర్గత అంశాలు అనేకం కనిపిస్తుంటాయి. మారుతూ ఉండటం భాషకున్న ప్రధాన లక్షణం. అందుకే భాషను సాధారణంగా 'జీవనది'తో పోలుస్తుంటారు. ప్రవాహశీలత దీని స్వభావం. ఈ మార్పు వాగ్రూప, లిఖిత రూపాలు రెండింటిలోనూ జరుగుతుంది. కాకపోతే ఒక స్థిర రూపం పొందిన 'లిపి' మార్పునకు లోనుకావడానికి చాలా సమయం పడుతుంది. ఐతే వాగ్వ్యవహారంలో మార్పులు లిపిలో కన్నా వేగంగా జరుగుతుంటాయి.

ఒక భాషా వ్యవహర్త మరో భాష నేర్చుకోవడం కష్టం అనీ భాషా కుటుంబాలు, తెగల మధ్య సామ్యాలు ఉండవనీ కొన్నాళ్ళు విశ్వసించాం. కానీ భాషపై ఇటీవల జరిగిన పరిశోధనలు ఈ విశ్వాసాలు సడలిపోయేలా చేశాయి. ఉదాహరణకు వాక్య నిర్మాణం విషయంలో కర్త-కర్మ-క్రియ (S-O-V-సబ్జెక్-ఆబ్జెక్ట్-వెర్బ్), కర్త-క్రియ-కర్మ (S-V-O-సబ్జెక్-వెర్బ్-ఆబ్జెక్ట్) అనే రెండు నిర్మాణాలే ప్రపంచవ్యాప్తంగా భాషలలో ఉన్నాయని తేలింది. అలాగే హల్లు-అచ్చు (C-V-కాన్సొనెన్ట్-ఓవల్), ఈ నిర్మాణ క్రమమే అన్ని భాషల్లోని పదాలలో ఉంది. చాలా భాషల్లోనూ ఏ ధ్వని కూడా మూడు హల్లులకు మించి వరసగా రావని భాషాశాస్త్రజ్ఞులు గుర్తించారు. కొన్ని కొన్ని భాషలలో కొన్ని అపవాదాలు ఉండవచ్చు. భాష మధ్య ఇలాంటి సామ్యాలు గమనించినపుడు బహుభాషలు నేర్చుకోవడం, బహుభాషా స్థితిని తరగతి గదుల్లో అంగీకరించడం కష్టమేమీ కాదని తెలుస్తుంది.

మా భాష గొప్పదంటే మా భాష గొప్పదని కొందరు వాదిస్తుంటారు. ప్రతి భాషకు దాని గొప్పదనం దానికి ఉండడం సహజం. అంతమాత్రాన పరాయి భాషలను కించపరచడం తగదు. పోలికలు పెట్టి తూలనాడడం, దూషించడం అసలే

పనికిరాదు. ప్రతి భాషానిర్మాణమూ సంక్లిష్టమైనదే అని గ్రహించాలి. శిశువు తన పరిసరాలలో ఏ భాషా వ్యవహర్తలుంటారో ఆ భాషే నేర్చుకుంటాడు. ఒకే ప్రాంతంలో రెండు భాషలు మాట్లాడే వారుంటే ఆ రెండు భాషలనూ శిశువు అలవోకగా నేర్చుకుంటాడు.

ఏ భాషలోనూ, ఆ భాషా పదాలు మాత్రమే ఉండవు. ఇచ్చి పుచ్చుకోవడం ప్రతి భాషకు ఉన్న స్వభావం. భాషలో 'ఆదాన-ప్రదానాలు' జరుగుతుంటాయి. అంటే కొన్ని పదాలు స్వీకరించడం, కొన్ని పదాలు ఇవ్వడం అని అర్థం. తెలుగులో లెక్కలేనన్ని అన్యదేశ్య పదాల్ని మనం వాడుతున్నాం. తిక్కన కాలం నుండే మనకు రచనల్లో అన్యదేశ్య పదాలు కనిపిస్తున్నాయి. దీన్ని భాషకున్న సహజ స్వభావంగా గుర్తించాలి.

## పిల్లలు నేర్చుకొనే విధానం :

ఇంత సంక్లిష్ట స్వభావాన్ని కలిగిన భాషను పిల్లవాడు అలవోకగా నాలుగేళ్ళు నిండేసరికి ఎలా నేర్చుకోగలుగుతున్నాడు? (కొందరు మూడేళ్ళంటారు) అనేది అందరిలోనూ కుతూహలాన్ని రేకెత్తించే ప్రశ్న. బళ్ళో చేరకముందు ఏకబిగిన స్వేచ్ఛగా మాట్లాడుతూ ప్రశ్నల పరంపరతో ఠారెత్తించే పిల్లవాడు - బళ్ళో చేరగానే 'మౌనముద్ర'తో ఎందుకుంటాడు? అనేది ఉపాధ్యాయుల్ని వేధించే ప్రశ్న. ఈ రెంటికీ సమాధానాలు వెతుకుదాం.

అనుకరణ ద్వారా శిశువు భాషను నేర్చుకుంటుంది - అనేది పాక్షిక సత్యం మాత్రమే. శిశువు మెదడులో పుట్టుకతోనే ఒక 'భాషావ్యవస్థ' ఉంటుందనీ, స్థానిక పరిసరాల ప్రభావంతో ఆ భాషావ్యవస్థ సహకారంతో శిశువు భాష నేర్చుకుంటుందనీ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రతిపాదించింది నోమ్ చామ్‌స్కీ అనే భాషా శాస్త్రవేత్త. ప్రపంచంలోని ప్రతి శిశువుకు ఈ వ్యవస్థ ఉంటుంది కాబట్టి ఆయన దీనికి 'విశ్వవ్యాకరణం' (యూనివర్సల్ గ్రామర్) అని పేరు పెట్టారు. దీన్నే సంగ్రహంగా యు.జి. అని పిలుస్తుంటారు.

పుట్టింది మొదలు పిల్లవాడు ఎన్నో పదాలు, శబ్దాలు, ధ్వనులు వింటుంటాడు. తనలో పదిలపరుచుకుంటాడు. దీన్నే ఇన్‌పుట్ అంటారు. అర్థవంతమైన, భావస్ఫోరకమైన ఈ పదాలు, శబ్దాలు, ధ్వనులను మెల్లమెల్లగా వ్యక్తీకరించడం మొదలుపెడతాడు. వాగింద్రియం - ముఖయంత్ర వ్యవస్థ-పటిష్టంగా, స్థిరమౌతున్న కొద్దీ వాక్కులో స్ఫుటత్వం, స్పష్టతరావడం గమనించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు మొదట ప / బ / మ / త / స అనే అక్షరాలతో కూడిన పదాలు పలకడానికి ప్రయత్నం చేస్తారు. ఆ తర్వాత రెండక్షరాల పదాలు పలుకుతారు. తర్వాత రెండేసి పదాలు, మూడేసి పదాలతో వాక్యాలు మాట్లాడడం మొదలుపెడతారు. రెండున్నర, మూడేళ్ళు వచ్చేసరికి పెద్దవారు నిర్మించగలిగే వాక్య నిర్మాణ క్రమం అంతా పిల్లవాడికి కరతలామలకం అవుతుంది. మూడేళ్ళ తర్వాత ప్రశ్నించడం వాగ్వైఖరిలో ఉండే అంతరార్థాలు, శ్లేషలు మొదలైనవన్నీ పట్టుకోగలుగుతారు.

పిల్లవాడు భాష నేర్చుకునే, నేర్చిన క్రమాన్ని గమనించిన ఉపాధ్యాయుడు ముందుగా పిల్లవాడికి భాషా విషయక సత్తా ఉంది అని నమ్మాలి. పరిసరాల్లోని ఏ భాషనైనా పిల్లవాడు నేర్చుకోగలడు అని విశ్వసించాలి. ప్రస్తుతం పిల్లవాడు మౌనంగా ఉన్నా... వాడి లోపల ఎంతో 'పదసంపద' ఉందనీ అవసరాన్ని, అవకాశాన్ని, సందర్భాన్ని బట్టి దాన్ని వాడు బయటపెడతాడని నమ్మాలి. ఫ్లాండర్స్ ఇంటరాక్షన్ అనాలిసిస్ ప్రకారం విద్యార్థి తన వాఙ్నైపుణ్యాన్ని అన్యథా వినియోగిస్తున్నాడు తప్ప ఉపాధ్యాయుడి ముందు, తరగతి గదిలో వినియోగించడం లేదు. ఈ పరిస్థితిని మార్చగలిగితే భాషా విషయకంగా విద్యార్థి

చేసే దోషాలను ఉపాధ్యాయుడు సవరించడానికి, విద్యార్థిలో ఆత్మవిశ్వాసం మొదలైన గుణాలు పెంచడానికి అవకాశం దొరుకుతుంది.

భాషా స్వభావం తెలుసుకున్న తర్వాత 'బోధనా లక్ష్యం' మారాలి. భాష అపరిమితత్వాన్ని గమనించిన ఉపాధ్యాయుడు పలు సందర్భాలలో పిల్లవాడు భాషను ఎలా ఉపయోగిస్తున్నాడో గమనించి సామర్థ్యాలను అంచనా వేయాలి. ఆయా సందర్భాలలో పిల్లలు నిర్భయంగా భాషను ఉపయోగించడానికి దోహదపడాలి.

ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గమనించాల్సిన అంశం మరొకటి ఉంది. బళ్ళో చేరడానికి ముందు శిశువు మాట్లాడడంలో చేసే తప్పుల్ని తల్లి, తండ్రి మిగతా ఎవరైనా పనిగట్టుకొని సరిదిద్దడానికి ప్రయత్నం చేయరు. కాని వారి పాటికి వారు సరైన పదాల్ని ఉచ్చరిస్తూ, మాట్లాడుతూ ఉంటారు. వాటిని గమనించి శిశువు తన తప్పులు తానే దిద్దుకుంటాడు. తరగతి గదిలో సరైన (ఉచ్చారణలో స్పష్టత ఉన్న) భాషను ఉపయోగించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం. భాషా వినియోగ సందర్భంలో ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించడానికి ప్రయత్నించాలే తప్ప నిష్కర్షగా ఖండించకూడదు. పై జాగ్రత్తలు తీసుకోగలిగినప్పుడే భాషోపాధ్యాయుడు తన కర్తవ్యాన్ని సరిగా నిర్వహించగలడు.

### పిల్లలు ఎలా నేర్చుకుంటారు? :

నేర్చుకునే సత్తా పిల్లలు జన్మతః కల్గి ఉంటారు. నేర్చుకునే విధానాన్ని మనం పరిశీలించిచూస్తే మనకు చాలా విషయాలు తెలుస్తాయి. పిల్లలు పరిసరాలను పరిశీలిస్తూ, పరిసరాలలో వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటూ తమలో దాగి ఉన్న అంతర్గత శక్తుల్ని వినియోగించుకుంటూ అత్యంత సహజంగా నేర్చుకుంటూ ఉంటారు. ఒకవిధంగా చెప్పాలంటే పిల్లలు బడికి రాకముందే ఎంతో నేర్చుకుని ఉంటారు. ఈ వాస్తవాన్ని విద్యావేత్తలందరూ అంగీకరిస్తున్నారు. ఈ నేర్చుకునే క్రమంలో తప్పులు చేస్తుంటారు. తప్పుల్ని సరిదిద్దుకుంటారు. ఇదే నేర్చుకోవడంలో ఉన్న సహజత్వం. తప్పులు చేయకుండా ఎవ్వరూ పరిపూర్ణంగా ఏదీ నేర్చుకోలేదు. నడక నేర్చుకుంటున్న శిశువును పరిశీలించండి. పడుతూ లేస్తూ, పడ్డప్పుడల్లా ఏడుస్తూ మళ్ళీ లేచి నడవడానికి ప్రయత్నిస్తూ (ఎన్నిమార్లైనా) ఉంటాడు. ఆ బుడిబుడి నడకల్ని చూసి మురిసిపోతాం. మరి అయ్యో నాబిడ్డకు అడుగులెయ్యడమే రావడంలేదే అని దిగులు పడిపోయామనుకోండి ఏమవుతుంది? కోటి అనమంటే కోతి అంటారు మన పిల్లలు. అప్పుడు మనమేం చేస్తాం? అదేమాట మళ్ళీ మళ్ళీ అన్పించి నవ్వుకొంటాం. ముద్దాడుతాం. 'ట' పలకడం రావడంలేదని చెంపలు వాయించామనుకోండి. ఏమవుతుంది?

**ప్రతి తప్పుకూ దండిస్తూ, ప్రతిదాన్నీ తప్పుబడ్తూ నడకనూ, మాటల్నీ మనం నేర్పి ఉంటే ఎప్పటికీ నడకరాదు. మాటలు రావు.**

మరి తరగతి గదిలోనూ అంతే. తప్పు చేస్తున్నారంటే నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అర్థం. తప్పులు చేయడం నేర్చుకోవడంలో భాగం. ఇంట్లో ఒప్పుకున్న దీన్ని బడిలో మనమెందుకు అర్థం చేసుకోం? అంగీకరించం? ఇలా అంగీకరించనందువల్ల జరుగుతున్న నష్టం ఎంత? అడుగడుగునా మనం పిల్లల్ని తప్పుబట్టడంవల్ల, కించబర్చడంవల్ల, చదువురాని, నేర్చుకోలేని మొద్దులుగా చిత్రీకరించడంవల్ల ఎందరో పిల్లలు బళ్ళకు దూరం అవుతున్నారు. బడిబయట ఊహించడానికైనా వీలులేని విషయాల్ని సైతం అలవోకగా అమోఘంగా నేర్చుకుంటున్న పిల్లలు బడిలో అతిచిన్న అంశాల్ని సైతం నేర్చుకోలేకపోతున్నారంటే ఎందువల్ల? ఆలోచించండి.

స్వేచ్ఛాయుత అభ్యసనం పిల్లల్లో సహజసిద్ధంగ నేర్వగలిగే శక్తుల్ని మేల్కొల్పుతుంది. వారు తమచుట్టూ ఉండే భౌతిక, సామాజిక వాతావరణానికి అనుగుణంగా, తమ నిర్దేశిత కర్తవ్యానికి అనుగుణంగా తమ జ్ఞానాన్ని తామే నిర్మించుకునేలా, తమ సామర్థ్యాల్ని తామే పెంపొందించుకునేలా ఇది దోహదం చేస్తుంది. ఇలా జరగాలంటే ముందుగా తమంతట తామే ప్రయత్నించడానికీ, ప్రత్యామ్నాయాలు వెతకడానికీ, తప్పులు దొర్లడానికీ, దొర్లిన తప్పుల్ని తమకు తామే సరిదిద్దుకోవడానికి పిల్లలకు తగినన్ని అవకాశాలు ఉండాలి.

తమను గుర్తించి తమకు విలువనిచ్చే వాతావరణంలో మాత్రమే పిల్లలు నేర్చుకోగల్గుతారు. ఈ వాతావరణం మన పాఠశాలల్లో కల్పించబడాలి. నేర్చుకోవడం ఒక సంతృప్తికర అనుభవంగా కాకుండా భయంతో, క్రమశిక్షణతో, ఒత్తిడితో కూడుకున్నది కావడం అభ్యసన మౌలిక ప్రయోజనానికే ప్రమాదకరం.

## పిల్లల్లో నేర్చుకోవడం ఎలా సంభవిస్తుంది? :

నేర్చుకోవడం ఒక నిరంతర ప్రక్రియ. అనేక విషయాలను పిల్లలు అనేక సందర్భాలలో నేర్చుకుంటారు. తమకు ఆసక్తి కల్గిన విషయాలను తొందరగా నేర్చుకోవడం, ఆసక్తి లేని వాటిని నేర్చుకోవడంలో ఇబ్బందులు పడడం మనం చూస్తూ ఉంటాం. పిల్లలు బళ్ళోనేకాకుండా బడిబయట కూడా నేర్చుకుంటారు. వినడం, చూడడం, చేయడం, చేసి చూడడం, చర్చించడం, ఆటలాడడం వంటి పనుల ద్వారా తామంతట తాముగా నేర్చుకుంటున్నారు. స్థూలంగా పరిసరాలలోని వస్తువులు / సామాగ్రి, తోటివారు, పెద్దలతో పరస్పర ప్రతిచర్యలు జరపడం ద్వారా జరుగుతుంది. ఇక పాఠశాల విషయానికి వస్తే కూడా ఇలాగే జరుగుతుంది. ఇక్కడ పెద్దల స్థానంలో ఉపాధ్యాయులుగా మనముంటాం.

### 1. పిల్లలు సామాగ్రితో ప్రతిస్పందించడం :

పరిసరాలలోని అనేక వస్తువులతో ప్రతి స్పందించడం ద్వారా ఎన్నో నూతన విషయాలను పిల్లలు గ్రహిస్తూ ఉంటారు. వీటిని చూడడం, తాకడం, పట్టుకోవడం, పరిశీలించడం, విప్పిచూడడం, ఆడుకోవడం వంటి సన్నివేశాలలో పాల్గొంటూ ఆయా సందర్భోచిత పదజాలాన్ని, లక్షణాలను, ధర్మాలను, వినియోగాలను పిల్లలు గ్రహిస్తుంటారు.

కాబట్టి ఉపాధ్యాయులుగా మనం వివిధ విషయాలలోని పాఠ్యాంశాలకు అనుగుణంగా సందర్భోచిత సన్నివేశాలలో సామాగ్రిని పిల్లలకు వినియోగించుకునే అవకాశాలు కల్పిస్తే మనం ఆశించినరీతిలో పిల్లలు నేర్చుకుంటారు.

### 2. పిల్లలు – పిల్లలతో పరస్పర ప్రతిచర్యలు పొందడం :

చిన్న పిల్లలను, ఎవరితో గడపడానికి ఎక్కువగా ఇష్టపడ్తారని ప్రశ్నిస్తే తమతోటివారితోనని జవాబిస్తారని మనందరికి తెల్సిన విషయమే. పిల్లలేకాదు మనం కూడా మన సమవయస్కులతో గడపడాన్ని కోరుకొంటాం. దీనికి కారణం ఒకేరీతిలో ఆలోచించడం కావచ్చు. ఒకరిమీద మరొకరికి ఉండే సన్నిహితత్వం, అవగాహన కావచ్చు. ఈ విధమైన సన్నిహితత్త్వం కలిసిపోవడం ద్వారా ఏర్పడుతుంది. ఆడుకోవడం, ఒక దగ్గర కూర్చొని ముచ్చటించుకోవడం, చర్చించుకోవడం, వాదులాడుకోవడం, కలిసి పనిచేయడం వంటి కార్యకలాపాల ద్వారా జరుగుతుంది. ఇలా ఈ కార్యకలాపాలకి చెందిన ప్రక్రియలను తోటివారి మధ్య జరిగే పరస్పర ప్రతిచర్యలుగా పిలుస్తుంటారు. వీటిలో బేషజాలకు, ఎక్కువ తక్కువలకు తావుండదు. ఒకరితో ఒకరు స్వేచ్ఛగా మాట్లాడుతారు. నిర్భయంగా ప్రశ్నిస్తారు. అనుభూతులను, అభిప్రాయాలను పరస్పరం

పంచుకుంటారు. తమ ఆలోచనలకు ఒక సమిష్టి రూపాన్ని ఇస్తారు. ఎదురైన సమస్యలకు, సందేహాలకు సమిష్టిగా పరిష్కారాన్ని కనుగొంటారు. ఇలా జరిగే క్రమంలో ఎన్నో కొత్త విషయాలను అలవోకగా పిల్లలు నేర్చుకుంటుంటారు.

కాబట్టి ఉపాధ్యాయులుగా మనం ప్రాథమికోన్నత స్థాయిలో పిల్లలకు విరివిగా జట్టుపనులు కల్పించాలి. మొహమాటం, భయంలేకుండా తోటివారి మధ్య జరిగే పరస్పర చర్చల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

**3. పిల్లలు – ఉపాధ్యాయుల పరస్పర ప్రతిచర్యలు :**

పాఠశాలలో పిల్లలు తమతోటివారితోనే కాకుండా ఉపాధ్యాయులతో కూడా పరస్పర ప్రతిచర్యలు జరుపుతారు. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమంటే ఉపాధ్యాయులలో తమతో సన్నిహితంగా ఉండేవారితో తమంటే ప్రేమ, ఆప్యాయత, అభిమానం చూపించే వారితో మాత్రమే ప్రతిస్పందిస్తుంటారు. వారితో స్వేచ్ఛగా మాట్లాడడం, వారు మాట్లాడగా వినడం, వారిని ప్రశ్నించడం, చర్చించడం ద్వారా అనేక అంశాలు గ్రహిస్తుంటారు. ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగానూ సంభవిస్తుంటాయి.

**పరస్పరాశ్రిత అభ్యసనం గురించి జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం – 2005 ఏం చెబుతుందో చూద్దాం!**

### ప్రతి చర్యల విలువ / పరస్పరాశ్రిత అభ్యసనం (Interactive Learning)

**చుట్టూ ఉన్న పరిసరాలతో, ప్రకృతితో, వస్తువులతో, ప్రజలతో భాష ద్వారా, కార్యక్రమాల ద్వారా జరిపే ప్రతిచర్య ద్వారా అభ్యసనం సాగుతుంది. గతిశీలమైన భౌతిక చర్యలు, వస్తువుల్ని స్వంతంగా, సహచరులతో కలసిచెయ్యడం, సాధించడం, అభివ్యక్తీకరణ, ప్రశ్నలు, వినడం, చర్చించడంలాంటి భాషా వినియోగం. ఇవన్నీ జ్ఞాన నిర్మాణంలో చాలాకీలకమైనవి. ఏ సందర్భంలో అభ్యసనం జరుగుతున్నదనే దాన్నిబట్టి జ్ఞాన ప్రాధాన్యత ఉంటుంది.**

**మన పాఠశాల అభ్యసనం ఎక్కువగా వ్యక్తి ప్రధానంగా ఉంటుంది. ఉపాధ్యాయుడు జ్ఞాన ప్రసారకర్త. బోధనను పిల్లలు సమాచార ప్రసారంగా భావిస్తారు. ఇది పిల్లల అభ్యసన కోసం ఉపాధ్యాయుడు అనుభవాన్ని క్రోఢీకరించడంగా ఉంటుంది. కానీ పిల్లలు ఉపాధ్యాయులతో, తోటివయస్కులతో, తమకంటే పెద్దలతో, పిన్నలతో, ప్రతిచర్యలు జరపడం ద్వారా ఎక్కువ అభ్యసనావకాశాల్ని పొందగల్గుతారు. ఇతరులతో కలసిమెలసి చర్చించుకొనే క్రమంలోనే నేర్చుకోవాల్సిన లక్ష్యం చేతికందుతుంది. ఇలాంటి అభ్యసనం ఫలవంతంగా జరగాలంటే మన బళ్ళలో వివిధ నేపథ్యాల పిల్లలుండడం అవసరం.**

**పూర్వప్రాథమిక దశలో ఇలాంటి సమిష్టి కృత్యాలు మనమెక్కువగా చేపడుతుంటాం. మాధ్యమిక ఉన్నత తరగతుల్లో కూడా ప్రాజెక్టుల్ని, ఇతర కార్యక్రమాల్ని ఇవ్వడం ద్వారా గ్రూపు కృత్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటి కృత్యాల్ని అంచనా వేసి మూల్యాంకనం చెయ్యడానికి కొన్ని పద్ధతులున్నాయి.**

**వీటిని సమీక్షించి మరింత బలోపేతం చేయాలి. పెద్ద పిల్లలకు తమ అభ్యసన అనుభవాలకు, తగిన ప్రశ్నలివ్వాలి. వీటి ద్వారా వాళ్ళు భావనలను అర్థం చేసుకోగల్గుతారు. జ్ఞానాన్ని నిర్మించుకొని సొంతం చేసుకోగలుగుతారు. ఇప్పుడిప్పుడే మన దృష్టిని వాస్తవ జ్ఞానం వైపు కొద్దికొద్దిగా మరల్చుతున్నాం. ఇది**

**చాలదు. ఉపాధ్యాయుడి సంసిద్ధతతోపాటు, తరగతి గది పద్ధతుల్ని మార్చుకోవడం, పాఠ్యపుస్తకాల్లో మార్పులు, మూల్యాంకనంలో మార్పులు జరిగినప్పుడే పాత పద్ధతుల్ని మనం స్పష్టంగా మార్చుకోగలం. ఏ అంశానికి ఆ అంశం ముక్కలు ముక్కలుగా ఉండే పద్ధతి నుంచి, బయటపడడం ఒక లక్ష్యంగా ఎన్.పి.ఇ.-86 పేర్కొన్నది. ఈ లక్ష్యానికి అనుగుణంగా మనం ముందుకుపోవాలంటే మన ప్రణాళిక సరళతరం కావాలి. మన పాఠ్యపుస్తకాల్లో మార్పురావాలి. వాటిలోని విషయాలు మారాలి. ఇందుకోసం మన ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని, సామర్థ్యాలను పెంచాలి. పిల్లల అభ్యసనానికి తగినట్లుగా ఉపాధ్యాయులు తమ స్వంత ప్రణాళికలను రూపొందించుకోవాలి. బోధనా సంస్కరణలకు సంబంధించిన ప్రయత్నాలు ఇంకా కేంద్రీకృతంగానే ఉన్నాయి. క్లస్టర్లు, బ్లాక్ రిసోర్సు సెంటర్లను మరింత భాగస్వాముల్ని చేయడం ద్వారా సమర్థవంతమైన వికేంద్రీకరణ సాధ్యమౌతుంది. అప్పుడు స్థానికంగా రిసోర్సు పర్సన్స్‌తోపాటు వనరులు, సామాగ్రి ఉపాధ్యాయులకు అందుబాటులోకి వస్తాయి.**

పిల్లలు పరస్పరాశ్రితంగా మూడు విధానాల్లో నేర్చుకుంటారని తెల్సుకున్నాం. స్థూలంగా చెప్పాలంటే పిల్లలు స్థానిక పరిసరాలనుంచి, స్థానిక సమాజం నుంచి నేర్చుకోవడం మొదలుపెడతారు. జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. వారు తమ చుట్టూ ఉన్న పరిసరాలతో జరిపే ప్రతిచర్యవలననే వారి జ్ఞానం అర్థవంతమౌతుంది. అందువల్ల పిల్లలు నేర్చుకోవడంలో పరిసరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రాథమికోన్నతస్థాయిలో బోధనాభ్యసన ప్రక్రియలు కల్పించే సందర్భంలో పరిసరాలను విరివిగా ఉపయోగించుకోవాలి. భాష స్వభావం, పిల్లలు భాషనేర్చుకొనే విధానాన్ని తెలుసుకొన్నాం కదా? జ్ఞాననిర్మాణానికి అనుగుణంగా భాషా బోధనావ్యూహాలు ఎలా ఉండాలి? తరగతుల్లో ఏమేం చేయాలి? అనే అంశాల గురించి తెలుసుకుందాం.

## బోధనా వ్యూహాలు

### 1. KWL వ్యూహం : (What I know? What I want to know? What I learnt?)


**(నాకేం తెలుసు? నాకేం తెలియాలి? నేనేం తెలుసుకున్నాను?)**

ఏదేని ఒక అంశం గురించి చర్చించే ముందు పిల్లల్ని ఆ అంశం గురించి వారికేం తెలుసో అడగాలి. ఇది మొదటి సోపానం తర్వాత ఆ అంశం గురించి వాళ్ళు ఏం తెలుసుకోవాలనుకుంటున్నారో చర్చించాలి. వాళ్ళ అభిప్రాయాలు వినాలి. ఇది రెండవ సోపానం. తర్వాత పుస్తకపఠనం, రిఫరెన్సు పుస్తకాలు చదవడం, కృత్యాల్లో పాల్గొనడం, జట్టుపనుల్లో పాల్గొనడం మూడవ సోపానం. ఇలా చర్చించిన తర్వాత విషయావగాహన అయిన పిదప వాళ్ళకు ఏమి అర్థమైంది ఏమి నేర్చుకున్నారో అడగాలి. ఈ వ్యూహంలో ఒక అంశాన్ని పిల్లలకు పరిచయం చేసేటప్పుడు వాళ్ళకు ఆ అంశంపట్ల ఉన్న పూర్వ జ్ఞానాన్ని, ఆసక్తిని, వారి అవగాహనను నేర్చుకుంటున్నామనే స్పృహతో తెలుసుకోవడం అనేది జరుగుతుంది. ఇందులో ముందుగా ఊహించడానికి, తాము ఊహించినదాన్ని వాస్తవాలతో పోల్చుకోవడానికి, ఆసక్తికరమైన అభ్యసనానికి అవకాశం ఉంటుంది.

### 2. భావనా చిత్రం (Mind / Concept Mapping) :

పిల్లలకు తమ పరిసరాలతో, ప్రతిచర్యలు జరపడం వల్ల ఎంతో అనుభవ జ్ఞానాన్ని పొందుతారు. ఎన్నో విషయాలపట్ల అవగాహనతో తమదైన శైలిలో స్పందిస్తుంటారు. మైండ్ మ్యాపింగ్ అనేది పిల్లల్ని ఒక అంశంపై తమ అవగాహనలు

చెప్పడం, అనుభవాలు పంచుకోవడం, బడిబయట జ్ఞానాన్ని తరగతి గదిలో పంచుకోవడం తద్వారా మొత్తం తరగతి గదిలో అవగాహన పెంచుకోవడం. ఇందుకోసం అంశానికి సంబంధించిన కీలక పదాన్ని నల్లబల్లపై రాసి ఆ పదాల భావనలను అందరితో చర్చించడం జరుగుతుంది. పిల్లల స్వేచ్ఛా అభిప్రాయాలకు ఇందులో స్థానం ఉంటుంది. ఒకే అంశం గురించి పిల్లలను వివిధ కోణాల్లో ఆలోచింపజేయడం, ఆలోచనల సారాన్ని క్రమానుగుణంగా రాయడం ద్వారా వారిలో స్వీయరచనను ప్రోత్సహించడానికి ఈ వ్యూహం ఉపకరిస్తుంది. కింది ఉదాహరణను గమనించండి.




పైన తెల్పిన విధంగా నల్లబల్లపై రాసిన భావనల చిత్రం ఆధారంగా వ్యాసరచన, వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు రాయడం వంటి సామర్థ్యాలు పిల్లల్లోవృద్ధి చెందుతాయి.

### 3. నృత్యాభినయం (Choreography) :

విద్యార్థులు తాము విన్న, చదివిన, తెలుసుకున్న అంశాలను స్వయంగా అభినయంతో నృత్యరూపకంగా ప్రదర్శించడమే కొరియోగ్రఫీ. ఇందులో నృత్యరూపక పాఠ్యాంశాలను ప్రదర్శించడానికి అవకాశముంటుంది. ఇందుకు ముందుగా పాఠ్యాంశాన్ని చదివించి పాత్రలను నిర్ణయించాలి. ఆ పాత్రలు పోషించడానికి పిల్లల్ని ఎంపికచేయాలి. సన్నివేశ దృశ్యాలకు కూడా పిల్లల్ని ఎంపిక చేయాలి. అంటే వృక్షాలు, పొదలు, కొండలు, నీటిమడుగులు వీటిని చూపడానికి కూడా పిల్లల్ని ఎంపికచేయాలి. ఇలా ఎంపికచేసిన పిదప జట్టులో సాధన చేయించాలి. ప్రదర్శించే సమయంలో ప్లేబ్యాక్ పాటను కూడా సాధన చేయించాలి. నృత్యరూపకాన్ని ప్రదర్శింపజేయాలి.

ఉదా : బెల్లంలడ్డూ, ఎలుక విందు లాంటి గేయ కథలు.

ఈ ప్రక్రియలో పిల్లలు చదవడం, చర్చించడం, భావాన్ని గ్రహించడం, తమ అవగాహనకు ఓ రూపాన్నివ్వడం, దాన్ని ప్రదర్శించడం వంటి సామర్థ్యాలు వృద్ధిచెందుతాయి.

### 4. ఏకపాత్రాభినయం (Mono Action) :

ఏదైనా ఒక పాఠ్యాంశంగాని లేదా అందులోని ఒక పాత్ర మాట్లాడిన విషయాన్నిగాని తీసుకొని వ్యక్తిగతంగా, స్వగతంగా విద్యార్థిచేత పాత్రోచితంగా అభినయం చేయించడాన్నే ఏకపాత్రాభినయం అంటారు.

ఉదా : పిసినారి పాపయ్య పాత్ర (నీడ ఖరీదు)

ఏకపాత్రాభినయం వల్ల పాత్ర స్వభావం గురించి, లక్షణాల గురించి అవగాహన ఏర్పడుతుంది.

### 5. మూకాభినయం (Mime) :

మౌనంగా అభినయిస్తూ భావ వ్యక్తీకరణ చేయడమే ముకాభినయం. ఒక సంఘటనగాని, సన్నివేశాన్నిగాని ప్రేక్షకులకు అర్థమయ్యే రీతిలో అభినయించి చూపడాన్ని ముకాభినయం అంటారు. ఇందులో డైలాగులు, బ్యాక్‌గ్రౌండ్‌లు ఉండవు. కేవలం మౌనంగా నటించడమే ఉంటుంది.

ఉదా : 4వ తరగతిలో 'ఎలుకవిందు' కథా సంఘటనను ముకాభినయం చేయవచ్చు.

### 6. జట్టుపనులు నిర్వహించడం (Group Works) :

పాఠాలకు సంబంధించిన కొన్ని అంశాలను జట్టులో నిర్వహించడం ద్వారా పిల్లలలో కలిసి పనిచేయడం, అభిప్రాయాలను పంచుకోవడం, జట్టులో ఒక నివేదిక రాయడమో, అర్థాలు గ్రహించడమో చేయడం. జట్టుపని అనంతరం జట్టుచేత ప్రదర్శింపజేయడం. వివిధ జట్లువారు రాసిన వాటిని ప్రదర్శించినప్పుడు చర్చించడం, వారి వారి జట్టు పనులను సరిచేసుకోవడం జరుగుతుంది. ఈ జట్టుపనుల కింద పాఠ్యపుస్తకంలోని పఠనకృత్యాలు, చదవడం, రాయడం, పదజాలం వంటి వాటిని స్వభావాన్నిబట్టి నిర్వహించాలి. ప్రాజెక్టుపనులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, నివేదికలు రాయడం వంటివి జట్టుపనులుగా చేపట్టాలి.

### 7. ప్రాజెక్టుపనులు (Project Works) :

ప్రాజెక్టుపనులు వివిధ కృత్యాల సమాహారం. ప్రాజెక్టు పనులను ఇంటిపనులుగా ఇవ్వాలి. ఇంటిపనిగా ఇచ్చేముందు ప్రాజెక్టుపనిలో పిల్లలు ఏంచేయాలో, ఎలా చేయాలో సూచనలు ఇచ్చి అర్థం చేయించాలి. ప్రాజెక్టుపని స్వభావాన్నిబట్టి వ్యక్తిగతంగా లేదా జట్టుపనిగా ఇవ్వాలి. జట్టుపనులుగా ఇచ్చేటప్పుడు ఆ ప్రాజెక్టుపనిలో జట్టులోని సభ్యులు ఎవరెవరు ఏమేం చేయాలో స్పష్టంగా బాధ్యతలను కేటాయించాలి. ప్రాజెక్టుపనిని పూర్తిచేసిన తరవాత పిల్లలతో ప్రదర్శింపజేయాలి. పిల్లలు ప్రాజెక్టుపనులను ప్రదర్శించేటప్పుడు దోషాలుంటే సవరించాలి. అవసరమైన సలహాలు, సూచనలు అందించాలి. పిల్లలతో ప్రదర్శనానంతరం ప్రాజెక్టుపనిని ఎలా నిర్వహించారో ఒక నివేదిక రాయించాలి. ఈ నివేదికలో ఎవరెవరు సభ్యులు, ఎవరెవరు ఏ బాధ్యతలను స్వీకరించారు? ప్రాజెక్టుపనికి సంబంధించి వివరాలను ఎలా సేకరించారు? ఏ ఏ విషయాలు అందులో ఉన్నాయి? ఏం నేర్చుకొన్నారు? వంటి సమాచారాన్ని నివేదిక రూపంలో పిల్లలు రాయాలి.

### 8. చర్చలు (Discussions) :

ఒక అంశం గురించి ఎవరెవరు ఏమేమి అనుకుంటున్నారో అభిప్రాయాలను పరచడం, చర్చల్లో పాల్గొనడం.

ఉదా: 1. ఆహారం వృథా ఎలా జరుగుతున్నది? వృథాను అరికట్టడానికి మనం ఏం చేయాలి? (అన్నం - 5వతరగతి)

2. కృష్ణానది మీద నాగార్జున సాగర్, జూరాల, శ్రీశైలం వద్ద ఆనకట్టలు కట్టారు. అట్లాగే గోదావరి మీద శ్రీరాంసాగర్, దవళేశ్వరం వద్ద ఆనకట్టలు కట్టారు కదా! వాటివల్ల లాభమా? నష్టమా? ఎందుకు? చర్చించండి.

### 9. స్వీయ అవగాహన - ప్రదర్శన (Self Understanding - Expression) :

ఏదేని అంశానికి సంబంధించిన విషయాన్ని పిల్లలే తమకు తాము చదివి అర్థం చేసుకొని దాన్ని ఏకపాత్రాభినయ రూపంలోనూ, నాటకీకరణ రూపంలోనూ, తోలుబొమ్మలాట రూపంలోనూ ఇలా ఏ రూపమనేది వాళ్ళే నిర్ణయించుకొని ప్రదర్శించాల్సి ఉంటుంది.

ఉదా: ఎవరు బాధ్యులు పాఠం (4వ తరగతి), ఎలుక విందు (4వ తరగతి), నీడ ఖరీదు (5వ తరగతి), గోపీడప్పుకథ (5వ తరగతి)

### 10. జిగ్ సా విధానం (Zigsaw Technique) :

ఈ విధానంలో ఒక అంశంకు సంబంధించిన విషయాన్ని భాగాలుగా / పేరాలుగా విభజించాలి. అట్లే పిల్లలను జట్లుగా చేయాలి. ఒక్కొక్క జట్టుకు ఒక్కోపేరా భాగాన్ని పంచాలి. ఎవరి భాగాన్ని వాళ్ళు జట్లలో చదువుకోవాలి. పూర్తి అవగాహన చేసుకోవాలి. అందరూ కలిసి వారు చదివిన భాగంపై అనుభవాలను పంచుకొని దానిపై సంపూర్ణ అవగాహనకు రావాలి. తర్వాత ఒక్కొక్క జట్టువారు తాము చదివిన అంశం గురించి వివరిస్తారు. మిగతా జట్లవారు అడిగే సందేహాలను నివృత్తి చేయాలి.

### 11. క్లోజ్ టెస్ట్ విధానం (Cloze Test Technique) :

ఇది చదవడం - అర్థంచేసుకొనే సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడే వ్యూహం. ఇందులో ఒక అంశంలో ప్రతి 5వ పదాన్ని తొలగించి ఇస్తారు. దాన్ని చదువుకొంటూ తొలగించిన స్థానంలోని పదాన్ని ఊహించాలి, నింపాలి.

### 12. సాహిత్య కార్యక్రమాలు (Literature activities) :

పిల్లలను నలుగురు చొప్పున నాలుగు జట్లను చేయాలి. ఒక్కో జట్టుకు భాషాపరమైన అభ్యాసాన్ని కేటాయించాలి. అంటే చదివిన అంశం గురించి ఒక జట్టుకు పదజాలం, సామెతలు వంటివి, ఇంకోజట్టుకు చదివిన అంశంలోని భాష గొప్పతనం గురించి, ఇంకో జట్టుకు చదివిన అంశంపై చిత్రాలు గీయమని, ఇంకోజట్టుకు చదివిన అంశంపై ప్రశ్నలు తయారుచేయమని లేదా వ్యాఖ్యానం రాయమని చెప్పవచ్చు. అంటే ఒకే అంశంపై అన్ని జట్లవాళ్ళు సాహిత్యపరంగా పనిచేస్తారు. భాషకు సంబంధించి ఉత్పత్తి రూపాలు చోటుచేసుకోవాలి. అందరివీ ప్రదర్శింపజేయాలి.

### 13. పుస్తక సమీక్షలు నిర్వహించడం (Book Reviews, Read and reflect) :

పిల్లల పఠనాభిలాషను పెంపొందించడానికి పాఠశాలల్లో గ్రంథాలయ పుస్తకాలను సరఫరాచేశారు. పిల్లల్ని వివిధ సాహిత్య రూపాలలో ఉన్న పుస్తకాలను చదవమనాలి. పిల్లలు చదివిన వాటిపై సమీక్షలు నిర్వహించాలి. సమీక్షలో

- వాళ్ళు చదివిన పుస్తకమేంటి?
- చదివిన అంశంపై అభిప్రాయం చెప్పడం.
- చదువుతున్నప్పుడు వాళ్ళ అనుభూతులను చెప్పించడం.
- చదివిన అంశంలోని పాత్రల గురించి, సంఘటనల గురించి మాట్లాడించడం.
- కవి ఏ ఉద్దేశంతో ఆ అంశాన్ని రాసారో చర్చించడం వంటివి జరగాలి.

పైన సూచించిన వివిధ సాధారణ వ్యూహాలతోపాటు నూతన పాఠ్యపుస్తకాలలో పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలపై అభ్యాసం కల్పించడానికి తరగతిగదిలో సామర్థ్య స్వభావాన్నిబట్టి వ్యూహాలను నిర్వహించాలి. వాటిని చూద్దాం.

## ♦ సామర్థ్యాల వారీగా వ్యూహాలు

### 1. వినడం - ఆలోచించి చెప్పడం :

భాషా సామర్థ్యాలలో వినడం, మాట్లాడడం చాలా ముఖ్యమైనవి. వీటిని ప్రాథమిక నైపుణ్యాలుగా భావిస్తున్నాం. కాని బడికి రాకముందే పిల్లలు వినడం-ఆలోచించి చెప్పే / మాట్లాడే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. బడిలో చేరిన తరవాత స్వేచ్ఛగా మాట్లాడడం, ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, సూటిగా మాట్లాడడం, సందర్భోచితంగా మాట్లాడడం, సరైన పదజాలంతో అర్థవంతంగా, వినసొంపుగామాట్లాడడం గురించి అభ్యసించాలి. అట్లే విన్నదాన్ని అర్థం చేసుకొని తమ అనుభవాలను జోడించి, ఆలోచించి తగురీతిలో మాట్లాడగలగాలి. ఆలోచించి మాట్లాడవలసిన అవసరాన్ని కల్పించడం ద్వారా పిల్లలు విషయాన్ని వినడంపట్ల ఏకాగ్రత చూపుతారు.

**బోధనావ్యూహం :**

వినడం-ఆలోచించి చెప్పడం గురించిన ఏకృత్యమైనా పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. వృత్తాకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు కూడా పిల్లల మధ్య కూర్చోవాలి. అభ్యాసంలోని ప్రశ్నలలో ఒక్కొక్క ప్రశ్న అడగాలి. ఒక ప్రశ్న గురించి పిల్లలందరితో మాట్లాడించాలి. పిల్లలు చెప్పిన విషయాన్ని ఆమోదించాలి. ఖండించకూడదు. పిల్లలు తమ అనుభవాలను, అభిప్రాయాలను జోడించి చెప్పేలా ప్రోత్సహించాలి. పిల్లలు అనేక రకాలైన సమాధానాలు చెప్పేవిధంగా ప్రశ్నలు అడగాలి. పిల్లల సమాధానాలను క్రోఢీకరించి ముగింపు / సమాధానం చెప్పించాలి / చెప్పాలి. తరగతిలో పిల్లల భాగస్వామ్యం అధికంగా ఉండేలా ఉపాధ్యాయుడు మార్గదర్శిలా ఉండాలి. అందరూ మాట్లాడేలా, చర్చలో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ అవకాశాలివ్వాలి. వినడం-మాట్లాడడం అభ్యాసాన్ని కూడా నిర్వహించడానికి ఒక పీరియడ్‌ను ప్రత్యేకంగా కేటాయించుకోవాలి.

### 2. ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం :

ముద్రిత అంశాలు వేటినైనా పిల్లలు ధారాళంగా స్పష్టమైన ఉచ్చారణతో చదవగల్గాలి. చదివిన అంశం గురించి అర్థం చేసుకొని చెప్పగల్గాలి, రాయగల్గాలి. భాషాభ్యసనం యొక్క ముఖ్య లక్ష్యం పిల్లలను భాషాభిమానులుగా, స్వతంత్ర పాఠకులుగా తయారుచేయడం. కాబట్టి పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించడం కోసం పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు తోడ్పడాలి.

పాఠశాల పిల్లల పఠనాభిరుచిని ఉన్నత శ్రేణికి తీసుకొని వెళ్ళాలి. పఠనావగాహనను పెంపొందించాలి. విభిన్న ప్రక్రియలతో కూడిన పాఠాలను పిల్లలకు పరిచయం చేయడం వైవిధ్యభరితమైన అభ్యాసాలవల్ల వారు పాఠ్యపుస్తకాలకతీతమైన ప్రగతిని సాధిస్తారు. ఇలా చదవడంపై పట్టు కలిగిన పిల్లలే తప్పుల్లేకుండా రాయగల్గుతారు. చక్కటి పదాలను సందర్భోచితంగా మాట్లాడడంలో లేదా రాయడంలో వినియోగిస్తారు.

**బోధనావ్యూహం :**

చదవడం కోసం ఇచ్చిన కృత్యాలు పూర్తి తరగతిగది కృత్యంగా లేదా వ్యక్తిగతంగా లేదా జట్టు కృత్యంగా అభ్యాసాల కాఠిన్యతా స్థాయినిబట్టి నిర్వహించాలి. ప్రతి అభ్యాసాన్ని పిల్లలతో మొదట వ్యక్తిగతంగా చదివించాలి. ఏం చెయ్యాలో పిల్లలతోనే చెప్పించాలి. పాఠంలో గుర్తించేవి, పిల్లలతో వ్యక్తిగతంగా చేయించడానికి ముందు ఎలా చేయాలో సూచనలు ఇచ్చి అవగాహన చేయించాలి. తప్పొప్పులను గుర్తించడం, జతపరచడం, ఎవరు ఎవరితో అన్నారు? వంటి అభ్యాసాలను పూర్తి తరగతిలో అడగాలి. పిల్లలు చెప్పినది బోర్డుపై రాయాలి. పుస్తకాలలో రాసుకోమనాలి. చర్చించిన తరవాత జట్లలోగానీ

వ్యక్తిగతంగాగానీ రాయించాలి.. మొదటి 45 నిమిషాలలో అవగాహన కల్పించేలా కృత్యాల నిర్వహణ జరగాలి. రెండవ 45 నిమిషాలలో పిల్లలు వ్యక్తిగతంగా రాసేట్లు చూడాలి.

### 3. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన) :

రాయడమంటే తప్పుల్లేకుండా రాయడం మాత్రమే కాదు. తాను విన్న లేదా చదివిన లేదా తెల్సిన విషయానికి తన అభిప్రాయం జోడించి సొంతంగా రాస్తేనే దాన్ని రాయడంగా భావించాలి. రాయడంలో పిల్లలు అంశాన్ని ఒక క్రమంలో, సంపూర్ణ వాక్యాలతో అర్థవంతంగా రాయాలి. అంశానికి తగిన పదజాలాన్ని ఉపయోగించి రాయగలగాలి. భావం, వాక్య నిర్మాణం, సరైన పదజాల వినియోగం ఉపయోగించి రాసినప్పుడే రాయడం ఫలవంతమైనదిగా భావించాలి.

పిల్లల్లోగల ఆసక్తిని పాఠశాలల్లో ప్రేరేపించి వారు స్వేచ్ఛగా రాయడాన్ని ప్రోత్సహించాలి. తద్వారా మరింత వేగంగా రాయడం నేర్చుకుంటారు. ప్రాథమిక తరగతుల్లో పిల్లలు స్వేచ్ఛగా వీలైనంత ఎక్కువ రాసేలా దృష్టిపెట్టడం, తప్పులు దిద్దడమే ప్రధానాంశం కారాదు. రాయడాన్ని ప్రోత్సహిస్తూ వారి దోషాలను వారే గుర్తించేలాచేయాలి. తరగతిలో చర్చ ద్వారా సరిదిద్దాలి. పిల్లలు బాల్యంలో మాట్లాడేటప్పుడు దోషాలు దొర్లుతుంటాయి. సరైన భాషావాతావరణంలో పాల్గొనడం ద్వారా కాలక్రమంలో వారి దోషాలను వారే సవరించుకొని చక్కగా మాట్లాడడాన్ని ఒడిసి పట్టుకొంటారు. ఈ ప్రక్రియంతా సుమారు ఆరు నెలల కాలంలో చోటుచేసుకొంటుంది. ఒకటిన్నర సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వయస్సులో జరుగుతుంది. అట్లే రాయడం కూడా! పిల్లలు రాయడాన్ని ప్రోత్సహించాలి. రాయడం అలవాటయ్యేలా పిల్లలతో రాయించాలి. తెల్సిన వాటి గురించి, చూసిన వాటి గురించి, విన్నవాటి గురించి, చదివిన వాటి గురించి సొంతంగా రాయమనాలి. రాసిన వాటిని సరిగా ఎలా రాయవచ్చో తరగతిలో ప్రతీరోజూ చర్చిస్తే కొంతకాలానికి రాయడంలో దొర్లే తప్పులను పిల్లలే తమంతటతాముగా సరిదిద్దుకొంటారు.

**బోధనావ్యూహం :**

తరగతి గదిలో స్వీయరచన ప్రశ్నలకు జవాబులు రాసేముందు పూర్తి తరగతి కృత్యంగా ప్రశ్నలపై చర్చ నిర్వహించాలి. ముందుగా ప్రశ్నల్ని నల్లబల్లపై రాయాలి. పిల్లల్ని ప్రశ్నలను చదవమనాలి. ఒక్కో ప్రశ్నను తీసుకొని పిల్లలతో మాట్లాడించాలి. అనుబంధ ప్రశ్నలు వేస్తూ సమాధానాన్ని రాబట్టాలి. ఇలా మేథోమథనం ద్వారాప్రశ్నలను గురించి చర్చించాలి. పిల్లలను జట్లుగా చేసినప్పుడు ప్రశ్నల సమాధానాలు తోటి పిల్లలతో చర్చించుకొంటూ రాయమనాలి. జట్లలో పనిచేస్తున్న సమయంలో ఉపాధ్యాయుడు అందరూ పాల్గొనేలా చూస్తూ అవసరమైనచోట సహకరించాలి. పిల్లలు చేసిన జట్టుపనిని ప్రదర్శింపజేయాలి. పిల్లలు రాసిన సమాధానాలను సరిచేయాలి. ఇందుకోసం పిల్లల్లో ఎవరైనా రాసిన సమాధానాన్ని లేదా ఏదైనా జట్టురాసిన సమాధానాన్ని నల్లబల్లపై లేదా చార్టుపై ఉన్నదున్నట్లుగా రాయాలి. ఇలా రాసిందాన్ని పూర్తి తరగతిగదిలో చదవించాలి. దోషాలపై కింది ప్రశ్నల ద్వారా చర్చ నిర్వహించాలి.

- భావం సరిగా రాశారా?
- సరైన క్రమంలో రాశారా?
- సరైన వాక్యాలు రాశారా. వాక్యాలు పూర్తిగా రాశారా?
- వాక్యాలలో పదాలు సరిగా ఉన్నాయా? ఉన్న పదాల స్థానంలో ఇంకా మంచి పదాలను రాయవచ్చా?
- అక్షరదోషాలు ఏమైనా ఉన్నాయా? ఏయే అక్షరాలను సరిగా రాయాలి?

ఇలా చర్చ ద్వారా జవాబును సరిచేయాలి. ఈ జవాబుతో పిల్లలు తాము రాసిన జవాబును పోల్చి సరిచూసుకొంటారు. సవరించేలా పూర్తి తరగతి కృత్యంగా ఎడిటింగ్‌ను నిర్వహించాలి. ఆ తరవాత జవాబును రాయమనాలి. ఇందుకోసం మొదటి 45 నిముషాలలో ప్రశ్నల గురించి మాట్లాడడం, మాట్లాడించడం, జట్లలో వ్యక్తిగతంగా రాయించడం, సరిదిద్దడం జరగాలి. తరవాత 45 నిముషాల్లో పిల్లలతో వ్యక్తిగతంగా రాయించాలి.

## 4. పదజాలం :

భాష అంటే పదజాల సమూహం. పదజాలం ఎంత సంపాదిస్తే భాషపై అంతపట్టు పెరుగుతుంది. పదాలను అర్థవంతంగా వ్యాకరణబద్ధంగా వినియోగిస్తే భాషగా మారుతుంది. భావ వినిమయం జరుగుతుంది.

విద్యార్థులకు పదజాలాన్ని సందర్భానుసారంగా వినియోగించడంపై అభ్యాసం కల్పించాలి. వివిధ సందర్భాలలో ఒకేపదం వేరువేరు అర్థాలిస్తుంది. వీటిని గుర్తించి అర్థం చేసుకొనేలా ప్రోత్సహించాలి. పదజాల వినియోగంపై విద్యార్థి పట్టు సాధించినప్పుడే ఏ విషయాన్నైనా వినసొంపుగా, రసవత్తరంగా, వ్యక్తీకరించగలడు. సృజనాత్మకంగా, రసాత్మకంగా రాయగలరు.

**బోధనావ్యూహం :**

పదజాలానికి సంబంధించిన అభ్యాసాల గురించి సూచనలిచ్చి అవగాహన కల్పించాలి. వ్యక్తిగతంగా లేదా అభ్యాసాల కాఠిన్యతా స్థాయినిబట్టి జట్టుపనిగా కూడా నిర్వహించవచ్చు. సమాధానాలు రాయమనాలి. పిల్లలు రాసిన వాటిని ప్రదర్శింపజేయాలి. పిల్లలు చెప్పిన దాన్ని నల్లబల్లపై రాయాలి. చర్చ నిర్వహించాలి. పిల్లలు చెప్పలేకపోయిన సందర్భాలలో ఉపాధ్యాయుడు సందర్భోచిత ప్రయోగాలద్వారా ఆ పదజాలాన్ని అర్థం చేయించాలి.

## 5. సృజనాత్మకత :

పిల్లల్లో ఊహాశక్తి, కల్పనాశక్తి అనంతంగా ఉంటాయి. పిల్లల్లోని ఈ శక్తి వెలికి తీయడానికి తగిన భాషా వాతావరణాన్ని తరగతి గదుల్లో కల్పించాలి. భాష కేవలం ఒక వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు. భాష సజీవమైనది. దానికొక లయ ఉంటుంది. దానిని అర్థం చేయించినప్పుడు పిల్లల్లో సృజనాత్మక ఆవిష్కరణకు వీలు కలుగుతుంది. సొంతంగా రాసే సామర్థ్యం సృజనాత్మకతకు మరింత దోహదపడుతుంది. ఈ సృజనాత్మక వ్యక్తీకరణ మౌఖిక రూపంలో, రాత రూపంలో మరియు ప్రదర్శన రూపంలో ఉంటుంది. స్వాభావికంగా, అంతర్లీనంగా పిల్లల్లో ఉండే సృజనాత్మకతను వెలికితీసేలా పాఠశాల తోడ్పడాలి. భాషాబోధనా లక్ష్యాలలో భాషా నైపుణ్యాల సాధనతోపాటు సృజనాత్మకత, కల్పనా శక్తులు వెలికితీయడం అతి ముఖ్యమైనవిగా గుర్తించాలి.

**బోధనావ్యూహం :**

ఈ సామర్థ్యాన్ని మొదట పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. తగిన సూచనలు ఇవ్వాలి. ఇచ్చిన అంశంపై ఆలోచింపజేసి స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ చెప్పేలా ప్రోత్సహించాలి. అవసరమైనచోట ఆధారాలను ఇచ్చి ఆలోచింపజేయాలి. అవగాహన కల్పించాలి. తరవాత పిల్లలను జట్లుగా విభజించి, చర్చించమనాలి, రాయమనాలి. జట్లలో చేసిన పనులను ప్రదర్శింపజేయాలి. వీటిని ప్రదర్శిస్తున్నప్పుడు ఉపాధ్యాయుడు పూర్తి తరగతిలో చర్చ నిర్వహించడం ద్వారా సలహాలు, సూచనలు అందజేయాలి. రాసిన సృజనాత్మక అంశాన్ని సరిచేయాలి. 'స్వీయరచన' ప్రశ్నలను సరిదిద్దిన విధంగా పూర్తి తరగతిలో నిర్వహించాలి. తరవాత వ్యక్తిగతంగా రాయమనాలి. పిల్లలు రాసిన వాటిని సంకలనంచేసి 'మా సృజనాత్మకత'

అని ఒక పుస్తకంలా తయారుచేయాలి. ప్రతీ పాఠానికి పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలతో ఒక పుస్తక సంకలనం తయారుచేసి తరగతి గదిలో ప్రదర్శించాలి. వీటిని నిర్వహించడానికి మొదటి 45 నిమిషాలలో అవగాహన కల్పించడం, జట్లలో రాయించడం, సరిదిద్దడం జరగాలి. తరవాత 45 నిమిషాలలో పిల్లలతో వ్యక్తిగతంగా రాయించాలి.

## 6. ప్రశంస :

విద్యార్థులలో సానుకూల దృక్పథాన్ని అలవర్చడానికి, తగు విధంగా స్పందించడానికి ఈ సామర్థ్యం ఎంతగానో దోహదపడుతుంది. జంతువులు, మొక్కలపట్ల పిల్లలు సానుభూతిని కలిగి ఉండడంతోపాటు ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలు, ముసలివాళ్ళకు తగిన సహాయం, సహకారం చేయగలిగేలా తయారవ్వాలి. అదే మాదిరిగా ఇతర భాషలు, సంస్కృతులు, పండుగలు, సంప్రదాయాలను గౌరవించేలా, గొప్పదనాన్ని గుర్తించి అభినందించే వైఖరి పిల్లల్లో పెంపొందేలా చూడాలి. పిల్లలు ఎదుటి వారిలోని గొప్పదనాన్ని గురించి ప్రశంసించాలి. దీనివల్ల విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం రూపుదిద్దుకొంటుంది.

**బోధనావ్యూహం :**

దీన్ని ముందు ఇంటి పనిగా ఇవ్వాలి. ఆపై పునశ్చరణలో భాగంగా పిల్లల్ని ప్రశంస ప్రశ్నపై మాట్లాడింపజేయాలి / ప్రదర్శింపజేయాలి. ప్రతి విద్యార్థిని ప్రశ్నించాలి. పిల్లల సమాధానాల్ని క్రోఢీకరించి ముగింపు ఇవ్వాలి. వ్యక్తిగతంగా రాయమన్న వాటిని రాయించాలి. పిల్లలు రాసిన ప్రశంసకు సంబంధించిన అంశాలతో పుస్తక సంకలనం తయారుచేయాలి. ఇలా రూపొందిన పుస్తక సంకలనాన్ని తరగతిలో ప్రదర్శించాలి. ప్రతీ పాఠానికి ఒక సంకలనం తరగతి గదిలో అందుబాటులో ఉంచాలి.

## 7. భాషను గురించి తెలుసుకుందాం :

తమ పరిసరాలలో అర్థవంతమైన సందర్భోచిత సన్నివేశాలలో పాల్గొనడం ద్వారా తమకున్న సామర్థ్యాన్ని వినియోగించుకొని, పిల్లలందరూ భాషను అత్యంత సహజంగా సులువుగా పొందుతున్నారు. అందుకే పాఠశాలకు రాకముందే పిల్లలు తమ పరిసరాల్లోని భాషను ఎంతో సులువుగా గ్రహించి సందర్భోచితంగా వినియోగిస్తున్నారు.

పాఠశాలలో భాష నేర్పడంలో ఉద్దేశం పిల్లవాడు కొత్తగా ఆలోచించగలగాలి. వాటిని క్రమబద్ధంగా వ్యక్తీకరించగల్గాలి. సృజనాత్మకంగా చెప్పగల్గాలి. రాయగల్గాలి. ఈ సామర్థ్యం ద్వారా విద్యార్థులలో భాషాభాగాలు, కాలాలు, విరామచిహ్నాలను ఉపయోగించలిగేలా, కాలాలకు అనుగుణంగా క్రియలను గుర్తించి ఉపయోగించగలిగేలా చేయాలి. అందుకు పిల్లల మెదడు వాటిని స్వయంగానే సూత్రీకరించుకొంటున్నది. దీనిని తరగతి గదిలో బలోపేతం చేయడానికి అభ్యాసం చేయించాలి.

**బోధనావ్యూహం :**

'భాషను గురించి తెలుసుకుందాం' అభ్యాసాలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. అభ్యాసంలోని అంశాన్ని పిల్లలతో చర్చిస్తూ అవగాహన చేయించాలి. ఉదాహరణలను పిల్లలతో చెప్పించాలి. ఉదాహరణల ద్వారా సూత్రాన్ని గ్రహించేలా / అర్థం చేసుకొనేలా చేయాలి. పిల్లలను జట్లలో కూర్చోమని నేర్చుకొన్న భాషాంశాలపై ఉదాహరణలు రాయించాలి. పిల్లలతో ప్రదర్శింపజేయాలి. పిల్లలు చెప్పిన ఉదాహరణలను నల్లబల్లపై రాయాలి. వ్యక్తిగతంగా నోటుపుస్తకాల్లో రాయించాలి. వీటిని అర్థం చేయించడానికి మొదటి 45 నిమిషాల సమయాన్ని వినియోగించాలి. తరవాత 45 నిమిషాలలో వీటిని పిల్లలతో వ్యక్తిగతంగా రాయమనాలి.

### ♦ నేనివి చేయగలనా?

పాఠ్యపుస్తకాలు పిల్లలు నేర్చుకోవడానికి తోడ్పడే సాధనం. తమ పిల్లలు ఏం నేర్చుకొంటున్నారు? ఎంత వరకు నేర్చుకొంటున్నారు? అని తల్లిదండ్రులు తెలుసుకోవడానికి ఉపయోగపడే సాధనం కూడా! సాధారణంగా ఒక పాఠం పూర్తయిందా లేదా అనే విషయం తల్లిదండ్రులకు తెలుస్తుంది. పిల్లలైనా చెప్పగల్గుతారు. అయితే ఇటు పిల్లలకు, అటు వారి తల్లిదండ్రులకు ఒక పాఠం పూర్తయిన పిదప ఏం నేర్చుకొన్నారు? అని తెలుసుకొనే అంశం గత వాచకాల్లో లేదు. ఎందుకు బోధిస్తున్నారో ఉపాధ్యాయులకు మాత్రం తెలిసి ఉంటుంది. తాము అనుకున్న ఈ లక్ష్యాలు తరగతిగదిలో ఎంతశాతం మంది చేయగలరు? అనే అంశంపై సాధారణంగా దృష్టిపెట్టడం చాలా అరుదుగా జరుగుతుంది. వీటిని దృష్టిలోపెట్టుకొని పిల్లలు ఒక పాఠం పూర్తయిన పిదప తామేమి నేర్చుకున్నారో? తమనుతాము స్వంతంగా అంచనావేసుకోవడానికి అనగా స్వీయ మూల్యాంకనం చేసుకోవడానికి వీలుగా భాషా సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకొని "నేనివి చేయగలనా?" అభ్యాసాలు రూపొందించారు. దీని ఆధారంగా ఉపాధ్యాయులు కూడా సామర్థ్యాల వారీగా పిల్లల స్థాయిని అంచనావేయడానికి అవకాశం లభిస్తుంది. అట్లే తల్లిదండ్రులకు కూడా బోధించిన పాఠం ద్వారా తమ పిల్లలు ఏ సామర్థ్యాలు పొందారో తెలుసుకోవడం సాధ్యమవుతుంది.

**వీటిని ఎలా నిర్వహించాలి? :**

నేనివి చేయగలనా? లోని ఒక్కొక్క వాక్యాన్ని తరగతిలో చదివి వినిపించాలి. పిల్లలు వాటిని చేయగలిగితే 'ఔను' వద్ద, చేయలేకుంటే 'కాదు' వద్ద '✓' గుర్తును పెట్టమనాలి. తరవాత ఒక్కొక్క అంశాన్ని ఎంతమంది '✓' గుర్తుపెట్టారో చేతులెత్తమనాలి. చేతులెత్తినవారి సంఖ్యను లెక్కించాలి. ఒక అంశంలో 80% కంటే తక్కువ మంది చేతులెత్తితే దానిపై పునరభ్యాసం కల్పించాలి.

**ముగింపు :**

భాషాబోధన మూసపోసినట్లుగా, యాంత్రికంగా ఉండకూడదు. భాష అంటేనే ఆలోచించడం, వ్యక్తీకరించడం పిల్లలు ఎప్పటికప్పుడు ఆలోచిస్తూ తమ అనుభవాలను విభిన్న రూపాలలో వ్యక్తపరచడానికి వీలుగా భాషాబోధన వ్యూహాలు, సోపానాలు ఉండాలి. పిల్లలందరూ పాల్గొనేలా, చర్చించుకునేలా, ప్రదర్శించేలా, వ్యక్తీకరించేలా ఈ వ్యూహాలు ఉండాలి. ప్రతీరోజూ భాషాబోధనకు కేటాయించిన పీరియళ్ళలో పీరియడ్ వారీ ప్రణాళికలో ఇటువంటి వ్యూహాలతో పిల్లలకు ఉత్సాహం, ఉత్సుకత పెంపొందించేలా నిర్వహించాలి. సందర్భాన్ని, బోధనాంశాన్ని బట్టి తమ వ్యూహాలను మార్చుకోవాలి.

*పిల్లలు పాఠశాలల్లో చేరినప్పటి నుండి అక్కడి వాతావరణంలో వాత్సల్యానుగుణంగా శ్రద్ధతో కూడిన సంరక్షణ ఉన్నప్పుడే భద్రత ఉందని భావిస్తారు. ముఖ్యంగా తమకు ఉపాధ్యాయులతో ఉన్న సంబంధంలో భద్రత ఉన్నదని భావిస్తే విద్యార్థులు స్వేచ్ఛగా, సున్నితంగా, నిష్కపటంగా స్పందించగలరు. వారి విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగుతుంది. అప్పుడే వారు పాఠ్యవిషయాలతోపాటు వారి చుట్టూ జరుగుతున్న వాటిపట్ల కూడా సహజమైన కుతూహలం, శ్రద్ధ చూపుతూ ఉత్సాహంగా వాటి గురించి నేర్చుకొంటారు. స్వేచ్ఛగా ప్రశ్నిస్తారు. స్వతంత్రంగా ఆలోచిస్తారు, చర్చిస్తారు. అందువల్ల మనకున్న ప్రధానమైన సమస్య పిల్లలను ఎలా విద్యావంతులను చేయాలన్నదికాదు. ఉపాధ్యాయులను ఎలా విద్యావంతుల్ని చేయాలన్నదే!*

*- జిడ్డు కృష్ణమూర్తి*

# 6

# బోధనా సోపానాలు

బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా జరగాలి. నూతన పాఠ్యపుస్తకాలు సోపాన క్రమం ప్రకారం బోధించడానికి అనుకూలంగా రూపొందించాలనే విషయాన్ని మీరు తెలుసుకొన్నారు కదా! వీటిని తెల్సుకోడానికి ముందు పాఠంలోని విషయం అమరిక వాటి ప్రాధాన్యత గురించి ఆలోచించండి.

## I. ఉన్ముఖీకరణ :

ఉన్ముఖీకరణ అంటే పాఠం పేరు రాబట్టడానికి అడిగే ప్రశ్నలు, జవాబులు చెప్పించే కార్యక్రమం కాదు. పిల్లలను మానసికంగా నేర్చుకోడానికి సిద్ధమయ్యేలా చేయడం, ఇతివృత్తం పట్ల, ప్రధానాంశం పట్ల ఆలోచింపజేయడం, ఇందుకోసం నూతన వాచకాల్లోని ప్రతీపాఠం ప్రారంభంలో పిల్లలను సంసిద్ధులను చేయడానికి వీలుగా పాఠ్యాంశ ఇతివృత్తానికి సంబంధించిన చిత్రం ఉంది. దీనికి సంబంధించి పిల్లలు ఆలోచించేలా ప్రశ్నలు కూడా ఉన్నాయి. ఈ ప్రశ్నలు అడుగుతూ వాటిని గురించి చర్చింపజేస్తూ పాఠం పట్ల పిల్లల్ని సంసిద్ధులను చేయడానికి ఇవి ఉపకరిస్తాయి. ఇదే క్రమంలో బోధింపబోయే పాఠ్యాంశానికి సంబంధించిన 'పూర్వజ్ఞానం' ఏదైనా విద్యార్థులలో ఉందా? తెలుసుకోవడానికి తద్వారా నేటి పాఠ్యాంశాన్ని పరిచయం చేయడానికి పిల్లలు నిర్భయంగా స్వేచ్ఛగా, ఆలోచిస్తూ తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి, వారిలో వాచికచర్యను పెంపొందిస్తూ సమర్థంగా మాట్లాడడం, వ్యక్తిగత భాగస్వామ్యం పొందడానికి దోహదపడతాయి.

ఉదా:- ఇందులో చిత్రాన్ని గురించి మాట్లాడింప చెయ్యాలి. చిత్రంలో ఏమేమి ఉన్నాయి? ఎవరెవరు ఏం చేస్తున్నారు? పాత్రల మధ్య సంభాషణ ఎలా ఉంటుంది? వారి స్థానంలో మీరుంటే ఏం చేస్తారు? వంటి ప్రశ్నల ద్వారా చర్చతో ఉన్ముఖీకరణ చేసి పాఠంవైపు ఆలోచింపజేసి పాఠాన్ని పరిచయం చేయాలి. పాఠాన్ని ప్రారంభించిన మొదటి పీరియడ్‌లో దీన్ని నిర్వహించాలి. మిగతా పీరియళ్ళలో ఉన్ముఖీకరణకు బదులుగా పునశ్చరణను నిర్వహించాలి. అంటే ముందురోజు బోధించిన / చర్చించిన అంశాలను స్పృశిస్తూ, చర్చ నిర్వహించడం లేదా అవగాహనను పరిశీలించడం జరగాలి. ఇందుకోసం ఒక పీరియడ్‌ను కేటాయించుకోవాలి. అనగా పాఠం ప్రారంభమయ్యేది మొదటి పీరియడ్‌లో అని అర్థం.

## II. పఠన కృత్యాలు – అర్థసంగ్రహణ :

ఉన్ముఖీకరణ ద్వారా పాఠంవైపు ప్రేరేపితులైన పిల్లలు పాఠంలోని విషయాలపై ప్రాథమిక అవగాహన పొందడానికి పాఠాన్ని చదివించడం ఈ సోపానం యొక్క ముఖ్య ఉద్దేశం. పిల్లలు పాఠాన్ని చదివే క్రమంలో తమకు అర్థంకాని పదాలను గుర్తించడం జరుగుతుంది. ఈ సోపానంలో పలకరింపు, పునశ్చరణ జరిగిన తరవాత కింది కృత్యాలు నిర్వహించాలి :

- ♦ పాఠ్యాంశ చిత్రం గురించి మాట్లాడించడం.
- ♦ పిల్లలచేత పాఠాన్ని ప్రకాశపఠనం (బాహ్యపఠనం) చేయడం.
- ♦ ఉపాధ్యాయుడు ఆదర్శపఠనం చేయడం.
- ♦ పిల్లల మౌనపఠనం – అర్థంకాని పదాల కింద గీతగీయడం.
- ♦ పదాల అర్థాలను గురించి తెలుసుకోవడానికి నిఘంటువును చూడడం (వ్యక్తిగతంగా)
- ♦ పదాల అర్థాలను తోటివారితో జట్లలో చర్చించడం.
- ♦ ఉపాధ్యాయుడు సందర్భోచిత వాక్యాలతో పదాలపై అవగాహన కల్పించడం మొదలగునవి.

పఠన కృత్యాల నిర్వహణ వల్ల పాఠ్య విషయంపై ప్రాథమిక అవగాహన కల్గుతుంది. పాఠంలోని విషయాన్ని భావాన్ని గ్రహించడానికి, ఊహించడానికి పైన తెల్పిన కృత్యాలను నిర్వహించాలి.

## III. పాఠ్యాంశబోధన – చర్చ – అవగాహన :

పాఠ్యాంశ బోధన అంటే పాఠంలోని విషయం గురించి చర్చించడం, విభిన్న కోణాల్లో ఆలోచించడం, పాఠంలోని విషయాన్ని విశ్లేషించడం వంటివి జరగాలి. కానీ గతంలో పాఠం బోధించడం అంటే పాఠంలోని విషయానికి సంబంధించిన పదాల అర్థాలను వివరించడం, అందులోని వ్యాకరణాంశాలను చెప్పడం, పేరా, పేరా వివరిస్తూ పోవడం అనేది జరిగేది. కాబట్టి పాఠం బోధించేటప్పుడు పిల్లలకు ఆ పాఠ్యాంశ విషయంలోని కీలకభావనలపై అవగాహన కలగాలి అందుకోసం పిల్లల్ని ఆలోచింప జేసే ప్రశ్నలు అడగాలి, పిల్లల పూర్వజ్ఞానాన్ని అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలి, ప్రశ్నించాలి, స్వేచ్ఛగా చర్చలో పాల్గొనాలి. ఇలా పిల్లలతో చర్చించుకుంటూ విషయబోధన జరగాలి. బోధించేటప్పుడే ఆ విషయం గురించి పిల్లలు బహుకోణాల్లో విశ్లేషిస్తూ, ఊహిస్తూ, ఆలోచించి ప్రతిస్పందించాలి. ఇందులో ప్రధానంగా సోపానాలు కింది విధంగా ఉంటాయి.

- ♦ పలకరింపు
- ♦ పునశ్చరణ
- ♦ పిల్లల బాహ్యపఠనం
- ♦ ఉపాధ్యాయుని ఆదర్శపఠనం
- ♦ పిల్లల మౌనపఠనం
- ♦ కీలకభావనలపై ఆలోచింపజేసే ప్రశ్నలు అడగడం
- ♦ పిల్లలందరినీ భాగస్వాములను చేస్తూ చర్చించడం
- ♦ పిల్లల అవగాహన – పరిశీలన
- ♦ ఆరోజు చర్చించిన పాఠ్యభాగంపై ప్రశ్నించడం ద్వారా పిల్లల అవగాహనను తెలుసుకోవడం.

ఇలా పాఠ్య బోధనకోసం నిర్ధారించుకున్న 3 లేదా 4 పీరియళ్ళలో పాఠ్యాంశ విషయంపై పిల్లలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం అంటే విషయంలోని కీలకభావనలను, సంఘటనలను, కవి యొక్క ఉద్దేశాన్ని, పాత్రల స్వభావాలను, సన్నివేశ సంబంధిత అంశాలను ఆలోచనలతో, విశ్లేషించి, చర్చించి అవగాహన పొందుతారు.

## IV. సామర్థ్యాల సాధన - ఇవిచేయండి అభ్యాస నిర్వహణ :

పాఠ్య విషయంపై పూర్తి అవగాహనపొందిన పిల్లలు ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల సాధనపై దృష్టిపెట్టాల్సి ఉంటుంది. మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్టు పాఠాన్ని బోధించడం అంటే ఉన్ముఖీకరణ నుండి నేనివిచేయగలనా? వరకు ఉన్న అన్ని అంశాలను బోధనలో భాగంగానే భావించి నిర్వహించడం. భాషా సామర్థ్యాలైన వినడం-ఆలోచించి మాట్లాడడం, చదవడం-అర్థంచేసుకొని వ్యక్తీకరించడం, ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన), పదజాలాభివృద్ధి, సృజనాత్మక వ్యక్తీకరణ, ప్రశంస, భాషాంశాల కింద ఇచ్చిన అభ్యాసాలను తరగతి గదిలో అవగాహన కల్పించాలి. ఈ సామర్థ్యాలపై అభ్యాసాలు 'ఇవిచేయండి' శీర్షికతో ఉన్నాయి. ప్రతి అభ్యాసాన్ని ముందుగా పూర్తి తరగతి కృత్యంగా విద్యార్థులకు ఎలా చేయాలో సూచనలు ఇవ్వాలి. అంటే పిల్లలను పలకరించడం, పునశ్చరణ జరిగిన తర్వాత కింది పనులను నిర్వహించాలి.

- ముందుగా అభ్యాసాన్ని పిల్లలతో చదివించాలి.
- ఏమి చేయాలో వాళ్ళతోనే చర్చించి తగిన సూచనలు ఇవ్వాలి.
- సామర్థ్య స్వభావాన్ని బట్టి తగిన నిర్వహణ వ్యూహాన్ని ఎంపిక చేసుకోవాలి.
- పిల్లల్ని వ్యక్తిగతంగాగాని, జట్టులోగాని అభ్యాసాలను చేయమనాలి.
- పిల్లలు చేసిన అభ్యాసాలను ప్రదర్శింపజేయాలి.
- పిల్లలు ప్రదర్శించిన వాటిపై చర్చ నిర్వహించాలి.
- అనంతరం పిల్లలతో చర్చించుకుంటూ సరిచేయాలి.
- సరిచేసిన అనంతరం నోటుపుస్తకాల్లో రాయమనాలి.

పై విధంగానే ప్రాజెక్టుపనులు చేయడానికి కూడా సూచనలు ఇచ్చి పిల్లలతో చేయించాలి. ప్రదర్శింపజేయాలి. నివేదికలు రాయించాలి.

ఈ అభ్యాసాల నిర్వహణలో ఉపాధ్యాయుడు కేవలం ఒక సౌకర్యకర్తగా ఉంటూ పిల్లలు నేర్చుకోవడంలో సహకరించాలి. పిల్లలు ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా, సామర్థ్యాలను సాధించేలా చూడాలి. ఎట్టి పరిస్థితుల్లో అభ్యాసాలను గైడ్లు, దర్శినులు చూసిరాయడం, నల్లబల్లపై రాస్తే చూసిరాయడం, పుస్తకంలో ఉన్న విషయాన్ని ఎత్తి రాయడం వంటివి చోటు చేసుకోకూడదు.

పిల్లలు భాష నేర్చుకోవడం అంటే భాషా సామర్థ్యాలను సాధించడమే. ఇందులో ఆలోచించడం, తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం, కలిసి పనిచేయడం, తమదైన శైలిలో ప్రతిస్పందించడం, వ్యక్తీకరించడం వంటివి చోటు చేసుకుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని అభ్యాసాల నిర్వహణ జరగాలి.

## V. స్వీయమూల్యాంకనం :

పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు ఏ మేరకు సాధించామో పిల్లలు తమను తాము అంచనా వేసుకొనేందుకు **'నేనివిచేయగలనా?'** అనే శీర్షికతో అభ్యాసాల చివర చేర్చడమైనది. ఇది విద్యార్థులు తమనుతాము అంచనా వేసుకోవడమేకాక ఉపాధ్యాయులకు పిల్లలు ఏ సామర్థ్యంలో వెనకబడుతున్నారో తెలుస్తుంది. అంతేగాకుండా ఎక్కడ పిల్లలకి పునరభ్యాసం కల్పించాలో తెలుసుకొని చర్యలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. ఇందులో

- నేనివిచేయగలనా? లోని అంశాలను పిల్లలు చదవాలి.
- వాళ్ళు చేయగలిగే వాటికి ✓ పెట్టమనాలి. చేయలేని వాటిని ✗ పెట్టాలి.
- ఎంతమంది చేయగలిగారో చేతులెత్తమని లెక్కించాలి.
- చేయలేని వారిని గుర్తించి పునరభ్యాసం కల్పించాలి.

పై విధంగా మూల్యాంకనం నిర్వహించినప్పుడు ఉపాధ్యాయుడు పిల్లల స్థాయిని విశ్లేషించడానికి, తదుపరి అభ్యాసాలు కల్పించడానికి వీలవుతుంది.

నూతన పాఠ్యపుస్తకాలలోని పాఠాలలోని విషయాన్ని ఇంతకుముందు చర్చించిన సోపానాల ప్రకారం అమర్చారు. వీటిని పాఠానికి కేటాయించిన మొత్తం పీరియళ్ళలో నిర్వహించాలి. ఒక పాఠానికి సగటున 10 పీరియళ్ళు అవసరమవుతాయి. పైన తెల్పిన ఐదు అంశాలను 10 పీరియళ్ళలో నిర్వహంచాలి. ఐతే ఏ సోపానాన్ని నిర్వహించినా, ఏ పీరియడ్‌లోనైనా తప్పకుండా పిల్లల్ని పలకరించడం, ఉన్ముఖీకరణ లేదా పునశ్చరణచేయడం, పిల్లల అవగాహనను పరిశీలించడం ఉంటుంది. వీటితోపాటు బోధనాంశం / కృత్యం ఆధారంగా అదనపు సోపానలను కూడా నిర్వహించాలి. ఒక పాఠ్యబోధనకు సంబంధించిన 10 పీరియళ్ళలో మనం నిర్వహించాల్సిన సోపానాల వివరాలను పరిశీలిద్దాం. వాటిని ఏయే పీరియళ్ళలో అమలుపర్చాలో కూడా తెల్సుకొందాం.

## సూచించిన బోధనా సోపానాలు

పాఠం బోధించడం అంటే ఉన్ముఖీకరణ చిత్రం నుండి 'నేనివిచేయగలనా?' వరకు ఉన్న అన్ని అంశాలకు బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించారు. ఇందులో ఉన్ముఖీకరణ చిత్రం, పఠన కృత్యాలు, పాఠ్యాంశ విషయం, 'ఇవిచేయండి' శీర్షికతో అభ్యాసాలు, స్వీయ మూల్యాంకనం వంటి అంశాలు ఉన్నాయి. ఇవి బోధించడానికి పాటించే సోపానాలు, వ్యూహాలు ఆ అంశాల స్వభావాన్ని బట్టి మారుతుంటాయి. కింద సూచించిన బోధనా సోపానాలను అంశాలకు తగిన విధంగా ఎంపికచేసుకొని ప్రణాళికల్లో పొందుపరుచుకోవాలి.

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| 1 | పలకరింపు | ప్రతి పీరియడ్‌లో ఉంటుంది. | పిల్లలను పలకరించడం |
| 2 | ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం చిత్రంలోని చిత్రం గురించి మాట్లాడించడం |
| 3 | పునశ్చరణ | 2 నుంచి 10 పీరియళ్ళలో ఉంటుంది. | ముందురోజు జరిగిన అంశం గురించి చర్చించడం |
| 4 | శీర్షికా ప్రకటన | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం పేరు / శీర్షికను ప్రకటించి నల్లబల్లపై రాయడం |
| 5 | కవిపరిచయం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం రాసిన కవి గురించి పరిచయం చేయడం |
| 6 | నేపథ్యం / ఉద్దేశం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం ఉద్దేశం/నేపథ్యం గ్రహించేలా చేయడం |
| 7 | పాఠం చిత్రం గురించి మాట్లాడించడం | 2వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠంలోని చిత్రాల గురించి చర్చ నిర్వహణ |
| 8 | గేయం/పద్యం/పాట ఉపాధ్యాయుడు పాడడం | 1 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పద్యాలకు / గేయాలకు ప్రాధాన్యత, రాగంతో పాడడం, ఎలా పాడాలో తెల్పడం అభ్యాసం చేసి చూపడం |
| 9 | గేయం/పద్యం/పాట పిల్లలు పాడడం | 1 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పద్యాలు/గేయాలు/పాటలను పిల్లలతో పాడించడం, అభినయం చేయించడం |
| 10 | పిల్లలచే బాహ్యాపఠనం | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | తరగతిలోని నలుగురైదుగురు పిల్లలతో ప్రకాశపఠనం చేయించాలి. దోషాలను గుర్తించాలి. |
| 11 | ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | స్పష్టోచ్చారణతో చదవాలి. పిల్లలను గమనించమనాలి. |

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| 12 | పిల్లల మౌనపఠనం – అర్థ సంగ్రహణ | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పిల్లలు మౌనంగా చదవాలి. తెలియని పదాలనుగుర్తించి, గీతగీయాలి. చర్చలో పాల్గొనాలి. తెల్సుకోవాలి. |
| 13 | పాఠం చిత్రం గురించి చర్చ | 2వ పీరియడ్‌లో ఉంటుంది. | పాఠంలోని చిత్రాన్ని పరిశీలింపజేయాలి. చర్చ నిర్వహించి, భావాన్ని ఊహింపచేయాలి. |
| 14 | పాఠ్యాంశంపై చర్చ, అవగాహన | 3 నుండి 5 పీరియళ్ళు | ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా కీలక పదాలు / వాక్యాలు / సంఘటనలపై చర్చ |
| 15 | సామర్థ్యాల వారీగా అభ్యాసాల నిర్వహణ | 6 నుండి 10 పీరియళ్ళ వరకు ఉంటుంది. | వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం ఒక పీరియడ్‌లో, స్వీయరచన ఒక పీరియడ్, పదజాలకృత్యాలు, ప్రాజెక్టు, ప్రశంస పనులు ఒక పీరియడ్, సృజనాత్మకతకు ఒక పీరియడ్, భాషను గురించి తెలుసుకోవడం, నేనివిచేయగలనా చివరి పీరియడ్‌లో నిర్వహించాలి. |
| 16 | సరిదిద్దడం (భావం / వాక్యం / పదాలు / అక్షర దోషాలు) | స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస నిర్వహించే పీరియళ్ళలో అలాగే పిల్లలు రాసిన అంశాలు ఏవైనా ప్రదర్శించినప్పుడు. ఉదా॥ ప్రాజెక్టు పనులు నివేదికలు సమర్పించినప్పుడు. | భావం సరిగా ఉందా? వాక్య నిర్మాణం, పదజాలం, అక్షరదోషాలపై చర్చ నిర్వహించి సరిదిద్దాలి. |
| 17 | స్వీయ మూల్యాంకనం | 10వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | చివరి పీరియడ్‌లో 'నేనివిచేయగలనా?'లోని అంశాలకు ఏమేమి చేయగలరో గుర్తింపచేయాలి. పునరభ్యాసం కల్పించాలి. |
| 18 | రాసిన అంశాలను ప్రదర్శించడం, సంకలనం చేయడం | 6 నుండి 10 పీరియళ్ళలో ఉంటుంది. | ప్రశంస, సృజనాత్మకత, ప్రాజెక్టు పనుల నివేదికలను సంకలనాలుగా తయారచేసి భద్రపరచడం |
| 19 | పిల్లల అవగాహన – పరిశీలన | ప్రతి పీరియడ్‌లో ఉంటుంది. | ప్రతీ పీరియడ్‌లో ఆ రోజు బోధించిన, నిర్వహించిన అంశాల ఆధారంగా సామర్థ్యాల వారీగా పిల్లల అవగాహనను పరిశీలించాలి. |
| 20 | పునరభ్యాసం | చివరి పీరియడ్‌లో ఉంటుంది. అవసరమైతే అదనపు పీరియడ్‌లో ఉంటుంది. | స్వీయ మూల్యాంకనం ద్వారా పిల్లలు ఏఏ సామర్థ్యాలలో వెనుకబడ్డారో గుర్తించి, ఆయా సామర్థ్యాల కోసం అదనపు పీరియళ్ళలో పునరభ్యాసం కల్పించాలి. |

పైన తెల్పిన సోపానలను ఒక పీరియడ్‌లో మూడు భాగాలుగా నిర్వహిస్తాం. అవి 1) ఉపోద్ఘాతం, 2) పాఠ్యాంశంపై చర్చ, అవగాహన లేదా సామర్థ్యాల సాధన, 3) పిల్లల అవగాహన పరిశీలన. ఉపోద్ఘాతంలో పలకరించుట, ఉన్ముఖీకరణ చిత్రం గుంరించి మాట్లాడడం, శీర్షికా ప్రకటన, పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం / పునశ్చరణ మొదలగు సోపానాలు ఉంటాయి. పాఠ్యాంశంపై చర్చ, అవగాహనలో పిల్లల ప్రకాశపఠనం, ఉపాధ్యాయుని ఆదర్శపఠనం, పిల్లల మౌనపఠనం, పాఠం చిత్రం గురించి మాట్లాడించడం, ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారాచర్చ మొదలగునవి ఉంటాయి. సామార్థ్యల సాధన కోసం, సూచనలు ఇవ్వడం, రాయించడం, సరిదిద్దడం వంటి సోపానాలు ఉంటాయి.

పిల్లల అవగాహన పరిశీలనలో సామర్థ్యాల వారీగా ప్రశంసించడం, పిల్లల అవగాహన తెల్సుకోవడం, స్వీయ మూల్యాంకనం వంటి సోపానాలు ఉంటాయి. కాబట్టి బోధనాంశం / సామర్థ్యం ఆధారంగా ఆయా పీరియళ్ళకు సంబంధించిన బోధనావ్యూహాలు, అభ్యసనానుభవాలను, సోపానాల ప్రకారం రాయాలి.

పై సూచించిన సోపానాలే కాకుండా అదనంగా సోపానాలను కూడా పాఠ్యబోధనలో అవసరమైనచోట వినియోగించుకోవచ్చు. ఇవి ఉపాధ్యాయుల స్వేచ్ఛకు వదిలివేయడమైనది. ప్రతి పీరియడ్‌లో నిర్వహించే బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలను పలకరించడం, పునశ్చరణ చేయడం లేదా ఉన్ముఖీకరణతో ప్రారంభమౌతాయి. పిల్లల అవగాహనను పరిశీలించడంతో ముగుస్తుంది. ప్రతి పీరియడ్ పూర్తికాగానే ఛాత్రోపాధ్యాయులు ఆ రోజు నిర్వహించిన బోధనాభ్యసన ప్రక్రియల ఆధారంగా తన అనుభవాలను, అనుభూతులను స్వీయ ప్రతిస్పందనల రూపంలో రాసుకోవాలలి. ఒక్కొక్క పీరియడ్‌లో బోధనకు ఎంపిక చేసుకొన్న అంశం, అభ్యాసం ఏదైనా కావచ్చు. దానికి సంబంధించిన సోపానాల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. వీటి ఆధారంగానే పాఠ్యప్రణాళికలు, పీరియడ్ ప్రణాళికలు రాసుకోవాలి. అమలుపరచాలి. వీటి గురించి తదుపరి అధ్యాయంలో చర్చిద్దాం.

## 1, 2 తరగతుల బోధనా సోపానాలు

ఒకటి రెండు తరగతులలో పాఠాలు పద పద్ధతిలో ఉంటాయి. అక్షరాలను నేరుగా పరిచయం చేయకుండా అక్షరాలకు సంబంధించిన కీలకపదాన్ని సన్నివేశం, సంఘటన ద్వారా పరిచయం చేస్తారు. ఈ కీలక పదాలతో కూడిన అభినయ గేయాలు / కథ / సంఘటన / సన్నివేశాలతో పాఠాలను పొందుపరిచారు. ఈ కీలక పదంలోని అక్షరాలపైనే పిల్లలకి అభ్యాసాన్ని కల్పించడం జరుగుతుంది. దీని ఆధారంగా పదనిర్మాణం, చదవడం, రాయడం, సృజనాత్మకత వంటి సామర్థ్యాలు పెంపొందేలా అభ్యాసాలు ఉంటాయి. కాబట్టి 1, 2 తరగతులలో సోపానాల గురించి తెల్సుకొందాం. అవి :

- పాఠం చిత్రం గురించి మాట్లాడించడం.
- గేయాన్ని ఉపాధ్యాయుడు పాడడం.
- పిల్లలతో గేయాన్ని పాడించడం.
- గేయాన్ని అభినయంతో పాడడం.
- గేయం గురించి పిల్లలతో మాట్లాడించడం.
- గేయాన్ని చదవడం.
- గేయాన్ని పిల్లలచే చదివించడం.
- పాఠంలోని కీలక పదాన్ని పాఠంలోను, వాక్యాలలోను పిల్లలతో గుర్తింపజేయడం.
- కీలకపదంలోని అక్షరాలను గుర్తింపజేయడం.
- నేర్చుకున్న అక్షరాలతో పదనిర్మాణం చేయించడం. పదాలను నల్లబల్లపై రాయడం.
- నూతన పదాలను చదివించడం, వాటిని రాయించడం.
- నూతన పదాలు చెప్పించడం, రాయించడం.
- పాఠ్యాంశంలోని అభ్యాసాలు చేయించడం అవి చదవడం, రాయడం అభ్యాసాలు.
  - సరైన పదాన్ని ఖాళీలలో గుర్తించి రాయడం.
  - నేర్చుకున్న పదాలను, అక్షరాలను చూడకుండా రాయాలి.
  - సృజనాత్మకత కింద చిత్రాన్ని గీయడం. చిత్రం పేరును రాయడం.

పై అంశాలన్నీ తరగతిగదిలో నిర్వహించడానికి 8 పీరియళ్ళు అవసరమైతాయి. గేయాన్ని పాడించడం, అభినయం చేయించడం అనేది ప్రతిరోజూ జరగాల్సినపని. ఈ 8 పీరియళ్ళకు పాఠాన్ని, అభ్యాసాలను కేటాయించుకుని ప్రణాళికను రాసుకోవాలి. 1, 2 తరగతులలో పాఠం బోధించడం అంటే కీలకపదం ద్వారా నేర్పే అక్షరాలను, పదాలను పిల్లలు చదవగలగాలి. రాయగల్గాలి. అప్పుడే ఆ పాఠం ద్వారా పిల్లల్లో సాధించాల్సిన సామర్థ్యాలను సాధించినట్టుగా భావించాలి.

# 7

# ఉపాధ్యాయుల తయారీ - ప్రణాళికలు

భాషా బోధన లక్ష్యాలు నెరవేరడానికి, నిర్ధారించిన సామర్థ్యాలను సాధింపజేయడానికి భాషోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. ఇందుకోసం కింద తెలిపిన ప్రణాళికలను రూపొందించుకోవాలి. అవి

1. వార్షిక ప్రణాళిక (Year Plan), 2. పాఠ్య ప్రణాళిక (Lesson Plan),
3. పీరియడ్ ప్రణాళిక/ కాలాంశ ప్రణాళిక (Period Plan)

## వార్షిక ప్రణాళిక

సంవత్సరం మొత్తానికి రాసేది వార్షిక ప్రణాళిక. గతంలో వార్షిక ప్రణాళికలో పాఠంపేరు, పాఠం పూర్తి అయిందా? లేదా? ఉపాధ్యాయుని సంతకం, ప్రధానోపాధ్యాయుని సంతకం మొదలగు వాటిని పొందుపరిచేవారు. NCF-2005 లో పేర్కొన్న విధంగా జ్ఞాన నిర్మాణానికి అనుగుణంగా మన ప్రణాళికలు వాటిలోని సోపానాలు ఉండాలి.

ప్రస్తుత వార్షిక ప్రణాళికలో ఒక తరగతికి సంబంధించి, ఆయా సబ్జక్టులలో సంవత్సరాంతానికి విద్యార్థులు ఏయే సామర్థ్యాలు సాధించాలి? ఒక్కొక్క పాఠానికి ఎన్ని పీరియళ్ళు అవసరమవుతాయి? అభ్యసన ప్రక్రియ వేగవంతంగా జరగడానికి అవసరమైన అదనపు సామగ్రి ఏమి ఉపయోగించాలి? ప్రతినెలలో సామర్థ్యాలను పెంపొందించడానికి అదనముగా నిర్వహించే కార్యక్రమాలు ఏమిటి? CCEకి సంబంధించి ఏమి నమోదు చేయాలి? మొదలైన వాటిని వార్షిక ప్రణాళికలో పొందు పరచాలి. ఈ కింది సోపానాల ద్వారా వార్షిక ప్రణాళిక రాయాలి. అవి I. తరగతి, II. విషయం, III.అవసరమైన పీరియళ్ళ సంఖ్య, IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు, V. మాసవారీగా పాఠాల విభజన, VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు, VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు.

# అ) వార్షిక ప్రణాళిక - నమూనా

**I. తరగతి :**

**II. సబ్జెక్టు :**

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య :**

అ) మొత్తం పీరియళ్ళు :

ఆ) బోధనాభ్యసనకు అవసరమైన పీరియళ్ళు :

**IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు :**

- వినడం, ఆలోచించి మాట్లాడడం : ........................
- ధారాళంగా చదవడం, వ్యక్తీకరణ : ........................
- స్వీయరచన : ........................
- పదజాల వినియోగం : ........................
- సృజనాత్మక వ్యక్తీకరణ : ........................
- ప్రశంస : ........................
- భాషను గురించి తెలుసుకుందాం : ........................

**V. మాసవారీగా పాఠాల విభజన :**

| మాసం | బోధించాల్సిన పాఠం పేరు | అవసరమైన పీరియళ్ళసంఖ్య | బోధనా వనరులు | నిర్వహించాల్సిన కార్యక్రమాలు మరియు CCE |
|---|---|---|---|---|
| జూన్ | 1<br>2 | | | |

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :**

**VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు :**

# ఆ) వార్షిక ప్రణాళికలోని సోపానాలపై వివరణ

**I. తరగతి** : ఏ తరగతికి వార్షిక ప్రణాళిక రాస్తున్నామో ఆ తరగతిని ఇక్కడ రాయాలి.

**II. విషయం** : తెలుగు

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : పాఠ్యపుస్తకంలో అన్ని పాఠాలు పూర్తిచేయడానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య రాయాలి. ఇందులో

అ) **మొత్తం పీరియడ్లు :** 220 (అంటే సంవత్సరంలో బోధనకు కేటాయించిన పీరియళ్ళు రాస్తాము)

ఆ) **బోధనకు అవసరమైన పీరియళ్ళు :** 160 (మొత్తం మనకున్న పీరియళ్ళు 220 అయితే పాఠ్యపుస్తక బోధనకు 160 అవసరమని రాయాలి)

**IV. సంవత్సరాంతానికి పిల్లల్లో ఆశించే అభ్యసన సామర్థ్యాలు :**

భాషా సామర్థ్యాల ఆధారంగా, పాఠ్యపుస్తకంలోని పాఠాలను ఒకసారి చదివి, ఆశించే సామర్థ్యాలను / విద్యా ప్రమాణాలను రాయాలి. ప్రతి సామర్థ్యంలో సంవత్సరాంతానికి విద్యార్థులలో ఆశించే అభ్యసనా ఫలితాలను రాయాలి. గతంలో వీటిని లక్ష్యాలు, స్పష్టీకరణలు అని రాసేవారు. తెలుగులో మనం చర్చించిన సామర్థ్యాల వారీగా ఒక్కొక్క సామర్థ్యంలో ఏమేం చేయగలగాలో స్పష్టంగా రాయాలి. వీటిని పాఠ్యపుస్తకంలో కూడా పొందుపరిచారు.

**V. మాసవారీగా పాఠాల విభజన – ప్రణాళిక :**

| మాసం | బోధించాల్సిన పాఠం పేరు | అవసరమైన పీరియళ్ళసంఖ్య | బోధనా వనరులు / సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ |
|---|---|---|---|---|
| జూన్ | 1<br>2 | | | |

పై పట్టికలో 1వ గడిలో మాసం పేరు రాయాలి. రెండవ గడిలో ఆ మాసంలో ఏ పాఠాలు బోధించాల్సి ఉంటుందో పాఠాల పేర్లు రాయాలి. దానికి అవసరమయ్యే పీరియళ్ళ సంఖ్యను 3వ గడిలో రాయాలి. ఆయా పాఠాలను బోధించడానికి అవసరమయ్యే బోధనా సామగ్రిని 4వ గడిలో రాయాలి. చివరి గడిలో భాషాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను, సి.సి.ఇ.కి సంబంధించిన కార్యక్రమాలను నమోదు చేసుకోవాలి. ఇందుకోసం ఉపాధ్యాయులకు సూచనలు, విషయసూచిక పేజీలను క్షుణ్ణంగా చదవాలి. వాటి ఆధారంగా నమోదుచేయాలి.

- **బోధనా వనరులు మరియు సామగ్రి (Resources for teaching & TLM) :**

ప్రతి ఉపాధ్యాయుడు ఆ సంవత్సరంలో బోధించాల్సిన పాఠాలకు అనుగుణంగా వనరుల గురించి ముందే ఆలోచించాలి. అవసరమైనవి గుర్తించి ముందే సిద్ధం చేసుకోవాలి. వనరులు అనగా ఉపయుక్త గ్రంథావళి (reference books), ఉపాధ్యాయుల కరదీపికలు, బోధనలో ఉపయోగించే సామగ్రి, నిఘంటువులు, సి.డిలు / వీడియోలు, మ్యాగజైన్స్, దినపత్రికల క్లిప్పింగ్స్, టీచింగ్ నోట్స్ మొదలగునవి. ఉపాధ్యాయులు ఇంకనూ ఆలోచించి బోధించే విషయాన్ని అనుసరించి తగిన బోధనా వనరులను సొంతంగా తయారుచేసుకోవాలి. బోధన ఆసక్తికరంగా ఉండాలంటే, పిల్లలు అభ్యసనంలో పాల్గొనాలంటే ఉపాధ్యాయుడు ముందే ఆలోచించి తగిన వనరులు ఉపయోగించి ఆసక్తికరంగా బోధించుటకు ప్రయత్నించాలి.

♦ **నిర్వహించాల్సిన కార్యక్రమాలు (Activities / Programmes to be performed) :**

ఆశించే సామర్థ్యాల సాధన కోసం ఆయా సబ్జక్టుల వారీగా పలు కార్యక్రమాలు నిర్వహించాలి. వీటిని పరిసరాలను, స్థానిక వనరులను ఉపయోగించి నిర్వహించాలి. ఇందులో భాగంగా కొన్ని కార్యక్రమాలను కేవలం తరగతి గదుల్లో కాకుండా బయట నిర్వహించాలి. వీటిలో క్షేత్ర సందర్శన (field visit), సాంస్కృతిక కార్యక్రమాలు (cultural activities), విజ్ఞాన యాత్రలు (educational tours), సామాజిక సంస్థల సందర్శన (visiting of social institutions), సమాజసేవ (social service), క్విజ్ (quiz), సెమినార్లు (seminars), వివిధ రకాలైన కవితలు, కథలు, కరపత్రాలు, పోస్టర్లు మొదలగువాటిని తయారుచేయుటకు కార్యశాలలు (workshops for material development), దినపత్రికలకు వ్యాసాలు రాయడం (writing articles / case studies to newspapers), కవిసమ్మేళనం, విషయనిపుణులచే ఉపన్యాసాలు (lecturers from experts), పద్య పఠనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, చిత్రలేఖనం, కవితలు రాయడం, కథలు రాయడం మొదలగు సృజనాత్మక అంశాలలో (creative activities) కార్యక్రమాలను నిర్వహించాలి. వీటిని కూడా వార్షిక ప్రణాళికలో చూపాలి మరియు అమలు చేయాలి. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులలో వివిధ సామర్థ్యాలు, అభిరుచులు పెంపొందించబడతాయి మరియు పాఠశాల ఒక ఆహ్లాదకరమైన ప్రదేశంగా కూడా మారుతుంది. దీనికి ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు వృత్తిపరంగా ఆలోచించి వృత్తికి న్యాయం చేయాలి. అలాగే సి.సి.ఇ కి సంబంధించి ఏ నెలలో నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు చేయాలి, ఏ నెలలో సంగ్రహణాత్మక మూల్యాంకన ప్రశ్నపత్రాలు తయారు చేసుకోవాలో, ఏ నెలలో నిర్వహించాలో వివరాలను ప్రణాళికలో పొందుపరచుకోవాలి.

### VI. వార్షిక ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయుల ప్రతిస్పందన :

ప్రధానోపాధ్యాయుడు నిర్వహించే సమీక్షా సమావేశాల ఆధారంగా నెలవారీగా ఉపాధ్యాయులు వార్షిక ప్రణాళిక అమలు గురించి తమ ప్రతిస్పందనలు రాయాలి. అనగా ఉపయోగించిన బోధనాభ్యసన ప్రక్రియలు, వనరులు ఏ రకంగా పిల్లల అభ్యసనానికి తోడ్పడ్డాయి? ఈ పద్ధతులవల్ల పిల్లలు ఏ మేరకు భాగస్వాములైనారు? పిల్లల అభ్యసనా ప్రగతి ఎలా ఉంది? మొదలగు వాటి గురించి ఉపాధ్యాయులు తమ అనుభవాలు, అభిప్రాయాలు రాయాలి. ప్రణాళికాపరంగా ఒక్కోసారి నెలవారీగా పాఠాలు పూర్తి చేయలేకపోవచ్చు. అందుకుగల కారణాలను కూడా ఇక్కడ రాయాలి.

### VII. వార్షిక ప్రణాళిక మరియు దాని అమలుపై ప్రధానోపాధ్యాయుని సలహాలు మరియు ప్రతిస్పందన:

పాఠశాల ఆరంభంలోనే ప్రతి ఉపాధ్యాయుడు తమ వార్షిక ప్రణాళికను ప్రధానోపాధ్యాయునికి సమర్పించాలి. వార్షిక ప్రణాళికను ఉపాధ్యాయులు తమ వేసవి సెలవుల్లోనే తయారుచేసుకోవాలి. ఇందుకు ప్రధానోపాధ్యాయుడు ఏప్రిల్ మాసంలోనే ఉపాధ్యాయులతో ఒక సమావేశం నిర్వహించి వార్షిక మరియు పాఠ్యప్రణాళికలపై చర్చించాలి. ఉపాధ్యాయులు సమర్పించిన వార్షిక ప్రణాళికలను ప్రధానోపాధ్యాయుడు పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలను రాయాలి. వార్షిక ప్రణాళిక అమలుపై నెలవారీగా సమీక్షించి తమ అభిప్రాయాలను ఆయా టీచర్ల వార్షిక ప్రణాళికలలోనే నమోదుచేయాలి. పాఠశాలను సందర్శించే పర్యవేక్షణ అధికారులు కూడా తప్పనిసరిగా వార్షిక, పాఠ్యప్రణాళికలను చూసి తమ సూచనలను, అమలుతీరును నమోదుచేయాలి. ఐతే ఉపాధ్యాయ శిక్షణ పొందే ఛాత్రోపాధ్యాయులు వార్షిక ప్రణాళికను బోధనాభ్యాసం (Teaching Practice) కు వెళ్ళడానికి ముందే రూపొందించాలి. ఉపన్యాసకుడికి సమర్పించాలి. తగిన సలహాలు, సూచనలు పొంది మార్పులు, చేర్పులు చేసుకోవాలి. వార్షిక ప్రణాళిక సోపానాల ప్రకారం ఒక తరగతి వార్షిక ప్రణాళికను ఎలా రాయాలో తెల్సుకొందాం.

# ఇ) మాదిరి వార్షిక ప్రణాళిక రాయడం

**I..** **తరగతి** : 5వ

**II.** **సబ్జక్టు** : తెలుగు

**III.** **అవసరమయ్యే పీరియళ్ళ సంఖ్య :**

అ) మొత్తం పీరియళ్ళు : 220

ఆ) బోధనాభ్యసనకు అవసరమయ్యే పీరియళ్ళు : 160

**IV.** **విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు :**

**(1) వినడం – ఆలోచించి మాట్లాడడం**

- గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు, వార్తలు మొదలయిన వాటిని విని అర్థం చేసుకోవాలి. సారాంశాలను క్రమపద్ధతిలో సొంతమాటల్లో చెప్పగలగాలి.
- చర్చల్లో పాల్గొనగలగాలి. తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.
- చిన్న చిన్న ప్రసంగాలు చెయ్యాలి. తెలిసిన వాటి గురించి చెప్పగలగాలి.
- కారణాలు వివరించగలగాలి. సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.

**(2) ధారాళంగా చదవడం – అర్థం చేసుకోవడం**

- పద్యాలు, పాటలు, గేయాలు, కథలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయకథలు వంటి ప్రక్రియా రూపాలను చదవగలగాలి, అర్థం చేసుకొని చెప్పగలగాలి.
- బాలసాహిత్యం, వార్తాపత్రికలు, సంచికలు, అపరిచిత అంశాలను చదవగలగాలి, అర్థం చేసుకోగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, తప్పు ఒప్పులను గుర్తించడం, అర్థాలు గ్రహించడం, శీర్షికలు నిర్ణయించడం, విషయాన్ని క్రమపద్ధతిలో అమర్చడం వంటివి చేయగలగాలి.

**(3) ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)**

- పాఠ్యాంశంలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలయిన వాటిని సొంత మాటల్లో రాయగలగాలి.
- ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ, విభేదిస్తూ, తమ అభిప్రాయాలను తెలుపుతూ సొంతమాటల్లో 8 లేదా10 వాక్యాలు రాయగలగాలి. ఒకటి రెండు పేరాలు రాయగలగాలి.
- ఊహించి లేదా తానే ఆ స్థానంలో ఉంటే ఏం చేస్తారో రాయగలగాలి. ఆయా సందర్భాలలో తమ అనుభవాల గురించి, చూసిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొదలగు వాటి గురించి రాయగలగాలి.

**(4) పదజాలం**

- ఇచ్చిన పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించగలగాలి.
- సందర్భాన్ని బట్టి అర్థాలను, నానార్థాలను, పర్యాయ పదాలను గ్రహించగలగాలి.
- పదపట్టికలు, గళ్ళ నుడికట్టు వంటి భాషా క్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలను రాయగలగాలి.

**(5) సృజనాత్మక వ్యక్తీకరణ**

- కథలు, కవితలు, గేయాలు పొడిగించగలగాలి, సొంతంగా రాయగలగాలి. ఆత్మకథలు, నినాదాలు, సూక్తులు, లేఖలు, సంభాషణలు మొదలయిన వాటిని రాయగలగాలి. ఏకపాత్రల అభినయం మరియు నాటకీకరణ చేయగలగాలి.
- సూచనలకనుగుణంగా చిత్రాలు గీసి, వర్ణించగలగాలి.
- పోస్టరు, అభినందన పత్రాలు, ఆహ్వాన పత్రాలు, గ్రీటింగ్ కార్డులు, మాస్కుల తయారీ, నమూనాలను తయారు చేయగలగాలి.

**(6) ప్రశంస**

- తోటివారు, మహిళలు, ఇతర వర్గాలు, ఇతర సంస్కృతులు, సేవలు చేసిన వారిని, భాషా శైలిని ప్రశంసించగలగాలి.

**(7)భాషను గురించి తెలుసుకుందాం**

- భాషా భాగాలతోపాటు కాలాలకు అనుగుణంగా క్రియలను ఉపయోగించగలగాలి. వాక్య నిర్మాణాన్ని, వాక్యాల రకాలను (సామాన్య, సంయుక్త, సంక్లిష్ట) గుర్తించగలగాలి. క్రియారహిత వాక్యాలు, కర్త, కర్మ, క్రియలను, విభక్తులను గుర్తించగలగాలి. ఉపయోగించగలగాలి.

*గురు శిష్యుల సంబంధం*

*విద్యాబోధనలో అన్నిటికంటే కీలకమైంది ఏది? గురుశిష్యుల మధ్య అవిభాజ్యమైన స్నేహబంధమే. అయితే ఆ యోగ్యత ఉపాధ్యాయుడికెప్పుడు లభిస్తుంది? పిల్లల్లో పిల్లలుగా ఉపాధ్యాయులు మారిపోగలిగినప్పుడే! ఉపాధ్యాయుణ్ణి గురించి పిల్లలకు ఎలాంటి అనుభూతి ఉండాలి? ఇతడు నా సహపాఠి అన్న భావన పిల్లల్లో అనుభూతి కల్గినప్పుడే!*

*గురుశిష్యుల మధ్య కావల్సింది సాన్నిహిత్యమేనా? కాదు! అంతరంగిక అభేదం. అది లేకుండా గురువు ఇచ్చేది లేదు. శిష్యుడు పుచ్చుకొనేది లేదు.*

*- రవీంద్రనాథ్ ఠాగూర్*

**V. మాసాల వారీగా పాఠాల విభజన – ప్రణాళిక**

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| జూన్ | 1. స్వతంత్రోత్సవం<br>* తెలివైన జవాబు (చదువు–ఆనందించు) | 10<br>1 | వర్ణమాల చార్టు, గుణింతాల చార్టు, రంగులు, దేశ గొప్పతనాన్ని తెలిపే నినాదాల చార్టు, మహనీయులు, దేశభక్తుల వివరాలు, దేశభక్తి పాటలు. | • దేశభక్తి పాటల పోటీ<br>• పిల్లలు గీసిన చిత్రాల ప్రదర్శన |
| జూలై | 2. సహవాసం<br>3. త్రిలింగాలు | 10<br>10 | సామెతలు, జాతీయాల పుస్తకం/ చార్టు, గ్రీటింగ్ కార్డులు, గుణింతాల చార్టు, దర్శనీయ స్థలాల వివరాలు, ఒత్తుల చార్టు | • గ్రీటింగ్ కార్డుల ప్రదర్శన<br>• బడిబయట పిల్లలకు చదువు చెప్పడం.<br>• దర్శనీయ స్థలాల చిత్రాల ప్రదర్శన<br>• 1వ నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు |
| ఆగస్టు | 4. మాతోట<br>* శిబి చక్రవర్తి (చదువు–ఆనందించు)<br>5. గోపీ డప్పు కథ | 10<br>1<br>10 | ఒత్తుల పదాల పట్టిక, మంచి తోట చిత్రాలు, తోట/చెట్లు గురించి కవితలు, గేయాలు, వాద్యపరికరాల చిత్రాలు, వివరాలు | • ఉపన్యాస పోటీ<br>• వ్యాసరచన పోటీ<br>• కవితలు, పాటల పోటీలు<br>• స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు<br>• 2వ నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు |
| సెప్టెంబర్ | 6. అన్నం<br>7. జెండా వెంకయ్య<br>* సూక్ష్మబుద్ధి (చదువు–ఆనందించు) | 10<br>10<br>1 | ఆహార పదార్థాల వృథా చిత్రాలు, గళ్ళనుడికట్టు చిత్రాలు, వివిధ దేశాల జెండాలు, దేశభక్తి సూక్తులు, నినాదాలు, ఆహ్వాన పత్రికలు, దేశభక్తుల కథలు. | • ఉపాధ్యాయ దినోత్సవం<br>• రైతు దేశానికి వెన్నెముక– ఉపన్యాసం<br>• ఆహారం వృథా చేయకూడదు–చర్చ<br>• 1వ సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రం తయారీ |
| అక్టోబర్ | 8. మనసుంటే మార్గముంది<br>9. సీతాకోకచిలుకలు<br>* ఎండ (చదువు–ఆనందించు) | 10<br>10<br>1 | వికలాంగులు పనిచేస్తున్న చిత్రాలు, పక్షుల గురించిన కవితలు, గేయాలు, ప్రకృతి చిత్రాలు. | • వికలాంగుల గొప్పతనాన్ని వివరిస్తూ మాట్లాడించడం<br>• సృజనాత్మక ప్రదర్శన పోటీలు (చిత్రాలుగీసి రంగులువేయడం, కవితలు)<br>• 1వ సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహణ |

GRK

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| నవంబర్ | 10. నీడ ఖరీదు<br>11. ప్రయత్నిస్తే<br>* క్రిస్మస్ (చదువు-ఆనందించు) | 10<br>10<br>1 | హాస్యకథల పుస్తకాలు, నమూనా పోస్టర్లు, బొమ్మలు | • బాలల దినోత్సవం సందర్భంగా సృజనాత్మక పోటీల నిర్వహణ<br>• హాస్యకథలు చెప్పడం-పోటీ<br>• తయారు చేసిన బొమ్మలు, పోస్టర్ల ప్రదర్శన<br>• 3వ నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు |
| డిసెంబర్ | 12. సంక్రాంతి<br>13. రామన్న కథ | 10<br>10 | ముగ్గుల చిత్రాలు, పండుగల వివరాలు తెలిపే చిత్రాలు, కాలుష్యం చిత్రం, మురికివాడల్లో సేవ చేస్తున్న చిత్రాలు. | • ముగ్గుల పోటీ<br>• పండుగల గొప్పతనం గురించి మాట్లాడడం<br>• కాలుష్యం-గీసిన చిత్రాల ప్రదర్శన<br>• 2వ సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం తయారీ |
| జనవరి | 14. నేను మీ ప్రియనేస్తాన్ని<br>15. వృథా చేయం | 10<br>10 | ఆత్మకథల పుస్తకాలు, పుస్తక సంకలనాలు, నీరు/విద్యుత్తు మొ॥వి పొదుపు పోస్టర్లు. | • ఉపన్యాస పోటీల నిర్వహణ<br>• వ్యాసరచన పోటీలు<br>• సృజనాత్మక రచనాపోటీలు<br>• 2వ సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహణ |
| ఫిబ్రవరి | 16. శతక పద్యాలు<br>* అన్నదమ్ముల కథ (చదువు-ఆనందించు) | 10<br>1 | శతక పద్యాల పుస్తకాలు, సి.డి.లు, కవుల చిత్రాలు | • పద్యాల పోటీ<br>• పిల్లలు రాసిన కథలు,లేఖల ప్రదర్శన<br>• పాఠశాల మ్యాగజైన్ తయారీ<br>• 4వ నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు |
| మార్చి | పునశ్చరణ | | వార్షికోత్సవం కోసం వనరుల సేకరణ, సామగ్రిని సమకూర్చుకోవడం | • వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ<br>• బాలకవి సమ్మేళనం<br>• 3వ సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రం తయారీ, నిర్వహణ |
| మొత్తం | | 166 | నిఘంటువులు, పురాతన నామకోశం, విద్యార్థి కల్పతరువు, కవులు, రచయితలకు సంబంధించిన దృశ్య శ్రవణ సామగ్రి, అంతర్జాలం, పద్యాలు, దేశభక్తి పాటల సి.డి.లు మొ॥వి. | • సి.సి.ఇ. ప్రకారం ప్రశ్నాపత్రాల తయారీ<br>• క్యుములేటివ్ రికార్డులను తల్లిదండ్రులకు పంపడం |

**VI. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు** : మాసవారీగా పూర్తిచేసిన పాఠాలు, నిర్వహించిన కార్యక్రమాల ఆధారంగా ఉపాధ్యాయులు తమ ప్రతిస్పందనలను రాయాలి.

**VII. ప్రధానోపాధ్యాయుడి సలహాలు, సూచనలు** : మాసవారీగా ప్రధానోపాధ్యాయుడు నిర్వహించే సమీక్షా సమావేశంలో ఇచ్చిన సలహాలు, సూచనలను నమోదుచేయాలి.

# పాఠ్య ప్రణాళిక

ఒక పాఠాన్ని ప్రాతిపదికగా తీసుకొని అన్ని పీరియళ్ళను దృష్టిలో పెట్టుకొని రాసే ప్రణాళికను పాఠ్యప్రణాళిక అంటారు. తెలుగులో ఒక్కొక్క పాఠానికి ఒక పాఠ్య ప్రణాళిక రాయాలి. భాషేతర విషయాలలో దీన్నే యూనిట్ ప్రణాళిక అని కూడా అంటారు. తెలుగులో ఒక్కొక్క పాఠాన్ని ఒక యూనిట్‌గా భావిస్తారు. కాబట్టి యూనిట్ ప్రణాళిక అన్నా, పాఠ్యప్రణాళిక అన్నా రెండూ ఒకటే. గతంలో పాఠ్య ప్రణాళిక అంటే ఒక పీరియడ్ కోసం ఉద్దేశించి రాసేవారు. ఇలా పీరియడ్‌ను ఉద్దేశించిరాసే ప్రణాళికను కాలాంశ ప్రణాళిక లేదా పీరియడ్ ప్రణాళిక అంటారు. దీని గురించి తర్వాత తెల్సుకొంటారు. ప్రాథమిక తరగతులకు ప్రతిరోజు తెలుగు బోధించడానికి 90 ని॥లు సమయం ఉంటుంది. మొదటి నలభై ఐదు నిమిషాల్లో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. రెండవ నలభై ఐదు నిమిషాల్లో పిల్లలతో ఆ రోజు బోధించిన అంశాల ఆధారంగా అభ్యాసం కల్పించాలి. అంటే పిల్లలతో సొంతంగా రాయించడం, అభ్యాసాలు చేయించడం, వాటిని సరిదిద్దడం వంటివి రెండవ 45 నిమిషాల్లో జరగాలి.

ఏమి బోధించాలి? ఎలా బోధించాలి? ఎటువంటి అభ్యసన కృత్యాలు ఇవ్వాలి? పిల్లల్ని ఏ విధంగా అభ్యసనంలో భాగస్వాములను చేయాలి? ఏమి కొత్త విషయాలు చెప్పాలి? మొదలగు వాటి గురించి ఉపాధ్యాయుడు ముందుగా ఆలోచించి ప్రణాళిక తయారుచేసుకోవాలి. కావున, ప్రణాళికను సులభతరంగా, ఆచరణయోగ్యంగా, ఆలోచించేవిధంగా ఉండటానికి వీలుగా నూతన నమూనాలో రూపొందించుకోవాలి. పాఠ్య ప్రణాళికలోని సోపానాలు కింది విధంగా ఉంటాయి.

## అ) పాఠ్య ప్రణాళిక – నమూనా

**1. పాఠం పేరు :**

**2. అవసరమైన పీరియళ్ళు :**

**3. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

- .........................
- .........................
- .........................
- .........................
- .........................

**4. పీరియడ్ వారీ వివరాలు :**

| పీరియడు సంఖ్య | మొదటి 45 ని॥ల్లో బోధించే అంశం / కృత్యం / సామర్థ్యం | బోధనా వ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | అవసరమైన సామగ్రి | రెండవ 45 ని॥ల్లో పిల్లలకు కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

**5. ఉపాధ్యాయుని సంసిద్ధత, అదనపు సమాచార సేకరణ :**

**6. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :**

## ఆ) పాఠ్య ప్రణాళిక – వివరణ

**యూనిట్ / పాఠ్య ప్రణాళికలోని సోపానాలు :**

1. **యూనిట్ / పాఠం పేరు** : బోధించే పాఠం పేరు రాయాలి
2. **తరగతి** : బోధించే తరగతి రాయాలి
3. **యూనిట్ / పాఠానికి కేటాయించిన మొత్తం పీరియడ్ల సంఖ్య** : ఈ పాఠాన్ని బోధించడానికి అవసరమైన మొత్తం పీరియళ్ళ సంఖ్య రాయాలి.
4. **సాధించాల్సిన విద్యా ప్రమాణాలు** : ఈ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు రాయాలి.
5. **పీరియళ్ళ వారీగా విభజన ప్రణాళిక** : పాఠాన్ని పూర్తిచేయడానికి అవసరమైన పీరియళ్ళను దృష్టిలో పెట్టుకొని ఉన్న పీరియడ్‌లో ఏమి బోధించాలి? ఏం నిర్వహిస్తారు? ఏ వనరులు కావాలి?, ఏ వ్యూహాలు అమలుపరుస్తారు? మొదలగు వివరాలను కింద పట్టికలో నమోదుచేయాలి.

| పీరియడు సంఖ్య (Periods) | మొదటి 45 ని॥లులో బోధించాల్సిన అంశం / కృత్యం (Teaching item / activity) | బోధనా వ్యూహాలు/ అభ్యసన అనుభవాలు (Teaching learning strategies) | బోధనాభ్యసన సామగ్రి (Resources for teaching [TLM] ) | రెండవ 45 ని॥ల్లో పిల్లలకు కల్పించే అభ్యాసం |
|---|---|---|---|---|
| 1<br>2<br>3 | | | | |

- పై పట్టికలో 1వ గడిలో ఏ పీరియడ్ అయితే ఆ పీరియడ్ సంఖ్య రాయాలి.
- రెండవ గడి బోధించాల్సిన అంశం / కృత్యం అనే అంశానికి సంబంధించినది. 90 ని॥ల సమయంలో మొదటి నలభై ఐదు నిమిషాల్లో బోధించాల్సిన అంశాలను / నిర్వహించాల్సిన కృత్యాలను రాయాలి. ఉదాహరణకు తెలుగులో 1వ పీరియడ్ ఉన్ముకీకరణ చిత్రం గురించి మాట్లాడించడం. 2వ పీరియడ్‌లో బోధించాల్సిన అంశం పఠన కృత్యాల నిర్వహణ – అర్థసంగ్రహణ ఉంటుంది. ఇలా ప్రతి పీరియడ్‌లో ఏమి బోధించాలో ఆ వివరం ఈ అంశం కింద రాయాలి.
- 3వ గడిలో బోధనా వ్యూహాలు అభ్యసనానుభవాలకు సంబంధించినది. ఈ గడిలో బోధనాంశానికి సంబంధించిన వ్యూహాన్ని, నిర్వహించే కృత్యాలు, వ్యూహాలు రాయాలి. అందులో

  ఉదా॥ 1వ పీరియడ్‌లో ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం.

  ఇది బోధనాంశం అవుతుంది. దీనికి సంబంధించిన బోధనావ్యూహాలు, పిల్లలకు కల్పించే అభ్యాసానుభవాల వివరాలు రాయాలి. అంటే ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడానికి పూర్తి తరగతి కృత్యం నిర్వహణ,

పాఠంలోని ప్రారంభపేజీలోని చిత్రం గురించి ఒక్కొక్కరితో మాట్లాడించడం, ఆ చిత్రం కింద ఇచ్చిన అంశాలను అడగడం, అవసరమైతే అదనపు ప్రశ్నలను అడగడం, తద్వారా పాఠ్యాంశం పట్ల మానసికంగా సిద్ధం చేయడం, శీర్షికాప్రకటన, పాఠ్యాంశ ఉద్దేశం గ్రహించేలా చర్చ నిర్వహించడం, పిల్లల అవగాహనను పరిశీలించడం అనే ఈ వివరాలను 3వ గడిలో రాయాలి. వ్యక్తిగత కృత్యాలు, జట్టు కృత్యాలు, పూర్తి తరగతి కృత్యాలు, పఠన కృత్యాలు, అభ్యసన కృత్యాలు, ప్రాజెక్టు పనులు వంటివి రాయాలి.

- 4వ గడిలో బోధనాభ్యసన సామగ్రి, వనరులకు సంబంధించినది. దీంట్లో ఏమేమి, సామగ్రి, వివరాలను వినియోగిస్తారో వివరాలను రాయాలి. చివరిగడి రెండవ 45 నిమిషాలకు సంబంధించినది. మొదటి 45 నిమిషాలలో బోధించిన బోధనాంశం దానికి సంబంధించిన అభ్యసానుభవాల ఆధారంగా పిల్లలకు సామర్థ్యాల వారీగా కల్పించాల్సిన అభ్యాసాల వివరాలను రాయడం. అంటే మూల్యాంకనం ప్రశ్నలు సామర్థ్యాల వారీగా రాయాలి. వీటిని జట్లలో లేదా వ్యక్తిగతంగా పిల్లలతో రాయించి సరిదిద్దాల్సి ఉంటుంది.

**6. ఉపాధ్యాయుల సంసిద్ధత, అదనపు సమాచార సేకరణ : బోధనాంశాలు మరియు విధానాలపై ఉపాధ్యాయుడు అదనంగా సేకరించుకోవాల్సిన సమాచారం.**

పాఠానికి సంబంధించిన బోధనాంశాలు / సామర్థ్యాలకు, కృత్యాలకు అవసరమైన సమాచారం అనగా ఆ అంశాలకు సంబంధించిన అదనపు సమాచారం, కొత్త ఉదాహరణలు, ఆలోచింపజేసే ప్రశ్నలు, అదనపు కృత్యాలు, సంబంధించిన కథలు, సంఘటనలు మొదలగు వాటిని రెఫరెన్స్ పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికల నుంచి సేకరించి టీచింగ్ నోట్స్ కింద రాసుకోవాలి. ప్రతి సంవత్సరం కొత్త విషయాలు ఈ టీచింగ్ నోట్స్‌కు చేర్చాలి. దీనికి ఎక్కువ పేజీలు కేటాయించాలి. ఒక ఉపాధ్యాయుని యొక్క వృత్తిపరమైన తయారీ ఈ టీచింగ్ నోట్స్ పరిశీలిస్తే తెలిసిపోతుంది.. పాఠ్యపుస్తకంలో ఉన్న సమాచారాన్ని మాత్రం ఈ టీచింగ్ నోట్స్ కింద రాయకూడదు. కేవలం అదనపు సమాచారాన్ని మాత్రమే (ఉదాహరణలు, కృత్యాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు మొదలగునవి) రాయాలి.

**7. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :**

ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు అంటే పాఠం ఏ రకంగా జరిగింది? పిల్లలు ఏమి నేర్చుకున్నారు? ఏ పద్ధతి నేర్చుకోవడానికి బాగా ఉపయోగపడింది? ఏ ఏ పిల్లలు సృజనాత్మకంగా జవాబులు చెప్పారు? మంచిగా జరిగిన తరగతులు, జరగని తరగతులు, కారణాలు, మంచిగా అనిపించిన అంశాలు, విజయవంతమైన వ్యూహాలు మొదలగువాటిని మరియు తన అనుభవాలను ఉపాధ్యాయుడు రాయాలి.

పాఠ్యప్రణాళికలో ఏ ఏ సోపానాలు ఉంటాయి? ఏమి రాయాలి? అనే అంశాలు తెల్సుకొన్నారు కదా! ఇప్పుడు ఒక పాఠానికి పాఠ్యప్రణాళికను ఎలా రాయాలో చూద్దాం. ఇందుకోసం నమూనా పాఠ్యప్రణాళికను పరిశీలించండి.

## ఇ) మాదిరి పాఠ్యప్రణాళిక - తెలుగు (Lesson Plan)

### 5వ తరగతి

**I. పాఠం పేరు** : 1. స్వతంత్రోత్సవం

**II. పాఠానికి అవసరమైన పీరియడ్ల సంఖ్య** : 10

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

**1. వినడం-ఆలోచించి మాట్లాడడం :** గేయాన్ని రాగంతో పాడి, అభినయం చేయగలగాలి. సారాంశం సొంతమాటల్లో చెప్పగలగాలి. కవి గేయం ద్వారా ఏమని, ఎందుకు చెప్పి ఉంటాడో మాట్లాడగలగాలి.

**2. ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం :** గేయాన్ని ధారాళంగా చదవగలగాలి. గేయం పాదాలను చదివి వరుస క్రమంలో ఉంచాలి. భావానుగుణమైన పాదాలను గేయంలో గుర్తించాలి. గేయంలో ప్రాస పదాలు గుర్తించాలి.

**3. ఆలోచించి సొంతమాటల్లో రాయడం :** గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి. ప్రశ్నలకు జవాబులను సొంతమాటల్లో రాయగల్గాలి.

**4. పదజాలం :** సందర్భోచితంగా పదాలకు అర్థాలు గ్రహించి ఉపయోగించగలగాలి. పాఠంలోని వర్ణమాల, గుణింత పదాలు, గుర్తించి పట్టికలో రాయాలి.

**5. సృజనాత్మకత :** మన దేశం గొప్పదనం తెలిపేలా నినాదాలు రాయాలి లేదా పాఠం ఆధారంగా చిత్రం గీసి దాని గురించి రాయాలి.

**6. ప్రశంస :** దేశం కోసం కృషి చేసిన, త్యాగం చేసిన వారిని ప్రశంసిస్తూ ఒక పేరా రాయగలగాలి.

**7. భాషను గురించి తెలుసుకుందాం :** భాషా భాగాలను గుర్తించగలగాలి. విరామ చిహ్నాలను సరైన చోట ఉంచాలి.

**IV. పీరియళ్ళ వారీగా విభజన ప్రణాళిక :**

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం మొదటి 45 ని॥లు | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | పిల్లలకు రెండవ 45 ని॥లలో కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ పీరియడ్ | ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం, స్వతంత్రోత్సవం గేయాన్ని పాడించడం<br>పేజి నెం. 1 | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడాలి<br>• శీర్షిక ప్రకటన<br>• నేపథ్యం, లక్ష్యాలు<br>• కవి పరిచయం<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• స్వతంత్రోత్సవం గేయం పాడడం<br>• గేయాన్ని పిల్లలతో పాడించడం<br>**III. అవగాహన పరిశీలన**<br>కవిపరిచయం, నేపథ్యం గురించి ప్రశ్నించడం | • స్వతంత్రోత్సవం గేయం చార్టు<br>• ఉన్ముఖీకరణ చిత్రం | • ఉన్ముఖీకరణ చిత్రం ఆధారంగా పదాలు, వాక్యాలు రాయడం.<br>• చిత్రం ఆధారంగా చిత్రంలోని వ్యక్తుల గురించి రాయడం. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం మొదటి 45 ని॥లు | బోధనావ్యూహాలు / అభ్యసన అనుభవాలు | సామగ్రి | పిల్లలకు రెండవ 45 ని॥లలో కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 2వ పీరియడ్ | 'పిల్లలూ! ఇలా చేయండి' నిర్వహణ | • పలకరింపు<br>• పునశ్చరణ<br>• పిల్లలు పాడడం, ఉపాధ్యాయుడు గేయాలు పాడడం, పాడించడం<br>• పాఠం చిత్రం గురించి మాట్లాడడం<br>• సంభాషణలు చెప్పించడం<br>• పిల్లల బాహ్య పఠనం<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం<br>• పిల్లల మౌన పఠనం<br>• తెలియని పదాల కింద గీత గీయడం, పదాల పట్టిక చూడడం అర్థాలు తెల్సుకోవడం<br>• ఉపాధ్యాయుడి అర్థవివరణ<br>• పిల్లలతో సొంతవాక్యాలు చెప్పించడం | • నిఘంటువు<br>• పాఠ్యపుస్తకం | • పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యాలు రాయండి.<br>• పాఠం చిత్రం ఆధారంగా పదాలు, వాక్యాలు రాయండి.<br>• చిత్రంలోని వారి మధ్య జరిగే సంభాషణలు ఊహించి రాయండి. |
| 3వ పీరియడ్ | పాఠ్యబోధన - గేయంలోని మొదటి రెండు పాదాలు పవిత్ర భారత నుండి సోదరులకు మ్రొక్కండి వరకు<br>పేజి నెం. 2 | • ఉపాధ్యాయుడు పాడడం, పిల్లలతో పాడించడం<br>• పిల్లల బాహ్య పఠనం<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం<br>• పిల్లల మౌన పఠనం<br>• పాఠ్య విషయంపై చర్చ అవగాహన<br>• ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి-<br>ఉదా॥ సవిత్రి అంటే మీకు ఏం అర్థమైంది?<br>లాల్ ఖిలా ప్రత్యేకత ఏమిటి? | • గేయం చార్టు | • చదవడం, అర్థం చేసుకునే అభ్యాసం<br>• గేయం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం.<br>• మొదటి రెండు చరణాల సారాంశాన్ని రాయడం |
| 4వ పీరియడ్ | గేయంలోని 3, 4 చరణాలు 'మతం తలపక నుండి శంఖాలూదండి' వరకు<br>పేజి నెం. 2 | • ఉపాధ్యాయుడు పాడడం, పిల్లలు పాడడం<br>• పిల్లల బాహ్య పఠనం<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం<br>• పిల్లల మౌన పఠనం<br>• పాఠ్య విషయంపై చర్చ అవగాహన<br>• ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి-<br>ఉదా॥ పోరులమందిన అంటే మీకు ఏం అర్థమైంది?<br>హృదంబుజార్పణ అంటే ఏమిటి? | • గేయం చార్టు | • చదవడం, అర్థం చేసుకునే అభ్యాసం<br>• గేయం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం.<br>• 3, 4 చరణాల సారాంశం రాయడం |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం మొదటి 45 ని॥లు | బోధనావ్యూహాలు / అభ్యసన అనుభవాలు | సామగ్రి | పిల్లలకు రెండవ 45 ని॥లలో కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 5వ పీరియడ్ | మిగిలిన గేయాన్ని పూర్తిగా బోధించడం<br>ఇంటిపనిగా ప్రాజెక్టుపని ఇవ్వడం | • ఉపాధ్యాయుడు పాడడం, పిల్లలు పాడడం<br>• పిల్లల బాహ్య పఠనం<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం<br>• పిల్లల మౌన పఠనం<br>• పాఠ్య విషయంపై చర్చ అవగాహన భారత విజయం గురించి ఏమని, ఎందుకు పాడాలి? | • గేయం చార్టు | • 'చదవండి'లోని ప్రశ్నలకు జవాబులు రాయడం<br>• జెండా గురించి రాయడం<br>• గేయం పాదాల సారాంశం రాయడం |
| 6వ పీరియడ్ | వినడం, ఆలోచించి చెప్పడం<br>ధారాళంగా చదవడం అభ్యాసాల సాధన<br>ప్రశంస అభ్యాసాన్ని ఇంటిపనిగా ఇవ్వడం | • గేయానికి స్వతంత్రోత్సవం అనే పేరు సరైనదేనా?<br>• ఒక్కొక్క ప్రశ్నను పిల్లలందరిని అడగడం<br>• ఒకరితో సమాధానాన్ని పూర్తిగా చెప్పించడం<br>• ఉపాధ్యాయుడు క్రోడీకరించడం<br>• చదవడం కింద ఉన్న అభ్యాసాన్ని ఎలా చేయాలో సూచనలివ్వాలి. | • నల్లబల్లపై వినడం, ఆలోచించి చెప్పడం ప్రశ్నలు రాయడం | • పుస్తకంలోని ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడంలోని అభ్యాసాలు చేయించడం |
| 7వ పీరియడ్ | ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)<br>పేజి నెం. 5 | • ప్రశ్నల గురించి చర్చ / మాట్లాడించడం<br>• బ్రిటీష్ వారి పిశాచదాస్యం నశించాలని కవి ఎందుకు అన్నారు?<br>• స్వతంత్ర యోధులను స్మరించాలని కవి ఎందుకు అన్నారు?<br>• ఒక్కొక్క ప్రశ్న గురించి అడగాలి<br>• పిల్లలందరినీ మాట్లాడించాలి<br>• వ్యక్తిగతంగా, జట్టులో జవాబులు రాయమనాలి<br>• సరిదిద్దడం<br>• పిల్లలు రాసిన సమాధానాన్ని నల్లబల్ల / చార్టుపై రాయాలి.<br>• భావం సరిగా ఉందా. వాక్యాలు సరిగా ఉన్నాయా? సరైన పదాలు రాశారా? అక్షర దోషాలు ఏమున్నాయి? అని చర్చ ద్వారా సరిదిద్దాలి | • స్వీయరచన, ప్రశ్నలు నల్లబల్లపై రాయడం<br>• చార్టు, స్కేలు పెన్సిల్ | • ఆలోచించి సొంతమాటల్లో రాయండి. అభ్యాసంలోని ప్రశ్నలకు జవాబులు రాయండి.<br>1) బ్రిటిష్‌వారి పిశాచదాస్యం నశించిందని కవి ఎందుకన్నాడు?<br>2) మనం స్వాతంత్ర్య యోధులను స్మరించాలని కవి అన్నాడు కదా! ఎందుకు?<br>3) ఈ గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం మొదటి 45 ని॥లు | బోధనావ్యూహాలు / అభ్యసన అనుభవాలు | సామగ్రి | పిల్లలకు రెండవ 45 ని॥లలో కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 8వ పీరియడ్ | ప్రాజెక్టు పని ప్రదర్శన<br>పదజాల కృత్యాలు<br>పేజి నెం. 5<br>ప్రశంస ప్రదర్శన | • పిల్లలు రాసిన ప్రాజెక్టు పని నివేదికను చదివించడం<br>• సరిదిద్దడం<br>• పదజాలంలోని అభ్యాసాలను వ్యక్తిగతంగా / జట్టులో చేయించడం<br>• సరిదిద్దడం<br>• ప్రశంస అభ్యాసాన్ని ప్రదర్శింపజేయడం | • పదజాలం కృత్యాలు<br>• దేశం కోసం త్యాగం చేసిన వారి చిత్రాలు | • పాఠ్యపుస్తకంలోని పదజాలంలోని అభ్యాసాలు<br>• ప్రాజెక్టుపని గురించి నివేదిక రాయడం<br>• ప్రశంస అభ్యాసాన్ని రాయడం |
| 9వ పీరియడ్ | సృజనాత్మకత<br>పేజి నెం. 6 | • మేథోమథనం : దేశభక్తికి సంబంధించిన నినాదాల గురించి ప్రశ్నించడం<br>• సూచనలు ఇవ్వడం, అవగాహన కల్పించడం<br>• జట్లపని చేయించడం<br>• ప్రదర్శన - చర్చ<br>• సరిదిద్దడం | • నినాదాలు రాసిన చార్టు కరదీపిక, పోస్టరు | • సృజనాత్మకత అభ్యాసాలు రాయడం<br>• 'ప్రశంస'లోని అభ్యాసాలకు జవాబులు రాయడం |
| 10వ పీరియడ్ | భాషను గురించి తెలుసుకోవడం<br>నేనివి చేయగలనా? | • వాక్యాలు నల్లబల్లపై రాయడం<br>• భాషా భాగాల గురించి ప్రశ్నిస్తూ, చర్చ ద్వారా అవగాహన<br>• అట్లే విరామచిహ్నాల గురించి,<br>• నేనివి చేయగలనా? వ్యక్తిగతంగా గుర్తించడం<br>• ఎంతమంది చేయగలరో చేతులెత్తమనడం<br>• చేయలేని వారిని గుర్తించడం | | • భాషను గురించి తెలుసుకోవడం, అభ్యాసాలు రాయడం<br>• నేనివి చేయగలనా? లో వెనుకబడిన పిల్లలకు పునరభ్యాసం కల్పించడం |

**V. ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచార సేకరణ :** కింది వివరాలను, పాఠ్యాంశ బోధనకు అవసరమైన అందనపు సమాచారాన్ని రిఫరెన్సు పుస్తకాలు, గ్రంథాలయ పుస్తకాలు, ఇంటర్నెటు నుండి సేకరించి వివరాలు రాయాలి.

- ♦ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన వారి వివరాలు.
- ♦ దేశభక్తుల చిత్రాలు.
- ♦ కవి వేదుల సత్యనారాయణ గురించిన వివరాలు.
- ♦ గేయాన్ని రాగంతో పాడడం, అభ్యాసం చేయడం.
- ♦ మరికొన్ని దేశభక్తి పాటల సేకరణ.
- ♦ పాఠంలోని ప్రతి పదం గురించి అర్థం తెలుసుకోవడం, సొంతవాక్యాలలో చెప్పగలగడం.
- ♦ పాఠంలోని గేయ పాదాల గురించి సందర్భోచిత అంశాలను వివరించగలిగేలా సిద్ధం కావడం మొదలగునవి.

**VI. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :** పాఠం పూర్తయ్యాక ఉపాధ్యాయుడు తన అనుభవాలు అనుభూతులు, సామర్థ్యాల సాధన గురించి తన ప్రతిస్పందనలు రాసుకోవాలి.

# పీరియడ్ ప్రణాళిక

పాఠ్యప్రణాళిక అంటే పాఠానికి సంబంధించినదని తెల్సుకొన్నారు కదా! దీని ఆధారంగా పీరియడ్ / కాలాంశ ప్రణాళిక రాయాలి. పాఠ్యప్రణాళికలో రాసుకున్న కాలాంశాల ప్రకారం బోధన చేపట్టాల్సి ఉంటుంది. ప్రతి కాలాంశంలో ఆ కాలాంశానికి ఏమిబోధించాలి? ఏ సామర్థ్యాలను సాధించాలి? ఏ ఏ వ్యూహాలు పాటించాలి? అనే అంశాలను సవివరంగా కాలాంశ ప్రణాళికలో రాసుకోవాలి. కాలాంశ ప్రణాళిక నమూనాను పరిశీలించండి. పాఠ్యబోధన పూర్తిచేయడానికి అవసరమైన 10 పీరియళ్ళకు ఒక్కొక్కదానికి వివరంగా కాలాంశ ప్రణాళికను / పీరియడ్ ప్రణాళికను రాయాల్సి ఉంటుంది.

## అ) పీరియడ్ ప్రణాళిక – నమూనా

**I.** పాఠం పేరు : ..........................

**II.** పీరియళ్ళ సంఖ్య : ..........................

**III.** సమయం : ..........................

**IV.** బోధనాంశం / సామర్థ్యం / కృత్యం : ..........................

**V.** పీరియడ్ ద్వారా సాధించాల్సిన సామర్థ్యం : ..........................

**VI. a)** మొదటి 45 ని॥లలో నిర్వహించే బోధనా వ్యూహాలు, సోపానాలు :

| సోపానం | బోధనాభ్యసనన ప్రక్రియలు/ అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | సామగ్రి / వనరులు |
|---|---|---|---|
| | | | |

**b)** పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం)

**VII.** రెండవ 45 ని॥లలో పిల్లలకు కల్పించే అభ్యాసం :

**VIII.** ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :

## ఆ) కాలాంశ ప్రణాళిక - సోపానాల వివరణ

**I. పాఠం పేరు** : ఏ పాఠాన్ని బోధిస్తున్నారో ఆ పాఠం పేరు రాయాలి.

**II. పీరియడ్ సంఖ్య** : పాఠ్య ప్రణాళిక ప్రకారం ఆ రోజు ఏ పీరియడ్‌ను బోధిస్తున్నారో ఆ పీరియడ్ సంఖ్య రాయాలి. అంటే 1వ పీరియడ్, రెండవ పీరియడ్.... ఇలా పీరియడ్ సంఖ్య రాయాలి.

**III. సమయం** : ఆ పీరియడ్ బోధనకు నిర్ధారించిన సమయం తెలుగుకు ప్రాథమిక స్థాయిలో 90 ని॥లు ఉంటుంది. మొదటి 45 ని॥లు బోధనాంశం / సామర్థ్యానికి సంబంధించిన బోధనావ్యూహాలు, అభ్యసనానుభవాలు, రెండవ 45 ని॥లలో కల్పించాల్సిన అభ్యాసం / మూల్యాంకనం.

**IV. బోధనాంశం / సామర్థ్యం / కృత్యం :**

పాఠ్య ప్రణాళికను అనుసరించి ఆ రోజు బోధించే బోధనాంశం, సామర్థ్యం, కృత్యం

ఉదా : - ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం
- పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన
- స్వీయరచన అభ్యాసం సాధన

**V. పీరియడ్ ద్వారా సాధించాల్సిన సామర్థ్యం :**

ఆ పీరియడ్ ద్వారా విద్యార్థులలో ఏ ఏ సామర్థ్యాలు సాధించదలచారో వాటిని రాయాలి. ఈ పీరియడ్‌కు సంబంధించిన బోధనాంశం ద్వారా సాధించాలినుకుంటున్న సామర్థ్యాల వివరాలు రాయాలి. దీన్ని సాధించడమే పీరియడ్ ప్రణాళిక యొక్క ప్రధాన ఉద్దేశం. ఇందుకనుగుణంగానే బోధనావ్యూహ్యాలు, అభ్యాసం / మూల్యాంకనం ఉంటుంది.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనా వ్యూహాలు / సోపానాలు :**

బోధనాంశం / సామర్థ్యాల సాధన / కృత్యాలకు సంబంధించిన సోపానాలు, నిర్వహణ వివరాలు కింది పట్టికలో రాయండి.

| సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | సామగ్రి / వనరులు |
|---|---|---|---|
| | | | |

పై పట్టికలో 1వ గడిలో సోపానాలు రాయాలి. బోధించే అంశం, పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకొని సోపానాలు రాయాలి. ఉదా: 1వ పీరియడ్‌లో ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం బోధనాంశం ఐతే మొదటి 45 ని॥లలో ఇంతకు ముందే చర్చించిన విధంగా 3 భాగాలు ఉంటాయి. అవి 1) ఉపోద్ఘాతం, 2) చర్చ-అవగాహన లేదా సామర్థ్యాల సాధన 3) పిల్లల అవగాహన పరిశీలన. వీటిలో ఒక్కొక్క దానికి సంబంధించిన సోపానాలను పేజి సంఖ్య 72, 73లో చర్చించిన విధంగా రాసుకోవాలి. ఉపోద్ఘాతంలో పలకరింపు, ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం, శీర్షికాప్రకటన, పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం అనేవి సోపానాలుగా రాయాలి. 'పాఠ్యాంశంపై చర్చ - అవగాహన' అనే దానికోసం చిత్రాన్ని పరిశీలింపజేయడం, ఆలోచింపజేసే ప్రశ్నలు అడగడం, సంభాషణలు చెప్పించడం వంటి సోపానాలు రాయాలి. ఆ పీరియడ్‌లోని వారికి పిల్లల అవగాహనను పరిశీలించడానికి సామర్థ్యాల వారీగా ప్రశ్నలు అడగడం వంటి సోపానాలు రాయాలి.

రెండవగడిలో బోధనాభ్యసన ప్రక్రియలు, అభ్యసనానుభవాల వివరాలు రాయాలి. ఒకటవ గడిలో రాసిన సోపానానికి అనుగుణంగా సవివరంగా ఎలా నిర్వహిస్తారో, ఏం చేస్తారో ఆ వివరాలను రాయాలి.

ఇలా రెండవ అంశం బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలలో 45 ని॥ల కాలాంశానికి సంబంధించి తరగతిగదిలో ఏ బోధన అభ్యసన ప్రక్రియలు చేపడతారో రాయాలి. ఇందులో ఆలోచింపజేసే ప్రశ్నలు అడగడం, పిల్లల అనుభవాలకు అభిప్రాయాలకు అవకాశం ఇవ్వడం, చర్చ జరపడం, సామగ్రిని వినియోగించడం వంటివి చోటుచేసుకుంటాయి.

పట్టికలోని 3వ గడిలో నల్లబల్ల పనిలో ఆ రోజు బోధించే బోధనాంశానికి సంబంధించి బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా పదజాలం, కీలకపదాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు వంటివి నల్లబల్లపై రాయాలి.

పట్టికలోని 4వ గడిలో బోధనాభ్యసన సామగ్రి / వనరుకు సంబంధించినది. ఈ గడిలో ఆ కాలాంశంలో బోధనాభ్యసనకు ఉపకరించే సామగ్రి, వనరుల గురించి రాయాలి.

**b) మొదటి నలభై ఐదు నిముషాలలో చివరకు – ఆఖరి అంశం పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం) :** ఈ సోపానంలో ఆ రోజు మొదటి 45 ని॥లలో బోధించిన అంశం గురించి పిల్లలు ఏ మాత్రం అర్థం చేసుకున్నారో అవగాహనను పరిశీలించే ప్రశ్నలు అడగాలి. అలాగే అన్వయింపజేసే ప్రశ్నలు అడగాలి.

**VII. రెండవ 45 ని॥లలో పిల్లలకు కల్పించే అభ్యాసం** : ఒక పీరియడ్‌లో మొదటి నలభై ఐదు నిముషాల ఆధారంగా నిర్వహించిన బోధనాంశం / సామర్థ్యాల సాధనకు సంబంధించిన సామర్థ్యాలపై రెండవ 45 ని॥లలో పిల్లలకు అభ్యాసం కల్పించాలి. ఈ వివరాలను ఇక్కడ రాసుకోవాలి.

**VIII. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు** : 1వ పీరియడ్ పూర్తయిన తరవాత అంటే 90 ని॥లు (మొదటి 45 ని"లు బోధనాభ్యసన ప్రక్రియలు / రెండవ 45 ని॥లు పిల్లలకు కల్పించే అభ్యాసం) పూర్తయిన తరవాత ఆరోజు ఉపాధ్యాయుడు తన అనుభవాలు, పిల్లల ప్రతిస్పందన, భాగస్వామ్యం, వాటి వివరాలను రాసుకోవాలి.

ఒక్కొక్క పీరియడ్ అనగా 90 ని॥లకు సంబంధించిన సోపానాలు, వాటిని ఎలా రాయాలో వివరాలు తెల్సుకున్నారు కదా! ఇప్పుడు ఒక్కొక్క పీరియడ్ వారీగా నమూనా ప్రణాళికలను పరిశీలిద్దాం!

*భాషా సంస్కరణ తాపత్రయం*

*పిల్లలను సంస్కరించాలని మనకు మహా తాపత్రయం... "వాళ్ళు తప్పులు మాట్లాడతారు. మంచిగా మాట్లాడరు. చదువుకొన్న వాళ్ళ మాటలు వాళ్ళకి రావాలి. మరీ పేదపిల్లల యాస ఘోరంగా ఉంటుంది. అంతా అనాగరికం. ఇవన్నీ సరిచేసి శుద్ధభాషను నేర్పడానికి కదా బడి ఉండేది" అని మన దృఢమైన విశ్వాసం.*

*పసిపిల్లలు 'బడికిపోతా' అనకుండా 'బలికి పోతా' అనే అంటారు. దాన్ని సంస్కారహీనం అని మనం అనడంలేదు. 'బలికి పోతా' అన్నప్పుడే దండించి, పదిసార్లు సరిగా పలికించి, పదిసార్లు రాయించి ఉంటే మన పిల్లలకు భాషవచ్చేది కాదేమో! మనం పిల్లల్ని ధారాళంగా మాట్లాడనిస్తున్నాం. స్వేచ్ఛగా మాట్లాడనిస్తున్నాం, ప్రోత్సహిస్తున్నాం. సమాజంలో పెరిగే కొద్దీ, పాల్గొనే కొద్దీ ఏది తప్పో, ఏది ఒప్పో పిల్లలే తెల్సుకొంటున్నారు. మరి మన బళ్ళలో జరుగుతున్నదేమిటి?*

*పిల్లల్ని ప్రేమించడమంటే వాళ్ళ సామాజిక పునాదుల్ని, భాషనూ ప్రేమించడమే! మన బళ్ళో, పుస్తకాల్లో పిల్లల భాష ఉండదు. కనీసం మనం బడి గోడలమీద రాసే నినాదాల్లో, సూక్తుల్లో కూడా పిల్లల విషయాలూ, మాటలూ ఉండవు. ఇక మిగిలింది ఒకటే మార్గం పిల్లలు పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడుకోవడం, దానికీ మనం నిషేధం విధిస్తే ఎలా? పిల్లలకు స్వేచ్ఛనిస్తే, స్వేచ్ఛగా మాట్లాడిస్తే మనల్ని ప్రశ్నిస్తారు, విసిగిస్తారు, అడ్డదిడ్డపు జవాబులు చెపుతారు అని ఆలోచిస్తాం. దీన్నుంచి మనం బయటపడాలి. పిల్లల మాటల్లో భిన్నాభిప్రాయాలు, విరుద్ధాంశాలు వ్యర్థమైనా మనం వినాలి. ఈ ఘర్షణ నుండే జ్ఞానం వికసిస్తుంది. దీన్ని మనం ఒప్పుకొని, అమలుపరిస్తే చాలా సమస్యలు మటుమాయమౌతాయి.*

*– చదువు విజ్ఞానం, ఏప్రిల్ 1999*

## ఇ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 1 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం.

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :
1. వినడం – ఆలోచించి మాట్లాడడం :
   - ఉన్ముఖీకరణ చిత్రం గురించి స్వేచ్ఛగా మాట్లాడగల్గాలి.
   - స్వతంత్రోత్సవ గేయాన్ని రాగయుక్తంగా పాడడం.
2. పదజాలం :
   - చిత్రం గురించిన పదాలను చెప్పగలరు. సొంతవాక్యాలలో చెప్పగలరు.
3. స్వీయరచన :
   - ఒక దేశనాయకుని గురించి పేరా రాయగలరు.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం**<br>1) పలకరింపు<br>2) ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం | పిల్లలూ! శుభోదయం. బాగున్నారా?<br>చిత్రం గురించి మాట్లాడించడం (పిల్లల్ని పాఠం వైపునకు మళ్ళింపజేయడానికి పాఠ్యపుస్తకంలోని ఉన్ముఖీకరణ చిత్రం గురించి ఆలోచింపజేసే ప్రశ్నలను అడుగుతాను.)<br>పిల్లలూ! 1వ పేజీలోని చిత్రాన్ని చూసి, జవాబులివ్వండి.<br>♦ చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?<br>♦ చిత్రంలో ఉన్న వారిని గురించి మీకు తెల్సింది చెప్పండి.<br>♦ చిత్రంలో ఉన్నవారు కాకుండా మీకు తెలిసిన ఇంకొంత మంది దేశనాయకుల పేర్లు చెప్పండి. | పిల్లలు చెప్పిన సమాధానాల్ని నల్లబల్లపై రాస్తాను.<br>దేశనాయకుల పేర్లు వారికి సంబంధించిన విషయాలు నల్లబల్లపై రాస్తాను. | ఉన్ముఖీకరణ చిత్రంలో ఇచ్చిన దేశ నాయకుల చిత్రాలతోపాటు మరికొందరి దేశనాయకుల చిత్రాలు.<br>వారికి సంబంధించిన వివరాలు తెలిపే పుస్తకాలు |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| | ♦ ఒక్కొక్కరి గురించి ఒక్కొక్క వాక్యం చెప్పండి.<br>♦ దేశనాయకుల్లో మీకిష్టమైనవారు ఎవరు? ఎందుకిష్టమో చెప్పండి!<br>♦ రిపబ్లిక్ దినోత్సవం కాకుండా మీ పాఠశాలలో ఏయే సందర్భాలలో జెండా పండుగ జరుపుకొంటారు?<br>♦ ఎలా జరుపుకుంటారో చెప్పండి.<br>♦ మీకు తెలిసిన దేశభక్తి గేయాలను పాడండి.<br>(ఈ ప్రశ్నలే కాకుండా సందర్భోచితంగా మరికొన్ని అనుబంధ ప్రశ్నల్ని కూడా అడుగుతాను.)<br>♦ నల్లబల్లపై రాసినవన్నీ ఒకరి తరవాత ఒకరు చదవండి. | ♦ పిల్లలు చెప్పిన దేశనాయకుల పేర్లు రాయడం.<br>♦ పిల్లలు చెప్పిన వాక్యాలు రాయడం. | కొన్ని దేశభక్తి గేయాలు లేదా దేశభక్తి గేయాలకు సంబంధించిన సి.డి.లు, వీడియోలు. |
| 3) శీర్షికా ప్రకటన | స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల గురించి మాట్లాడారు కదా! ఆ వీరులను స్మరించుకొంటూ స్వతంత్రోత్సవం పేరుతో మీకో గేయాన్ని పరిచయం చేశారు. దాన్నిప్పుడు నేర్చుకొందాం. | స్వతంత్రోత్సవం | |
| 4) నేపథ్యం | మన దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో వీరులు పోరాడారు. ఎందరో కవులు తమ దేశభక్తి గీతాలతో ప్రజలను ఉత్తేజపరుస్తూ స్ఫూర్తిని నింపారు. ఈ పాటలే ఉద్యమ స్ఫూర్తిని కలిగించి స్వాతంత్ర్య సమరానికి ప్రజలను సన్నద్ధులను చేశాయి. అటువంటి దేశభక్తి గేయాన్ని మీరు ఈ పాఠంలో నేర్చుకొంటున్నారు. | | |
| 5) కవిపరిచయం | 'స్వతంత్రోత్సవం' అనే ఈ దేశభక్తి గేయాన్ని వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు రాశారు. ఈయనకు 'గౌతమీ కోకిల' అనే బిరుదు ఉంది. | వేదుల సత్యనారాయణ బిరుదు గౌతమి కోకిల | వేదుల సత్యనారాయణ గారి ఛాయాచిత్రం |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **II. పాఠ్యాంశంపై చర్చ - అవగాహన** | | | |
| 1) పిల్లలతో గేయం పాడించడం | పిల్లలూ! స్వతంత్రోత్సవం గేయాన్ని మీరెవరైనా పాడతారా? మీకు వచ్చినట్లుగా పాడండి. ఎవరిలాగా పాడతారో చూద్దాం! | | స్వతంత్రోత్సవం గేయం దేశభక్తి గీతాల CD |
| 2) ఉపాధ్యాయుడు పాడడం | పిల్లలూ! నేనీ గేయాన్ని రాగయుక్తంగా, లయబద్ధంగా పాడి వినిపిస్తాను. వినండి. | | |
| 3) పిల్లలతో పాడించడం | పిల్లలూ! నేను పాడగా విన్నారు కదా! ఇప్పుడు నన్ను అనుసరిస్తూ గేయాన్ని పాడండి. | | |
| 4) చిత్రం ఆధారంగా సంభాషణలు | పిల్లలూ! ఇంతకుముందు చిత్రం గురించి ప్రశ్నలకు జవాబులు చెప్పారు కదా! ఈ చిత్రం ఆధారంగా సంభాషణలు అంటే ఎవరైనా ఇద్దరు వచ్చి ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారో ఊహించి మాట్లాడండి. | సంభాషణలు నల్లబల్లపై రాయాలి | |

**VI. b) పిల్లల అవగాహన - పరిశీలన (మూల్యాంకనం)**

పిల్లలూ! మీరు గేయాన్ని చక్కగా పాడారు. ఇప్పుడీ గేయం గురించి కొన్ని ప్రశ్నలు అడుగుతాను. చెప్పండి.

1. గేయాన్ని విన్నప్పుడు మీకేమనిపించింది?
2. ఇలాంటి గేయాలు ఎప్పుడెప్పుడు పాడుతారు?
3. మీరీ రోజు ఏయే దేశ నాయకుల గురించి మాట్లాడారు?
4. అందరూ మాట్లాడారు కదా! ఎవరు మాట్లాడింది మీకు బాగా నచ్చింది? ఎందుకు?
5. మీరు పాడిన దేశభక్తి పాటలలో ఎవరు బాగా పాడారు?

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) పదజాలంపై అభ్యాసం కల్పించడం | పిల్లలూ! ఉన్ముఖీకరణ చిత్రంలో ఎవరెవరున్నారో చెప్పారు కదా! ఇప్పుడు మీరు ఎవరికి వారు (వ్యక్తిగతంగా) దేశనాయకుల పేర్లు రాయండి. వారిని గురించి ఒక వాక్యం రాయండి. | ♦ దేశనాయకుల పేర్లు రాయండి.<br>♦ వారి గురించి ఒక్కోవాక్యం రాయండి.<br>♦ మీకు నచ్చిన దేశనాయకుల గురించి 5, 6 వాక్యాలలో ఒక పేరారాయండి. | |
| ఆ) స్వీయ రచనపై అభ్యాసం కల్పించడం | పిల్లలూ! మీకు నచ్చిన దేశనాయకుల గురించి 5, 6 వాక్యాలలో ఒక పేరా రాయండి. (వ్యక్తిగత / జట్టు కృత్యం) | | |
| ఇ) పిల్లలు రాసిన వాటిని ప్రదర్శించడం | పిల్లలూ! ఎవరెవరు ఏమేమి రాశారో చదివి వినిపించండి.<br>♦ ముందుగా వాక్యాలు చదవండి.<br>♦ స్వీయరచనలో ఇచ్చిన అంశాన్ని ఇద్దరు, ముగ్గురు పిల్లలు చదవండి. | | |
| ఈ) పిల్లలు ప్రదర్శించిన వాటిని సరిచెయ్యడం | మీరందరూ చాలా బాగా రాశారు. కాని ఎక్కడన్నా చిన్న చిన్న దోషాలుంటే వాటిని సరిచేసుకొందామా!... (అని చెప్పి వారితో చర్చించుకొంటూనే వారి భాషాదోషాలు / భావదోషాలు వంటివి సవరిస్తాను.) | | |
| VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 2 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** పఠన కృత్యాలు - అర్థసంగ్రహణ

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :

1. వినడం - ఆలోచించి మాట్లాడడం :
   - ♦ స్వతంత్రోత్సవం పాఠం చిత్రం గురించి స్వేచ్ఛగా మాట్లాడగలగడం.
   - ♦ స్వతంత్రోత్సవ గేయాన్ని రాగయుక్తంగా పాడగలగడం.
2. చదవడం - అర్థంచేసుకోవడం :
   - ♦ పాఠాన్ని చదివి పదాలకు అర్థాలను గ్రహించడం.
   - ♦ పాఠాన్ని ధారాళంగా, తప్పుల్లేకుండా చదవడం.
3. పదజాలం :
   - ♦ పదాల అర్థాలను సందర్భోచిత వాక్యాలలో ప్రయోగం చేయడం.
4. స్వీయరచన :
   - ♦ పాఠం చిత్రం ఆధారంగా సంభాషణలు చెప్పగలగడం. రాయడం.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం** | | | |
| 1) పలకరింపు | పిల్లలూ! శుభోదయం. | | |
| 2) పునశ్చరణ | పిల్లలూ! నిన్న నేర్చుకున్న గేయాన్ని అందరూ కలిసి పాడండి. నిన్న మీరు ఉన్ముఖీకరణ చిత్రం చూసి ఎవరెవరి గురించి మాట్లాడారు? | | గేయం రాసి ఉన్న చార్టు. |
| **II. పాఠ్యాంశంపై చర్చ-అవగాహన** | | | |
| 1. ఉపాధ్యాయుడు పాడడం | చక్కగా చెప్పారు పిల్లలూ! ఇప్పుడు గేయాన్ని మరొకసారి నేను పాడుతాను వినండి. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| 2) పిల్లలతో పాడించడం | పిల్లలూ! నేను పాడగా విన్నారు కదా! ఇప్పుడు నన్ను అనుసరిస్తూ గేయాన్ని పాడండి. | | |
| 3) పాఠం చిత్రం గురించి మాట్లాడించండి<br>పేజి నెం : 2-3 | పిల్లలూ! గేయాన్ని బాగా పాడారు. ఇప్పుడు 2, 3 పేజీల్లోని పాఠం చిత్రం చూడండి.<br>♦ చిత్రంలో ఏమేమి ఉన్నాయి?<br>♦ చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?<br>♦ చిత్రంలో పిల్లలు ఏం చేస్తున్నారు? ఇలా ఎందుకు చేస్తున్నారు?<br>♦ మీరు ఇలా పాటలను ఎప్పుడెప్పుడు ఏ ఏ సందర్భాలలో పాడారు?<br>♦ చిత్రంలోని పటం గురించి మీకేమి తెలుసో చెప్పండి.<br>♦ చిత్రంలో కన్పించే పర్వతాల గురించి చెప్పండి. | <u>పిల్లలు చెప్పిన సమాధానాలను నల్లబల్లపై రాస్తాను</u><br>♦ పిల్లలు చెప్పిన పదాలు<br>♦ పిల్లలు చెప్పిన వాక్యాలు | పాఠ్యపుస్తకం |
| 4) సంభాషణలు చెప్పించడం | 3వ పేజీలో జెండా పట్టుకున్న పిల్లవాడితో ముందున్న పిల్లవాడు ఏం మాట్లాడుతున్నాడో ఊహించి చెప్పండి.<br>(అనుబంధ ప్రశ్నలు వేస్తూ పిల్లలను మాట్లాడిస్తాను. పాఠం చిత్రం ఆధారంగా పదాలు, వాక్యాలు, సంభాషణలు చెప్పిస్తాను.) | | |
| 5) పిల్లల బాహ్యపఠనం | పిల్లలూ! చాలా చక్కగా మాట్లాడారు. ఇప్పుడు నేను చెప్పినవారు గేయ పాఠాన్ని చదవండి. (ఇద్దరు ముగ్గురు పిల్లలతో బాహ్యపఠనం చేయిస్తాను. ఉచ్చారణ దోషాలు సవరిస్తాను.) | | |
| 6) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | పిల్లలూ! మీరు చదివారుకదా! ఇప్పుడు నేను చదువుతాను. జాగ్రత్తగా వినండి.<br>(నేను స్పష్టమైన ఉచ్చారణతో చదివి వినిపిస్తాను.) | | |
| 7) పిల్లల మౌనపఠనం | పిల్లలూ! నేను చదివింది విన్నారు కదా! ఇప్పుడు మీరు మౌనంగా పాఠాన్ని చదవండి. ఇలా చదివేటప్పుడు మీకు అర్థంకాని పదాల కింద గీతగీయండి. | | పాఠ్యపుస్తకం |
| 8) అర్థ సంగ్రహణం | పిల్లలూ! మీకు అర్థంకాని పదాల కింద గీత గీసారు కదా! 131వ పేజీలో ఉన్న పదాలు - అర్థాల పట్టిక చూసి పదాల అర్థాలను రాయండి. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| • జట్టుపని | పిల్లలూ! మీకు ఇంకా తెలియని పదాలు ఉంటే జట్టులో కూర్చుని మీ మిత్రులతో చర్చించి అర్థాలను రాయండి. అవసరమనుకున్నచోట నిఘంటువును ఉపయోగించండి. | | నిఘంటువు |
| • పదాల అర్థాలను పిల్లలచే చదివించండి | పిల్లలూ! ఇప్పుడు మీరు రాసిన పదాల అర్థాలను చదవండి. | పిల్లలు చెప్పిన పదాలను, అర్థాలను నల్లబల్లపై రాస్తాను | |
| • ఉపాధ్యాయుని అర్థ వివరణ | పిల్లలూ! ఇంకా మీకు అర్థం తెలియని పదాలు ఉంటే చెప్పండి. నేను వివరిస్తాను. (పిల్లలు చెప్పిన పదాల అర్థాలను సందర్భోచిత వాక్యాల ద్వారా వివరిస్తాను.) | | |
| • పదాలతో సొంత వాక్యాలు చెప్పించడం | పిల్లలూ! పదాలు, అర్థాలు బాగా చదివారు, తెలుసుకున్నారు కదా! ఇప్పుడు ఈ పదాల నుండి ఒక్కొక్కరు ఒక పదాన్ని ఉపయోగించి ఒక్కో సొంతవాక్యం చెప్పండి.<br>పిల్లలూ! బాగా చెప్పారు. | పిల్లలు చెప్పిన సొంతవాక్యాలను నల్లబల్లపై రాస్తాను | |
| **VI. b) పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం)** | పిల్లలూ! ఈ రోజు మీరు గేయాన్ని బాగా పాడారు. చిత్రం గురించి మాట్లాడారు. అలాగే పాఠం చదివి అర్థాలను గ్రహించారు కదా! ఈ రోజు మీరు నేర్చుకున్న అంశాల గురించి అడుగుతాను చెప్పండి.<br>♦ గేయాన్ని రాగంతో పాడండి.<br>♦ చిత్రం గురించి ఎవరెవరు ఏమేం మాట్లాడారు?<br>♦ చిత్రం గురించి సంభాషణలు చెప్పిన వారిలో ఎవరి సంభాషణ బాగుంది. ఎందుకు?<br>♦ ఈ రోజు మీరు చదివిన పాఠంలో మీరు నేర్చుకున్న కొత్తపదాలు ఏవి వాటిని ఏ సందర్భాలలో ఉపయోగిస్తామో చెప్పండి. | | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) పదజాలంపై అభ్యాసం కల్పించడం | పిల్లలూ! పాఠం చదివి అర్థాలను చెప్పారు కదా! ఇప్పుడు ఎవరికి వారు ఆ అర్థాలను రాయండి. ఆ పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి. | | |
| ఆ) స్వీయ రచనపై అభ్యాసం కల్పించడం | పిల్లలూ! పాఠం చిత్రం గురించి సంభాషణలు చెప్పారు కదా! నలుగురు చొప్పున జట్లలో కూర్చుని సంభాషణలు రాయండి. | | |
| ఇ) పిల్లలు రాసిన వాటిని ప్రదర్శించడం | పిల్లలూ! రాయడం పూర్తి చేసారా! ఇప్పుడు ఎవరెవరు ఏమేమి రాసారో చదివి వినిపించండి.<br>(ముందుగా పదజాలం అభ్యాసాన్ని చదివిస్తాను. తర్వాత జట్లలో రాసిన సంభాషణలను చదివిస్తాను.) | | |
| ఈ) పిల్లలు ప్రదర్శించిన వాటిని సరిచెయ్యడం | మీరందరూ చాలా బాగా రాసారు. ఇప్పుడు రాసిన వాటిలో ఏవైనా దోషాలు ఉంటే సరిచేద్దామా! సరిచేసిన తరువాత మీ నోటు పుస్తకాలలో రాసుకోండి.<br>మీరు రాసిన సంభాషణను ఇద్దరు సాధన చేయండి. రేపు ప్రదర్శించాల్సి ఉంటుంది. | | |
| VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 3 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన మొదటి 2 చరణాలు

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :
1. చదవడం - అర్థంచేసుకొనిచెప్పడం : ♦ పాఠాన్ని ధారాళంగా స్పష్టమైన ఉచ్చారణతో చదవగలగడం.
2. వినడం - మాట్లాడడం : ♦ పాఠ్యాంశ బోధనలోని అంశాన్ని అవగాహన చేసుకోవడం, ఆలోచింపజేసే ప్రశ్నలకు ప్రతిస్పందించడం, చర్చలో పాల్గొనడం.
3. స్వీయరచన : ♦ అవగాహన చేసుకొన్న విషయాన్ని సొంతమాటల్లో చెప్పగలగడం, రాయగలగడం.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం** | | | |
| 1) పలకరింపు | పిల్లలూ! శుభోదయం. ఎలా ఉన్నారు? | | |
| 2) పునశ్చరణ | పిల్లలూ! మీరు నిన్న రాసిన సంభాషణలను నాటకీకరణ చేయండి.<br>(పిల్లలు రాసిన సంభాషణతో నాటకీకరణ చేయించడం)<br>నిన్న మీరు ఏఏ పదాలకు అర్థాలను గ్రహించారో చెప్పండి.<br>(ఇద్దరు ముగ్గురు పిల్లల్ని అడగడం)<br>ఒకరు గేయాన్ని పాడి వినిపించడం. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **II. పాఠ్యాంశంపై చర్చ-అవగాహన** | | | |
| పవిత్ర భారత సవిత్రి కోహూ నుండి సోదరులారా మొక్కండి వరకు 2 చరణాలు | పిల్లలూ! ఈ రోజు గేయంలోని మొదటి రెండు చరణాలను నేర్చుకుందాం.<br>♦ పాఠ్యపుస్తకం చూడండి.<br>♦ "పవిత్ర భారత సవిత్రి కోహో............ మొక్కండి" వరకు చూడండి. | స్వతంత్రోత్సవం | గేయం రాసి ఉన్న చార్టు. |
| 1. ఉపాధ్యాయుడు పాడడం | పిల్లలూ! ఈ రెండు చరణాలు నేను అభినయంచేస్తూ పాడుతాను వినండి.. (అభినయం చేయాలి.) | | |
| 2) పిల్లలచేత పాడించడం | పిల్లలూ! నేను పాడిన గేయాన్ని విన్నారు కదా! ఇప్పుడు నన్ను అనుసరిస్తూ మీరు గేయం పాడండి. అభినయం చేయండి. | | |
| 3) పిల్లల బాహ్యపఠనం | పిల్లలూ! మొదటి 2 చరణాలను నేను అడిగినవారు చదవండి. | | |
| 4) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను. శ్రద్ధగా వినండి. | | |
| 5) పిల్లల మౌన పఠనం | పిల్లలూ! నేను చదివింది విన్నారు కదా! ఇప్పుడు మీరు మౌనంగా 2 చరణాలను చదవండి. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| 6) చర్చ – అవగాహన | పిల్లలూ! గేయంలోని 2 చరణాలు చదివారు కదా! మీకు ఏమి అర్థమైందో చెప్పాలి.<br>♦ పిల్లలూ! గేయం పేరు స్వతంత్రోత్సవం కదా! అంటే మీకు ఏమి అర్థమైందో చెప్పండి.<br>♦ 'పవిత్ర భారత సవిత్రి' అని కవి ఎవరిని ఉద్దేశించి అన్నారు?<br>♦ 'పవిత్ర భారత సవిత్రి కోహో' అంటే మీకేం అర్థమైంది?<br>♦ త్రివర్ణ కేతనమంటే ఏమిటి? అందులో ఏమేమి ఉంటాయి?<br>♦ గేయం మొదటి చరణాల సారాంశం ఏమిటి?<br>♦ 'మతం తలపక' అంటే మీరేం అర్థం చేసుకున్నారు?<br>♦ ద్వేషం–రోషం ఎవరైనా ఎందుకు మరవాలి?<br>♦ గేయంలో రెండవ చరణం దేని గురించి చెబుతోంది?<br>♦ గేయంలోని మొదటి 2 చరణాల సారాంశం చెప్పండి.<br>పిల్లలూ! చాలా బాగా చెప్పారు. 3వ పేజీలో ఉన్న మొదటి 2 చరణాల గేయ పంక్తుల సారాంశాన్ని చదవండి.<br>(పిల్లలతో చర్చించుకుంటూ కీలక పదాలు, భావనలపై అర్థం చేయిస్తాను.) | <u>కీలక పదాలను రాయడం</u><br>ఉదా: స్వతంత్రోత్సవం<br>త్రివర్ణ కేతనం<br>సవిత్రి కోహో<br>మతం తలపక<br>ద్వేషం – రోషం | పదాలు – అర్థాలు ఉన్న చార్టు |
| VI. b) పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం) | పిల్లలూ! గేయ సారాంశాన్ని బాగా చెప్పారు.<br>♦ గేయాన్ని ఒకరు అభినయంతో పాడి చూపండి.<br>♦ గేయ సారాంశాన్ని నేనడిగినవారు సొంతమాటల్లో చెప్పండి.<br>♦ స్వతంత్ర శంఖాలను ఎందుకు ఊదాలని కవి చెప్పారు?<br>♦ 'పిశాచదాస్యం' అని కవి ఎవరి గురించి చెప్పారు? అలా ఎందుకు చెప్పారు? | | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) చదవడంపై అభ్యాసం కల్పించడం | పిల్లలూ! గేయంలోని మొదటి 2 చరణాలను చదివి ప్రాస పదాలను రాయండి.<br>పిల్లలూ! గేయంలోని మొదటి 2 చరణాల ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.<br>♦ గేయంలో మనం దేన్ని మరవాలని చెప్పారు?<br>♦ స్వతంత్ర శంఖాలు ఎలా ఊదాలి? | ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి<br><u>చదవడం - అర్థం చేసుకొని వ్యక్తపరచడం</u><br>♦ గేయంలోని మొదటి 2 చరణాలను చదివి ప్రాస పదాలు రాయండి.<br>♦ గేయంలో మనం దేన్ని మరవాలని కవి చెప్పారు.<br>♦ స్వతంత్ర శంఖాలు ఎలా ఉండాలి? | |
| ఆ) స్వీయ రచనపై అభ్యాసం కల్పించడం | పిల్లలూ! 2 చరణాల సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి. | <u>స్వీయరచన</u><br>రెండు చరణాల సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి | |
| **VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు** | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 4 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** పాఠ్యాంశ బోధన చర్చ - అవగాహన 3, 4 చరణాలు

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :
1. వినడం - మాట్లాడడం : ♦ పాఠ్యాంశ విషయాన్ని అవగాహన చేసుకోవడం, ఆలోచింపజేసే ప్రశ్నలకు ప్రతిస్పందించడం. చర్చలో పాల్గొనడం.
2. చదవడం - అర్థంచేసుకొనిచెప్పడం : ♦ పాఠాన్ని ధారాళంగా స్పష్టమైన ఉచ్చారణతో చదవగలగడం. ప్రశ్నలకు సమాధానాలు రాయడం.
3. స్వీయరచన : ♦ అవగాహన చేసుకొన్న విషయాన్ని సొంతమాటల్లో చెప్పగలగడం, రాయగలగడం.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

**a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం**

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం** | | | |
| 1) పలకరింపు | పిల్లలూ! శుభోదయం. అంతా బాగున్నారా! అందరూ వచ్చారా? ఏం చేస్తున్నారు? | | |
| 2) పునఃశ్చరణ | పిల్లలూ! నిన్న గేయం 2 చరణాల గురించి చెప్పండి.<br>మొదటి 2 చరణాలు పాడండి. | | |
| **II. పాఠ్యాంశంపై చర్చ-అవగాహన** | | | |
| నెత్తురులోడ్చిన.... నుండి సోదరులారా! చేయండి వరకు | పిల్లలూ! ఈ రోజు గేయంలోని 3, 4 చరణాలను నేర్చుకుందాం. | | గేయం రాసిన చార్టు. |
| 1. ఉపాధ్యాయుడు పాడడం | పిల్లలూ! 3, 4 చరణాలు నేను పాడుతాను వినండి. (అభినయం చేస్తూ పాడడం) | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| 2) పిల్లలచేత పాడించడం | పిల్లలూ! నేను పాడిన గేయాన్ని విన్నారు కదా! ఇప్పుడు నన్ను అనుసరిస్తూ మీరు కూడా అభినయంచేస్తూ పాడండి. | | గేయం రాసిన చార్టు. |
| 3) పిల్లల బాహ్యపఠనం | పిల్లలూ! 2వ పేజీలోని 3, 4 చరణాలను నేను అడిగినవాళ్ళు చదవండి. | | |
| 4) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను. శ్రద్ధగా వినండి. | | |
| 5) పిల్లల మౌన పఠనం | పిల్లలూ! నేను చదివింది విన్నారు కదా! ఇప్పుడు మీరు మౌనంగా 3, 4 చరణాలను చదవండి. | | |
| 6) చర్చ – అవగాహన | పిల్లలూ! గేయంలోని 3, 4 పాదాలు చదివారు కదా! మీకు ఏమి అర్థమైందో చర్చించుకుందామా.<br>♦ నెత్తురులోడ్చిన సత్తువలూడ్చిన అంటే మీకు ఏమి అర్థమైంది?<br>♦ పిశాచదాస్యం నశించిందని కవి ఏ అర్థంలో అన్నారు?<br>♦ స్వతంత్ర శంఖాలు ఎలా ఊదాలి? ఎందుకు ఊదాలని చెప్పారు?<br>♦ ప్రపంచమంతా ప్రతిధ్వనించేలా దేనిగురించి ఏమి చాటి చెప్పాలి?<br>♦ పోరుల మందిన అంటే అర్థం ఏమిటి?<br>♦ కారల కుందిన అని కవి ఎందుకన్నాడు?<br>♦ స్వతంత్ర యోధులను ఎందుకు స్మరించుకోవాలి?<br>♦ 'ముదశ్రు తర్పణం హృదంబుజార్పణ' అంటే మీకు ఏమి అర్థమైంది?<br>పిల్లలూ! చాలా బాగా చెప్పారు.<br>3వ పేజీలో ఉన్న మొదటి 3, 4 చరణాల సారాంశాన్ని చదవండి.<br>(ఇలా పిల్లలతో చర్చించుకుంటూ కీలక పదాలు, భావనల గురించి అడుగుతూ విషయాన్ని అర్థం చేయిస్తాను.) | నెత్తురులోడ్చిన<br>సత్తువలూడ్చిన<br>పిశాచదాస్యం<br>స్వతంత్రశంఖాలు<br>పోరులమందిన<br>కారలకుందిన<br>ముదశ్రుతర్పణ<br>హృదంబుజార్పణ | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **VI. b) పిల్లల అవగాహన - పరిశీలన (మూల్యాంకనం)** | పిల్లలూ! గేయ సారాంశాన్ని బాగా చెప్పారు.<br>♦ ఈ రోజు నేర్చుకున్న గేయాన్ని అభినయంతో చేసి చూపండి.<br>♦ 3, 4 చరణాల సారాంశాన్ని చెప్పండి.<br>♦ స్వతంత్ర శంఖాలెందుకు ఊదాలి?<br>♦ స్వతంత్రయోధులను ఎలా స్మరించుకోవాలి. | | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **అ) చదవడంపై అభ్యాసం కల్పించడం** | పిల్లలూ! గేయంలోని 3, 4 చరణాలను చదివి చూడకుండా రాయండి.<br>రెండు చరణాలు చదివి కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.<br>♦ ఏది నశించాలని కవి కోరుకున్నాడు?<br>♦ స్వతంత్ర శంఖాలు ఎలా ఊదాలన్నారు?<br>♦ స్వతంత్రయోధులు ఎలా కష్టపడ్డారు?<br>♦ వారిని ఎలా మనం తలచుకోవాలి? | <u>చదవడం, అర్థంచేసుకొని రాయడం</u><br>ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి<br>1. ఏది నశించాలని కవి కోరుకున్నాడు?<br>2. స్వతంత్రశంఖాలు ఎలా ఊదాలనుకున్నారు?<br>3. స్వతంత్రయోధులు ఎలా కష్టపడ్డారు?<br>4. వారిని ఎలా మనం తలచుకోవాలి? | |
| **ఆ) స్వీయ రచనపై అభ్యాసం కల్పించడం** | పిల్లలూ! 3, 4 చరణాల సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి. | <u>స్వీయరచన</u><br>3, 4 చరణాల సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి. | |
| **VIII. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు** | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 5 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** పాఠ్యాంశ బోధన - చర్చ - 5వ చరణం

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :

1. వినడం - మాట్లాడించడం : ♦ పాఠ్యాంశంలోని విషయాన్ని అవగాహన చేసుకోవడం, ఆలోచింపజేసి ప్రశ్నలకు స్పందించడం, చర్చలో పాల్గొనడం.
2. చదవడం - అర్థంచేసుకొనిచెప్పడం : ♦ పాఠాన్ని ధారాళంగా స్పష్టమైన ఉచ్ఛారణతో చదవగలగడం.
3. స్వీయరచన : ♦ అవగాహన చేసుకొన్న విషయాన్ని సొంతమాటల్లో చెప్పగలగడం, రాయగలగడం.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం** | | | |
| 1) పలకరింపు | శుభోదయం పిల్లలూ! | | |
| 2) పునఃశ్చరణ | పిల్లలూ! నిన్న నేర్చుకున్న రెండు చరణాలను పాడండి. ఎవరైనా నిన్న నేర్చుకున్న చరణాల సారాంశాన్ని చెప్పండి. | | |
| **II. పాఠ్యాంశంపై చర్చ-అవగాహన** | | | |
| అమోఘశక్తుల నుండి విజయం పాడండి వరకు | పిల్లలూ! ఈ రోజు గేయంలోని ఆఖరి చరణం నేర్చుకుందాం. | | |
| 1. ఉపాధ్యాయుడు పాడడం | పిల్లలూ! పూర్తి గేయాన్ని నేను పాడుతాను వినండి. (అభినయం చేస్తూ పాడడం) | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| 2) పిల్లలచేత పాడించడం | పిల్లలూ! నేను పాడిన గేయాన్ని విన్నారు కదా! ఇప్పుడు నన్ను అనుసరిస్తూ మీరు కూడా అభినయంచేస్తూ పాడండి. | | గేయం రాసిన చార్టు. |
| 3) పిల్లల బాహ్యపఠనం | పిల్లలూ! ఆఖరి చరణం నేను అడిగినవాళ్ళు చదవండి. | | |
| 4) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను. శ్రద్ధగా వినండి. | | |
| 5) పిల్లల మౌన పఠనం | పిల్లలూ! నేను చదివింది విన్నారు కదా! ఇప్పుడు మీరు మౌనంగా 5వ చరణం చదవండి. | | |
| 6) చర్చ – అవగాహన | పిల్లలూ! 5వ చరణం చదివారు కదా! మీకు ఏమి అర్థమైందో చర్చించుకుందామా?<br>♦ మనకున్న అమోఘ శక్తులను సమీకరించుకోవడం అంటే ఏమిటి?<br>♦ భారత విజయం గురించి ఎలా పాడాలి?<br>♦ హిమాద్రి నుండి కుమారి వరకు అంటే మీకు ఏమి అర్థమైంది?<br>♦ 5వ చరణ సారాంశాన్ని చెప్పండి.<br>పిల్లలూ! చాలా బాగా చెప్పారు.<br>3వ పేజీలో ఉన్న 5వ చరణ సారాంశాన్ని చదవండి.<br>(ఇలా పిల్లలతో చర్చించుకుంటూ కీలక పదాలు, భావనల గురించి అడుగుతూ విషయాన్ని అర్థం చేయిస్తాను.) | అమోఘశక్తుల సమీకరించుక భారత విజయం హిమాద్రి నుండి కుమారి వరకు | |
| **VI. b) పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం)** | పిల్లలూ! గేయమంతా పూర్తి అయింది కదా! గేయం సారాంశాన్ని చెప్పండి.<br>(పిల్లలు ఒక్కొక్కరితో ఒక్కో వాక్యం చెప్పించాలి.) | | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) చదవడంపై అభ్యాసం కల్పించడం | ♦ పిల్లలూ! గేయంలోని ప్రాసపదాలను రాయండి.<br>♦ 4, 5 చరణాల సారాంశాన్ని రాయండి. | ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి<br>చదవడం – అర్థం చేసుకొని రాయడం<br>♦ గేయంలోని ప్రాసపదాలను రాయండి.<br>♦ 4, 5 చరణాల సారాంశాన్ని రాయండి.<br>స్వీయరచన<br>♦ మన జెండా గురించి రాయండి. | |
| ఆ) స్వీయ రచనపై అభ్యాసం కల్పించడం | మన జెండా గురించి రాయండి. | | |
| ఇ) ప్రాజెక్టు పని కేటాయింపు | పిల్లలూ! 7వ పేజీలోని ప్రాజెక్టుపనిని ఒకరు చదవండి. ఏమి చేయాలో చెప్పండి.<br>పిల్లలూ! ఈ ప్రాజెక్టుపనికోసం మీరు నలుగురు చొప్పున జట్టుగా అవండి. ప్రాజెక్టుపని చేయడానికి మీలో ఎవరెవరు ఏమి చేస్తారో మీరే నిర్ణయించుకోండి. ఇందులో దేశభక్తి గేయాలను సేకరించడం, లేదా స్వాతంత్ర్యం కోసం పాటుపడిన వారి చిత్రాలు సేకరించడం, దీనికోసం మీరు వార్తాపత్రికలు, గ్రంథాలయ పుస్తకాలను సంప్రదించాలి.<br>చిత్రాలతోబాటు వారికి సంబంధించిన విషయాలను ఇద్దరు సేకరించండి.<br>అందరూ కలిసి ప్రాజెక్టుపని పూర్తిచేయండి.<br>ఇందుకోసం మీకు రెండు రోజుల సమయం ఉంటుంది. 8వ రోజు మీరు ప్రదర్శించాల్సి ఉంటుంది. | | |
| VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I.** పాఠం పేరు : స్వతంత్రోత్సవం

**II.** కాలాంశం సంఖ్య : 6 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** వినడం - ఆలోచించి మాట్లాడడం, ధారాళంగా చదవడం - అర్థంచేసుకొని చెప్పడం అభ్యాసాల సాధన

**V. సాధించాల్సిన సామర్థ్యాలు :**
- ♦ వినడం - ఆలోచించి మాట్లాడడం ప్రశ్నలకు ఆలోచించి సొంతమాటల్లో ప్రతిస్పందించగలరు.
- ♦ పాఠాన్ని చదివి గేయపాదాలను వరుసక్రమంలో రాయగలరు.
- ♦ గేయ సంబంధ వాక్యాలను గేయంలో గుర్తించగలరు.
- ♦ ప్రాస పదాలను, గేయ ఆధారిత ప్రశ్నలకు జవాబులు రాయగలరు.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం**<br>1) పలకరింపు<br>2) పునశ్చరణ | పిల్లలూ! శుభోదయం. ఎలా ఉన్నారు?<br>పిల్లలూ! గేయం అందరికీ వచ్చిందా! గేయం గురించి అందరికీ అర్థమైంది కదా! ఇప్పుడు మీరందరూ కలిసి గేయాన్ని అభినయంతో పాడండి. | | |
| **II. అభ్యాసాలపై సాధన - చర్చ - అవగాహన**<br>1. వినడం - ఆలోచించి మాట్లాడడం | పిల్లలూ! చక్కగా పాడారు. ఇప్పుడు 4వ పేజీలోని 'ఇవి చేయండి' శీర్షికలో వినడం - ఆలోచించి చెప్పడం సామర్థ్యం కింద ఇచ్చిన ప్రశ్నలను చదవండి.<br>(పిల్లలు ఒక్కక్కరితో ఒక ప్రశ్న చదివించడం.) | పిల్లలు చదివిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి. | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| | ♦ పిల్లలూ! మొదటి ప్రశ్న గేయాన్ని రాగంతో పాడండి. అభినయం చేయండి. అని ఉంది కదా! ఎవరు చేస్తారో చెప్పండి.<br>(ఇద్దరు, ముగ్గురితో పాడించాలి, అభినయం చేయించడం)<br>♦ శభాష్ పిల్లలూ! బాగా పాడారు. ఇప్పుడు రెండవ ప్రశ్న గేయానికి స్వతంత్రోత్సవం అనే పేరు సరైందేనా? ఎందుకో ఒక్కొక్కరు చెప్పండి.<br>(ప్రశ్నపై పిల్లలందరితో మాట్లాడించడం.)<br>వెరీగుడ్ పిల్లలూ! ఇప్పుడు మీరందరూ మాట్లాడిన విషయాలను ఒకరు క్రోడీకరించి చెప్పండి. (అందరి సమాధానాలను కలిపి ఒకరితో చెప్పించడం).<br>ఇప్పుడు మూడవ ప్రశ్న చూద్దాం.<br>'భారత విజయం గురించి హిమాలయ పర్వతాలు మొదలుకొని కన్యాకుమారి వరకు పాడండి' అని కవి ఎందుకు చెప్పి ఉంటాడో ఒక్కొక్కరు మీకు తెలిసిన సమాధానాలు చెప్పండి.<br>(పిల్లలందరినీ మాట్లాడించడం. అందరి సమాధానాలను ఒకరితో క్రోడీకరిందం) మీ సమాధానాలన్నీ నేనూ చెబుతాను వినండి. | 1. గేయాన్ని రాగంతో పాడండి. అభినయం చేయండి.<br>2. ఈ గేయానికి స్వతంత్రోత్సవం అనే పేరు సరైందేనా? ఎందుకో చెప్పండి?<br>3. కవి 'భారత విజయం గురించి హిమాలయ పర్వతాలు మొదలుకొని, కన్యాకుమారి వరకు పాడండి' అని ఎందుకు చెప్పి ఉంటాడు? | |
| 2) ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం – అభ్యాసం సాధన<br>అభ్యాసం ఎలా చేయాలో సూచనలు ఇవ్వడం | బాగా ఆలోచించి చెప్పారు పిల్లలూ!<br>ఇప్పుడు ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం అభ్యాసాలు చూద్దాం.<br>పిల్లలూ! ధారాళంగా చదవడం కింద ఉన్న అభ్యాసాలను ఒక్కొక్కరు చదవండి. ఏమి చేయాలో చెప్పండి.<br>(పిల్లలతోనే సామర్థ్యాల కింద ఉన్న అభ్యాసాలను చదివించుతాను ఏమి చేయాలో వాళ్ళతోనే చెప్పిస్తాను లేదా ఏమి చేయాలో సూచనలను ఇస్తాను.) | | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **అ) ధారాళంగా చదవడం అర్థం చేసుకొని చెప్పడం సామర్థ్యాల కింద ఉన్న అభ్యాసాలను చేయించడం**<br>**(వ్యక్తిగత కృత్యం)** | పిల్లలూ! నేను చెప్పిన సూచనలు విన్నారు కదా! ఇప్పుడు ఎవరికి వారు మీ నోటుపుస్తకాలలో అభ్యాసాలను రాయండి.<br>పిల్లలూ! 4వ పేజీలోని ప్రశ్నలకు జవాబులు రాయండి.<br>♦ పిల్లలూ! మొదటి ప్రశ్నలో స్వతంత్ర భారత పతాకానికి మనమెలా మొక్కాలి అని కవి అన్నాడో కదా! మీరు చదివి అర్థం చేసుకొని రాయండి. (పిల్లలందరితో ఈ ప్రశ్నను చదివించి వారి సొంతమాటల్లో జవాబురాయిస్తాను)<br>♦ రెండవ ప్రశ్న స్వతంత్ర శంఖాలను ఎందుకు ఊదాలి అని కవి అన్నాడో కదా! అర్థంచేసుకొని రాయండి. (ఈ ప్రశ్న గురించి పిల్లలందరితో చదివించి జవాబు రాయిస్తాను.)<br>♦ ఇప్పుడు 3వ ప్రశ్న భారత విజయం గురించి ఎక్కడ నుండి ఎక్కవ వరకు, ఎలా పాడాలి? అని కవి చెప్పారు కదా! మీరందరు చదివి అర్థం చేసుకొని రాయండి.<br>♦ ఇక నాల్గవ ప్రశ్న మనం ఆనందంతో కూడిన కన్నీళ్ళను ఎవరికి అర్పించాలి అని కవి చెప్పారు కదా! అర్థం చేసుకొని రాయండి. (పిల్లలు రాసిన సమాధానాలను సరిచేస్తాను.) | ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి<br><u>చదవడం – అర్థం చేసుకొని రాయడం</u><br>♦ స్వతంత్ర భారత పతాకానికి మనమెలా మొక్కాలి?<br>♦ స్వతంత్ర శంఖాలను ఎందుకు ఊదాలి?<br>♦ భారత విజయం గురించి ఎక్కడ నుండి ఎక్కవ వరకు, ఎలా పాడాలి?<br>♦ మనం ఆనందంతో కూడిన కన్నీళ్ళను ఎవరికి అర్పించాలి? | |
| **ఆ) పిల్లలు రాసిన వాటిని సరిచూడడం** | పిల్లలూ! సమాధానాలన్నీ రాసారు కదా! మీరు రాసినది చూపండి. | | |
| **ఇ) ప్రశంస అభ్యాసం కేటాయింపు** | పిల్లలూ! ప్రశంస అభ్యాసంని ఒకరు చదవండి. చదివారు కదా! ఇప్పుడు మీరు ఏం చేయాలో చెప్పండి. దీన్ని మీరు ఇంటివద్ద ఆలోచించి రాయండి. 8వ రోజు మీరు రాసినది ప్రదర్శించాల్సి ఉంటుంది. | | |
| **VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు** | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

GRK

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 7 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** ఆలోచించి సొంతమాటల్లో రాయడం అభ్యాససాధన (స్వీయరచన)

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :
- ♦ కవి అభిప్రాయాన్ని సొంతమాటల్లో రాయగలరు.
- ♦ కీలక భావనలపై తమ అభిప్రాయాన్ని చెప్పగలరు, రాయగలరు.
- ♦ గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలరు.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం** | | | |
| 1) పలకరింపు | పిల్లలూ! శుభోదయం. ఎలా ఉన్నారు? | | |
| 2) పునశ్చరణ | పిల్లలూ! నిన్న వినడం ఆలోచించి మాట్లాడడం అభ్యాసం కింద ఏ ఏ ప్రశ్నలను చర్చించుకున్నామో చెప్పండి.<br>మీకు ప్రాజెక్టుపని కేటాయించాను కదా! సేకరిస్తున్నారా? రేపు ప్రాజెక్టుపని, ప్రశంస గురించిన అంశాలు మీరు ప్రదర్శించాల్సి ఉంటుంది. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **II. సామర్థ్యాల సాధన అవగాహన**<br>1. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)<br>• చర్చ – అవగాహన | పిల్లలూ! ఈ రోజు మనం 3వ సామర్థ్యమైన ఆలోచించి సొంతమాటల్లో రాయండి. అభ్యాసంలోని ప్రశ్నలను చర్చిద్దాం. 5వ పేజీ తెరవండి. అందులో స్వీయరచన కింద ఉన్న ప్రశ్నలను చదవండి.<br>మీరు చెప్పిన ప్రశ్నలన్నీ నల్లబల్లపై రాసానుకదా! ఇప్పుడు ఒక్కొక్క ప్రశ్న గురించి చర్చిద్దాం. ప్రతి ప్రశ్న గురించి అందరూ మాట్లాడాలి తెలిసిందా!<br>ముందు మొదటి ప్రశ్నను ఒకరు చదవండి. బ్రిటిష్ వారి పిశాచదాస్యం నశించిందని కవి ఎందుకన్నాడు?<br>(పిల్లలందరితో ఈ ప్రశ్నపై మాట్లాడిస్తాను.)<br>పిల్లలూ! అందరూ సమాధానాలు చెప్పారు కదా! ఒకరు క్రోడీకరించి చెప్పండి.<br>రెండవ ప్రశ్న మన స్వాతంత్ర్య యోధులను స్మరించాలని కవి అన్నారు కదా! ఎందుకో చెప్పండి.<br>(ఈ ప్రశ్న గురించి అందరితో మాట్లాడిస్తాను.)<br>పిల్లలూ! అందరూ మాట్లాడింది క్రోడీకరించి ఒకరు చెప్పండి.<br>ఇప్పుడు 3వ ప్రశ్న. స్వతంత్ర్య భారత పతాకానికి ద్వేషం రోషం అన్నీ మరచి మొక్కాలని కవి చెప్పారుకదా దీన్ని బట్టి మీకేమి అర్థమైందో చెప్పండి.<br>(అందరితో మాట్లాడించడం, క్రోడీకరించడం.)<br>ఇక 4వ ప్రశ్నను చర్చిద్దాం. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.<br>(అందరితో మాట్లాడించడం, సమాధానాన్ని క్రోడీకరించడం.) | ఆలోచించి సొంతమాటల్లో రాయడం<br>ప్రశ్నలు<br>1. బ్రిటీష్‌వారి పిశాచదాస్యం నశించిందని కవి ఎందుకన్నాడు?<br>2. మనం స్వాతంత్ర్య యోధులను స్మరించాలని కవి ఎందుకన్నాడు?<br>3. స్వతత్ర్య భారత పతాకానికి ద్వేషం, రోషం అన్నీ మరచి మొక్కాలని కవి చెప్పాడు కదా! దీన్ని బట్టి మీకు ఏమి అర్థం అయింది.<br>4. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి. | |
| • జట్టుపని నిర్వహణ | పిల్లలూ! చాలా బాగా చెప్పారు.<br>ఇప్పుడు మీరు నలుగురు చొప్పున జట్టుగా తయారవండి. చర్చించిన ప్రశ్నలకు జవాబులు రాయండి. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| • జట్టు ప్రదర్శన<br><br>• సరిచేయడం (ఎడిటింగ్) | పిల్లలూ! ముందు మొదటి ప్రశ్నకు ఒక జట్టు వారు ప్రదర్శించండి.<br>(మొదటి ప్రశ్న ఒక జట్టుతో ప్రదర్శింపచేయడం అంటే నల్లబల్లపై రాయించడం.)<br>పిల్లలూ! మీరు ఒక జట్టువారు రాసినదాన్ని చూడండి. దీన్ని ఇప్పుడు సరిచేద్దాం...<br>♦ ముందుగా భావం ఎలా ఉందో చెప్పండి.<br>♦ వాక్యాలు సరిగా ఉన్నాయా?<br>♦ ఉపయోగించిన పదాలు సరిపోయాయా?<br>♦ అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా?<br>(ఇలా పిల్లలతో మాట్లాడుతూ పిల్లలు రాసిన సమాధానాన్ని సరిచేస్తాను.)<br>పిల్లలూ! సరిచేసాం కదా! ఇప్పుడు మిగిలిన జట్లవాళ్ళు కూడా దీన్ని గమనించి మీరు రాసిన దాన్ని సరిచేసుకోండి.<br>(ఇలా ఒక్కో జట్టు చేత ఒక్కో ప్రశ్న ప్రదర్శింపజేసి సరిచేయడం చేస్తాను.) | పిల్లల సమాధానాన్ని నల్లబల్లపై రాయించడం, సరిచేయడం. | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) స్వీయరచనపై అభ్యాసం | పిల్లలూ! ఈ రోజు మనం చర్చించిన స్వీయరచన ప్రశ్నలు జట్లలో రాసారు కదా! ఇప్పుడు మీరు మీ నోటుపుస్తకాలలో రాయండి. | | |
| **VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు** | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 8 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** పదజాలం అభ్యాస సాధన

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :
- ♦ పదాలకు అర్థాలను గ్రహించడం వాటితో సొంత వాక్యాలు రాయగలగడం.
- ♦ సంబంధించిన పదాలు రాయగలగడం.
- ♦ ప్రాజెక్టుపని నివేదికలు రాయడం.
- ♦ ప్రశంసిస్తూ రాయడం చేయగలరు.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం** | | | |
| 1) పలకరింపు | పిల్లలూ! శుభోదయం. | | |
| 2) పునశ్చరణ | పిల్లలూ! నిన్న వినడం స్వీయరచన ప్రశ్నలను అందరూ రాసారా? ఎవరెవరు ఏమి రాసారో చెప్పండి. ఈ రోజు ముందుగా మీరు చేసిన ప్రాజెక్టుపని ప్రదర్శించాలి. | | |
| ప్రాజెక్టుపని | పిల్లలూ! ప్రాజెక్టుపనిలో ఎవరెవరు ఏమేం చేసుకొచ్చారో ఒక జట్టు వచ్చి ప్రదర్శించండి. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| | (జట్టు పిల్లలందరూ రావాలి. ఒక్కొక్కరితో వాళ్ళు సేకరించిన ప్రాజెక్టుపని గురించి చెప్పించాలి.)<br>వెరీగుడ్ పిల్లలూ! ఇప్పుడు ఇంకో జట్టు వాళ్ళు ప్రదర్శిస్తారు.<br>(అన్ని జట్లతో ప్రదర్శింపజేయాలి.)<br>పిల్లలూ! మీ ప్రాజెక్టుపనిలో మీరు గమనించిన దోషాలు ఏమైనా చెప్పండి.<br>పిల్లలూ! మీరు చేసిన ప్రాజెక్టు పనిని గోడపత్రికలో ప్రదర్శించండి.<br>పిల్లలూ! మీ అందరికీ అభినందనలు చాలా బాగా ప్రదర్శించారు. | | |
| **II. సామర్థ్యాల సాధన అవగాహన**<br>• పదజాలం<br>• సూచనలు ఇవ్వడం<br>• జట్టుపని<br>• జట్టు ప్రదర్శన<br>• ప్రశంస ప్రదర్శన | పిల్లలూ! పేజి నెం 5లో ఉన్న పదజాలం అభ్యాసం కింద ఉన్న ప్రశ్నలను చదవండి. ఏమి చేయాలో చెప్పండి.<br>♦ గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.<br>♦ గళ్ళల్లో పదాలను వెతికి సొంతంగా వాక్యాలు రాయండి.<br>పిల్లలూ! ఇప్పుడు జట్లలో కూర్చుని పదజాలం అభ్యాసాలను చేయండి.<br>పిల్లలూ! జట్లలో మీరు అభ్యాసాలను పూర్తిచేసారు కదా! ఒక్కో అభ్యాసం ఒక్కో జట్టువారు ప్రదర్శించండి.<br>పిల్లలూ! విన్నారుకదా! మీరు రాసిన వాటితో సరిచూసుకోండి.<br>పిల్లలూ! ప్రశంసకు సంబంధించిన స్వాతంత్ర్యవీరుల గొప్పదనాన్ని ప్రశంసిస్తూ రాయమన్నాను కదా! ఎవరెవరు ఏమేమేం రాసారో చదవండి.<br>(ఇద్దరు ముగ్గురితో ప్రదర్శింపజేయాలి.)<br>వెరీగుడ్ పిల్లలూ! చాలా బాగా చెప్పారు. | <u>పదజాలం అభ్యాసం</u><br>పిల్లలు చెప్పిన పదాలను వాక్యాలను నల్లబల్లపై రాయాలి. | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) పదజాలం అభ్యాసాలు | పిల్లలూ! పదజాలం అభ్యాసాలను మీ నోట్సులో రాయండి. | | |
| ఆ) ప్రాజెక్టు నివేదిక రాయడం | పిల్లలూ! ప్రాజెక్టు ఎవరెవరు, ఏఏ బాధ్యతలను పంచుకున్నారు. ఎక్కడెక్కడ నుంచి సమాచారం సేకరించారు అనే విషయాలతో నివేదికను రాయండి. | | |
| ఇ) ప్రశంస అభ్యాసం రాయడం | పిల్లలూ! దేశనాయకుల గురించి ప్రశంసిస్తూ పేరా రాసారు కదా! అది నోట్సులో రాయండి. | | |
| ఈ) పిల్లలు రాసిన వాటిని సరిచేయడం | | | |
| VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

### పిల్లలూ పరీక్షలు

*నిరంతరం పరీక్షిస్తున్నందువల్లపిల్లల ఆత్మవిశ్వాసానికీ, తీవ్రమైన నష్టం కలుగుతుంది. తాము నేర్చుకోగలమనే సంగతి ఇతరులు నమ్మాలని పిల్లలు కోరుకొంటారు. పరీక్షలవల్ల ఈ నమ్మకానికే అడుగడుగునా అడ్డంకి కల్గుతుంది. పిల్లలు ఏమి నేర్చుకొన్నారో పరీక్షించడానికి ప్రయత్నించడం వాళ్ళు ఏమి నేర్చుకోలేదో ఎత్తిచూపి భయపెట్టే ప్రమాదంగా మారుతుంది. ఇది పిల్లలపట్ల అవిశ్వాసం వ్యక్తంచేయడమై ప్రళయాంతకమవుతుంది.*

*– జాన్‌హోల్ట్*

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I.** **పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II.** **కాలాంశం సంఖ్య** : 9 **III. సమయం :** 90 ని॥లు

**IV.** **బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** సృజనాత్మకత అభ్యాస సాధన

**V.** **సాధించాల్సిన సామర్థ్యాలు** :
- ♦ పాఠం ఆధారంగా చిత్రాన్ని గీసి రంగులు వేయగల్గుతారు. చిత్రం గురించి రాయగల్గుతారు.
- ♦ మన దేశం గొప్పదనాన్ని తెలిపేలా నినాదాలు రాయగల్గుతారు.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం**<br>1) పలకరింపు<br>2) పునశ్చరణ | పిల్లలూ! శుభోదయం. ఎలా ఉన్నారు?<br>పిల్లలూ! రాసిన ప్రాజెక్టుపని నివేదికలు ఒకరిద్దరు చదవండి.<br>(పిల్లలతో ప్రాజెక్టు నివేదికలు చదివించడం.) | | |
| **II. అభ్యాసాల సాధన చర్చ–అవగాహన**<br>• సృజనాత్మకత | పిల్లలూ! 6వ పేజీలో ఇచ్చిన సృజనాత్మక కృత్యంలోని అభ్యాసాలను చదవండి.<br>♦ పిల్లలూ! మొదటి ప్రశ్నలో పాఠం ఆధారంగా చిత్రం గీయమన్నారు కదా! అది ఎవరికి వారు గీసి రంగులు వేసి దాని గురించి రాయండి.<br>♦ అలాగే రెండవ ప్రశ్న చూడండి. మన దేశ గొప్పదనాన్ని తెలిపేలా నినాదాలు రాయమన్నారు కదా!<br>నినాదాలు మీరెప్పుడైనా విన్నారా! ఎప్పుడెప్పుడు విన్నారు? చెప్పండి. 'వందేమాతరం!' అనేది ఒక నినాదం. ఇప్పుడు మీకు తెలిసిన కొన్ని నినాదాలు చెప్పండి.<br>(పిల్లలతో నినాదాల గురించి చర్చించండి. | <u>సృజనాత్మకత</u><br>♦పాఠం ఆధారంగా చిత్రం గీసి, రంగులు వేయండి. చిత్రం గురించి రాయండి.<br>♦మనదేశం గొప్పదనాన్ని తెలిపేలా నినాదాలు రాయండి. | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| • జట్టు పని<br>• జట్టు ప్రదర్శన<br>• సరిదిద్దడం | పిల్లలూ! మీరు ఇప్పుడు జట్లలో కూర్చుని దేశగొప్పదనంపై నినాదాలు తయారుచేయండి.<br>పిల్లలూ! మీరు జట్లలో రాసినవి ఒక్కొక్కరు ప్రదర్శించండి.<br>పిల్లలూ! మీరు రాసినవి నల్లబల్లపై రాయండి.<br>పిల్లలూ! నినాదాలు రాసినవి సరిచేద్దామా?<br>భావం సరిగా ఉందా?<br>వాక్యాలు సరిగా రాసారా?<br>పదాలు సరిపోయాయా?<br>అక్షర దోషాలు ఉన్నాయా? | పిల్లలతో నల్లబల్లపై నినాదాలు రాయించాలి. | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) సృజనాత్మకత అభ్యాసాలు కల్పించడం | పిల్లలూ! అందరివీ సరిచేసుకున్నారు కదా! ఇప్పుడు మీరు ఎవరికి వారు చిత్రం గీసి చిత్రం గురించి రాయండి. | | |
| ఆ) సరిచేయడం | పిల్లలూ! మీరు రాసిన నినాదాలు, గీసిన చిత్రాలు, వాటి గురించి రాసినవి చూపించండి. | | |
| ఇ) సంకలనం చేయడం | పిల్లలూ! మీరందరూ చాలా బాగా రాసారు. మీరు రాసినవన్నీ కలిపి 'మా సృజన' అని ఒక సంకలనం పుస్తకంలా చేద్దామా!<br>(పిల్లలు రాసినవి, చిత్రాలు కలిపి ఒక పుస్తకంలా చేయాలి.) | | |
| VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

## ఆ) మాదిరి పీరియడ్ ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

**I. పాఠం పేరు** : స్వతంత్రోత్సవం

**II. కాలాంశం సంఖ్య** : 10 **III. సమయం :** 90 ని॥లు

**IV. బోధనాంశం/ఉపశీర్షిక/కృత్యం :** భాషను గురించి తెలుసుకుందాం అభ్యాస సాధన, స్వీయ మూల్యాంకన నిర్వహణ.

**V. సాధించాల్సిన సామర్థ్యాలు** :
- ♦ వాక్యాలలో నామవాచకం, సర్వనామం, విశేషణం, క్రియలను గుర్తించగల్గుతారు.
- ♦ గేయాలలో నామవాచకాలు, విశేషణాలు క్రియలను గుర్తించగల్గుతారు.
- ♦ . , ! ? గుర్తులను సరైనచోట ఉంచి రాయగల్గుతారు.
- ♦ తమను తాము స్వీయమూల్యాంకనం చేసుకోగల్గుతారు.

**VI. a) మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలు / బోధనా సోపానాలు :**

### a) మొదటి 45 నిమిషాలలో జరిపే కార్యక్రమం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| **I. ఉపోద్ఘాతం**<br>1) పలకరింపు<br>2) పునశ్చరణ | పిల్లలూ! శుభోదయం. ఎలా ఉన్నారు?<br>పిల్లలూ! నిన్న మీరు రాసిన నినాదాలు, సేకరించిన నినాదాలు ఇక్కడ ప్రదర్శించండి. | | |
| **II. సామర్థ్యాల సాధన అవగాహన**<br>• భాషను గురించి తెలుసుకుందాం అభ్యాస సాధన | చాలా బాగా చెప్పారు పిల్లలూ! ఇప్పుడు 6వ పేజీలోని భాషను గురించి తెలుసుకుందాం అభ్యాసాన్ని చదవండి. | పిల్లలు చెప్పిన వాక్యాలను నల్లబల్లపై రాయడం. | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| | ♦ పిల్లలూ! నల్లబల్లపై రాసిన వాక్యాలను గమనించండి. నేనడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి.<br>♦ ముందుగా దేశభక్తుని పేరేమిటి?<br>ఇలా పేర్లను తెలిపే పదాలను ఏమంటారు?<br>మీకు తెలిసిన పేర్లను చెప్పండి.<br>(పేర్లను తెలిపే పదాలను నామవాచకాలు అంటారని ఉదాహరణలతో అవగాహన చేయించడం.)<br>♦ పిల్లలూ! రెండవ ప్రశ్నలో భగత్‌సింగ్ ఎటువంటి దేశభక్తుడో చెప్పండి. వెరీగుడ్. ధైర్యమనేది భగత్‌సింగ్ గుణం కదా! ఇలా గుణాన్ని తెలిపే ఈ భాషా భాగాన్ని ఏమంటారో తెలుసా?<br>పాఠంలో మీరు గుర్తించిన అలాగే మీకు తెలిసిన గుణాన్ని తెలిపే పదాలను చెప్పండి.<br>♦ పిల్లలూ! 3వ ప్రశ్న చదవండి. అతడు అనే పదం ఎవరికి బదులుగా వాడారు?<br>వెరీగుడ్! నామవాచక పదాలకు బదులుగా వాడే పదాలను సర్వనామమంటారు తెలుసుకున్నారు కదా!<br>♦ అలాగే వాక్యాలలో క్రియా పదాలను గుర్తించండి.<br>(పనిని తెలిపే పదాలను క్రియాపదాలు అంటారని తెలియజేయడం. ఉదాహరణలు చెప్పించడం.) | <u>భాషాంశాలు</u><br>♦<u>భగత్‌సింగ్</u> గొప్ప దేశభక్తుడు. <u>అతడు</u> ధైర్యంగా బ్రిటిష్ వారిని ఎదిరించాడు. దేశం కోసం ప్రాణత్యాగం చేశాడు.<br>1. దేశభక్తుని పేరు ఏమిటి? పేర్లను తెలిపే పదాలను ఏమంటారు?<br>2. భగత్‌సింగ్ ఎటువంటి దేశభక్తుడు? గుణాన్ని తెలిపే ఈ భాషాభాగాన్ని ఏమంటారు?<br>3. అతడు అనేది ఈ వాక్యాలలో ఎవరికి బదులుగా వాడారు? అలాంటి పదాలను ఏమంటారు? | |
| • జట్టు పని / వ్యక్తిగత పని | పిల్లలూ! మీరు ఇప్పుడు జట్లలో కూర్చుని 7వ పేజీలోని 'ఆ' భాగంలోని పట్టికలో ఇచ్చిన అంశాలకు తగిన పదాలను రాయండి. అలాగే (ఇ) అభ్యాసంలో ఇచ్చిన గుర్తులను ఎక్కడ ఉంచాలో గుర్తించండి. | 4. పై వాక్యాలలో క్రియాపదాలను గుర్తించి రాయండి. | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| • జట్టు పని ప్రదర్శన | పిల్లలూ! పూర్తిచేసారా? ఇప్పుడు ఒక జట్టువారు ప్రదర్శిస్తారు. మిగిలిన వారు గమనించండి.<br>(పిల్లలతో చదివించడం.)<br>పిల్లలూ! విన్నారు కదా? ఈ పదాలే కాకుండా ఇంకా వేరే పదాలు ఎవరైనా రాసుంటే వాళ్ళు చదవండి.<br>వెరీగుడ్! బాగా చదివారు.<br>పిల్లలూ ఇప్పుడు మరో జట్టు వాళ్ళు (ఇ) అభ్యాసంలోని గుర్తులను ఎక్కడ ఎలా ఉంచారు? నల్లబల్లపై చూపించండి.<br>పిల్లలూ! ఈ జట్టు వాళ్ళు సరిగ్గానే గుర్తించారా!<br>(ఇలా చర్చించుకుంటూ భాషను గురించి తెలుసుకుందాం అభ్యాసంలో ఇచ్చిన అభ్యాసాలపై అవగాహన కల్పించాలి.)<br>పిల్లలూ! విరామ చిహ్నాలను ఎక్కడెక్కడ ఉంచాలో తెలుసుకున్నారు కదా! ఈ వాక్యాలను ఎలా చదవాలో ఒక్కొక్కరు హావభావాలతో విరామచిహ్నాలను పాటిస్తూ చదవండి. | (ఇ) అభ్యాసంలోని సంభాషణను నల్లబల్లపై రాయాలి.<br>కింది సంభాషణను చదవండి ' . , ! ? ' గుర్తులను సరైనచోట ఉంచి రాయండి.<br>రామయ్య : ఏం సూరయ్యా బాగున్నావా?<br>సూరయ్య : ఆ బాగానే ఉన్నాను రామయ్యా.<br>రామయ్య : అవును ఏం పని మీద వచ్చావేమిటి?<br>సూరయ్య : పండుగ వస్తోంది కదా అందుకని కావాల్సిన సరుకులు, కూరగాయలు, పూలు, పండ్లు కొనడానికని వచ్చాను.<br>రామయ్య : నేనూ ఆపనిపైనే వచ్చాను ఇద్దరం కలిసి వెళ్దాం పద. | |
| VI. b) పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం) | పిల్లలూ! భాషను గురించి తెలుసుకుందాం కృత్యాలను బాగా చేశారు. ఇప్పుడు చివరిగా 'నేనివి చేయగలనా' శీర్షిక కింద పట్టికలోని అంశాలను చదవండి. ఒక్కొక్క అంశం చదవండి. మీరు చేయగలిగితే 'ఔను' అని, చేయలేకుంటే 'కాదు' అని (✓) గుర్తు పెట్టండి. | | |

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| | గుర్తించారా పిల్లలూ! ఇప్పుడు మొదటి అంశానికి 'ఔను' అని ఎంత మంది '✓' పెట్టారో చేతులెత్తండి.<br>(ఇలా ఒక్కో అంశాన్ని పిల్లలను అడుగుతూ 80% కన్నా తక్కువ ఏ అంశానికి 'కాదు', '✓' పెట్టారో వారికి సామర్థ్యాలపై పునరభ్యసనం కల్పించాలి.) | | |

## VII. రెండవ 45 నిమిషాలలో పిల్లలకు కల్పించే అభ్యాసం

| బోధనాభ్యసన సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు / అభ్యసన అనుభవాలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామాగ్రి / వనరులు |
|---|---|---|---|
| అ) భాషను గురించి తెలుసుకుందాం | పిల్లలూ! భాషను గురించి తెలుసుకుందాంలోని అభ్యాసాలను మీ నోటు పుస్తకాలలో రాయండి.<br>ఇంతకు ముందు స్వీయమూల్యాంకనంలో ఏవేవి చేయలేకపోయామని గుర్తించాలో వారు నా దగ్గరకి రండి. మీకు మళ్ళొకసారి అర్థం చేయిస్తాను.<br>(పిల్లలకు ఆ సామార్థ్యాలపై పునరభ్యసనం కల్పించడం.) | | |
| VIII.ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు | 90 ని॥లలో పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల ప్రతిస్పందనలు, భాగస్వామ్యం, ప్రగతి గురించి రాయాలి. | | |

*బాల్యపు హక్కు*

*పూర్తిస్థాయి బడిలో చదువుకొనే పిల్లలు మాత్రమే చాకిరికి దూరంగా ఉన్నట్టు లెక్క. దీన్ని మనం నమ్మి పిల్లల్ని పూర్తిగా బళ్ళలో ఉంచగల్గినప్పుడే వాళ్ళ బాల్యాన్ని, హక్కుల్ని మనం కాపాడగలం. బాలల హక్కుల్ని కాపాడడం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం, అందరికీ విద్య – ఇవన్నీ ఒకే గొలుసులో లింకుల్లా కనిపిస్తాయి. వీటిలో ఏదో ఒకదానిపై దృష్టిపెట్టి, మిగతావాటిని విస్మరిస్తే సమస్య ఏమాత్రం పరిష్కారం కాదు.*

*– మామిడిపూడి నాగార్జున*

# 8

# నిరంతర సమగ్ర మూల్యాంకనం

నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం 2009 మన రాష్ట్రంలో 2010 ఏప్రిల్ మాసం నుండి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరగాలి. ఆర్.టి.ఇ.2009 చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించే సామర్థ్యాన్ని లేదా అన్వయించే సామర్థ్యాన్ని నిరంతరంగా, సమగ్రంగా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. పిల్లల యొక్క శారీరక, మానసిక శక్తులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది తద్వారా పిల్లల్లో సర్వతోముఖాభివృద్ధి జరగాలని ఈ చట్టం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నిరంతర, సమగ్ర మూల్యాంకనాన్ని అన్ని విషయాల్లో అనగా పాఠ్య, సహపాఠ్య విషయాల్లో పూర్తిస్థాయిలో అమలుపరచాల్సి ఉంటుంది.

**భావనల అవగాహన**

అ) **నిరంతర మూల్యాంకనం :** పిల్లల అభివృద్ధిని, ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనావేసి అవసరమైన చర్యలు చేపట్టడం ఎప్పుడూ కొనసాగాలి. పిల్లల ప్రగతిని కేవలం పరీక్షల ద్వారానే కాకుండా ఇతర సాధనాల ద్వారా ఎప్పటికప్పుడు అంచనావేయాల్సి ఉంటుంది. తరగతిలో, తరగతి గది బయట, బోధనాభ్యసన ప్రక్రియల సమయంలో కూడా పిల్లల ప్రగతిని తెల్సుకోవడం మరింత పురోభివృద్ధి సాధించడం అనేది నిరంతరం జరగాలి.

ఆ) **సమగ్ర మూల్యాంకనం :** పిల్లల అభివృద్ధిని అంచనావేయడం కేవలం పాఠ్య విషయాలకే పరిమితం కారాదు. పాఠ్య విషయాలతోపాటు సహ పాఠ్య విషయాలు అనగా కళలు - సాంస్కృతిక విద్య, పని-కంప్యూటర్ విద్య, వ్యాయామ ఆరోగ్య విద్య, విలువల విద్య మొదలగువాటిని కూడా మూల్యాంకనం చేయాలి. ఇలా పిల్లల సర్వతోముఖాభివృద్ధితో సంబంధం ఉన్న పాఠ్య, సహపాఠ్య విషయాల మూల్యాంకనం చోటుచేసుకోవడాన్ని సమగ్ర మూల్యాంకనం అంటారు. పాఠ్య విషయాలలో ఆయా సబ్జెక్టుకు సంబంధించిన సామర్థ్యాలు / అభ్యసనాఫలితాలు / ఆశించేఫలితాలు / నైపుణ్యాలు మొదలగు వాటిని మూల్యాంకనం చేస్తాం. అట్లే సహపాఠ్య విషయాలలో కూడా పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు / నైపుణ్యాలు / ఆశించిన ఫలితాలు / అభ్యసనా ఫలితాలను కూడా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఐతే సహపాఠ్య విషయాలను ప్రత్యేకంగా బోధించి మూల్యాంకనం చేయాల్సి ఉన్నప్పటికీ ఇవి ఆయా సబ్జక్టులలో కూడా అంతర్లీనంగా ఉంటాయి. కాబట్టి పిల్లల యొక్క శక్తి సామర్థ్యాలు, వైఖరులు, నైపుణ్యాలు, జ్ఞానాత్మక అంశాలను ఇలా అన్నింటినీ కలిపిచేసిన మూల్యాంకనాన్ని సమగ్ర మూల్యాంకనమని భావిస్తారు.

ఇ) **నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు – మూల్యాంకనం రకాలు :** నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలుజరపడానికి ప్రధానంగా మూల్యాంకనాన్ని రెండు విధాలుగ నిర్వహిస్తారు. వాటిలో మొదటిది నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation), రెండవది సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation).

ఈ) **నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) :** పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? ఏమి నేర్చుకొంటున్నారు? ఎక్కడ వెనుకబడుతున్నారు? దీన్ని ఎలా సరిదిద్దాలి? అనే అంశాలను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ, అవసరమైన చర్యలను చేపట్టి ప్రగతిని సాధించడానికి తోడ్పడేదే నిర్మాణాత్మక మూల్యాంకనం. ఇది నిరంతరం జరుగుతూ ఉంటుంది. బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ సమయంలో, తదనంతరం, పిల్లలూ తోటి వారితో కల్సి పనిచేస్తున్నప్పుడు, కృత్యాలు / ప్రాజెక్టులు / అన్వేషణలు వంటి కార్యకలాపాలలో పాల్గొంటున్నప్పుడు నిర్మాణాత్మక మూల్యాంకనం చోటుచేసుకొంటుంది. ప్రధానంగా ఇది నేర్చుకోడానికి తోడ్పడేది. (Evaluation for learning) అనగా పరీక్షించడానికి లేదా అంచనావేయడానికి పరిమితంకాకుండా, తదుపరి అభివృద్ధికి లేదా ప్రగతికి తోడ్పడుతుంది.

**సాధనాలు :–** నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది కేవలం పరీక్షలకే పరిమితం కాదు. ఇతర ప్రత్యామ్నాయ సాధనాలపై ఆధారపడుతుంది. నిర్మాణాత్మక మూల్యాంకనం స్వభావరీత్యా నిరంతరం జరుగుతుంటుంది కాబట్టి కింది సాధనాలను నిర్మాణాత్మక మూల్యాంకనంలో వినియోగిస్తారు.

సాధనాలు :–

i) **పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (Participation & reflections)**

ii) **పిల్లలు రాసిన అంశాలు (నోటుబుక్కులు, అసైన్‌మెంట్లు మొదలగునవి) (Children Written Works)**

iii) **లఘు పరీక్ష (Slip Test)**

iv) **ప్రాజెక్టు పనులు (Project Works)**

## నిర్మాణాత్మక మూల్యాకనం నిర్వహణ :

నిర్మాణాత్మక మూల్యాకనంలో భాగంగా పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అంచనావేస్తున్నప్పటికీ, వారి ప్రగతిని మాత్రం ఒక విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు మాత్రమే నమోదుచేస్తాం. అది **జూలై, ఆగష్టు, నవంబర్, ఫిబ్రవరి మాసాల్లో** నమోదుచేయాలి. ఇంతకు ముందు తెల్పిన సాధనాల ప్రకారం వివరాలు నమోదుచేయాలి. నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహిస్తారు. వాటి వివరాలు :

| క్ర.సం | అంశం | కేటాయించిన మార్కులు | ఆధారాలు |
|---|---|---|---|
| 1. | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు | 10 మార్కులు | ఉపాధ్యాయుడి పాఠ్యప్రణాళిక, తోటి పిల్లల ప్రతిస్పందనలు |
| 2. | పిల్లలు రాసిన అంశాలు | 10 మార్కులు | నోటుబుక్కులు, అసైనుమెంట్లు, పోర్టుఫోలియోలు, పాఠ్యపుస్తకాలు |
| 3. | లఘుపరీక్ష (స్లిప్‌టెస్టు) | 20 మార్కులు | పిల్లలు రాసిన జవాబు పత్రాలు / జవాబులు రాసిన నోటుబుక్కు |
| 4. | ప్రాజెక్టుపనులు | 10 మార్కులు | ప్రాజెక్టుపని నివేదికలు |
| 5. | మొత్తం | 50 మార్కులు | – |

- **పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు :** పిల్లలు వినడం, విన్నదాన్ని అర్థం చేసుకోవడం, చదివిన దాన్ని అర్థం చేసుకోవడం, తమ ఆలోచనలను వ్యక్తం చేయడం, ప్రశ్నించడం వంటివి చేయడానికి మాట్లాడాల్సి ఉంటుంది. పిల్లలు వివిధ రకాలైన కృత్యాలలో, బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనాల్సి ఉంటుంది. తమ తోటి వారితో, సామగ్రితో, ఉపాధ్యాయులతో ప్రతిచర్యలు జరపాల్సి ఉంటుంది. పిల్లలను ప్రశ్నిస్తున్నప్పుడు, పిల్లలే ప్రశ్నిస్తున్నప్పుడు, జట్టు పనుల్లో పాల్గొంటున్నప్పుడు, ప్రాజెక్టు పనుల్లో పాల్గొనేటప్పుడు పిల్లల భాగస్వామ్యాన్ని పరిశీలించడం ద్వారా వారి భాషాస్థాయిని అంచనావేయవచ్చు. ప్రధానంగా భాషలో విన్నదాని గురించి, తెల్సినదాని గురించి, చదివిన దాని గురించి ప్రశ్నించినప్పుడు వారి ప్రతిస్పందనల ద్వారా అవగాహన స్థాయిని అంచనావేయవచ్చు. ఇది నిరంతరం రోజువారీగా జరిగే ప్రక్రియలు. ఆయా సందర్భాలలో ప్రతిస్పందనల ద్వారా పిల్లలు వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం, అర్థంచేసుకోవడం వంటి సామర్థ్యాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఉపాధ్యాయులు తమ పరిశీలనలపై ఆధారపడాలి. పిల్లల యొక్క భాగస్వామ్యం తీరుతెన్నుల గురించి, ప్రతిస్పందనాశక్తి గురించి తమ పరిశీలనను ఉపాధ్యాయులు తమ డైరీలో నమోదుచేసుకోవడం ద్వారా వారి స్థాయిని మూల్యాంకనం చేయవచ్చు.

- **పిల్లలు రాసిన అంశాలు :** భాషాసామర్థ్యాలలో రాయడం ఒక ముఖ్యమైన సామర్థ్యం. ప్రాథమికంగా పిల్లలు తప్పుల్లేకుండా రాయడం, అందంగా రాయడంతో మొదలైన ఈ సామర్థ్యం క్రమేణా సొంతంగా రాయడం, క్రమపద్ధతిలో రాయడం, విశ్లేషణాత్మకంగా రాయడం, నివేదికలు రాయడం, అభిప్రాయాలు రాయడం, విమర్శనాత్మకంగా రాయడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాల స్థాయికి చేరుతుంది. 'రాయడం' అనే సామర్థ్యం రాస్తూ ఉంటేనే వృద్ధి చెందుతుంది. ఇందుకోసం కేవలం పరీక్షలప్పుడు రాసే జవాబు పత్రాలపైననే ఆధారపడడం వల్ల పిల్లలు రాసే సామర్థ్యాన్ని పూర్తిగా అంచనావేయలేం. ఇది నిరంతరం జరగాలి. ఇందుకోసం పిల్లలు ప్రతి రోజూ ఏదో ఒకదాన్ని గురించి ఎంతో కొంత రాయాల్సి ఉంటుంది.

  పిల్లల నోటుబుక్కులు, ప్రాజెక్టుపని నివేదికలు, సేకరించిన అంశాలు, పిల్లలు రాసే కవితలు, కథలు, గేయాలు, అసైన్‌మెంట్లు వంటివన్నీ కూడా పిల్లల రాత పనులకు నిదర్శనాలు. వీటిని పిల్లలు రాసే విధానాన్ని నిరంతరం అంచనావేయాల్సి ఉంటుంది. పిల్లలు రాసిన అంశాలతో పోర్టుఫోలియోలు తయారుచేయడం, పుస్తకసంకలనాలు తయారుచేయడం ద్వారా తరగతిలో భద్రపరచవచ్చు. వీటి ఆధారంగా పిల్లలు రాసే సామర్థ్యాన్ని అంచనావేయవచ్చు. ఈ ప్రగతిని నమోదుచేయవచ్చు.

- **లఘు పరీక్ష (స్లిప్ టెస్టు) :** ఇది సాధారణంగా నిర్వహించే రాతపరీక్షకాదు. దీన్ని నిర్వహించడానికి నిర్దిష్ట సమయం కానీ, ముందస్తు ప్రణాళికగానీ, పిల్లలకు ముందే తెలపాల్సిన అవసరంకానీ ఉండదు. అప్పటికప్పుడు పిల్లల స్థాయిని అంచనావేయడానికి నిర్వహించేపని. చదివింది అర్థంచేసుకోవడం గురించి లేదా సొంతంగా సొంతమాటల్లో రాయడం గురించి లేదా పదజాల వినియోగం గురించి లేదా వ్యాకరణాంశాల గురించి లేదా సృజనాత్మకత గురించి లేదా ప్రశంస గురించి .... ఇలా ఏ సామర్థ్యం గురించైనా కావచ్చు, పిల్లల సామర్థ్యాన్ని అప్పటికప్పుడు పరీక్షించడానికి ఉద్దేశించినది లఘుపరీక్ష. ఒక పాఠం పూర్తయిన తర్వాతకూడా నిర్వహించుకోవచ్చు. ఐతే సి.సి.ఇ. పేరుతో చీటికి మాటికి పరీక్షించి పిల్లలను మరింత ఒత్తిడికి లేదా ఆందోళనకు గురిచేయరాదు. సాధారణంగా ఇచ్చే ఇంటిపని లాగానే పీరియడ్‌లో అప్పటికప్పుడు నిర్వహించుకోవచ్చు. ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి. జవాబులను నోటుబుక్కులో రాయమనాలి.

- **ప్రాజెక్టుపనులు :** భాషానైపుణ్యాలు అనగా వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం గురించి అందరికీ తెల్సు. ఐతే భాషా బోధన వీటి సాధనకే పరిమితం కాకుండా సృజనాత్మకత, కల్పనాశక్తి, ప్రశంసా పూర్వకమైన వైఖరి నిర్మాణం, మానవ సంబంధాల మెరుగుదల, మానసికోల్లాసం వంటి సాధనకు కూడా తోడ్పడాలి. తరగతి గదుల్లో భాషా నైపుణ్యాల సాధనకు అభ్యాసం కల్పించినా, సందర్భోచితంగా వీటిని వినియోగించే సమర్థత, కల్పనచేయడం, ఆలోచించడం, నిర్ణయాలు గైకొనడం, వాటికి కట్టుబడడం, నివేదికలు రాయడం, వాటిని చక్కగా ఎదుటివారికి వివరించగల్గడం వంటి

అనేక సామర్థ్యాలు సాధింపబడడానికి భాషలో కూడా ప్రాజెక్టుపనులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఎ.పి.ఎస్.సి.ఎఫ్. 2011 పేర్కొన్నట్లు అభ్యసనం పాఠ్యపుస్తక పరిధి దాటాలి. అదనపు పఠన సామగ్రిని పిల్లలు చదవాలి. పిల్లల్లో భాషాభిమానం, భాషాభిరుచి పెరగాలి. పఠనాశక్తి పెరిగి స్వతంత్ర్య పాఠకులుగా ఎదగాలి. ఇందుకోసం అనేక కృత్యాలు, సామర్థ్యాల సమాహారమైన ప్రాజెక్టుపనులను నిర్వహించాలి. నూతన భాషా వాచకాలలో ప్రతి పాఠంలో ఒక ప్రాజెక్టుపనిని ఇచ్చారు. వీటిని పిల్లలతో చేయించాలి. నివేదికలు రాయించాలి. ఈ నివేదికలను పోర్టుఫోలియోల రూపంలో భద్రపరచాలి. వీటి ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనావేసి నమోదుచేయాలి.

ఉ) **సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation) :** నిర్దిష్ట కాలపరిమితికి నిర్ధారించిన అంశాల ఆధారంగా ఆశించిన భాషా సామర్థ్యాలను ఎంతమంది పిల్లలు సాధించగల్గుతున్నారు? లేదా ఒక విద్యార్థి ఎంతమేరకు సామర్థ్యాలను పొందాడో తెల్సుకోడానికి దోహదపడేది సంగ్రహణాత్మక మూల్యాంకనం. సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని సాధారణంగా రాతపరీక్షల ద్వారా, మౌఖిక పరీక్షల ద్వారా నిర్వహిస్తారు. ఒక విద్యా సంవత్సరంలో దీన్ని మూడుసార్లు నిర్వహించాల్సి ఉంటుంది. **మొదటిది సెప్టెంబర్, అక్టోబర్ మాసంలో, రెండవది డిసెంబర్ లేదా జనవరి మాసంలో, మూడవది ఏప్రిల్ మాసంలో** నిర్వహించాలి.

## సంగ్రహణాత్మక మూల్యాంకనంలో వేటిని మూల్యాంకనం చేయాలి?

భాషాబోధన యొక్క లక్ష్యం భాషా సామర్థ్యాలను సాధింపచేయడమే! అందుకే నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించేటపుడు సాధించాల్సిన సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకొన్నారు. విద్యాసంవత్సరం పూర్తయ్యేనాటికి ఏఏ సామర్థ్యంలో ఎంతవరకు వేటిని సాధించాలో పాఠ్యపుస్తకాలలో వివరాలు పొందుపరచారు. వీటికి అనుగుణంగా పాఠ్యపుస్తకంలో ప్రతి పాఠం చివర **'ఇవి చేయండి'** పేరుతో అభ్యాసాలను పొందు పర్చారు. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో ఏ ఏ భాషా సామర్థ్యాలను మూల్యాంకనం చేయాలో తెల్సుకొందాం.

### 1. వినడం, ఆలోచించి మాట్లాడడం

పిల్లలు గేయాలు, పాటలు, కథలు, సంభాషణ అన్ని అర్థంచేసుకోవాలి. విన్న అంశాన్ని / సారాంశాన్ని క్రమ పద్ధతిలో సొంతమాటల్లో చెప్పగలగాలి. పిల్లలు తాము విన్న వాటి గురించి అభిప్రాయాలు చెప్పగలగడం, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడాలి. కారణాలు చెప్పగలగాలి. చిన్న చిన్న ప్రసంగాలు ఇవ్వగలగాలి.

### 2. ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం.

వివిధ ప్రక్రియలు అనగా కథలు, గేయాలు, పాటలు, వార్తలు, సంభాషణలు వంటివి చదివి అర్థం చేసుకోవాలి. దీని ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, విషయాలను క్రమపద్ధతిలో పట్టికలో రాయడం, చదివిన అంశం ఆధారంగా ప్రశ్నలురాయడం, తప్పొప్పులు గుర్తించడం, పాత్రలస్వభావాల పట్టికతయారు చేయడం వంటివి చేయగలగాలి.

### 3. ఆలోచించి రాయడం / స్వీయరచన : -

పిల్లలు తమకుతెల్సిన, విన్న, చూసిన, చదివిన అంశాల గురించి సొంతంగా ఒకటి, రెండు పేరాలు రాయగల్గాలి. అభిప్రాయలను, ఆలోచనలను రాయగలగాలి. సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.

### 4. పదజాలం :-

పాఠంలోని పదాలకు అర్థాలు గ్రహించగల్గాలి. వాటితో వాక్యాలు రాయగల్గాలి. వీటిని సందర్భోచితంగా వినియోగించగల్గాలి.

**5. సృజనాత్మకత :-**

కథలు, కవితలు, గేయాలు పాడించగలగడం, సొంతంగా రాయగలగడం, పోస్టర్లు, కరపత్రాలు, గ్రీటింగ్‌కార్డులు, నినాదాలు, సూక్తులు, సంభాషణలు రాయగలగాలి. కథలు, చిత్రాల ఆధారంగా సంభాషణలు రాసి అభినయించగలగాలి.

**6. ప్రశంస :-**

ఇతరులు అనగా బాలికలు, ఇతర మతాలు, వర్గాలు, వికలాంగులు మొదలగువారిలోని గొప్పతనాన్ని గుర్తించి ప్రశంసించగలగాలి. ఇతరుల సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించగల్గాలి. పిల్లలో ఇతరులను అభినందించేవైఖరి పెంపొందాలి.

**7. భాషను గురించి తెల్సుకోవడం :-**

కాలాలు, క్రియలు, క్రియల్లో భేదాలు, భాషాభాగాలపై అవగాహన, వచనాలు మొదలగునవి గుర్తించగల్గాలి. అవగాహన చేసుకోవాలి. వాక్యనిర్మాణంలో విభక్తుల పాత్రను గుర్తించాలి.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం, ప్రశ్నపత్రం రూపొందించడానికి సూచనలు**

- సంగ్రహణాత్మక పరీక్ష కోసం ఉపాధ్యాయుడే ప్రశ్నపత్రం తయారుచేసుకోవాలి.
- పూర్తయిన పాఠాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి. అక్టోబర్ వరకు పూర్తయిన పాఠాల ఆధారంగా మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఉండాలి.
- రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రంలో మొదటి టర్మ్ అనగా అక్టోబర్ వరకు నేర్చుకొన్న వాటిలో 30% ప్రశ్నలు ఉండాలి.
- మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనంలో విద్యా సంవత్సరం పూర్తయ్యేనాటికి సాధించాల్సిన సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రం తయారుచేయాలి.
- బట్టీపట్టి రాయడానికి, జ్ఞాపకం ఉంచుకొని రాయడానికి బదులు సొంతంగా ఆలోచించి రాసేలా ప్రశ్నలు ఉండాలి.
- పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో అన్వయించి జవాబులు రాసేలా ప్రశ్నలు ఉండాలి.
- రెండు గంటల సమయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రం తయారు చేసుకోవాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం 50 మార్కులకు ఉంటుంది.
- సామర్థ్యాల వారీగా కేటాయించిన భారత్వం ప్రకారం రాతపరీక్షకు ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి.
- మౌఖిక పరీక్షకు కేటాయించిన మార్కులను మినహాయించి భారత్వపట్టిక ప్రకారం రాత పరీక్షకు ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి.
- వినడం, ఆలోచించి మాట్లాడడం, ప్రశంస వంటి సామర్థ్యాలలో పిల్లలస్థాయిని మౌఖిక పరీక్షద్వారా అంచనావేయాలి. భారత్వం ప్రకారం వీటికి కూడా మార్కులు ఉంటాయి. అట్లే చదవడంలో పిల్లలు ధారాళంగా చదవడం గురించి కూడా పిల్లలను మౌఖికంగా అంచనావేయాల్సి ఉంటుంది. దీనికి కూడా మార్కులు ఉంటాయి. లేదా నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) లోని పిల్లలస్థాయిని పరిగణనలోకి తీసుకొని నమోదుచేయాలి.
- ఒక సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలన్నిటినీ ప్రశ్నపత్రంలో ఒకే దగ్గర ఇవ్వాలి.
- ప్రాజెక్టు పనులను ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు.

**సామర్థ్యాలవారీగా మౌఖిక, రాత పరీక్షల భారత్వం**

| క్ర. సం. | సామర్థ్యాలు | 1,2 తరగతులు | | | | 3, 4, 5 తరగతులు | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | మౌఖికపరీక్ష | | రాతపరీక్ష | | మౌఖికపరీక్ష | | రాతపరీక్ష | |
| | | % | మార్కులు | % | మార్కులు | % | మార్కులు | % | మార్కులు |
| 1. | వినడం, మాట్లాడడం, ప్రశంస | 20% | 10 | – | – | 10% | 5 | – | – |
| 2. | ధారాళంగా చదవడం, అవగాహన చేసుకోవడం | 10% | 5 | 20% | 10 | 10% | 5 | 20% | 10 |
| 3. | స్వీయరచన | – | – | 40% | 20 | – | – | 30% | 15 |
| 4. | సృజనాత్మకత | 10% | 5 | – | – | – | – | 10% | 5 |
| 5. | పదజాలం, వ్యాకరణాంశాలు | – | – | – | – | – | – | 20% | 10 |
| 6. | మొత్తం | 40% | 20 | 60% | 30 | 20% | 10 | 80% | 40 |

**సంగ్రహణాత్మక పరీక్ష ప్రశ్నపత్రంలో సామర్థ్యాల వారీగా ప్రశ్నల సంఖ్య**

| క్ర.సం | సామర్థ్యం | ప్రశ్నల స్వభావం | జవాబులు రాయాల్సిన ప్రశ్నల సంఖ్య | మార్కులు |
|---|---|---|---|---|
| 1. | చదవడం | • పరిచిత గద్యం (లక్ష్యాత్మకం)<br>• అపరిచిత గద్యం / గేయం (లక్ష్యాత్మకం) | 5<br>5 | 5<br>5 |
| 2. | రాయడం | • వ్యాసరూప సమాధానాలు (రెండింటిలో ఒకటి రాయాలి)<br>• లఘు సమాధాన ప్రశ్నలు | 1<br>5 | 5<br>10 |
| 3. | సృజనాత్మకత | • పరిచిత వ్యవహార రూపాలు 3 ఇస్తే ఒకటి రాయాలి. | 1 | 5 |
| 4. | పదజాలం, వ్యాకరణాంశాలు | పదజాలం – లక్ష్యాత్మకం<br>భాషాంశాలు – లక్ష్యాత్మకం | 5<br>5 | 5<br>5 |
| 5. | మొత్తం | వ్యాసరూప – 1<br>లఘు సమాధానం – 5<br>వ్యవహార రూపాలు – 1<br>లక్ష్యాత్మకం – 20 | 27 | 40 |

- **ప్రశ్నల స్వభావం: 1, 2 తరగతులు**

**చదవడం :** చదవడానికి 2 రకాల ప్రశ్నలు ఇవ్వాలి.

- ఒక్కొక్కటి ఐదు మార్కులకు అనుగుణంగా లక్ష్యాత్మక ప్రశ్నలు తయారుచేయాలి.
- మొదటి రకం ప్రశ్నలు అక్షరాలకు, పదాలకు సంబంధించినవిగా ఉండాలి.

  ఉదా: అక్షరాన్ని పదంతో జతపరచడం, పదాలలో, వాక్యాలలో అక్షరాన్ని గుర్తించడం, పదంలో లోపించిన అక్షరాన్ని రాయడం.
- రెండవది పదంలో తారుమారైన అక్షరాలను సరిచేసి రాయడం.
- ఒక్కొక్క ప్రశ్నకు ఒక మార్కు లేదా అరమార్కు చొప్పున మార్కులు కేటాయించాలి.

**రాయడం :** రాయడానికి 4 రకాల ప్రశ్నలు ఇవ్వాలి. ఇవికూడా లక్ష్యాత్మక ప్రశ్నలు ఉండాలి.

- మొదటి రకంలో ఐదు ప్రశ్నలు అక్షరాలకు సంబంధించినవిగా ఉండాలి. (వర్ణమాల అక్షరాలు, గుణింతాలు, ఒత్తులు - అక్షరాలు రాయడం.)
- రెండవ రకం ఐదు ప్రశ్నలు పదాలకు సంబంధించినవిగా ఉండాలి.

  ఉదా: చిత్రాలకు పేర్లు రాయడం, సొంతంగా పేర్లు రాయడం. (కూరగాయలు, పూల, వ్యక్తుల పేర్లు.)
- మూడవ రకం ప్రశ్నలు వాక్యాలకు సంబంధించినవిగా ఉండాలి.

  ఉదా: చిత్రం ఆధారంగా వాక్యాలు రాయడం. పదాలతో సొంతవాక్యాలు రాయడం.
- నాల్గవ రకం ప్రశ్న దేని గురించైనా సొంతంగా వాక్యాలు / పేరా రాసేలా ఇవ్వాలి లేదా లఘు సమాధాన ప్రశ్నలు ఇవ్వవచ్చు.

- **ప్రశ్నల స్వభావం: 3, 4, 5 తరగతులు**

**I. ధారాళంగా చదవడం, అర్థం చేసుకోవడం :**

- చదవడానికి రెండు రకాల ప్రశ్నలు ఇవ్వాలి.
- పిల్లలు చదవగల్గుతున్నారా? లేదా తెల్సుకోడానికి, చదివినదాన్ని అర్థం చేసుకోవడాన్ని అంచనావేయడానికి ప్రశ్నలు ఉండాలి.
- ఒక్కొక్కటి ఒక మార్కు చొప్పున ఐదు మార్కులకు లక్ష్యాత్మక ప్రశ్నలు ఇవ్వాలి.
- వీటిలో ఒకటి తప్పనిసరిగా పేరా / గేయం ఇచ్చి పేరా ఆధారంగా ప్రశ్నించేలా ఉండాలి. అనగా బహుళైచ్ఛిక ప్రశ్నలు లేదా పేరా చదివి తప్పొప్పులు, ప్రశ్నలు రాయడం లేదా ప్రశ్నలకు జవాబులు రాయడం, పేరాలోని కీలకాంశాలు రాయడం, సారాంశం రాయడం మొదలగునవి ఇవ్వాలి.

- రెండవ రకం ప్రశ్న పదాలు, వాక్యాలు, పేరాలు మొదలగునవి చదవగలుగుతున్నారా లేదా పరీక్షించడానికి అనువుగా ఉండాలి.

  ఉదా: వాక్యంలోని పదాలను తారుమారు చేసి సరిచేయమనడం లేదా సన్నివేశం / కథావాక్యాలను క్రమం తప్పి ఇచ్చి వరుస క్రమంలో రాయమనడం, పేరాలోని వాక్యాలు తారుమారిచ్చి పేరాను సరిచేసి రాయమనడం మొదలగునవి.

**II. ఆలోచించి సొంతంగా రాయడం (స్వీయరచన) :**

- రాయడం అంటే పిల్లలు సొంతంగా తమ ఆలోచనలను, భావాలను రాయగలగడం. కాబట్టి బహుళ సమాధానాలు వచ్చేలా ప్రశ్నలు ఉండాలి. (Open ended Questions). పిల్లలు తమ అభిప్రాయాలను రాయగలగాలి.
- ప్రశ్నపత్రంలో ఇందుకోసం రెండు రకాల ప్రశ్నలు ఇవ్వవచ్చు. వీటిలో ఒకటి వ్యాసరూప సమాధాన ప్రశ్న అనగా తెలిసిన వాటి గురించి సొంతమాటల్లో 8, 10 వాక్యాలతో పేరా రాసేలా ఉండాలి.

  ఉదా: మీరు జరుపుకునే పండుగ, సారాంశం రాయడం, భావాలు రాయడం మొదలగునవి.
- ఇందుకోసం 2 లేదా 3 ప్రశ్నలు ఇచ్చి ఒక దానిని రాయమనచ్చు.
- రెండవ రకం ప్రశ్నలు లఘు సమాధానం వచ్చేవిగా ఉండాలి. ఇవి కూడా పాఠంలోని విషయాన్ని జ్ఞాపకం ఉంచుకొని రాసేలా ఉండకూడదు. సొంతంగా ఆలోచించిరాసేలా ప్రశ్నలు ఉండాలి.
- రెండు, మూడు వాక్యాలలో సమాధానం రాసేలా ఉండాలి.

**III. సృజనాత్మకత :**

- పిల్లలు సొంతంగా కవితలు, కథలు, గేయాలు, సంభాషణలు, నినాదాలు ..... వంటివి రాయడం, పొడిగించడం చేయడానికి వీలుగా వివిధ వ్యవహార రూపాల్లో ప్రశ్నలు ఉండాలి.
- పాఠాల్లోని సృజనాత్మక వ్యక్తీకరణలోని అంశాల ఆధారంగా ప్రశ్నలు ఉండాలి. అయితే పుస్తకంలో ఇచ్చినవే ఇవ్వకూడదు. అలాంటి స్వభావం ఉన్న ఇతర వ్యవహార రూపాలను అడగాలి.

  ఉదా: చిత్రం ఆధారంగా సంభాషణలు రాయడం, కథను పొడిగించడం, ఇచ్చిన పదాలు, ఆధారాలకు లోబడి కథ రాయడం మొదలగునవి.
- వీటికి కూడా ఏవైనా 3 వ్యవహార రూపాలు ఇచ్చి ఒక దాన్ని రాయమనాలి.

**IV. పదజాలం / భాషాంశాలు :**

- వీటిలో పదజాలానికి, భాషాంశాలకు వేరు వేరుగా ప్రశ్నలు ఇవ్వాలి.
- పదజాలం కోసం పదాలు ఇచ్చి సొంతవాక్యాలు రాయమనడం, పదాలు ఇచ్చి సందర్భోచితంగా ఖాళీలను పూరించమనడం, గళ్ళనుడికట్టు, పదనిర్మాణం, సమానార్థకపదాలు, వ్యతిరేకార్థక పదాలు వంటివి కూడా ఇవ్వవచ్చు.
- పదాలకు అర్థాలు / నానార్థాలు / పర్యాయపదాలు రాయమన్నప్పుడు వాక్యరూపంలో ఇచ్చి అడగాలి.

- వీటికి ఒక్కొక్క మార్కు చొప్పున లేదా 1/2 మార్కు చొప్పున ప్రశ్నలు లక్ష్యాత్మకంగా ఇవ్వాలి.
- వ్యాకరణాంశాలకు కూడా లక్ష్యాత్మక ప్రశ్నలు ఇచ్చి పరీక్షించాలి.
- వీటికి కూడా పదజాలంలో వచ్చినట్లుగానే 1 మార్కు, 1/2 మార్కుకు అనుగుణంగా లక్ష్యాత్మక ప్రశ్నలు ఇవ్వాలి.

✦ **జవాబుపత్రాలు దిద్దడం :-**

పిల్లలు రాసిన సమాధానాల ఆధారంగా మార్కులు కేటాయించాలి. జవాబుపత్రంలో పైన సామర్థ్యాల వారీగా మార్కులు, గ్రేడును నమోదు చేసుకోవాలి.

✦ **పిల్లల ప్రగతి నమోదు :-**

పిల్లలకు వచ్చిన మార్కుల ఆధారంగా పిల్లల ప్రగతిని గ్రేడుల రూపంలో సంబంధిత రిజిష్టరులో నమోదు చేయాలి. మార్కుల ఆధారంగా సామర్థ్యాల వారీగా మొత్తం గ్రేడును నమోదుచేయాలి.

✦ **గ్రేడు వివరాలు :-**

91 – 100 : A+

71 – 90 : A

51 – 70 : B+

41 – 50 : B

0 – 40 : C

✦ ఒక సామర్థ్యంలోనైనా లేదా తెలుగు సబ్జెక్టు మొత్తానికి కూడా పిల్లలకు వచ్చిన మార్కుల ఆధారంగానే గ్రేడును కేటాయించాలి. అయితే పిల్లలకిచ్చే ప్రగతి పత్రంలో మార్కుల ఆధారంగా కేవలం గ్రేడును నమోదుచేసి ఇవ్వాలి.

*దురదృష్టవశాత్తు విద్యారంగంలో ముఖ్యంగా ఉపాధ్యాయ శిక్షణా రంగంలో పాత అంధ విశ్వాసాలు,కొన్ని క్రొత్త మూఢ నమ్మకాలను ప్రతిష్టించే పని వరుసగా జరుగుతూనే ఉంది. అవి మరింత ఆర్భాటంగా జరుగుతోంది. ఏదైనా ఒక క్రొత్త పద్ధతి, క్రొత్త సాంకేతికం రాగానే వెంటనే అందరూ దానినే ఆకాశానికి ఎత్తేస్తారు. బోధనా రంగంలోని అన్ని సమస్యలకు అదే రామ బాణం అంటారు. అయితే తదనంతరం మరొక నూతన పద్ధతి ప్రవేశించగానే ఈ రామ బాణం పనికి రానిదైపోతుంది. ప్రతి పద్ధతిలోనూ మంచి ఉంటుంది. చెడు ఉంటుంది. ఆలోచించినప్పుడు విజ్ఞులకు ఆ రెండూ తెలిసి వస్తాయి. గిజుభాయి పేర్కొన్న అన్ని శిక్షణా పద్ధతుల్లోని మంచిని, చెడును రెండింటిని చెప్పడమేగాక వాటిలోని ఉత్కృష్టతను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించాలి. గిజుభాయి అనుభవాల ప్రకారం మనకు అనిపించేదేమిటంటే ఏ పద్ధతి అయినా తరగతి స్థాయి, వాతావరణం, పాఠ్యాంశం, ఉపాధ్యాయుని బోధనా పద్ధతి ఈ అన్నింటిపై ఆధారపడి ఉంటుంది. కనుక రామబాణం లాంటి చిట్కా ఏదీ లేదు. ఉపాధ్యాయుడు తన కళ్ళను, చెవులను బాగా తెరిచి ఉంచాలి. వీటికన్నా తన మెదడును మరింత విశాలంగా తెరిచి ఉంచాలి.*

*– శ్యామలాల్ కౌశిక్, వైశాలినగర్, అజ్మీర్.*

## పిల్లల ప్రగతి నమోదు

పిల్లల ప్రగతి నమోదుకోసం పాఠశాలలో సి.సి.ఇ. రిజిష్టరును ఏర్పాటుచేసుకోవాలి. దీంట్లో నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలలో పిల్లల ప్రగతి వివరాలను నమోదుచేయాలి. పిల్లలు పొందిన మార్కుల ఆధారంగా గ్రేడింగ్ నమోదుచేయాలి.

a) గ్రేడింగ్ వివరాలు

91 - 100 : A+
71 - 90 : A
51 - 70 : B+
41 - 50 : B
0 - 40 : C

b) నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల ప్రగతి నమోదు పట్టిక.

| క్ర.సం. | పేరు | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (10 మా) | పిల్లలు రాసిన అంశాలు (10 మా) | ప్రాజెక్టుపని (10 మా) | లఘు పరీక్ష (20 మా) | మొత్తం మార్కులు (50 మా) | గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|
| 1. | పి.రజని | 8 | 7 | 8 | 15 | 38 | A |
| 2. | ఎ.రాము | 8 | 9 | 9 | 18 | 46 | A+ |
| 3. | | | | | | | |
| 4. | | | | | | | |

c) సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పిల్లల ప్రగతి నమోదు పట్టిక.

| క్ర.సం. | పేరు | వినడం - మాట్లాడడం ప్రశంస (10) | చదవడం (20) | స్వీయరచన (30) | సృజనాత్మక (20) | పదజాలం, భాషాంశాలు (20) | మొత్తం మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | పి.రజని | 8 | 16 | 25 | 15 | 15 | 79 | A |
| 2. | ఎ.రాము | 8 | 18 | 26 | 16 | 18 | 86 | A |
| 3. | | | | | | | | |
| 4. | | | | | | | | |

d) వార్షిక ఫలితం : ఒక విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించి పిల్లల ప్రగతిని నమోదుచేస్తారు. అట్లే మూడుసార్లు సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించి పిల్లల ప్రగతిని నమోదుచేస్తారు. ఐతే విద్యా సంవత్సరం చివరన వార్షిక ఫలితాన్ని నిర్ధారించాలి. ఇందుకోసం నాలగవ నిర్మాణాత్మక మూల్యాంకనంలోని ప్రగతిని, మూడవ అనగా చివరి సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని ప్రగతి ఆధారంగా వార్షిక ఫలితాన్ని నిర్ధారించాలి. ఇందుకోసం కింది పట్టికను పరిశీలించండి.

**వార్షిక ఫలితం - ప్రగతి వివరాలు**

| క్ర.సం. | పేరు | 4వ సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని మార్కుల గ్రేడు (50) | 3వ సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని మార్కుల గ్రేడు (100) | మొత్తం మార్కులు (150) | వార్షిక ఫలితం గ్రేడు |
|---|---|---|---|---|---|
| 1. | పి.రజని | 36-A | 78-A | 114 | A |
| 2. | ఎ.రాము | 46-A | 89-A | 135 | A |

# సంగ్రహణాత్మక మూల్యాంకనం - తెలుగు

## మౌఖిక పరీక్ష ప్రశ్నపత్రం

**1వ తరగతి** **మార్కులు: 20**

---

**I. వినడం, మాట్లాడడం**

**అ) కింది వాటిలో ఏదైనా ఒక గేయాన్ని పాడండి.** 5 మార్కులు

- అల్లిబిల్లి జాబిలమ్మ
- కోతి బావకు పెళ్లంట
- ఇల్లు కట్టి చూడండి

**ఆ) కింది వాటిలో ఏదైనా ఒకదాన్ని గురించి చెప్పండి.** 5 మార్కులు

- ఔటు కథ
- తాళం చెవి కథ
- ఎలుక-ఏనుగు కథ

**II. చదవడం**

**కింది వాటిలో ఏవైనా ఐదు వాక్యాలు చదవండి.** 5 మార్కులు

(అ) విజయకు ఒక రూపాయి కావాలి.

(ఆ) ఒంటెను ఎడారి ఓడ అంటారు.

(ఇ) ఊయల ఊగడం మాకు ఆనందం.

(ఈ) వేటగాడు జింకను చూశాడు.

(ఉ) బొంగరం ఆట ఆడుకుందామా!

(ఊ) రైలులో గౌతమి ఊరికి పోయింది.

(ఎ) కాకి, మేక ఆటలు ఆడాయి.

(ఏ) గౌరి సైకిలు కొనింది.

**III. సృజనాత్మకత**

**కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి చెప్పండి.** 5 మార్కులు

(అ) 125వ పేజీలోని చిత్రం చూడండి. కథను చెప్పండి.

(ఆ) 23వ పేజీలో పాప, ఉడత, ఏమి మాట్లాడుకుంటున్నారో ఊహించి చెప్పండి.

(ఇ) 109వ పేజీలోని చిత్రం చూసి కథను ఊహించి చెప్పండి.

# సంగ్రహణాత్మక మూల్యాంకనం – తెలుగు

## రాత పరీక్ష ప్రశ్నపత్రం – 1వ తరగతి

**విద్యార్థి పేరు :** ______________________ **మొత్తం మార్కులు : 30**

---

**I. చదవడం : (10 మార్కులు)**

**1. కింది అక్షరాలను సరిచేసి పదాలు రాయండి.** $2\frac{1}{2}$ మార్కులు

(అ) ప ఆ న య కా ______________


(ఆ) మా ట టా ______________

(ఇ) టి ర య అ కా ______________

(ఈ) ప ళ గా బం దుం ______________

(ఉ) య కా వం ______________


**2. కింది బొమ్మలను సరైన పదాలతో జతపరచండి.** $2\frac{1}{2}$ మార్కులు



గొడుగు



కొడవలి



చేపలు



ఇటుకలు



కడవ

**3. కింది పదాలు చదవండి. ఖాళీలను సరైన పదాలతో పూరించండి.** 5 మార్కులు

గొడుగు, గులాబీ, దంతం, పడవ, టెంకాయ

(అ) నీటిలో ________________ ఉంది.

(ఆ) ఏనుగు ________________ తెల్లన.

(ఇ) ________________ పూలు అందంగా ఉంటాయి.

(ఈ) దేవుడికి ________________ కొడతారు.

(ఉ) వర్షంలో ________________ పట్టుకొని వెళ్ళాలి.

## II. రాయడం (20 మార్కులు)

**1. కింది గుణింతాన్ని రాయండి.** 5 మార్కులు

| ✓ | ా | ి | ీ | ు | ూ | ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క | కా | | | | | | | | | | |

**2. కింది గళ్ళలోని అక్షరాలతో ఏర్పడే 10 పదాలు రాయండి.** 5 మార్కులు

| | | | |
|---|---|---|---|
| వ | ఈ | ఉ | ఫ |
| ఉ | క | త | స |
| ప | జ | ం | గ |
| ల | బ | న | శ |

ఉదా॥ ఈగ

________________ ________________


________________ ________________

________________ ________________


________________ ________________

________________ ________________

**3. కింది బొమ్మలు చూసి పేర్లు రాయండి.** 5 మార్కులు







________________ ________________ ________________ ________________ ________________

**4. కింది బొమ్మను చూసి 5 వాక్యాలు రాయండి.** 5 మార్కులు



________________________________

________________________________

________________________________

________________________________

________________________________

# సంగ్రహణాత్మక మూల్యాంకనం - తెలుగు

## మౌఖిక పరీక్ష ప్రశ్నపత్రం - తెలుగు

**2వ తరగతి** **మార్కులు: 20**

**I. వినడం, మాట్లాడడం**

**అ) కింది వాటిలో ఏదైనా ఒక గేయాన్ని పాడండి.** 5 మార్కులు

- చెమ్మచెక్క
- చిట్టిచిట్టి మిరియాలు
- రింగురింగు బిళ్ళ

ఆ) కింది వాటిలో ఏదైనా ఒకదాని గురించి చెప్పండి. 5 మార్కులు

- రత్తయ్య-జగ్గయ్య కథ
- బైరవుడి కథ
- కాకి తెలివి కథ

**II. చదవడం**

**కింది పేరాలలో ఏదైనా ఒక పేరాను ధారాళంగా చదవండి.** 5 మార్కులు

(అ) సంయుక్త టీచరు జెండా ఎగురవేశారు. జాతీయ గీతం పాడుతూ అందరూ జెండాకు వందనం చేశారు. దేశభక్తి గేయాలు పాడారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ఇచ్చారు. పిల్లలకు, పెద్దలకు మిఠాయిలు పంచారు. ఆనందంగా గెంతులు వేస్తూ పిల్లలు ఇళ్ళకు వెళ్ళారు.

లేదా

(ఆ) పరమానందయ్య ఒక గురువు. ఆయనకు పన్నెండు మంది శిష్యులు. ఒకరోజు గురువుగారు ఊరికి పోవాలని అనుకున్నారు. ఎద్దుల బండిలో బయలుదేరారు. శిష్యులూ బండి వెనక నడవసాగారు. కింద ఏమైనా పడతాయేమో చూడండి, అన్నారు గురువుగారు.

లేదా

(ఇ) ఒక అడవిలో ఒక నక్క ఉండేది. దానికి కొంగ మాంసం తినాలని కోరిక. ఒకరోజున దారిలో కొంగ కనిపించింది. కొంగ బావా! మా ఇంటికి రావా! నీకు చేపల పులుసుతో భోజనం పెడతాను అంది. కొంగ, నక్క మాటలు నమ్మింది. నక్క ఇంటికి వెళ్ళింది.

**III. సృజనాత్మకత**

**కింది వాటిలో ఏదైనా ఒక అంశం గురించి చెప్పండి.** 5 మార్కులు

(అ) 100వ పేజీలో కుక్క, కోడి మధ్య సంభాషణను ఊహించి చెప్పండి.

(ఆ) 73వ పేజీలో అబ్బాయి, ఏనుగు మధ్య సంభాషణను ఊహించి చెప్పండి.

(ఇ) 42వ పేజీలో చిత్రం ఆధారంగా కథను ఊహించి చెప్పండి.

# సంగ్రహణాత్మక మూల్యాంకనం – తెలుగు

## రాత పరీక్ష – ప్రశ్నపత్రం – 2వ తరగతి

విద్యార్థి పేరు : ______________________ మొత్తం మార్కులు : 30

**I. చదవడం (10 మార్కులు)**

**1. కింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.** 5 మార్కులు

(గడ్డి, ముగ్గు, కత్తెర, దుప్పటి, అత్త)

(అ) ఆవు ______________ తింటుంది.

(ఆ) నాన్నగారి చెల్లెలిని ______________ అంటారు.

(ఇ) చలికి ______________ కప్పుకుంటారు.

(ఈ) ఇంటిముందు ______________ పెడతారు.

(ఉ) బట్టలను ______________ తో కత్తిరించాలి.

**2. పదాలు జతపరచండి. వాక్యాలు రాయండి.** 5 మార్కులు

| | |
|---|---|
| (i) పూల సజ్జలో | పట్టుచీర ఉంది |
| (ii) బస్సు టైరులో | కారంగా ఉంటాయి |
| (iii) పంటచేలో | ముద్దబంతి పూలు ఉన్నాయి |
| (iv) అట్టపెట్టెలో | గాలి తుస్సుమంది |
| (v) మిరపకాయ బజ్జీలు | పైరు వేశారు. |

(i) ________________________________________

________________________________________

(ii) ________________________________________

________________________________________

(iii) ________________________________________

________________________________________

(iv) ________________________________________

________________________________________

(v) ________________________________________

________________________________________

## II. రాయడం (20 మార్కులు)

**1. 'మ' గుణింతానికి 'ౖమ' చేర్చి రాయండి.** 5 మార్కులు

| ✓ | ా | ి | ీ | ు | ూ | ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మ్మ | మ్మా | | | | | | | | | | |

**2. కింది గళ్ళలోని అక్షరాలతో 10 పదాలు రాయండి.** 5 మార్కులు

| | | | | |
|---|---|---|---|---|
| మ | రా | సి | నీ | బ్బా |
| జ | క | గ్గ | డ | బ్బి |
| ము | బ్బు | ర | దు | కొ |
| బ్బా | జు | జో | ళ్లు | ము |
| అ | యి | గ | లం | సి |

_______________ _______________
_______________ _______________
_______________ _______________
_______________ _______________
_______________ _______________

**3. కింది పదాలు చదవండి. వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.** 5 మార్కులు

(అ) కుందేలు _______________ _______________________________
(ఆ) సింహం _______________ _______________________________
(ఇ) సూది _______________ _______________________________
(ఈ) కొబ్బరికాయ _______________ _______________________________
(ఉ) చుక్కలు _______________ _______________________________

**4. కింది చిత్రం చూడండి. చిత్రం గురించి 5 వాక్యాలు రాయండి.** 5 మార్కులు



1. _______________________________
2. _______________________________
3. _______________________________
4. _______________________________
5. _______________________________

# సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం - తెలుగు

**విద్యార్థి పేరు :** ____________________ **తరగతి : 5వ తరగతి**

**క్రమసంఖ్య :** ____________________ **మార్కులు : 40**

## రాత పరీక్ష

## I. సామర్థ్యం : ధారాళంగా చదవడం - అర్థంచేసుకోవడం

**1. కింది పేరాను చదవండి. ప్రశ్నలకు ఒక్కో వాక్యంలో జవాబులు రాయండి.** (1 × 5 = 5 మా)

బడిలో 'మన పల్లెసీమలు అనే సినిమాను ప్రదర్శించారు. అందులో పల్లెలే మనకు ఆధారమని, పల్లెల్లోనే వ్యవసాయం చేసి పంటలు పండిస్తారని. అయితే ఈనాడు పల్లెల్లో వ్యవసాయం చేసేవారి సంఖ్య తగ్గిపోతోందని చూపించారు. అదే విధంగా గ్రామాల్లో నీటి ఎద్దడి వల్ల, వర్షాలు పడకపోవడంవల్ల రైతులకు నష్టాలు వస్తున్నాయని చూపారు. వర్షాభావాన్ని అధిగమించడానికి చెట్లు నాటాలనీ, నీటిని పొదుపు చేయాలనీ చూపారు. లేదంటే పల్లెల్లో సాగునీరు, తాగేనీరూ లభ్యంకాని పరిస్థితి ఏర్పడుతుందని ఆ సినిమా ద్వారా సందేశమిచ్చారు.

(అ) బడిలో ఏ అంశంపై సినిమాను ప్రదర్శించారు?

______________________________

(ఆ) రైతులకు నష్టాలు ఎందుకు వస్తున్నాయని చూపారు?

______________________________

(ఇ) నీటి ఎద్దడి కొనసాగితే పల్లెల్లో ఎలాంటి పరిస్థితులు ఏర్పడుతాయని చెప్పారు?

______________________________

(ఈ) వర్షాభావ పరిస్థితికి చెట్లకు గల సంబంధం ఏమై ఉంటుంది?

______________________________

(ఉ) పల్లెల్లో వ్యవసాయం చేసేవారి సంఖ్య ఎందుకు తగ్గుతోంది?

______________________________

**2. కింది పేరాను చదవండి. ఐదు ప్రశ్నలు తయారుచేయండి.** (1 × 5 = 5 మా.)

ప్రతి మనిషికి తెలివితేటలు ఉండాలి. కేవలం తెలివితేటలు గలవాడైతేనే ప్రయోజనం లేదు. తెలివితేటలకు తోడు 'సమయస్ఫూర్తి' కూడా ఉండాలి. 'సమయస్ఫూర్తి' అంటే సమయానికి తగ్గట్లుగా ఆలోచన చేయటం. ఇది నేర్చుకుంటే వచ్చేది కాదు. ఆయా పరిస్థితుల కనుగుణంగా, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వ్యవహరించే

విజ్ఞతనే 'సమయస్ఫూర్తి' అంటారు. ఒక్కొక్క సమయంలో అనుకోని, ఊహించని ప్రమాదాలు వచ్చి పడుతుంటాయి. అలాంటి సమయాలలో, సమయస్ఫూర్తిని ప్రదర్శించి ఆ ప్రమాదాల నుండి బయటపడడం నేర్చుకోవాలి. రానున్న ఆపదను ముందుగానే పసిగట్టి తరుణోపాయాన్ని ఆలోచించగలిగేది తెలివితేటలు అయితే, ఊహించని ప్రమాదాలు హఠాత్తుగా వచ్చి పైన పడినప్పుడు వాటి నుండి తప్పించుకోగల శక్తిని 'సమయస్ఫూర్తి' అంటారు. తెలివితేటలకు సమయస్ఫూర్తి తోడైనప్పుడే జీవితంలో రాణించగలుగుతారు. కనుక ప్రతి వ్యక్తికీ 'సమయస్ఫూర్తి' ఉండాలి.

1. ________________________________________

2. ________________________________________

3. ________________________________________

4. ________________________________________

5. ________________________________________

## II. సామర్థ్యం : ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)

**1. కింది ప్రశ్నలలో ఒకదానికి సమాధానాన్ని పది పంక్తుల్లో రాయండి.** 1 × 5 = 5 మా.

(అ) మీకు నచ్చిన ఒక పండుగ గురించి రాస్తూ, ఆ పండుగ జరుపుకోవడానికి వెనుక గల కారణాలను, కలిగే లాభాలను రాయండి.

(ఆ) ఆహారపదార్థాలను వృథాచేయడంవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, అవి తగ్గాలంటే మీరిచ్చే సూచనలు రాయండి.

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

**2. కింది ప్రశ్నలలో ఐదింటికి రెండేసి పంక్తుల్లో సమాధానాలు రాయండి.** 2 × 5 = 10 మా.

(అ) 'మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లడం' అంటే మీకేమి అర్థం అయిందో రాయండి.

(ఆ) సూర్యుణ్ణి మహత్తర శక్తిగా భావిస్తూ ఆరాధించడం ఆచారంగా వస్తోంది కదా! ఎందుకు?

(ఇ) 'పుస్తకం మన నేస్తం లాంటిది' దీన్ని మీరెలా సమర్థిస్తారో రాయండి.

(ఈ) ఎటువంటి వారికి మనం సహాయం చేయాలి? మీరు అలా చేస్తే ఎలాంటి అనుభూతి పొందుతారు?

(ఉ) మీరు చూసిన ప్రదేశాలలో / దర్శనీయ స్థలాలలో 'ఇది అందరూ చూడవలసిన ప్రదేశం' అనిపించిన దాని గురించి రాయండి.

(ఊ) మంచి నీటి కోసం వెళ్ళిన రామన్న అక్కడి పరిస్థితి చూసి బేజారయ్యాడు కదా! అటువంటి పరిస్థితి ఏర్పడడానికి కారణాలు ఏమై ఉంటాయో రాయండి.

## III. సామర్థ్యం : సృజనాత్మకత

**1. కింది వాటిలో ఏదైనా ఒక దాన్ని గురించి రాయండి.** 1 × 5 = 5 మా.

(అ) అన్నం యొక్క గొప్పదనాన్ని వివరిస్తూ రైతుశ్రమ తెలియజేసేలా మీరు ఒక చిన్న గేయం రాయండి.

(ఆ) విద్యుత్తు పొదుపుచేయుట గురించి మీరు పాఠశాలలోని బాలసభ సమావేశంలో మాట్లాడాలనుకున్నారు. అందుకోసం ఒక సందేశాన్ని తయారుచేసి రాయండి.

(ఇ) మీరు తోటలోకి వెళ్ళగా అక్కడ రంగురంగుల సీతాకోకచిలుకలు కనబడ్డాయి. మీరు ఒకదాన్ని పట్టుకోవాలని చూడగా ఆశ్చర్యంగా అది మీతో మాట్లాడింది. మీ సీతాకోక చిలుక ఏమని అందో, అందుకు మీరేమన్నారో ఊహించి సంభాషణల రూపంలో రాయండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## IV. సామర్థ్యం : పదజాలం / వ్యాకరణాంశాలు

**1. కింది వాటికి సూచించిన విధంగా సమాధానాలు రాయండి.** 5 × 1 = 5 మా.

(అ) పిసినారి పాపయ్య <u>పశ్చాత్తాపం</u>తో కుమిలిపోయాడు. గీత గీసిన పదానికి అర్థం రాయండి. ఆపదాన్ని ఉపయోగించి ఓ సొంతవాక్యం రాయండి.

______________________________

(ఆ) కింది వాక్యంలో గీతగీసిన పదానికి బహువచనంతో వాక్యాన్ని మళ్ళీ రాయండి.

మా ఊరిలో <u>ప్రదర్శన</u> ఏర్పాటు చేశారు.

(ఇ) కింది పదాన్ని వేరు వేరు సందర్భాలలో వేర్వేరు అర్థాలు వచ్చేలా వాక్యాలు రాయండి.

తేలు : ______________________________

______________________________

(ఈ) రైతు, కాపలా, పొలం, ఈ పదాలతో సొంతవాక్యాన్ని రాయండి.

______________________________

(ఉ) కింది పదాలను వరుసక్రమంలో ఉంచి రాయండి.

దారం, ప్రత్తి, దుస్తులు, నేయడం

______________________________

**2. కింది ప్రశ్నలకు సూచించిన విధంగా సమాధానాలు రాయండి.** 5 × 1 = 5 మా.

(అ) కవిత, అనిరుధ్‌లు సంతకు వెళ్ళారు. ఈ వాక్యం ఏ కాలాన్ని తెలియజేస్తుంది?

______________________________

(ఆ) రాధిక పాఠం చదివి, జవాబులు రాసింది. ఈ వాక్యాన్ని విడదీసి రెండు వాక్యాలుగా రాయండి.

______________________________

(ఇ) కింది వాక్యంలో విభక్తుల కింద గీత గీయండి.

భానుతేజ, వాఙ్మయితో బాసర ఆలయం యొక్క గొప్పదనం గురించి చెప్పాడు.

(ఈ) కింది వాక్యంలో కర్తకు ముందు విశేషణం చేర్చి వాక్యాన్ని తిరిగి రాయండి.

కుందేలు సింహాన్ని బావి వద్దకుతీసుకెళ్ళింది.

______________________________

(ఉ) కింది క్రియాపదాల ఆధారంగా సంశ్లిష్ట వాక్యాన్ని రాయండి.

తెచ్చి, నాటింది.

______________________________

*ఉపాధ్యాయుడు ప్రకృతి ప్రేమికుడుగా ఉండాలి. ప్రకృతి నిరంతరం సమభావంతో, ప్రేమపూర్వకంగా నవ్వుతూ ఉంటుంది. దాని ప్రాంగణంలో విహరిస్తూ ఉంటే మన శారీరక, మానసిక అలసటలు మాయమవుతాయి. కొత్త చైతన్యం మనలో ప్రవేశిస్తుంది. తోటలోని వివిధ రంగుల పూలు, రకరకాల పక్షులు, ఉదయం, సాయంత్రం ఆకాశంలో కనబడే అందమైన దృశ్యాలు, రాత్రి వేళల్లో నక్షత్రాల శోభ, ఇవన్నీ మన శరీరానికి, మనస్సుకు అత్యంత ఉల్లాసాన్ని అందిస్తాయి. మనలో తాజాదనం నింపుతాయి. ఇందుకొరకు మనమేమి ఖర్చు చేయల్సింది లేదు. ప్రకృతి ప్రసాదించిన ఈ వరాలను మనం ఉపయోగించుకోకపోతే ఎంతో నష్టపోతాము.*

*– గిజుభాయి*

# 9

# బోధనాభ్యాసం - మార్గదర్శకాలు

ఇంతకుముందు అధ్యాయాలలో మీరు పాఠ్యపుస్తకాల తాత్త్విక అంశాల గురించి, వార్షిక, పాఠ్య, పీరియడ్ ప్రణాళికల గురించి తెలుసుకున్నారు. ఆయా ప్రణాళికల ఆధారంగా బోధనాభ్యాసం చేపట్టాల్సి ఉంటుంది. బోధనాభ్యాసంనకు ముందు మీ తయారీ ఎలా ఉండాలి? బోధనాభ్యాస సమయంలో ఏం చేయాలి? బోధనాభ్యాసం తరవాత ఏం చేయాలో మార్గదర్శకాలను ఈ అధ్యాయంలో పొందుపరిచాము.

- ఛాత్రోపాధ్యాయులు 80 రోజులు పాఠశాలల్లో ఉంటారు. అందుకు తగిన విధంగా బోధనాభ్యాసన పీరియడ్లను కేటాయించాలి.
- ఇందులో 6 మెథడాలజీ సబ్జెక్టులలో, 2 సహపాఠ్యాంశ సంబంధ విషయాలలో బోధనాభ్యాసం (Teaching practice) చేయాలి.
- భాషకు కాలాంశం 90 ని॥లు, ఉంటుంది. ప్రణాళికలు కూడా తదనుగుణంగా రాయాలి.
- తెలుగు బోధనాభ్యాసం చేసేటప్పుడు ఈ 90 ని॥ల కాలాంశాన్ని దృష్టిలో పెట్టుకొని పీరియడ్ ప్రణాళిక రాయాలి.
- ఒక పాఠం / యూనిట్ పూర్తిగా అంటే అన్ని కాలాంశాలు (పీరియడ్‌లు) బోధించేలా బోధనాభ్యాసం జరగాలి. అంటే..

  తెలుగులో ఒక పాఠం ప్రామాణికం (10 పీరియడ్లు) గణితంలో ఒక యూనిట్ ప్రామాణికం (8 నుండి 12 పీరియడ్లు) ఇలా ఆ పాఠాన్ని లేదా యూనిట్‌ను బోధించడానికి ఎన్ని పీరియడ్లు అవసరమౌతాయో అన్ని పీరియడ్లు తప్పనిసరిగా బోధనాభ్యాసం చేయాలి.
- తెలుగులో కచ్చితంగా 1, 2 తరగతులలో ఏదేని ఒక తరగతిపై బోధనాభ్యాసం చేయాలి.
- 1, 2 తరగతులల్లో ఒక పాఠానికి అలాగే 3, 4, 5 తరగతులల్లో ఒక పాఠానికి మొత్తం 20 పీరియడ్లు బోధించేలా ప్రణాళిక చేసుకోవాలి.

- విషయ బోధనకు కేటాయించుకున్న విధంగానే సహపాఠ్యాంశాలలో (co-curriculum) ఒక్కోదానికి 2 పీరియళ్ళ చొప్పున బోధనాభ్యాసం చేపట్టాలి.
- సహపాఠ్యాంశానికి సంబంధించిన బోధనాభ్యాసం మొదటి సంవత్సరం పాఠశాల సందర్శన (School exposure)కై వెళ్ళినప్పుడు నిర్వహించి రికార్డులు రాసి సమర్పించాలి.

### ✦ బోధనాభ్యాసానికి ముందు కళాశాలల్లో జరగవలసినవి

- బోధనాభ్యాసానికి (Teaching practice) వెళ్ళే ముందు వార్షిక ప్రణాళికను ప్రతి ఒక్క ఛాత్రోపాధ్యాయునితో రాయించాలి. వార్షిక ప్రణాళికపై కళాశాలలో ఒక కార్యశాలను నిర్వహించి అవగాహన కల్పించాలి. ఇందులో ముందుగా
    - వార్షిక ప్రణాళికను ఉపన్యాసకులు సమర్పించాలి. అర్థం చేయించాలి. (Presentation by the lecturer)
    - ఛాత్రోపాధ్యాయులను జట్లుగాచేసి వాళ్ళతో ఒక వార్షిక ప్రణాళిక రాయించాలి.
    - జట్టువాళ్ళు రాసిన వాటిని ప్రదర్శింపజేయాలి.
    - ప్రదర్శించిన వార్షిక ప్రణాళికపై చర్చించాలి, సరిచేయాలి.
    - అనంతరం వ్యక్తిగతంగా ప్రతి ఒక్క ఛాత్రోపాధ్యాయునితో వార్షిక ప్రణాళిక రాయించాలి.
- పాఠ్య ప్రణాళిక (Lesson plan) పీరియడ్ ప్రణాళిక (Period plan) లను కూడా పై విధంగానే కార్యశాలలను నిర్వహించి ఛాత్రోపాధ్యాయులకు అవగాహన కల్పించాలి. రాయించాలి. ఇవి కూడా ఛాత్రోపాధ్యాయులు బోధనాభ్యాసానికి (Teaching practice) వెళ్ళక ముందు జరగాలి.
- బోధనాభ్యాసం ముందుగానే ఉపన్యాసకులు బోధనాసోపానాలపైన ప్రదర్శన ఇవ్వాలి, (Demonstration by lecturers).
- ఛాత్రోపాధ్యాయులు కూడా విషయానికి (subject) సంబంధించిన ఉపన్యాసకుల ముందు బోధనాభ్యసం కళాశాలలోనే (Internal Teaching Practice) నిర్వహించాలి.
- కళాశాలలో బోధనాభ్యాస (Internal Teaching Practice) నిర్వహణకు ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన బోధనా సోపానాలను కొన్నింటిని ఎంపిక చేసుకోవాలి. ఉదా : తెలుగు పాఠ్యాంశబోధన, స్వీయరచన, సృజనాత్మక అభ్యాసాల నిర్వహణ మొదలగునవి. వాటిని కళాశాలలో ఉపన్యాసకుల ముందు ప్రదర్శించాలి.
- ప్రణాళికలపై అవగాహన కల్పించిన విధంగానే నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకన ప్రశ్నపత్రాలపై చర్చనిర్వహించి రాయించాలి.
- నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకన రికార్డు రాయడంపై అవగాహన కల్పించాలి.

### ✦ బోధనాభ్యాసం సమయంలో జరగవలసినవి

- ఛాత్రోపాధ్యాయులు బోధనాభ్యాస సమయంలో వార్షిక, పాఠ్య, పీరియడ్ ప్రణాళికలతో సంసిద్ధులుగా ఉండాలి.
- బోధనాభ్యాస సమయంలో బోధనకు అవసరమైన బోధనాభ్యసన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- ఉపన్యాసకులు బోధనాభ్యాసం జరిగే చోటుకు వెళ్ళి సందర్శించాలి. తగిన సూచనలు ఇవ్వాలి. సందర్శనలో గమనించాల్సిన అంశాలు.
    - పాఠ్యప్రణాళిక రాశారా?

- పీరియడ్ ప్రణాళికను అనుసరిస్తున్నారా?
- పిల్లల భాగస్వామ్యం ఎలా ఉంది?
- పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం జరుగుతున్నదా?
- ఆ పీరియడ్‌లో సాధించాల్సిన సామర్థ్యాలపై దృష్టి పెట్టారా?
- బోధనాభ్యసన సామగ్రి / వనరులను సమకూర్చుకున్నారా? వినియోగించారా?
- ప్రాజెక్టుపనులు ఏమి చేయించారు? ఆధారాలున్నాయా?
- ప్రయోగాలు / క్షేత్రపర్యటనలు ఏమేమి చేసారు?
- ఆలోచింపజేసే అనుబంధ ప్రశ్నలు అడుగుతున్నారా, పరస్పర ప్రతిచర్యలు జరిగేటప్పుడు పరిశీలించాలి.
- ఆలోచింపజేసే ప్రశ్నలు అడిగేటప్పుడు అన్వయింపచేసి ప్రశ్నలను అడుగుతున్నారా?
- నిర్మాణాత్మక మూల్యాంకనం ఏ రకంగా చేస్తున్నారు?

ఇలా పై ప్రశ్నలను దృష్టిలో ఉంచుకొని పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి.

- ♦ నిరంతర సమగ్రమూల్యాంకనం బోధనాభ్యాసం (Teaching Practice)లో అంతర్భాగం కాబట్టి బోధనాభ్యాస సమయంలో నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) జరగాలి. బోధనాభ్యాసం (Teaching Practice) పూర్తిచేసాక సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించాలి. దీన్ని CCE రికార్డులో నమోదుచేయాలి.
- ♦ సహపాఠ్యాంశాలకు సంబంధించిన 2 పీరియళ్ళ సమయంలో ఎంపిక చేసుకున్న ఏవేని రెండు సహపాఠ్యాంశాలను అంటే 1. విలువలవిద్య–జీవననైపుణ్యాలు, 2. వ్యాయామ ఆరోగ్యవిద్య, 3. పని–కంప్యూటర్ విద్య, 4. కళలు, సాంస్కృతిక విద్యకు సంబంధించిన ఏవైనా రెండింటిని నిర్వహించాలి. పిల్లలచే ఈ పీరియళ్ళకు సంబంధించిన అంశాలపై చర్చ నిర్వహించడం, కృత్యాలు నిర్వహించడం జరగాలి. ఇందులోకూడా పిల్లలు పాల్గొన్నతీరును, ప్రతిస్పందించేతీరును పరిశీలించి గ్రేడింగ్ ఇవ్వాలి.

### ✦ బోధనాభ్యాసం తరవాత చేయవలసినవి

- ♦ బోధించిన పాఠాలకు సంబంధించి సంగ్రహణాత్మక (Summative) ప్రశ్నపత్రాన్ని (50 మార్కులకు) తయారుచేయాలి.
- ♦ సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్ష నిర్వహించాలి.
- ♦ పిల్లలు రాసిన సమ్మేటివ్ పత్రాలను దిద్దాలి. మార్కులు వేయాలి, గ్రేడ్లు ఇవ్వాలి.
- ♦ గ్రేడును నిర్ణయించిన పిదప పిల్లల ప్రగతిని నమోదుచేయాలి.
- ♦ నిరంతర సమగ్ర  మూల్యాంకన రికార్డు రాయాలి.

### ✦ బోధనాభ్యాస రికార్డులు

- ♦ ఛాత్రోపాధ్యాయులు బోధనాభ్యాసానికి సంబంధించి కింది రికార్డులను రాయాలి.
  - వార్షిక ప్రణాళిక రికార్డు.
  - పాఠ్య ప్రణాళిక రికార్డు.
  - పీరియడ్ ప్రణాళిక రికార్డు.
  - నిరంతర సమగ్ర మూల్యాంకన రికార్డు.

# ఛాత్రోపాధ్యాయుల వ్యక్తిగత సమాచారం

| కళాశాల వివరాలు | | |
|---|---|---|
| కళాశాల పేరు | : | ______________ |
| వీధి | : | ______________ |
| పట్టణం | : | ______________ |
| జిల్లా | : | ______________ |
| ఫోన్ నంబర్ | : | ______________ |

ఫోటో

1. ఛాత్రోపాధ్యాయుని పేరు :
2. తల్లి / తండ్రి / సంరక్షకుని పేరు :
3. పుట్టిన తేది :
4. (a) ఇంటి చిరునామా :

   ఫోను / మొబైల్ నంబర్ :

   (b) ప్రస్తుత చిరునామా :
5. విద్యార్హతలు :
6. అలవాట్లు :
7. రక్తం గ్రూపు :
8. ఎత్తు :
9. బరువు :
10. బ్యాంకు ఖాతా సంఖ్య, బ్యాంకు పేరు :
11. ఇ-మెయిల్ అడ్రస్ :
12. గుర్తింపు చిహ్నాలు :

GRK

# బోధనాభ్యసన ప్రక్రియలు - పరిశీలన పత్రం - తెలుగు

**సూచనలు**

*ఛాత్రోపాధ్యాయులు ఆ రోజు బోధించే కాలాంశానికి సంబంధించిన ప్రణాళికను పరిశీలించండి. దాని ప్రకారం బోధన జరిగిందా? లేదా అని పరిశీలించాలి. ఆ కాలాంశ బోధనకు సంబంధించిన సామర్థ్యాల సాధన గురించి, ఛాత్రోపాధ్యాయుల బోధనలో గమనించిన బలాలు, బలహీనతలు గుర్తించి తగు సూచనలను రాయాలి.*

**అ) మొదటి భాగం**

**A. సాధారణ సమాచారం**

1) ఛాత్రోపాధ్యాయుని పేరు
2) రోల్ నెం.
3) బోధించు తరగతి
4) విషయము
5) పాఠము / యూనిట్
6) పాఠ్యాంశము
7) బోధించు తేది
8) పాఠశాల పేరు
9) విద్యార్థుల సంఖ్య
10) విద్యార్థుల హాజరు

**B. పీరియడ్ ప్రణాళిక / కాలాంశ ప్రణాళిక పరిశీలన**

1) సోపానాల క్రమంలో రాశారా?
2) బోధించే అంశం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలను రాశారా?
3) సాధించాల్సిన సామర్థ్యాలకు అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియలు/ అభ్యసన అనుభవాలను పొందుపరిచారా?
4) సాధించాల్సిన సామర్థ్యాలకు అనుగుణంగా పిల్లల అవగాహనను పరిశీలించడానికి ప్రశ్నలు రాశారా?
5) బోధనాభ్యసన సామగ్రి వివరాలను పొందుపరిచారా?

**ఆ) రెండవ భాగం బోధనాభ్యసన ప్రక్రియల పరిశీలన**

**I. ఉపోద్ఘాతం (1వ పీరియడ్‌లో పరిశీలించాల్సినవి)**

- ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించారా? లేక పునశ్చరణ జరిగిందా?
- పాఠం పేరు నల్లబల్లపై రాశారా?
- పాఠం ఉద్దేశ్యం/ నేపథ్యం గురించి పిల్లలకు అవగాహన కలిగిందా?
- కవి పరిచయం గురించి చర్చించారా?

## II. పఠన కృత్యాల నిర్వహణ (రెండవ పీరియడ్‌లో పరిశీలించాల్సినవి)

- పిల్లలచే బాహ్యపఠనం చేయించారా?
- పిల్లల బాహ్యపఠన సమయంలో ఉచ్చారణ దోషాలు సవరించారా?
- ఉపాధ్యాయుని ఆదర్శ పఠనం జరిగిందా?
- పిల్లలతో మౌనపఠనం చేయించి, అర్థంకాని పదాల కింద గీత గీయించారా?
- తెలియని పదాల గురించి పిల్లలు జట్లలోగాని, తోటి పిల్లలతోగాని చర్చించారా?
- తెలియని పదాల గురించి పిల్లలు నిఘంటువులను పరిశీలించారా?
- ఇంకనూ తెలియని పదాల గురించి పిల్లలతో చర్చించారా?
- నూతన పదాలను వాక్య ప్రయోగం ద్వారాగాని లేదా సందర్భోచిత సన్నివేశాల ద్వారా పిల్లలే గ్రహించేలా చేశారా?

## III. పాఠ్యాంశంపై చర్చ – అవగాహన (3, 4, 5 పీరియళ్ళలో పరిశీలించాల్సినవి)

- పాఠంలోని విషయం ఆధారంగా ఆలోచింపజేసే ప్రశ్నలను అడిగారా?
- బహుళ సమాధానాలు వచ్చే ప్రశ్నలను అడిగి పిల్లలు ప్రతిస్పందించేలా ప్రోత్సహించారా?
- పాఠంలోని కీలకపదాలు, సందేశాత్మక వాక్యాలు, సంఘటనలు, విలువల గురించి చర్చ నిర్వహించారా?
- పిల్లలు సొంతంగా ఆలోచించి సమాధానాలు చెబుతున్నారా?
- పిల్లలు స్వేచ్ఛగా ప్రశ్నిస్తున్నారా?
- పిల్లలందరూ చర్చలో పాల్గొంటున్నారా?
- ఛాత్రోపాధ్యాయుని భాష, పిల్లలకిచ్చే సూచనలు వారికి అర్థమవుతున్నాయా?
- పిల్లల అవగాహన తెలుసుకోవడానికి సామర్థ్యాధారిత ప్రశ్నలు అడుగుతున్నారా?
- బోధనాభ్యసన సామగ్రిని వినియోగించారా?
- సామగ్రి ద్వారా నేర్చుకోవడానికి పిల్లలకు అవకాశం కల్పించారా?
- నల్లబల్ల వినియోగం జరిగిందా?
- నల్లబల్లపై తప్పులు లేకుండా రాశారా?
- నల్లబల్లపై అక్షరాలు అందంగా పిల్లలు చదవడానికి అనువైన పరిమాణంలో రాశారా?
- కాలాంశానికి నిర్దారించుకున్న సామర్థ్యాల సాధనకు అనుగుణంగా అభ్యసనా అనుభవాలు కల్పించారా?
- కాలాంశానికి నిర్దారించుకున్న సామర్థ్యాలకనుగుణంగా మూల్యాంకనం జరిగిందా?

### IV. అభ్యాసాలపై చర్చ - అవగాహన (6 నుండి 9 పీరియళ్ళలో పరిశీలించాల్సినవి)

- ఈ రోజు ఏ ఏ సామర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాలను నిర్వహించారు? .........................
- ఇందుకనుగుణంగా ఏ ఏ కృత్యాలు నిర్వహించారు? ...............................................
- పిల్లలతో ఏ రకమైన కృత్యాలు నిర్వహించారు? (వ్యక్తిగత/ పూర్తి/ జట్టు).....................................
- ఎంతమంది పిల్లలు సామర్థ్యాలపై పట్టుసాధించారు? ...............................................
- పిల్లలు తమ తప్పులను సరిచేసుకోవడానికి, పూర్తి తరగతిలో చర్చ నిర్వహించారా? ........................
- ఈ రోజు అభ్యసన కల్పించిన సామర్థ్యంపై పిల్లల అవగాహనను పరిశీలించారా? ...........................

### V. స్వీయ మూల్యాంకనం నిర్వహణ (10వ పీరియడ్‌లో పరిశీలించాల్సినవి)

- స్వీయ మూల్యాంకనంలోని ఒక్కొక్క అంశాన్ని ఉపాధ్యాయుడు చదివించాడా?
- పిల్లల చేత చేయగలిగిన వాటిని, చేయలేని వాటిని గుర్తింపజేశారా?
- ఏ ఏ సామర్థ్యాలను 80% మంది పిల్లలు చేయగలిగారు?
- ఏ ఏ సామర్థ్యాలలో పిల్లలు వెనుకబడ్డారు?
- చేయలేకపోయిన విద్యార్థులకు ప్రత్యామ్నాయ బోధన జరిగిందా?

### D. బలాలు, బలహీనతలు, సూచనలు

- ఈ కాలాంశంలో గమనించిన బలాలు ...........................................................

  .........................................................................................................
- ఈ కాలాంశంలో గమనించిన బలహీనతలు ......................................................

  .........................................................................................................
- బోధనాభ్యసన ప్రక్రియలను మరింత విజయవంతంగా నిర్వహించడానికి మీరిచ్చే సలహాలు/ సూచనలు

  .........................................................................................................

  .........................................................................................................

  .........................................................................................................

**పరిశీలకుని పేరు** **పరిశీలకుని సంతకం**

# 10

# C.C.E. రికార్డు రాయడం – మార్గదర్శకాలు

మన రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరుగుతున్నందున S.A.T. (Scholostic Achievement Test Record) రికార్డుకు బదులుగా C.C.E. రికార్డు రాయాలి. బోధనాభ్యసనం కోసం పాఠశాలకు వెళ్ళిన తరవాత ప్రణాళికలు రూపొందించుకొని బోధనాభ్యాసం చేస్తారు. బోధనాభ్యాసం జరిగేటప్పుడు నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) నిర్వహించి పిల్లల ప్రగతి నమోదు చేయాలి. అట్లే బోధనాభ్యాసం పూర్తయిన పిదప బోధించిన పాఠం ఆధారంగా సామర్థ్యాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకొని సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation)కోసం పరీక్ష నిర్వహించాలి. పిల్లల జవాబుపత్రాలు దిద్ది సామర్థ్యం వారీగా గ్రేడును కేటాయించాలి. ఈ వివరాలను నమోదుచేయాలి. ఈ విధంగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించిన తరవాత సి.సి.ఇ. రికార్డు రాయాలి, సమర్పించాలి.

**సి.సి.ఇ రికార్డును ఎలా రాయాలి?**

- సి.సి.ఇ. ఆవశ్యకత, వివరాలు.
- నిర్మాణాత్మక మూల్యాంకనం – సాధనాలు – వివరాలు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం – వివరాలు.
- ప్రశ్నపత్రం తయారుచేసిన విధం.
- భారత్వాల పట్టికలు.
    - సామర్థ్యాల వారీగా భారత్వ పట్టిక.
    - ప్రశ్నల రకం – భారత్వ పట్టిక.
    - కాఠిన్యత స్థాయి – భారత్వ పట్టిక

- నిర్మాణాత్మక మూల్యాంకనం – పిల్లల ప్రగతి నమోదు.

| క్ర.సం. | పిల్లల పేరు | సాధించిన మార్కులు | | | | మొత్తం మార్కులు 50 M | గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|
| | | పిల్లల ప్రతిస్పందనలు 10 M | రాత అంశాలు 10 M | ప్రాజెక్టుపని 10 M | లఘు పరీక్ష 20 M | | |
| | | | | | | | |

- సంగ్రహణాత్మక మూల్యాంకనం – ప్రగతి నమోదు

| క్ర.సం. | విద్యార్థి పేరు | సామర్థ్యాల వారీగా సాధించిన మార్కులు | | | | | మొత్తం మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|---|
| | | వినడం – మాట్లాడడం ప్రశంస 10 M | చదవడం 20 M | స్వీయరచన 30 M | సృజనాత్మక 20 M | పదజాలం, భాషాంశాలు 20 M | | |
| | | | | | | | | |

- వార్షిక / చివరి ఫలితం

| క్ర.సం. | విద్యార్థి పేరు | నిర్మాణాత్మక మూల్యాంకనం మార్కులు | నిర్మాణాత్మక మూల్యాంకనం గ్రేడు | సంగ్రహణాత్మక మూల్యాంకనం మార్కులు | సంగ్రహణాత్మక మూల్యాంకనం గ్రేడు | నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మొత్తం మార్కులు | చివరి ఫలితం గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |

- సామర్థ్యాల వారీగా విశ్లేషణ పట్టికలు.
- గ్రేడింగ్ విశ్లేషణ : సబ్జెక్టులు

| తరగతి | మొత్తం విద్యార్థుల సంఖ్య | A+ | A | B+ | B | C |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |

- పిల్లల అభ్యసన సమస్యలు (ఏయే సామర్థ్యాలలో వెనుకబడి ఉన్నారు?)
- ప్రత్యామ్నాయ బోధన, కార్యాచరణ ప్రణాళిక (పిల్లలు వెనుకబడిన సామర్థ్యాలను తిరిగి సాధించడానికి కార్యాచరణ ప్రణాళిక తయారీ)
- ముగింపు.

# 11

# పఠనీయ గ్రంథాలు

ఉపాధ్యాయుడు నిరంతర అభ్యాసకుడు. తన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకోసం అవసరమైన పరామర్శ గ్రంథాలు ఎప్పటికప్పుడు చదవాలి, అంతర్జాలం (internet) నుండి విషయాలను సేకరించుకోవాలి. ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించడానికి ముందే ఇలాంటి వృత్తిపర నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకు సంబంధించిన కొన్ని పరామర్శ గ్రంథాల వివరాలు ఉన్నాయి. వాటిని చదవండి.


1) జాతీయ విద్యాప్రణాళిక చట్రం - 2005
2) Language and Language teaching position paper - NCERT
3) Right to Education Act - 2009
4) పిల్లలు - భాష - ఉపాధ్యాయుడు - రచన ప్రొ॥ కృష్ణకుమార్, తెలుగు అనువాదం డా॥ డి.చంద్రశేఖర రెడ్డి.
5) ఆం.ప్ర.రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధిపత్రం - 2004
6) భాష - భాషాబోధన ఆధారపత్రం - APSCERT
7) ఉపాధ్యాయుల కరదీపిక - తెలుగు 1, 2 తరగతులు
8) ఉపాధ్యాయుల కరదీపిక - తెలుగు 3వ తరగతి
9) ఉపాధ్యాయుల కరదీపిక - తెలుగు 4, 5 తరగతులు
10) ఉపాధ్యాయుల కరదీపిక - తెలుగు 6, 7 తరగతులు
11) ఉపాధ్యాయుల కరదీపిక - తెలుగు 8, 9 తరగతులు
12) నిరంతర సమగ్ర మూల్యాంకనం కరదీపిక
13) ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం - 2009, ఉపాధ్యాయుల కరదీపిక - SCERT
14) సహపాఠ్యాంశాలు పాఠ్య ప్రణాళిక
15) తెలుగు పాఠ్య ప్రణాళిక (1 నుండి 10 తరగతులు)
16) Learning Curve - Special Issue on Language Learning
17) భాష - ఆధునిక దృక్పథాలు - సర్వశిక్ష అభియాన్ కరదీపిక

18) అభ్యసనాభివృద్ధి కార్యక్రమం కరదీపిక – SSA
19) పురాతన నామకోశం, విద్యార్థి కల్పతరువు, తెలుగు నిఘంటువులు.
20) సర్వశిక్ష అభియాన్ వారిచే సరఫరా చేసిన బాలసాహిత్యం (వాన చినుకులు, కథావాచకాలు, కథాకార్డులు, కథాపుస్తకాలు)
21) సర్వశిక్ష అభియాన్ వారిచే సరఫరా చేసిన ఉపాధ్యాయ వృత్తిపర అభివృద్ధికి సంబంధించిన పుస్తకాలు (గిజుభాయి సమగ్ర సాహిత్యం, అమ్మో బడి, నేర్పడం ఒక కళ.... వంటి పుస్తకాలు)

## Websites

1) www.apscert.gov.in
2) www.ncert.in
3) www.apf.org

**భాష, భాషావిద్యకు సంబంధించిన ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వెబ్‌సైట్లు, ఉపయుక్త గ్రంథాల వివరాలు :**

### ఎ. భాషాభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వ సంస్థలు వివరాలు

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 1. | సెంట్రల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మైసూర్ | www.cill.org |
| 2. | కమీషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టర్మినాలజీ, న్యూఢిల్లీ | www.cstt.nic.in |
| 3. | నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్, న్యూఢిల్లీ | www.ncert.nic.in |
| 4. | నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్ | www.ntm.org.in |

### బి. స్వచ్ఛంద సంస్థల పేర్లు

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 1. | సెంటర్ ఫర్ లర్నింగ్, బెంగుళూర్ | http://cfl.in |
| 2. | సెంటర్ ఫర్ లర్నింగ్ రిసోర్సెస్, పూనె | www.clrindia.net |
| 3. | దిగంతర్ శిక్ష ఏవమ్ ఖేల్‌కుద్ సమితి, జైపూర్ | www.digntar.org |
| 4. | ఏకలవ్య, ముంబాయి | http://eklavya.in |
| 5. | ప్రథమ్, ముంబాయి | www.pratham.org |
| 6. | రిషివ్యాలి ఇనిస్ట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, చిత్తూర్ డిస్ట్రిక్ట్, ఆం.ప్ర. | http://www.rishivalley.org |
| 7. | ద టీచర్ ఫౌండేషన్, బెంగుళూర్ | www.teacherfoundation.org |
| 8. | విద్యాభవన్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ వి.బి.టీచర్స్ కాలేజ్, ఉదయ్‌పూర్ | http://vidyabhavansociety-seminar-org |

## సి. ప్రచురణ సంస్థల పేర్లు

| క్ర.సం. | సంస్థపేరు | వెబ్‌సైట్ పేరు |
|---|---|---|
| 1. | విజయవాణి పబ్లికేషన్స్, చిత్తూర్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ | |
| 2. | ఎమెస్కో పబ్లికేషన్స్, హైదరాబాద్ | |
| 3. | విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ | |
| 4. | ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ | |
| 5. | అన్వేషి (తూడిసి బుక్స్) – టేల్స్ ఫ్రమ్ ది మార్జిన్స్ ఏ సీరిస్ ఆఫ్ 8 బుక్స్) | http://www.anveshi.org/content/view/172/99 |
| 6. | భారత్ జ్ఞాన్ విజ్ఞాన్ సమితి (బిజివియస్) | www.bgws.org |
| 7. | సెంటర్ ఫర్ లర్నింగ్ రిసోర్సెస్ | www.clirindia.net/materials/childrenbooks.html |
| 8. | చందమామ ఇండియా | www.chandamama.com |
| 9. | చిల్డ్రన్ బుక్‌ట్రస్ట్ | www.childrenbooktrust.com |
| 10. | ఏకలవ్య | http://eklavya.in |
| 11. | ఇండియా బుక్ హౌస్ | www.ibhworld.com |
| 12. | జన్‌చేతన | http://janchetnaa.blogspot.com |
| 13. | కరాడి టేల్స్ కంపెనీ | www.karaditales.com |
| 14. | కథ, న్యూఢిల్లీ | www.katha.org |
| 15. | మెక్‌మిలన్ పబ్లిషర్స్ | http://international.macmillan.com |
| 16. | నేషనల్ బుక్ ట్రస్ట్ | www.nbtindia.org.in |
| 17. | నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ | www.ncert.nic.in |
| 18. | నవనీత్ ప్రకాశన్ కేంద్ర, అహ్మదాబాద్, గుజరాత్ | – |
| 19. | పిసియమ్ చిల్డ్రన్స్ మాగజైన్ | www.pcmmagazine.com |
| 20. | ప్రథమ్ బుక్స్ | www.prathambooks.org |
| 21. | పుస్తక్ మహల్ | www.pustakmahal.com |
| 22. | రూమ్ టు రీడ్ | www.roomtoread.org |
| 23. | ద లర్నింగ్ ట్రీ స్టోర్ | http://www.tltree.com |
| 24. | తులిక బుక్స్ | www.tulikabooks.com |

## డి. భాషాభ్యాసానికి సంబంధించిన కొన్ని వెబ్‌లింకులు

1) http://www.bbc.co.uk/schools/magickey/adventures/drogon game.shtml is a game that helps learn about a question and a question mark.
2) http://www.proteacher.com/cgi.bin/outsidesite.cgi?id=4731Extexternel=http://www.sdcoe.k12.ca.us/actbank/sorganiz.htmEtoriginal=http://www.proteacher.com/070037.shtmltitle=Graphic%20organizers containswell-delineated writing standards. level wise.
3) http://www.lessonplanspage.com/LAK1.htm contains a whole host of ideas for language activities
4) http://www.0P97.org/ftcyber/jack/puzzles/puzzles.html has easy, medium and hard jigsaw puzzles that are based on fairy tabes.
5) http://www.youtube.com.watch?v=2LVNi-FPEuYhas a video of the panchatantra story about the doves ina hunter's net (collective strength) in Hindi.
6) http://www.darsie.net/talesofwonder/contains Folk and Fairy Tales from around the world.
7) http://www.thepromisefoundation.org/TPFLt RB.pdf is report of a study on Learning to Read in Bengali, useful for language researchers in Indian languages.
8) http://www.rubybridges.org/story.htm contains the inspring story of Ruby Bridges and her teacher.
9) http://puzzlemaker.discoveryeducation.com/allows the user to create and print customized word search, criss-cross, match puzzles, and more using his/her own word lists.
10) http://gem.win.co.nz/mario/wsearch/wsearch.php allows you to generate your own word maze/word search puzzle.
11) http://georgerncgurn.com/articles/reading forpleasure.html has a good article on reading for pleasure.
12) http://www.atozteacherstuff.com/pages/374.shtml for a lovely idea on getting children excited about reading.
13) http://lesl.about.com/od/vocabularylessonplans/a/characteradj.htm for an excellent activity that develops and broadens knowledge of character adjective vocabulary.
14) http://www.scholastic.com/ispy/play/for a set of award winning puzzles and games that allow children to discover word associations, word play and themes help them build important learning skills including reading.
15) http://www.readwritethink.org/materials/in the bag/index, html for an interactive game that builds vocabulary.
16) http://www.sacred.texts.com/hin/ift/index.htm has links to indian fairy tales.
17) http://primary.naace.co.uk/activities/BigBooks/index.htm has audio-e-books for kids.
18) http://www.vrml.k12.la.us/krause/Reading.htm for slide shows that excite a childr to read.
19) http://www.thepromisefoundation.org/TPFLtkb.pdf is report of a study on Learning to Read in Bengali, useful for language researchers in Indian languages.
20) http://www.thepromiselfoundation.org/TPFRdk.pdf is report of a study on Reading difficulties in Kannada, useful for languages researchers in indian language.

# అనుబంధాలు

## 1) పిల్లలూ- భాష

*- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

మానవ నాగరికతను మలుపు తిప్పింది భాష అని మనకు తెలుసు. భాష మానవుడి ప్రమేయాన్ని బయటి ప్రపంచంలో విప్లవీకరించడమే కాదు మానవుణ్ణి అంతర్గతంగా కూడా విప్లవీకరించింది. వానరుడి నుండి నరావతారం జరిగాక నరుడిలోని అనేక మార్పులకు భాష ఒక కారణమని ఆధునిక శాస్త్రవేత్తల అభిప్రాయం. అప్పటి దాకా బయటి శక్తులు పరిణామక్రమాన్ని నిర్ణయిస్తే భాష పుట్టాక అంతర్గత శక్తి (భాష) పరిణామాన్ని నిర్దేశించిందన్నమాట.

ఇప్పుడు భాష సార్వత్రికం, సార్వజనీనం. లిపిలేని భాషలున్నాయి గానీ ధ్వనుల్లేని, మాటల్లేని భాషలు లేవు. అత్యంత ప్రాథమిక స్థాయి (Primitive) భాష సైతం అద్భుతంగా ఆయా జాతుల అవసరాల్ని తీర్చగల స్థాయిలో ఉంది. అలాగే అవసరాలు పెరిగేకొద్దీ భాష తనకు తాను అద్భుతంగా మార్పులకు లోనవుతుంది. ఎప్పటికప్పుడు జవసత్వాలు సమకూర్చు కొంటోంది. భాషా, మానవుడూ చెట్టాపట్టాలేసుకొని పాతాళపుపొరల్నీ, గగనాంతరాళాల్నీ పిడికిట్లో బిగించుకొంటున్న యుగం మనది.

**భాషా నిర్మాణం :**

మనమందరం మాట్లాడుతున్నాం. అలవోకగా మాట్లాడుతున్నాం. మాట్లాడ్డమంత సులభం మరేముంది గనుక? కానీ కొంచెం లోతుగా చూస్తే భాషకు ఎంత సంక్లిష్టం!!!

అలాగే భాషకున్న ఈ ప్రాథమిక నిబంధనలన్నీ సార్వత్రికాలు, అన్ని భాషలకు సమానంగా వర్తించేవి.

ప్రతి భాషలోనూ హల్లు - అచ్చు - హల్లు - అచ్చు పద్ధతే ఉంటుంది. హల్లుల్ని అచ్చులేకుండా పలకలేము. ఒకవేళ పలికినా రెండు మూడు హల్లులకు మించి ఒకటిగా పలకలేము. మూడు హల్లుల సంయుక్తాక్షరాలు గల పదాలు ఏ భాషలోనైనా పట్టుమని పది చెప్పండి. చూద్దాం. స్త్రీ, శాస్త్రం, స్ట్రీట్, స్ట్రక్చర్ ఇలా చెప్పొచ్చు. ఎంత చెప్పినా ఎస్,టి,ఆర్ ధ్వనులతో తప్ప ఇతర ధ్వనులతో (హల్లులు) గల సంయుక్తాక్షరాలు ఎక్కడా చిక్కవు. ఇక నాల్గు హల్లులు గల సంయుక్తాక్షరం అసాధ్యం.

మన వాగ్యంత్రం ఎక్కువ హల్లుల కలయికను అంగీకరించదు. అందుకే మనం 'ఇస్కూలు' అంటాం. సూర్యుణ్ణి సూరీడు అని సరిపెట్టుకొంటాం.

ప్రతి భాషలోనూ మాటలకూ వాటి అర్థాలకూ సంబంధం లేదు. 'గాడిద' అని గుడ్డలు మోసేదాన్నే ఎందుకనాలి? ఇంటికావలి ఉండే జంతువుని పంది అని ఎందుకనగూడదు? దీనికి జవాబెక్కడా చిక్కదు. అంటే మాటలన్నీ కేవలం కొండ గుర్తులు (సింబల్స్), అమూర్తాలు.

ఒక రకంగా చూస్తే భాష అత్యంత సంక్లిష్టమైంది. అంతా సంకేతాలతోనే నిండిఉంటుంది. చిన్న మార్పు చేసినా కొంప మునిగిపోతుంది.

సీత వంట చేస్తుంది.

సీత వంట చూస్తుంది.

ఒక్క దీర్ఘమే తేడా, అర్థంలో బోలెడు మార్పు.

రాముడు బడికి పోతున్నాడు సీత బడికి పోతూ ఉంది.

ఇక్కడ కర్త లింగాన్ని బట్టి క్రియ మారిపోతుంది. అదే సీత గానీ రాముడు గానీ తమను గురించి చెప్పుకొంటే 'నేను బడికి పోతున్నాను' అని ఒకే రకంగా చెప్పవచ్చు. ఇలా ప్రతి భాషలోనూ చిన్న మార్పులు పెద్ద తేడాల్ని తెస్తుంటాయి.

వాక్యాల్లోనూ ఇంతే. ఒక క్రమం ఉంటుంది. మనం ఆ క్రమంలోనే మాట్లాడతాం.

'పోతున్నాడు బడికి రాముడు' అనొచ్చు. అయినా ఇది కృతకం.

పదాలు కొన్నే వాక్యాలు లక్షలు. ఎన్ని వాక్యాలైనా మనం తయారు చేసుకోగలం. నిజానికి ఒకసారి చేసిన వాక్యం మరోసారి చెయ్యం.

***అంతా సందర్భం మీద (contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే! మూడేళ్ల బిడ్డ భాషా పరంగా పెద్దవాడి కిందే (linguistic adult) లెక్క.***

ఎప్పటికప్పుడు కొత్త వాక్యాల్ని సృష్టించుకోగలం. ప్రతి భాషకూ అంత వివిధత, సృజనాత్మకత అత్యంత సాధారణం.

భాష నిరంతరం పరిణామశీలి. ఒక లెక్క ప్రకారం మాట్లాడేవాడు చెప్పేదీ. వినేవాడు స్వీకరించేది నూటికి నూరుపాళ్లు ఒక్కటిగానే ఉండదు. తాత భాషా, తండ్రి భాషా, తన భాషా ఒకటి కానేగాదు. అసలు మనం మాట్లాడేప్పుడు కూడా ఒకసారి ఒక చోట పలికేది, మరోసారి మరోచోట పలికేది ఒకటిగాదు.

భాషా పండితులు ఎంత గీపెట్టినాసరే అది తనకు తాను మారుతూనే ఉంటుంది. ఈ వాక్యాల కంటే పదాలు, పదాల కంటే ధ్వనులు ఎక్కువగా మార్పుకు లోనవుతాయి.

ఈ మార్పులు సందర్భాన్ని బట్టి ఉంటాయి. అంతా సందర్భం మీద (Contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే!

భాషకూ భావాలకూ మధ్య అంతు చిక్కని సంబంధం ఉంటుంది. 'తోడేలు' అనగానే 'భయం' కమ్ముకొంటుంది. 'ఐస్క్రీం' అనగానే నోరు ఊరుతుంది.

ఒకే మాట పలు సందర్భాల్లో పలు అర్థాలివ్వవచ్చు. 'నా మాట ఏం చేశావ్' అన్నప్పుడూ 'మాటా మాటా పెరిగింది' అన్నప్పుడూ 'మాట' వినడానికి ఒకటే. అర్థం మాత్రం ఒకటి గాదు.

ఇలా చూస్తే భాష అత్యంత క్లిష్టమైంది, అత్యంత గహనమైంది. ఎవరైనా పరాయిభాషను వయసొచ్చాక నేర్చుకొంటూంటే ఈ సంక్లిష్టత అర్థమవుతుంది. ఇంత 'న్యూసెన్సు' ఏమిటా అని తల తిరిగి పోతుంది.

**పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు? :**

మరి ఇంత క్లిష్టమైన భాషని పిల్లలు అలవోకగా ఎలా నేర్చుకొంటున్నారు? ఒకటి గాదు రెండు, మూడు భాషలు కూడా ఏకకాలంలో ఎలా నేర్చుకొంటున్నారు? అంటే మూడేళ్ల బిడ్డ భాషాపరంగా పెద్దవాడి కిందే లెక్క.

ప్రతి బిడ్డా మూడేళ్ల వయసులో భాష నేర్చుకొంటోంది. ఇదొక సార్వజనీన సూత్రం. కొంచెం క్రమంలో తేడా ఉండవచ్చు, వేగంలో అటూ ఇటూ ఉండొచ్చు. కానీ మాతృభాష మాత్రం అందరికీ మూడేళ్లలో అనర్గళంగా వచ్చి తీరుతుంది. ఇదెలా సాధ్యం?

విచిత్రమేమంటే పిల్లలు నేర్చుకొనే క్రమం కూడా ప్రపంచమంతా ఒకటే. ముందు చిన్న చిన్న సరళ వాక్యాలు మాట్లాడతారు.

'నాన్న' అంటే అదీ వాక్యమే, 'నాన్న వచ్చాడు' 'నాన్న పోతున్నాడు', 'నాన్న కన్పించడం లేదు' ఇలా ఏదైనా కావచ్చు! ఆ తర్వాత రెండు పదాలతో వాక్యాలుంటాయి.

సరళ వాక్యాల తర్వాత వ్యతిరేక వాక్యాలు పిల్లలకు వస్తాయి. ఆ తర్వాత ప్రశ్నార్థకాలు నేర్చుకొంటారు.

ప్రతి బిడ్డకూ హల్లు-అచ్చు, హల్లు-అచ్చు (CVCV) సూత్రం తెలుసు. వీటిని కలగాపులగం చేసి గందరగోళపడినట్టు ఎక్కడా కన్పించదు.

ఒక వాక్యాన్ని సందర్భానుసారంగా అర్థం చేసుకోవడం పిల్లలకీ వచ్చు. నవ్వుతూ 'నేను రాను' అంటే 'వస్తానులే' అన్న ధ్వని అందులో ఉందని బిడ్డకు తెలుసు. చివర మనం చేసే చిన్న మార్పు వల్ల ప్రశ్నలుగా వాక్యాలు మారుతుంటాయి. వీటిని పిల్లలు అట్టే పట్టేస్తారు.

'సీత పుస్తకం చదువుతున్నాడు' అని మనం అంటే ఏ మూడేళ్ల పాపైనా 'ఇందులో ఏదో తప్పుందన్న'ట్టు మనల్ని వెక్కిరిస్తుంది. కాకుంటే తప్పేమిటో ఆ పిల్ల స్పష్టంగా చెప్పలేకపోవచ్చు.

భిన్నార్థాల మాటలని సందర్భాన్ని బట్టి పిల్లలు అర్థం చేసుకొంటున్నారు. వాక్యంలోని పదాల క్రమాల్ని కర్త ఆధారంగా క్రియలో వచ్చే మార్పుల్ని, కర్తా కర్మల విభక్తుల్ని తెలుసుకోడమేగాదు అవసరాన్ని బట్టి వాక్యాల్ని వివిధ విన్యాసం చేయగల నేర్పునీ పిల్లలు అత్యంత సహజంగా పొందుతున్నారు.

అంతకంటే అద్భుతం తమకు తెలిసిన పరిమిత పదాలతోనే వారు వేలాది వాక్యాలు కొత్త కొత్తవి స్వంతంగా తయారుచేసుకోవడం. ఇదంతా పెద్దల్లాగానే వాళ్లూ చెయ్యగల్గుతున్నారు.

మరీ విచిత్రం - పిల్లలు రెండు మూడు భాషల నియమాల్ని కూడా పట్టేస్తున్నారు. ఇంత సంక్లిష్ట నిర్మాణం గల నైరూప్య విషయాన్ని ఇంత సులభంగా పిల్లలెలా గ్రహిస్తున్నారు? ఇంత గొప్పగా ఎలా ఉపయోగించుకోగల్గుతున్నారు?

**దీన్ని భాషా శాస్త్రవేత్తలు, మానసిక శాస్త్రవేత్తలూ ఇలా విశ్లేషిస్తున్నారు.**

- ఆసక్తికర వాతావరణంలోనే పిల్లలు భాష నేర్చుకొంటున్నారు. అవసరమైన వాతావరణమే ఆసక్తికరమైంది. సహజమైందీ.
- ఈ భాషాభ్యసన క్రమంలో తప్పని సరిగా మనం అందజేసేది (ఇన్‌పుట్) ఉంటుంది. కానీ ఫలితం (అవుట్ పుట్) ఉండదు. అంటే ఇన్‌పుట్‌కు సమానంగా - అవుట్‌పుట్ ఉండదు. దీనర్థం పిల్లలకి ఎన్నో మాటలు వినిపిస్తుంటాయి. వాటిని వాళ్లు కొన్నింటిని గ్రహిస్తుంటారు. గ్రహించినవి తిరిగి ఒప్పజెప్పాల్సిన అవసరం ఈ నేర్చుకొనే క్రమంలో లేదు.

- ఒక్క సంవత్సరం పాటు పిల్లలు వింటూనే ఉంటారు. జవాబు చెప్పాల్సిన, ఉపయోగించుకోవాల్సిన పని ఉండదు. ఎవ్వరూ అలా ఒత్తిడి చెయ్యరు. ప్రతి చర్య అవసరంలేని స్వీకరణ ఇది. ఇదొక మౌన మహాయుగం.
- ప్రతీది సందర్భం నుంచే పిల్లలు నేర్చుకొంటారు. తాము పాల్గొనని తమకు సంబంధం లేని, అమూర్త నిర్వికారాంశాలకు ఇక్కడ తావులేదు.
- ఇలా నేర్చుకొనేప్పుడు వాళ్లకేమో ఒక క్రమం లేదు. ముందు అక్షరాలు, తర్వాత పదాలు, ఆ తర్వాత వాక్యాలు ఇలాంటి వరుస లేదు. ముందు 'అ' చివర 'క్ష' అనే క్రమం అసలే లేదు.
- ముందు సులభం, తర్వాత క్లిష్టం అనే వరస కూడా లేదు. దీర్ఘాలు ముందురావచ్చు. హ్రస్వాలు వెనక రావచ్చు. పిల్లలకందుతున్న భాష ఒక నిర్ధారిత క్రమంలో ఉండదు. దానికో ప్రణాళికా పద్ధతీ ఏమీ ఉండవు.
- ఈ అభ్యసన క్రమంలో ఏమి మాట్లాడారన్నది ప్రధానం కాదు. ఏదైనా మాట్లాడవచ్చు. మాట్లాడకుండానూ ఉండొచ్చు. ఎలాంటి ఒత్తిడీ లేదు.
- తమ స్వంత పద్ధతిలో పిల్లలు నేర్చుకొంటారు. దాన్ని ఎవ్వరూ రూపకల్పన చెయ్యరు. 'టీ' అనే ఒక మాటను ఒక పాపెలానైనా వాడు కొంటుంది. తాను పాలు తాగుతున్నా, అమ్మమ్మ కాఫీ తాగుతున్నా, నాన్నా టీ తాగుతున్నా, అన్నిటినీ 'టీ' అనే అంటుంది. ముందు తాను పట్టుకొన్న ఒక పేరు అన్న పానీయాలకూ పెట్టి, తర్వాత వేర్వేరు పేర్లు పెట్టుకొనే ఒక స్వంత క్రమం ఆ పాప ఏర్పరచుకొన్నదన్నమాట.
- ప్రతి రూలునూ తనకు తానే బిడ్డ తెలుసుకొంటుంది. వ్యాకరణం ఎవ్వరూ చెప్పరు.
- విచిత్రంగా అన్ని భాషల పిల్లలూ మొదట ప, బ, మ ధ్వనుల్ని ఇష్టపడతారు. 'అమ్మ, బాబా, పాపా' వంటివి వారికిష్టం.

భాష ఇంత సంక్లిష్టంగా ఉండే అంశం కావడమేమిటీ? నేర్చుకోవడం ఇంత సులభతరంగావడమేమిటి? భాషకున్న నిబంధనలు ఇంత సార్వత్రికం కావడమేమిటి? నేర్చుకొనే క్రమం ఇంత సార్వజనీనం కావడమేమిటి? అంతా విచిత్రంగా ఉంది గదూ! అవును పెద్దలకు, మనకు విచిత్రమే! పిల్లలకేమో ఇది అత్యంత సహజం.

ఇప్పుడు పెద్దలం, మనం పట్టుకోవల్సిందల్లా ఈ అభ్యసన క్రమాన్నీ, రహస్యాన్నీ.

*పిల్లలూ - అబద్ధాలూ*

*మీ పిల్లలు అబద్ధాలు చెపుతున్నారంటే మీరంటే వాళ్ళు భయపడుతున్నామన్నమాట. లేకుంటే మిమ్మల్ని అనుసరిస్తున్నామన్నమాట. అబద్ధాలు చెప్పే తల్లిదండ్రులకు అబద్ధాలు చెప్పే పిల్లలుంటారు. తమను తాము రక్షించుకోవడానికే పిల్లలు అబద్ధాలు చెపుతారు. మీ ఇంట్లో భయాన్ని రద్దు చెయ్యండి. పిల్లల్లో అబద్ధాలు అవే తగ్గిపోతాయి.*

*- ఎ.యస్.నీల్*

## 2) పిల్లలు భాష నేర్చుకొన్నట్టే రాయడమూ నేర్చుకోగలరా?

*- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

భాషా, లిపీ ఈ రెండింటి స్వభావం ఒకటేనా? పరిణామ వికాస క్రమాలూ ఒకటేనా? అలా అయితే భాష నేర్చుకొన్నట్టే అక్షరాల్నీ పిల్లలు సహజంగా నేర్చుకొనే వీలుందా? రెండిటి అభ్యసన క్రమం, ఒకటేనా? ఈ ప్రశ్నలు కొంచెం లోతైనవి. పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు. అన్న ప్రశ్నకు సందర్భం, స్వప్రమేయం, స్వీయావసరం, స్వేచ్ఛల ఆధారంగా నేర్చుకొంటారనీ దీన్నే సహజ అభ్యసనమనీ ఇప్పుడు చాలా మంది అంగీకరిస్తున్నారు. మరి లిపికీ (అక్షరాలకూ) ఇది వర్తిస్తుందా? అంటే అంతే అని చెప్పడానికి మాత్రం వీళ్ళల్లో చాలా మంది తటపటాయిస్తారు.

అసలు మనం మాట్లాడడం నేర్పడం లేదు. పిల్లలే తమకు తాము నేర్చుకొంటున్నారు. కానీ ఏమీ నేర్పకుండా రాయడం నేర్చుకొనే వాళ్లెవరున్నారు? కాబట్టి మాట్లాడడం, రాయడం రెండూ ఒకేగాటన కట్టెయ్యదగినవి కావని ఎవరైనా తేలిగ్గా జవాబు చెప్పొచ్చు. మరి కొంచెం లోతుగా చెప్పదల్చుకొంటే అసలు మాట్లాడడం ఒక తప్పనిసరి అవసరం. బిడ్డకి ఆకలి వేసినప్పుడు దాన్ని ఏడుపు రూపంలో వ్యక్తం చేసినట్టే, ఆకలి తీరినప్పుడు దాన్ని కేరింత రూపంలో వ్యక్తం చేస్తుంది. దీన్ని భాషకు ప్రాథమిక రూపంగా మనం అనుకొంటే ఇది మనుగడకు సంబంధించిన సమస్య. ఇలా చూస్తే భాష ఓ విధంగా ఒక సహజాతం లాంటిది. అందుకు దీన్ని వ్యక్తీకరించేందుకు సహజమైన ఏర్పాటు ఉంది. మన వాగ్యంత్రం ఇందులో భాగం. మరి లిపికీ స్వభావం ఎక్కడుంది? లిపి మనం అవసరం కొద్దీ కల్పించుకున్నది. రాసేందుకు వాడే సాధనాలు నోరులాగా, నాలుకలాగా సహజమైనవి గావు. అవి మనం సృష్టించుకొన్నవి. అవి మనిషి బాహిరమైనవి. అలాంటప్పుడు భాష నేర్చుకొన్నట్టే పిల్లలు లిపి ఎలా నేర్చుకోగలరు? దీనికి నేర్పడం తప్పనిసరి. ఒక క్రమంలో నేర్పడం మరింత తప్పనిసరి. ఈ రకమైన చర్చ ముందుకొస్తుంది.

**అక్షరాల స్వభావం :**

దీన్ని తేల్చుకోవాలంటే లిపి స్వభావంలోకి మనం వెళ్ళాలి. దాని లక్షణాల్ని కొంచెం పరిశీలించాలి.

మొదటిది - మనం పెట్టుకొన్న పేరుకీ ఆ వస్తువుకీ ఎలా సంబంధం లేదో మనం రాస్తున్న అక్షరానికీ పలుకుతున్న ధ్వనికీ సైతం సంబంధం లేదు. గాడిదను గాడిద అనే ఎందుకనాలో చెప్పలేనట్టే ఒకానొక కంఠధ్వనిని 'క' అనే ఎందుకు రాయాలో కూడా మనం చెప్పలేం. గాడిదలాగే 'క' కూడా మనం పెట్టుకొన్న ఓ సంకేతం. అమూర్త సంకేతం.

అందువల్లనే ఒక లిపిలో ఏ భాషనైనా రాయగలం, అన్ని భాషల్నీ అన్ని లిపుల్లోనూ రాయగలం. ఉదా : KUKKA (తెలుగు), DOG (ఆంగ్లం), KUTHE (హిందీ)

ఇలా లిపి కేవలం సంకేతం మాత్రమేగాబట్టి ఏ లిపీ సమగ్రం, సంపూర్ణం కాదు. ఒక ధ్వనిని అనేక రూపాల్లో రాయడం సాధ్యం. ఒక అక్షరాన్ని అనేక విధాలుగా పలకడమూ జరుగుతున్నదే. ఋషిని రుషి అని రాస్తే 'ఆవు'ను 'ఆఉ ' అని రాస్తే 'ఒకటి'ని 'వొకటి' అని రాస్తే చదవడానికేమీ ఇబ్బంది ఉండదు. రెండు వస్తువులకు ఒకే పేరున్నట్టే రెండు ధ్వనులకు ఒకే అక్షరమూ మనం రాస్తున్నాం. ఒక ధ్వనిని ఒకచోట ఒకలాగా మరోకచోట మరోలాగా పలుకుతున్నట్టే ఒక అక్షరాన్ని ఒకచోట ఒక ధ్వనికీ, మరో చోట మరో ధ్వనికీ మనం ఉపయోగించుకొంటున్నాం. మనం చెప్పదల్చుకొన్న ప్రతి దానికి సరిపోయే మాటలు లేనట్టే మనం రాయదల్చుకొన్న ప్రతిధ్వనికీ సరిపోయే అక్షరాలూ లేవు. చేప, చాప, చాట ఈ మూడింటా పలుకుతున్న ధ్వనియేది? రాస్తున్నదేది? లేదా రాస్తున్నదేది? పలుకుతున్నదేది?

**లిపీ మారుతోంది :**

మరో అంశం పరిశీలిద్దాం. భాష రోజు రోజుకీ మారుతోంది. దాని పరిణామ క్రమాన్ని మనం రికార్డు చెయ్యొచ్చుకూడా. గుఱ్రబు, గుఱ్ఱంబు, గుఱ్ఱమ్ము, గుఱ్రము, గుఱ్ఱం. గుఱ్ఱం ఇలా రూపాంతరం చెందడం మన కళ్ల ముందే చూస్తున్నాం. సందర్భాన్ని బట్టి, వ్యక్తిని బట్టి వేగాన్ని బట్టి కూడా భాషలో మార్పులు కొల్లలుగా మనం చూడొచ్చు. ఇందులో ఏది సరైంది? (లాక్షణికమైంది) ఏది సరైంది గాదు? అని ప్రశ్నిస్తే ఎవరికివారి భాషే సరైంది అనడం కంటే వేరేజవాబు ఉండదు. పిల్లవాడికి గుల్లం సరైంది. పండితుడికి గుఱ్రము సరైంది. అనడం కంటే జవాబు ఉండదు. పిల్లవాడికి గుల్లం సరైంది. పండితుడికి గుఱ్రము సరైంది. మనకు గుఱ్ఱం సరైంది. స్కూలు మొహం ఎప్పుడూ చూడని వారికి ఇస్కూలు అంతే సరైంది. కాకుంటే మనం (అంటే సమాజం మీద ఒక పట్టుగల) ఒకానొక భాషని లాక్షణికం అంటున్నాం. అక్కడితో ఆగక ఈ లక్షణాలు తెలీని వారి భాషని గ్రామ్యం అనీ అచ్చ తెలుగులో అలగాజనం భాష అనీ కూడా ఎద్దేవా చేస్తున్నాం.

మరి లిపి కూడా ఇలానే మారుతోందా? మారుతోంది గానీ భాష మారినంత వేగంగా మారడం లేదు. దానిక్కారణం భాషకున్నంత అవసరం, ప్రాచుర్యం. సందర్భ వైవిధ్యం రాయడానికి లేకపోవడం గావచ్చు. కానీ మారుతుండటం మాత్రం అక్షరసత్యం. ఇప్పుడు కాఫీలోని ఫీకి కొత్త అక్షరం వచ్చింది. అమెరికన్లు డౌట్‌లో బి ఎందుకని ఎదురు తిరుగుతున్నారు. మన పిల్లలు చే, జే లకు ఎగనామం పెట్టేశారు. బండి 'ఱ' తిరిగి రాని లోకాలకి వెళ్ళిపోయింది. పాపం 'ౠ' అంతరించి 'ఋ' తోడులేక మినుకుమినుకుమంటోంది శ, ష, సలలో ఏదో ఒకదానికి తొందర్లోనే మూడేటట్టుంది. అసలు స(శ) స(ష) అని రాస్తే పోతుంది గదా అనే సవాలూ వస్తోంది. అక్కడితో ఆగక 'అ' ఒక్కటే మిగిలించి దానికి దీర్ఘం (తా) గుడీ (తి) ఇత్యాదులిచ్చి ఆ, ఇ, ఈ అని పలికితే అక్షరాలు కలసి రావూ అనే పొదుపు ఉద్యమమూ తలెత్తుతోంది. ఎలక్ట్రానిక్ యుగం ఇంకొంచెం ముదిరితే ఏ అక్షరాలు (పాపం వాటి పేరేమో అక్షరాలు – నశించనివి) ఏమవుతాయో ఎవరు చెప్పగలరు? ప్రపంచీకరణ ప్రభావం వల్ల అన్ని భాషలకీ ఒకే లిపి అనే చట్టం రాదని హామీ ఎవరివ్వగలరు?

భాషకీ లిపికీ మధ్య ఓ అనిర్వచనీయమైన లయ ఉందిగదా అనొచ్చు. లిపి ఏర్పడ్డాక ఆ లిపిలో మన భాషని ఏళ్ల తరబడి చూసుకోవడం అలవాటయ్యాక మనకలా కన్పిస్తోంది. ఇది కేవలం స్వీయ మానసిక విషయం. అంతేగానీ ఈ అనుబంధమేదీ భాషకీ లిపికీ మధ్య లేదని ఆధునిక లిపి శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

**లిపి – సహజాభ్యసనం :**

భాషకీ లిపికీ మధ్య ఈ సాన్నిహిత్యం చూసాక ఇక లిపిని నేర్చుకోవడం దగ్గరికి వద్దాం. భాషలా లిపి ఒక సహజాతం లాంటిది కాదుగదా మరి సహజ అభ్యసనం ఎలా సాధ్యమనేది చాలా విలువైన ప్రశ్న. పిల్లలు అవసరం ఉన్నా లేకున్నా ఏదో ఒకటి గొణక్కుంటుంటారు. ఏదో ఒక శబ్దం చేస్తూనే ఉంటారు. ఇది చాలా చిన్న వయస్సు నుంచీ మనం చూస్తున్నాం. అలాగే పిల్లలు ఏదో ఒకటి నేల మీద, గోడల మీద గీయడమూ మనం గమనించొచ్చు. తాను భావిస్తున్న దానికి (ఆ మూర్త భావనకి) ఓ సంకేతం (మూర్త రూపం) కల్పించుకోవడంలో ఇది భాగమా? లిపికిదే ప్రాథమిక రూపమా? అసలు ఆదిమ మానవుడు మాటలు రాక సైగలు చేసుకొనే కాలంలోనే తన భావాల్ని బొమ్మల ద్వారా సంకేతాల ద్వారా తెలియజేసేవాడని చాలా ఆధారాలు కూడా మనకు దొరుకుతున్నైకదా! కాబట్టి భాష లానే రాత కూడా ఓ సమాజావసరం. సహజాతం లాంటిదనే వాదన కూడా ముందుకొస్తోంది.

అదెలా ఉన్నా భాష నేర్చుకొనే క్రమానికీ, రాత నేర్చుకొనే క్రమానికీ మధ్య సామ్యం మాత్రం మనం గమనించి తీరాలి. అంగీకరించి తీరాలి. అసలు పిల్లలు భాషనీ అక్షరాల్నే గాదు నడక నేర్చుకోవడంలో కూడా ఓ క్రమం ఉంది. ఓ వ్యాకరణం ఉంది. ప్రతి అమూర్తాంశాన్ని మనిషి తెలుసుకోడానికీ ఒక క్రమం ఉంది. ఈ క్రమాల మూల స్వభావం, లక్షణం ఒకటిగానే ఉంటై. దీన్ని అర్థం చేసుకొంటే పిల్లలు రాయడం నేర్చుకోవడంలోనూ, భాషను నేర్చుకోవడంలో ఒక క్రమమే చాలా వరకు ఉందని మనం అనుభవం నుంచి తెలుసుకోవచ్చు.

భాషని పిల్లలు ఒక సందర్భంలో నేర్చుకొంటారని మనం అంగీకరిస్తే లిపినీ ఒంటరిగా గాక ఒక సందర్భం (కాన్‌టెక్స్ట్)లోనే పిల్లలు నేర్చుకొంటారు. మనం అలా నేర్పడమే సహజాభ్యసనం. అ, ఆ, ఇ అని దిద్దేప్పుడు ఏ సందర్భం ఉంది?

పిల్లలు స్వప్రమేయంతోనే భాషను నేర్చుకొన్నట్లే రాయడంలో కూడా జరగాలి. రాయడం సహజాభ్యసనం ద్వారా జరగాలి. (బొమ్మలు, గీసినట్టు అక్షరాలు స్వంతంగా గీయడానికి ఉద్యుక్తులు కావాలి).

పిల్లలు భాషని ముక్కలు ముక్కలుగాగాక సమగ్ర రూపంలోనే నేర్చుకొన్నట్లు లిపినీ అ, ఆ, ఇ, ఈ అని ముక్కలు చెయ్యడం గాకుండా పదాలు, వాక్యాలుగా నేర్చుకోవడం (అదీ ఒక సందర్భంలో) సహజాభ్యసనం.

మనం పట్టుబట్టి ప్రతిమాటా నేర్పితే, వ్యాకరణం చెపితే పిల్లలకు భాష రాలేదు. అలాగే ఎంతసేపు దిద్దిస్తే అంతగా అక్షరాలు వస్తాయనేది మన భ్రమ. మాట్లాడుతున్న క్రమంలో భాష వచ్చినట్టే చదువుతున్న క్రమంలోనే రాయడం వస్తుంది.

తప్పులు మాట్లాడుతూనే బాగా మాట్లాడడం నేర్చుకొన్నట్లు తప్పులు రాస్తూనే పిల్లలు సరిగా రాయడం నేర్చుకొంటారు. పిల్లలు మాట్లాడేటప్పుడు గుర్రాన్ని 'గుల్లం' అనగానే మనం ఎలా బెంబేలు పడమో అలాగే 'అమ్మను' 'అమం' అని రాయగానే మనం అన్యాయం జరిగిపోయిందనుకోకూడదు.

ఇన్‌పుట్ - ఔట్‌పుట్ అనే సూత్రం భాషకు మల్లే రాతకీ వర్తిస్తుంది. ఒక పదాన్ని చదవగల్గిన మరునాడే డిక్టేషన్ చెప్పడం అర్థరహితం. ఏడో పాఠంలో ఉన్నవాడు మూడో పాఠం పదాలు బాగా రాయగల్గితే చాలు. పరిసరాలు అనుకూలంగా ఉంటే పిల్లలు రెండు భాషలూ మాట్లాడగల్గినట్టే రెండు లిపులూ నేర్చుకోగలరు. కానీ ఏ భాషా వాతావరణం ఎక్కువగా ఉంటే ఆ భాషలో పట్టు చిక్కినట్టే, ఏ లిపి వాతావరణం ఎక్కువుంటే అందులో బాగా రాయగలరు.

ఇలా ఎంతైనా చెప్పుకోవచ్చు గానీ అసలు సూత్రం మాత్రం ఒక్కటే. అదేమంటే పిల్లలు దేన్నైనా నేర్చుకోవడానికి ఓ క్రమం, ఓ పద్ధతి ఉంటుంది. ఆ క్రమం, పద్ధతీ అన్నింటా దాదాపు ఒక్కటే. కావల్సిందల్లా దీన్ని మనం అర్థం చేసుకోవడం, అంగీకరించడం.

### స్వేచ్ఛా - చర్చా

*వాస్తవమైన స్వేచ్ఛను సాధించేదే విద్య. విమర్శనాత్మక చైతన్యాన్ని కొందరు అరాచకమని భావిస్తారు. స్వేచ్ఛ అంటే భయపడతారు. ఈ భయం ఉపాధ్యాయుల్లోనే కాదు, పిల్లల్లోనూ పాతుకొనిపోతుంది. చర్చ స్వేచ్ఛ కోసం పోరాడే చర్య. చర్చలో ప్రేమ ఉంది, నిబద్ధత ఉంది. ఒక చర్చ మరొక చర్చకు దారితీస్తుంది. బోధనాపద్ధతులు మారితే ఈ స్వేచ్ఛా, చర్చల ప్రక్రియ ముందుకు సాగుతుంది. ప్రపంచాన్ని, పిల్లల్ని ప్రేమించేవాళ్ళే చర్చలోకి ప్రవేశిస్తారు.*

*- పాలో ఫ్రెయిరీ*

## 3) భాషా బోధనలో భిన్న ధోరణులు

*- "చదువు విజ్ఞానం", జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం*

భాషను అభివృద్ధి చెందిన మానవుడి మెదడుకు ఫలితంగానేగాక మానవుడి మెదడు అభివృద్ధికి ఒకానొక హేతువుగా కూడా నేడు పరిగణిస్తున్నారు. సైగల రూపంలో, చిన్న చిన్న ధ్వనుల రూపంలో మొదలైన భాష నేడు అత్యంత విస్తృతంగా, సంక్లిష్టంగా కూడా పరిణతి చెంది మన అవసరాల్ని అద్భుతంగా నెరవేరుస్తోంది.

భాషా నిర్మాణం వాస్తవానికి అంత సరళమైంది ఏమీ కాదు. ప్రతి భాషకూ తనదైన నిర్మాణ పద్ధతి ఉంది. అదే సందర్భంలో అన్ని భాషలకూ సమానమైన కొన్ని నియమాలు ఉన్నాయి. ఏ చిన్న నియమాన్ని ఉల్లంఘించినా, చిన్న పొరపాటు చేసినా మొత్తం చెప్పదల్చుకొన్నదే తారుమారయ్యే ప్రమాదం ఉంది. 'వేసవిలో సంపన్నులు తాళలేక ఊటీ, సిమ్లా వంటి శీతల ప్రదేశాలకు వెళుతుంటారు' అనే వాక్యంలో 'తాళలేక' అనే పదాన్ని 'తాళంలేక' అని చదివితే ఏమవుతుంది? ఇలాంటివి ఉదాహరణలు ఎన్నైనా మనం నిత్యజీవితంలో చూడవచ్చు.

వచనం మారినప్పుడు, లింగం వేరైనప్పుడు, కాలాల్లో భేదం వచ్చినప్పుడు క్రియల్లో వచ్చే మార్పులకు మనం అలవాటు పడ్డాం గాబట్టి మాతృభాషలో సవాళ్లుగా కన్పించవుగానీ ఇతర భాషల్లోనైతే తలనొప్పిగా ఉంటాయి. సంస్కృత భాషలో 'దారా:' (భార్యలు) అనేది పుంలింగం. అది బహువచనంలో మాత్రమే ఉంటుంది. హిందీలో నపుంసక లింగం లేదు. ఉన్నదల్లా స్త్రీ పురుషాలే. హిందీలో 'నే' ప్రత్యయం వచ్చినప్పుడు క్రియ కర్తనుబట్టిగాక కర్మను బట్టి మారుతుంది. ఆంగ్లంలో కర్మణి (passive voice) ప్రాధాన్యత ఎక్కువ.

ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు. మరి ఇంత సంక్లిష్టమైన, దేనికది ప్రత్యేకమైన భాషల్ని మనం ఇంత అలవోకగా ఎలా నేర్చుకొంటున్నాం? మనలో ధారాళంగా మాట్లాడడం గానీ, అభిప్రాయాలు వ్యక్త చెయ్యడం గానీ చేతగాని వాళ్లు ఎవ్వరూ లేరు. అందరం కొంచెం అటూ ఇటూగా అత్యంత సమర్థంతంగా విని అర్థం చేసుకొంటున్నాం. మాట్లాడుతున్నాం. ఈ నైపుణ్య సంపాదనా క్రమంలో కూడా మన మధ్య పెద్ద తేడా ఏమీ లేదు. అందరం ఒకే వయస్సులో ఒకే 'పాండిత్యం' సంపాదిస్తున్నాం. మన పిల్లలకు గల పదజాల సంపద కూడా దాదాపు ఒకే మోతాదులో ఉంటోంది. ఇదెలా సాధ్యమవుతోంది?

మనమెవ్వరమూ ముందు వ్యాకరణం నేర్చుకొని తర్వాత మాట్లాడడం మొదలు పెట్టలేదు. ప్రతిదీ ఎవరో ఒకరు పట్టుపట్టి, చెవిమెలిపెట్టి నేర్పితేనే మనకిది వొంటపట్టలేదు. అన్నిటికంటే మించి ఒక పద్ధతి, ఒక క్రమం ఎవరో నిర్దేశిస్తే దాని ప్రకారం మనం నేర్చుకోలేదు.

మరి చదవడం, రాయడం దగ్గరికొచ్చేటప్పటికి ఇలా జరగడం లేదు. ఎక్కువ మంది ఇందులో వెనకబడిపోతున్నారు. కొందరు సాధ్యంగాదని పారిపోతున్నారు. చాలా మంది పెద్ద భారంగా ఈదలేక సతమతమవుతున్నారు. దీనిక్కారణాలేమిటి? ఈ నైపుణ్యాలు (చదవడం, రాయడం) వినడం, మాట్లాడడం కంటే చాలా సంక్లిష్టమైనవా? మనిషి మెదడు ఈ నైపుణ్యాల్ని సంతరించుకోవడానికి వెనకబడేంత బలహీనమైందా? ఒకేసారి రెండు మూడు భాషలు కూడా మాట్లాడగల్గుతున్న పిల్లలు మాతృభాషను కూడా ఎందుకు చదవలేకపోతున్నారు? సంవత్సరాల తరబడి శ్రమించినా ఎందుకు అనుకొన్న ఫలితాలు సాధించలేకపోతున్నారు?

పిల్లలు సహజమైన సందర్భాల్లో స్వేచ్ఛగా పాల్గొనడం వల్ల మాట్లాడడం అంత సులభంగా నేర్చుకోగల్గుతున్నారని ఇప్పుడందరం అంగీకరిస్తున్నాం. భయం, ఒత్తిడీ లేని వాతావరణంలో తప్పుల్ని లెక్కించి ప్రతిదీ సరిచేసే పరిస్థితి లేనిచోట, ఎంత నేర్చుకొన్నారని అడుగడుగునా మూల్యాంకనం చేయని పద్ధతిలో వారు నేర్చుకొంటున్నారు.

అంతేకాదు. పిల్లలు భాషను అవసరాల ప్రాతిపదికన నేర్చుకొంటున్నారు. విస్తృత సమాచారం అందుబాటులో ఉండటంతోపాటు అందులోంచి తమ ఇష్టం వచ్చింది, తమక్కావల్సింది ఉపయోగించుకొనే, సంగ్రహించుకొనే స్వేచ్ఛ కూడా వారికి ఉంది. తమ అవసరాల్ని ఏది తీరుస్తుందో దాన్ని మాత్రమే పిల్లలు అభివృద్ధి చేసుకొంటారు. ఈ క్రమం నుంచే పిల్లలు నేర్చుకొంటున్నారు.

భాషా తత్త్వవేత్తలు దీనిమీద ఇప్పటికే కావల్సినన్ని తర్జనభర్జనలు చేశారు. మళ్ళీ దీని జోలికి మనమిక్కడ వెళ్ళనక్కరలేదు. కానీ ఈ నేపథ్యంలో మనం భాషను తరగతి గదిలో నేర్పుతున్న పద్ధతిని మాత్రం సమీక్షించుకోవలసి ఉంది.

సాధారణంగా మనమందరం నేర్చుకొన్నదీ, నేర్పుతున్నదీ అక్షరాల్ని ఒక వరుస క్రమంలో రాయించే (దిద్దించే) పద్ధతి. దీన్ని అక్షరపద్ధతి అంటున్నాం. ప్రతి భాషకూ ఒక అక్షరమాల ఉంటుంది. అందులోని అక్షరాలకు ఒక వరస ఉంటుంది. ఈ వరస ప్రకారం పలికించడం (గుర్తించడం), రాయించడం నేర్పడంతో మనం భాషాబోధనను ప్రారంభిస్తున్నాం. ఆంగ్లంలాంటి భాషకున్న అక్షరమాల చిన్నది. తమిళం లాంటి భాషకు గల అక్షరమాల చాలా సరళమైంది. ప్రతిధ్వనికీ ఒకే అక్షరాన్ని పలుధ్వనులతో పలకడం వారి సంప్రదాయం. సంస్కృతంలో, తెలుగులో అలా కాదు. అక్షరమాల చాలా పెద్దది. వీటికితోడు గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు, సంశ్లిష్టాలు కూడా కలిపితే ఇది చాలా పెద్దదవుతుంది. ఇవన్నీ నేర్చుకోవడమే, గుర్తించి రాయగల్గడమే భాష నేర్చుకోవడంగా మనం పరిగణిస్తున్నాం.

ఒక్క మన భాషకే గాదు, మనదేశంలోనే కాదు ప్రపంచమంతా ఈ పద్ధతి చాలా కాలం నుంచి, బహుశా లిపి ఏర్పడినప్పటి నుంచీ కొంచెం తరతమ తేడాలతో కొనసాగుతోంది. దీనికి అనుకూలంగా వ్యతిరేకంగా చాలా వాదనలున్నాయి. వినడం, మాట్లాడడం చేసినట్లే చదవడం, రాయడం నేర్చుకోలేమేమో అన్నదానిపై తర్జనభర్జలున్నాయి.

అనుకూలంగా మాట్లాడేవారు - "అసలు అక్షరాలు రాకుండా చదవడం ఎవరైనా ఎలా నేర్చుకొంటారు?" అని ప్రశ్నిస్తారు. ఒక ఇల్లు కట్టడానికి వరసగా ఇటుకలు పేర్చినట్టే ముందు అక్షరాలు నేర్చుకొన్నాకే రాయడం వస్తుంది. అప్పుడీ అక్షరాల్ని కలుపుకొంటే సరిపోతుందనేది సాధారణమైన సమాధానం. ప్రతి భాషకూ ఒక లిపి ఉంటుంది. ఆ లిపి ఆ భాషకు స్వంతం. భాషా హృదయం లేదా సౌందర్యం (లయ) లిపిలో దాగి ఉంటుంది. అందువల్ల భాష నుంచి లిపిని విడదీయలేం. ఉదాహరణకు తెలుగులోని అచ్చులు వాటిలోని హ్రస్వదీర్ఘాలు ఒకానొక పద్ధతిలో (లయాత్మకంగా) ఉన్నాయి. వాటిని అదే వరసలో నేర్చుకోవడం తప్పనిసరి. అలా నేర్చుకోడం వల్ల ధ్వనుల్ని గుర్తించడం తేలిక, వాటిలోని భేదాల్ని లేదా సామ్యాల్ని గుర్తించడం తేలిక అనేది మరో వివరణ. శ, ష, స అనేవి మూడు ఒక వరుసలో ఉండటంవల్లే వాటిలోని సున్నితమైన తేడాని గుర్తించగల్గుతున్నాం. 'అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ' లలో ఒక క్రమం ఉంది. ఒక లయ ఉంది. అవి (అచ్చులు) నేర్పాక హల్లులు నేర్పితే గుణింతాలు నేర్పడం తేలిక, శాస్త్రీయం కూడా. చాలా మంది అభిప్రాయమిది.

వినడం, మాట్లాడడం నేర్చుకొన్నట్టుగా, అంత సహజంగా మనం చదవడం రాయడం నేర్చుకోలేం. భాష మౌఖికంగా అందుబాటులో ఉన్నంతగా రాతలో అందుబాటులో ఉండదు. అంటే వాతావరణం, సందర్భం కల్పించడంలో శ్రవణ, భాషణ నైపుణ్యాలకున్న అవకాశం పఠన, లేఖన నైపుణ్యాలకు లేదు. ఆవశ్యకత ప్రాతిపదికన చూసినా మొదటి రెండింటికి

గల ప్రాధాన్యత రెండోవాటికి లేదు. అందువల్ల కూడా రెండూ ఒకే రకంగా నేర్చుకోగల్గడం అసాధ్యం. మరో అంశం ఏమంటే మానవ శరీరాంతర్గతంగానే స్వర యంత్రం ఉంది. అత్యంత సహజంగా ఇతరావయవాలు స్పందించినట్లే ఇదీ స్పందించి ధ్వనుల్ని ఉత్పత్తి చేయగలదు. వినడం, మాట్లాడడం అనేవి ఒక రకమైన స్పందనలు, కానీ చదవడం, రాయడం అలా కాదు. వీటికోసం బయటి పరిసరాల మీద ఆధారపడాల్సిన ఉంది. ఇదొక అదనపు నైపుణ్యమే తప్ప అత్యవసర సహజావసరం కాదు, స్పందనా కాదు. అందువల్ల ఒకేలా నేర్చుకోవడం మొదటి రెండు నైపుణ్యాలకూ, తర్వాతి రెండు నైపుణ్యాలకూ కుదరదనేది మరో సమాధానం.

ఇక రెండో వాదన ఇటీవలది. ఇది ఎక్కువగా భాషాశాస్త్రం మీద, మానవ అభ్యసన పరిశోధనల మీద, మానసిక తత్వశాస్త్రం మీద ఆధారపడి ఉంది. సాపేక్షంగా ఇది ఆధునిక వాదం.

భాషకు లిపి మనం కల్పించుకొన్నదే. అక్షరమాల, అందులోని క్రమం మనకు మనం పెట్టుకొన్నదే. అందువల్ల ఒక్కో భాష ఒక్కో క్రమం ఉంటుంది. ఒకవేళ ఒకే క్రమం ఉన్నట్లు కన్పించినా (ఉదా : ద్రావిడ, ఆర్య భాషలు వేరైనా అక్షర మాలాక్రమం ఒకటిగానే ఉంది) అది ముందుగా ఒక భాష ఏర్పరుచుకొన్న క్రమాన్ని అనుసరించి మరొక భాషవారు పెట్టుకొన్నదే తప్ప మరొకటి కాదు. చాలాకాలం ఒకే వరసలో చదివీ చదివీ అలవాటుపడి దాన్ని సహజ క్రమంగా, ఆ భాషకు మాత్రమే సరిపోయే స్వంత క్రమంగా మనం భ్రమపడుతున్నాం. లయ అనబడేది కూడా చాలావరకు అంతే. సంస్కృతం లాంటి భాషలు వర్ణమాలలోని అక్షరాల్ని వాటి ఉత్పత్తి స్థానాల ఆధారంగా నిర్ణయించాయి. (అ–కంఠ్యం, ఆ–తాలవ్యం). కొన్ని సుదూర భాషల వర్ణమాలల మొదటి అక్షరాలు ఒకటి రెండు ఒకే ధ్వని గలవి ఉండొచ్చు. అది కొంత యాదృచ్ఛికం, కొంత ధ్వనికి గల ప్రాధాన్యత ప్రాచుర్యం, సౌలభ్యం మీద (ఉదా: ఆంగ్లంలో 'ఎ' తెలుగులో 'అ' రెండూ మొదట ఉన్నాయి) ఆధారపడిన విషయం. అంతకు మించి శాస్త్రీయత అక్కడేమీ లేదు. కాబట్టి ఇదే క్రమంలో నేర్చుకోవడం వల్ల భాష నేర్చుకోవడంలో వొరిగేదేమీ ఉండదని వీరి అభిప్రాయం. అంతేగాదు ఈ రోజు కాకుంటే రేపైనా అన్ని భాషలకూ ఓ లిపి (అంతర్జాతీయ లిపి) వీలున్నన్ని తక్కువ అక్షరాలతో వస్తుందని ఇది లిపి పరిణామక్రమమని వీరు నమ్ముతున్నారు. మనం ఎంత కావాలనుకొన్నా కొన్ని అక్షరాలు అదృశ్యమవుతున్నాయి. కొన్ని కొత్తవీ వచ్చి చేరుతున్నాయి. బాగా అభివృద్ధి చెందిన భాషలు అక్షరాల్ని మరీ తగ్గించుకొంటున్నాయి. ఇవన్నీ కూడా లిపి–భాషల మధ్య విడదీయరాని సంబంధం ఉందనడాన్ని వ్యతిరేకిస్తున్న అంశాలుగా వీరు పేర్కొంటున్నారు.

అన్నిటికంటే ముఖ్యమైంది మరొకటి ఉంది. అదేమంటే మనం భాషను ముక్కలు ముక్కలుగా నేర్చుకోవడం లేదు. మొత్తంగానే నేర్చుకొంటున్నాం. పిల్లలు చేసే చిన్న చిన్న ధ్వనులు కూడా సారాంశంలో వాక్యాలే. అలాగే వాళ్లు వచ్చీ రాక పలికే చిన్న చిన్న పదాలు కూడా వాక్యలే. 'అమ్మ' అంటే అమ్మ వచ్చిందనో, కొట్టిందనో, కావాలనో అర్థం మనం మొదట చిన్న చిన్న ధ్వనులు, తర్వాత పదాలు, వాక్యాలు భాషా నిబంధనలు నేర్చుకోవడం లేదు. ఒకే రకమైన ధ్వనుల్ని ముందుగానూ, మరొక రకమైనవి తర్వాత నేర్చుకోవడమూ లేదు.

కేవలం గుర్తు పెట్టుకోవడం ద్వారా, అంటే జ్ఞాపకశక్తి మీద ఆధారపడి కూడా మనం భాషను నేర్చుకోవడంలేదు. అనేక సందర్భాల్లో పాల్గొంటూ మన అవసరాల్ని మాటిమాటికీ ఉపయోగించుకొంటున్నందువల్లనే ఏమాటలైనా మనం నేర్చుకోగల్గుతున్నాం. వినియోగం లేనివి మనం వదిలేస్తాం లేదా మరిచిపోతాం. అలాగాక అక్షరాలు నేర్పే పద్ధతిలో కేవలం అక్షరాల్ని వేరుగా నేర్పుతున్నాం. అంటే భాషను ముక్కలు ముక్కలుగా చేసి ఒక క్రమం పెట్టి నేర్పుతున్నామన్నమాట.

అంతేగాక అక్షరాలకు అర్థం లేదు. స్వంతంగా వినియోగంలేదు. ఒక రకంగా మొండిగా గుర్తుంచుకొనే సర్కసు తప్ప మరొకటి లేదు. ఇది కృత్రిమమైన క్లిష్టమైన పద్ధతి. ఎన్ని అక్షరాలు నేర్పినా పదాలు రావు. అప్పటి దాకా నేర్చుకొన్న అక్షరాలు ఏమాత్రం వినియోగంలోకి రావు. అలాంటివి ఎలా గుర్తుంటాయి? ఎందుకు గుర్తుండాలి? మానవ అభ్యసన విధానానికే ఇది విరుద్ధం. ఇలా ఈ పద్ధతిని నేడు చాలామంది వ్యతిరేకించి సమగ్ర దృక్పథాన్ని భాషాభ్యసనంలో శాస్త్రీయమైనదిగా ముందుకు తెస్తున్నారు.

పూర్వం మనం ముందు అక్షరాలన్నీ ఒక్కటి కూడా పొల్లు పోకుండా నేర్చుకొని, తర్వాత వాటి గుణింతాలు, ఆ తర్వాత వాటి వొత్తులు నేర్చుకొని అప్పుడు మాత్రమే పదాలు రాసేవాళ్ళం. నిజానికి 'అ' నుంచి 'క' వరకు నేర్చుకోగానే ఎవరైనా 'ఈక', 'ఒక' లాంటి పదాలు నేర్చుకోవచ్చు. ఇది కూడా మనం చేసేవాళ్ళం గాదు.

క్రమక్రమంగా సాంప్రదాయిక అక్షర పద్ధతిలో కూడా మార్పులు వస్తున్నాయి. అవసరం లేని 'ఌ, ౡ' లాంటివి కనుమరుగైనాయి. అంతగా ప్రాచుర్యం లేని మహా ప్రాణాలను (ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ) వరుస నుంచి తప్పించి చివర నేర్పుతున్నారు. కొన్ని అక్షరాలు నేర్పగానే వాటితో వచ్చే పదాలు నేర్పి, ఆ అక్షరాల్ని కల్పిస్తున్నాం. (కొందరైతే మరో ముందడుగు వేసి పదాలతోనే భాష నేర్పడం కూడా చేస్తున్నారు. అర్థంలేని, స్వంతంగా వినియోగంలో లేని అక్షరాల్ని నేర్పడం వల్ల వాటిని గుర్తుంచుకోవడం అసాధ్యమన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారు.)

ఈ పద్ధతిలో అక్షరాల్ని వరస క్రమంలో నేర్పడం ఉండదు. బాగా ప్రాచుర్యంగల, వాడుకలోని పదాల్ని నేర్పి వాటిలోని అక్షరాల్ని కూడా పరిచయం చేస్తారు. దీనివల్ల పదజాలం పిల్లలకు మొదటి నుంచే అందుబాటులో ఉంటుంది. నేర్చుకొన్న ప్రతిదీ వినియోగంలోకి వస్తుంది. గుడ్డిగా గుర్తుంచుకోనక్కరలేదు.

కొన్ని పదాలు నేర్పగానే చిన్న చిన్న వాక్యాలు కూడా నేర్పవచ్చు. అప్పుడు నేర్చుకొన్నది మరింత వినియోగంలోకి వస్తుంది. ప్రతిదీ అర్థవంతంగా కన్పిస్తుంది.

అక్షర పద్ధతి మీద మరొక సవాలు కూడా చాలా విలువైంది ఉంది. ఈ పద్ధతిలో మొదట రాయడం తర్వాత చదవడం నేర్పుతున్నాం. భాషాభ్యసన క్రమానికిది విరుద్ధం. ముందు చదవడం తర్వాత మాత్రమే రాయడమనేది శాస్త్రీయం. ముందు చదవాలంటే అవి గుర్తుంచుకోవాలి. గుర్తుంచుకోవడం వినియోగించుకొనే క్రమంలో మాత్రమే సాధ్యమవుతుంది. అంతేకాదు చదవగలవారు మాత్రమే రాయగల్గుతారు. మనం ఎంత దిద్దినా హిందీ అక్షరాల్ని ఇప్పుడెంతమంది గుర్తుంచుకోగల్గుతున్నాం? దీనిక్కారణం వీటిని వినియోగించకపోవడమే. మన మెదడుకు అవసరం ప్రాతిపదికన ఎన్నిటికైనా గుర్తుంచుకొనే సామర్థ్యం అద్భుతంగా ఉంది.

దీనికి మరో ముక్తాయింపు కూడా లేకపోలేదు. అసలు ఏ విద్యావంతుడైనా చదవడానికి వినియోగించుకోవడంలో 10వ వంతు కూడా రాయడానికి భాషను వినియోగించుకోడు. మహా కవులకు కూడా ఇది వర్తిస్తుంది. గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు వయోజన విద్య నేర్పించేటప్పుడు పలకా బలపాలుండేవి కాదు. వారి విద్యలో రాయడానికి స్థానమే లేదు. కేవలం చదవడం మాత్రమే నేర్పేవారు. దీనర్థం మనం రాయడం నేర్పనక్కర లేదని కాదు చదవడానికి రాయడం నేర్చుకోవడం తప్పనిసరి అవసరం కాదని చెప్పడానికి మాత్రమే.

మరి ఈ పద పద్ధతిలో కూడా ఉన్నదేమిటి? ప్రాచుర్యం గలవి, సులభమైనవి అనే పేర కొన్ని పదాల్ని వాటి అక్షరాల్ని ఎంపిక చేసి మళ్ళీ ఒక క్రమాన్ని నిర్దేశించుకొని భాష నేర్పడమే గదా! నేర్పినవి వినియోగంలోకి రావడం తప్ప, అర్థవంతంగా

నేర్చుకోవడం తప్ప వినడంలా, మాట్లాడడంలా ఇది భాషను మొత్తంగా నేర్పడం కాదుగదా. ఇది సహజమైన ప్రక్రియ కాదుగదా! ఇంకా చెప్పాలంటే ఒక రకంగా అక్షరాలు ముందు నేర్పే పద్ధతికి అంతో ఇంతో దగ్గరిదే గదా! ఈ చర్చా లేకపోలేదు.

భాషా ప్రపంచాన్ని (అక్షరాలు, పదాలు, సంభాషణలు, పాటలు, కథలు) విద్యార్థికి వీలున్నంత అందుబాటులో ఉంచి పలు సందర్భాల్లో వాటిని విరివిగా వినియోగించుకొనేట్టు చేయడం ద్వారా భాషను మొత్తంగానే నేర్పవచ్చు అనే వాదమొకటి బలంగా ఉంది.

ఇందులో ఏ క్రమమూ ఉండదు. ఏ నిర్దేశమూ ఉండదు. మాట్లాడడం నేర్చుకొన్నట్టే పిల్లలు మొత్తంగా భాషను నేర్చుకొంటారు. ఇది కూడా సాధ్యమే అనడం కన్నా ఇదే శాస్త్రీయం అనేవాళ్ళూ నేడు తక్కువగా లేరు.

లిపి మానవుడికి తెలిసి కొన్ని వేల సంవత్సరాలు గడిచినా దీన్ని నేర్పడం పట్ల ఇంత తర్జనభర్జనలు ఇప్పటికీ జరగడం విచిత్రంగా మనకు కన్పించవచ్చు. కానీ శాస్త్రం పెరుగుతున్న కొద్దీ, పరిశోధనలు నూతనాంశాల్ని ఆవిష్కరిస్తున్న కొద్దీ ఇలాంటి తర్కాలు ముందుకు వస్తూనే ఉంటాయి. ఆచరణలో ఏవి సాధ్యమైతే అవి నిలుస్తాయి. మిగిలినవి అవి ఎంత ఆధునికమైనవైనా, ఎంత ప్రాచీనమైనవైనా గతిస్తాయి.

ఎటొచ్చీ పిల్లల్ని హింసించకుండా, వారి సహజ స్వభావానికి, అభ్యసన క్రమానికి సంబంధం లేకుండా గుడ్డిగా యాంత్రికంగా నేర్పడం ఒక్క భాషకే కాదు దేనికైనా న్యాయం చేకూర్చదు. ఇది అన్నిటికీ వర్తించే సాధారణ సూత్రం. దీన్ని మనసులో ఉంచుకొన్నప్పుడు మనం పాటించే పద్ధతుల్లో ఏ లోపాలున్నాయో మనకే సులభంగా అర్థమవుతుంది.

*మీ పిల్లలు*

*మీ పిల్లలు మీ స్వంతం అనుకొనేవారు, వాళ్ళొక నిరంతరజీవన స్రవంతికి బిడ్డలు మీ ద్వారా వాళ్ళకి జన్మ లభించినంతమాత్రాన, వాళ్ళు మీ నుంచే పుట్టినట్లుకాదు. వాళ్ళు మీతో ఉన్నంతమాత్రాన, వాళ్ళు మీ వాళ్ళైనట్లు కాదు. మీరు వాళ్ళకు ప్రేమను పంచివ్వండి, అంతేకానీ మీ ఆలోచనల్ని రుద్దకండి, వాళ్ళకు వాళ్ళ స్వంత ఆలోచనలుంటాయని మరవకండి. వాళ్ళ శరీరాలనే మీరు పోషించేది, ఆత్మలను కాదని మరవకండి, వాళ్ళ ఆత్మలు రేపటి ప్రపంచం కోసం తపిస్తుంటాయి. ఆ ప్రపంచాన్ని మీరు చూడలేరు, కలనైనా కనలేరు. వాళ్ళలా మీరుండే ప్రయత్నం చేయండి, వాళ్ళను మీలా మార్చేందుకు మాత్రం పూనుకోకండి. జీవితం వెనక్కి నడవదని గుర్తించండి. మీరు విల్లు అయితే, మీ పిల్లలు అందులోంచి దూసుకెళ్ళే బాణాలు సుమండీ!*

*– ఖలీల్ జిబ్రోన్*

## 4) పిల్లలు చదివే పుస్తకాలేవీ? కథలేవీ?

***- కొడవగంటి కుటుంబరావు, సంవేదన, అక్టోబర్ 1968***

మన దేశంలో బాలసాహిత్యమంటూ ఇప్పుడిప్పుడే వస్తున్నది. బెంగాలీ, హిందీ మొదలైన భాషలలో రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం కూడా బాలపత్రికలుండినట్టు తెలుస్తోంది. తెలుగులో మాత్రం బాల పత్రికలు స్వాతంత్ర్యం వచ్చే రోజుల్లోనే బయలుదేరాయి.

నా చిన్నతనంలో బాలసాహిత్యమంటూ వేరే లేదు. నాకు చదవటమూ, రాయటమూ రాగానే సుమతీ శతకం కంఠస్థం చెయ్యమన్నారు. వావిలకొలను వారు రచించిన పాకెట్ సైజ్ కథల పుస్తకాలేవో ఉండేవి. భాగవతం నుంచి కుచేలోపాఖ్యానం, రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం లాంటి కథలు చదివాను. వాటిలోని కొన్ని పద్యాలు నాకిప్పటికింకా జ్ఞాపకం ఉన్నాయి.

అర్థ శతాబ్దం క్రితం ఇదే బాలసాహిత్యం, నిజానికిది పిల్లల కోసం ప్రత్యేకించి రాసిన సాహిత్యం కాదు. పెద్దల సాహిత్యమే. పెద్దల సాహిత్యంలో పిల్లలకు పనికి వచ్చేదంతా పిల్లల సాహిత్యంగా చలామణీ కావటం మన సంప్రదాయం. మనం ఈ రోజు బాల సాహిత్యం గురించి పాశ్చాత్యుల అభిప్రాయాలు అరువు తెచ్చుకొని లాభం లేదు.

ఇంచుమించు ఇరవై ఏళ్లుగా బాలసాహిత్యంతో నాకు గల సంబంధాన్ని బట్టి బాల సాహిత్యం ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అన్న అభిప్రాయాలు కొన్ని ఏర్పరుచుకొన్నాను. కొంత కాలమయ్యాక వాటికి కాలదోషం పట్టవచ్చు. ప్రస్తుతానికి ఈ నా అభిప్రాయాలు సముచితమైనవని భావించి వాటిని ఇక్కడ చెబుతున్నాను.

పశుపక్ష్యాదులు పాత్రగా గల నీతి కథలూ, దేవతలూ, రాక్షసులూ, మాంత్రికులూ, అతీత శక్తులూ మొదలైన వాటితో కూడిన దేవతా కథలూ గడిచిపోయిన యుగాలకూ, సమాజానికీ సంబంధించిన జానపద కథలూ బాల సాహిత్యంలో ప్రముఖ స్థానం కలిగి ఉంటాయి.

### వాస్తవికత :

పైన చెప్పిన కథలలో వాస్తవికతకు చోటు లేదు. "బుల్లి చేపల చేత మాట్లాడించటంలోనే ఉన్నది చిక్కంతా!" అన్నాడట ఆలివర్ గోల్డ్‌స్మిత్ చేపలూ, కాకులూ, ఎలుకలూ మాట్లాడటం వల్ల వాస్తవికత పోతుందని అతడు భయపడి ఉంటాడు. కాని బాల సాహిత్యంలో అలాంటి వాస్తవికత అవసరం. పిల్లలు తాము వినే (చదివే) కథలలోని సన్నివేశాలనూ, సంఘటనలనూ తమ పరంగా అన్వయించుకోనవసరం లేదు. వాళ్ళు వాటికి ఎడంగా ఉండే ఆనందం పొందాలి. "అనగనగా ఒక రాజు, ఆరాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చి ఎండవేశారు... ఏ రాజు? ఏడుగురు వేటకు పోయి ఏడు చేపలేనా తెచ్చారు? ఏడు చేపలు ఎండేస్తే ఎవరి ముక్కులోకి?" ఇలాంటి సందేహాలు వేటికీ కథలో తావులేదు.

కొన్ని నీతి కథలను కొందరు ఆధునికం చెయ్యాలని ప్రయత్నిస్తారు. ఇది పొరపాటు. మాంసం ముక్క నోట కరుచుకొన్న కాకిని నక్క, "కాకిబావా, కాకిబావా! ఒక్క పాటపాడు!" అనగానే ఈ ఆధునిక కాకి మాంసం ముక్కను కాలి కింద పెట్టుకొని, పాటపాడి నక్కను 'ఫూల్' చేస్తుంది. ఇది నీతికథ కాదు, జర్నలిజం.

పిల్లల కథలు వర్తమాన జీవితానికి సంబంధించి ఉండాలనీ, అందులో వాస్తవికతకు చోటు కలిగించాలనీ కొందరు కొన్ని రకాల రచనలు చేస్తారు. మాటవరుసకు సీత పుట్టిన రోజు పండుగ అనుకోండి. సీతకు పుట్టిన రోజు పండుగ చేస్తారు. బామ్మ తలంటి పోస్తుంది. నాన్నారు తెచ్చిన కొత్తపూల పరికిణి కట్టుకొంటుంది. మామయ్య తెచ్చిన పూల జాకెట్టు వేసుకొంటుంది. అన్న తెచ్చిన కొత్త రిబ్బను ఎంచక్కా పెట్టుకొంటుంది. అమ్మ పూరీలు, జిలేబీలు, మైసూర్‌పాకూ, బాదం హల్వా చేసి పెడుతుంది.

ఇదే విధంగా తంతు జరిగిపోతుంది. ఇది పిల్లల కథ కాదు. పెద్దవాళ్ళు నెలల పిల్లలతో (వాళ్ళకర్థమవుతుందనుకొనీ, వాళ్ళ భాషే మాట్లాడ్తున్నామనుకొనీ) 'ఓంతిలా? అయి కావాలా?' అన్నట్టుగానే ఉంటుంది ఇలాంటి కథ కూడానూ. ఇటువంటి కథలు మరీ జాస్తిగా చదివితే పిల్లలకు తమ పరిసరాల మీద చాలా రోత పుడుతుంది. సినిమాలలో చూపే ప్రేమ నిజమనుకొన్నవాడు వాస్తవ జీవితంలోని ప్రేమ చూసి అనుకొన్నట్లుగా పిల్లలు పెద్దలయ్యాక, వంచింపబడ్డామనుకోగలరు. ఎందుకంటే ఈ కథల్లో ఉండేది 'స్టెరిలైజ్' చేసిన జీవితం వాస్తవంగా ఉన్నట్లు భ్రమగొల్పే అవాస్తవం. చేపలూ, కొంగలూ మాట్లాడే కథలు ఇలా మోసం చెయ్యవు.

**మౌలిక భావాలు :**

బాల సాహిత్యం పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావాలను బలంగానాటాలి. ధైర్యసాహసాలు, నిజాయితీ, స్నేహపాత్రత, త్యాగబుద్ధీ, కార్యదీక్షా, న్యాయమూ మొదలైనవి. అన్యాయాన్ని జయించటం ద్వారా సంతృప్తిని కలిగించే కథలు ఎంత అవాస్తవంగా ఉన్నా, పిల్లల మనస్సులకు చాలా మేలు చేస్తాయి. దురాశా, ఓర్వలేని తనమూ, అధికార గర్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నతా, అధర్మమూ, స్వార్థమూ మొదలైనవి శిక్షించబడటం కూడా పిల్లలకు తృప్తినివ్వాలి.

కొన్ని కొన్ని సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్బల్యంగా పరిణమించటమూ, ప్రమాదం తెచ్చిపెట్టటమూ జరుగుతుంది. భూతదయ చాలా మంచిది. నిస్సహాయులపట్ల దయ చూపటం వరకూ ఇబ్బందిలేదు. కాని దుర్మార్గుల పట్ల చూపే దయ ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుచేతనే బోను నుంచి పులిని విడిపించిన బ్రాహ్మడి కథలో ముఖ్యాంశం బ్రాహ్మడి జాలికాదు. అది తెచ్చి పెట్టిన ప్రమాదమే. ఆ ప్రమాదాన్ని నక్కయుక్తిగా తప్పిస్తుంది. యుక్తి కథలకు బాల సాహిత్యంలో చాలా స్థానం ఉంది.

స్థూలంగా చెప్పాలంటే పిల్లల్లో దౌర్బల్యాన్ని పెంపొందించేది మంచి బాల సాహిత్యం కాదు. మహాసత్త్వుల కథలు ఉత్తమ బాల సాహిత్యం. ఒక లక్ష్యం పెట్టుకొన్నాక మహాసత్త్వుడైన వాడు ఎన్ని ప్రమాదాలనూ లక్ష్యపెట్టడు. అటువంటి పాత్రలు గల కథలు ఎంత హెచ్చుగా చదివితే పిల్లలకు కారెక్టర్ అంత బాగా ఏర్పడుతుంది. మన దేశాలవంటి పేద దేశాలలో పిల్లలకు డబ్బు మీద దృష్టి ఏర్పడటం కన్నా 'కారెక్టర్' ఏర్పడటం చాలా అవసరం.

రాక్షసులను మనుషులు జయించటమూ, ధనికులను వాళ్ళ సేవకులు భంగపరచటమూ, అతి సామాన్యమైన వ్యక్తులలో అసాధారణ శక్తులుండటమూ లేదా వారికవి లభ్యం కావటమూ – ఇలాంటి ఇతివృత్తాలు గల జానపద కథలు ప్రపంచ మంతటా ఉన్నాయి. వాస్తవ సంప్రదాయాలకు ఎదురు వెళ్ళే ఈ కథలు చదవటంవల్ల కూడా పిల్లలకు కొంత లాభం ఉన్నది. ముఖ్యంగా చిన్న పిల్లలకు దొంగల భయమూ, దయ్యాల భయమూ లాంటివి అతి తేలికగా అబ్బుతాయి. ఆ భయాలను తగ్గించే దొంగల కథలూ, దయ్యాల కథలూ పిల్లలు చదివి ఉండటం మంచిది.

దేవుడి మీద భక్తినీ, మత విశ్వాసాలనూ ప్రచారం చెయ్యటానికే రచించిన కథలు పిల్లలకు చెప్పటం అంత మంచిది కాదు. కథల్లో దేవతలూ, భక్తులూ ఉండరాదని కాదు. దేవుణ్ణి నమ్ముకొంటే అన్ని సుఖాలూ ఒనగూడతాయన్న అభిప్రాయాన్ని పెద్దలు కలిగి ఉండటం ఎంత తప్పో, పిల్లలకు ఇవ్వటం అంతకు పదింతలు తప్పు, కథలో నెగ్గవలసినది మనుష్యయత్నమూ, మనిషి సద్బుద్ధీనూ, ఇది చాలా ముఖ్యం.

**రచనా విధానం :**

బాల సాహిత్యం రాసేటప్పుడు కథనం పెద్దవాళ్ళు పిల్లలతో మాట్లాడుతున్నట్టుండాలనుకోవటం నా బుద్ధికి చాదస్తంగా కనిపిస్తుంది. "అప్పుడేమయిందనుకొన్నారూ" "రాజుకో కూతురుందనుకొన్నాం కాదూ?.. చూశారా, వాడి దుర్మార్గం వాణ్ణి ఏ స్థితిలోకి తెచ్చిందో?" ఇలా అడుగడుగునా బాల పాఠకులను తట్టుతూ ఉండటం అనవసరం అనుకొంటాను.

రచనలో వ్యర్థపదాలూ, ప్రకృతి వర్ణనలూ, సౌందర్య వర్ణనలూ పిల్లలను అంతగా ఆకట్టవు. 'కీకారణ్యం', 'కటికచీకటి', 'పండువెన్నెల', 'పెద్ద కెరటాలతో ఉప్పెన' ఇలాంటి మాటలతో వాళ్ళు ఎంతైనా ఊహించుకోగలరు.

పాత్రలు చాలా మంచివాళ్ళయినా కావాలి, చాలా చెడ్డవాళ్ళయినా కావాలి. చాలా తెలివిగల వాళ్ళయినా కావాలి. వట్టి మూర్ఖులైనా కావాలి. చాలా అందంగానైనా ఉండాలి. వికారంగానైనా ఉండాలి. ఓ మాదిరి మంచీ, సుమారైన తెలివీ, ఎటూగాని అందమూ బాల సాహిత్యానికి అవసరం. పాత్రల అంతస్సంఘర్షణలు కూడా అంతే.

పిల్లల కోసం రాయటం ఒక గొప్ప కళ. తెలుగులో ఆ కళను చెప్పుకోదగినంతగా వృద్ధి చేసినవారెవరూ ఉన్నట్టు కనబడదు. కొందరు పాత్రోచిత భాష ప్రవేశపెట్టాలని హీన పాత్రల చేత యాసగా మాట్లాడించటం లాంటి ప్రయోగాలు చేస్తారు. నా దృష్టిలో ఇది గూడా ఈనాటికీ పొరపాటే. కథల్లో సంభాషణలు ఉండక తప్పదు. కాని వాటిలో అంత వాస్తవికత నిరుపయోగం.

**బాలగేయాలు, ఇతర రచనలు :**

అదృష్టవశాత్తూ ఈనాడు మనలో చక్కని బాలగేయాలు రాసేవారున్నారు. నిజానికి పెద్ద వాళ్ళకన్నా పిల్లలు గేయాలను ఎక్కువగా ఆనందించగలరు. బాలగేయ రచనలు పిల్లలకు ఎంతగా అందుతున్నాయో నాకు తెలీదు. కొన్నిటికి బహుమతులు కూడా లభించాయనుకొంటాను.

పిల్లలకు విజ్ఞానం కూడా కొంతవరకూ అవసరమే. ఈ స్పుత్నిక్ - హైడ్రోజన్ బాంబు యుగంలో వాళ్ళు తెలుసుకోదగిన వైజ్ఞానిక విషయాలు ఎన్నో ఉన్నాయి. ఆకాశానా, భూమిమీదా, సముద్రం అడుగునా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఆరోగ్య సంబంధమైన అంశాలు చిన్నతనం నుంచీ తెలుసుకోదగినవి ఎన్నయినా ఉన్నాయి. అడవిలో చెట్లలాగా ఈనాటి పిల్లలు వీటిని గురించి ఏమీ తెలుసుకోకుండా పెరగటం చాలా తప్పు.

**బాల గ్రంథాలు :**

బాల గ్రంథాలు చూడటానికి అందంగా ఉండాలి. అచ్చు చక్కగా ఉండాలి. బొమ్మలు ఊహలను కదిలించేవిగా ఉండాలి. వాటిలో ఎలాంటి అచ్చుతప్పులు ఉండరాదు. అవి చవగ్గా కూడా ఉండాలి.

వ్యాపార యుగంలో ఈ రెండూ కుదరవు. అందుకని సోషలిజం వచ్చేదాకా ఈ సమస్యను తడిపి ఉంచడానికి వీల్లేదు. ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రస్తుతం ఉన్న మార్గాలు ఏవంటే.

1) పిల్లల కోసం వేసే పుస్తకాలకు ప్రభుత్వం, లేక ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వటం,

2) ప్రచురణ కర్తలు ఈ పుస్తకాలను అనేక వేల సంఖ్యలో ముద్రించటం (లక్షల సంఖ్యలో కాకపోతే).

పుట్టిన రోజు పండుగలకూ, ఇతర పండుగలకూ పెద్ద వాళ్ళు పిల్లలకు మిఠాయి వగైరాలతో బాటు చక్కని పుస్తకాలు కూడా బహూకరించడం. ఇతర దేశాలలో ఇరవై అయిదు రూపాయలు ఖరీదు చేసే పిల్లల పుస్తకాలు సైతం అచ్చు అవుతున్నాయి. పెద్ద వాళ్ళు బహూకరించకపోతే నిత్య ఖర్చులో నుంచి పిల్లలు అలాంటి పుస్తకాలు కొనటం సాధ్యమా?

పిల్లల పుస్తకాల ప్రచురణ ఆంధ్రలోనే చాలా వెనుకబడి ఉన్నట్టు కనబడుతుంది. మంచి ముద్రణాలయాలు లేకపోవటమూ, బాల పుస్తకాల ప్రచురణ పెట్టుబడిదార్లను ఆకర్షించలేకపోవటమూ, అందుకు కారణాలు కావచ్చు. పిల్లలకు తగినట్టుగా బొమ్మలు వేసే చిత్రకారులు కూడా చాలా తక్కువగానే ఉన్నట్టు కనిపిస్తారు.

పిల్లలు పుస్తకాలకు గిరాకీ రాగానే అందరూ బొమ్మల రామాయణాలు, భారతాలూ ప్రచురించారు. రామాయణ, భారతాలు పిల్లలకు అనవసరమననుగానీ, వాటికన్నా చాలా మంచి బాల సాహిత్యం ఉన్నది. రాసేవాళ్ళూ, వేసేవాళ్ళూ ఉంటే.

## 5) మన చదువుల్లో కథల స్థానం ఏమిటి?

*– ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

మన స్కూళ్ళలో ఒకటీ రెండు తరగతులకైనా రోజూ ఒక పీరియడ్ కథలు చెప్పుకోడానికుంటే ఎంత బావుంటుంది! ఛ్ఛ్! మన పిల్లలు ఆ మాత్రం భాగ్యానికైనా నోచుకోలేకపోతున్నారు. ఈ అవకాశమే ఉంటే బడిలో చేరిన పిల్లలు బడి నుంచి జారిపోకుండా సగం సమస్య పరిష్కారమయ్యేది. 'కథలు చెప్పుకొంటే డ్రాపౌట్ తగ్గుతారా' అని నన్ను చాలా మంది ఎగతాళిగా చూడొచ్చు. ఇంత పెద్ద సమస్యను ఇంత తక్కువగా పరిగణిస్తున్నానని నన్ను ఎద్దేవా చెయ్యొచ్చు. ఇలాంటి సలహా నేనిచ్చినప్పుడు నాపట్ల వెటకారంగా (సానుభూతితోనూ) చూసిన సీనియర్ అధికార్ల నెందరినో నేనెరుగుదును. ఏం చేద్దాం మరి? వారి 'అపార పరిపాలనానుభవం' వాళ్ళనలా తయారు చేసింది! ఒకప్పుడు ఈ అధికార్లూ నాలానే ఎంతో కొంత ఆలోచించి ఉండకపోరు. కానీ పాపం వాళ్ళు సీనియర్లయిపోయాక ఇలా మారిపోయారు!

ఇంతకన్నా ఘోరం ఏమంటే మన ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో కథలకు కాసింత చోటయినా చిక్కడంలేదు. "కథల ప్రాధాన్యం' మీద మొత్తం శిక్షణా కోర్సుల్లో ఎక్కడయినా ఓ పాఠం ఉంటే ఉండొచ్చు. అంతకంటే కొంచెం లోతుకు పోయిన పాపాన ఈ సంస్థలెప్పుడూ పోవు.

నాకో తీరని కల ఉంది. అదేమంటే మన టీచర్లకు కనీసార్హతగా ముప్పై కథలయినా తడుముకోకుండా చెప్పడం ఉండే రోజు ఎప్పుడొస్తుందా అని. మన ప్రాచీన కథల మీద ఈ మాత్రం పట్టు ఉండే టీచర్లుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో గదా అని! 'పట్టు' అంటే గందరగోళపరచకుండా, గజిబిజి చెయ్యకుండా సాఫీగా చెప్పగల్గడం అన్నమాట.

కథలు చెప్పుకోవటం మన సమాజపు సహస్రాబ్దాల సంప్రదాయం, వారసత్వం! ఒకటీ రెండా? వేలాది సాంప్రదాయక కథలు చెవి నుంచి చెవికి, గుండె నుంచి గుండెకు ఎన్ని శతాబ్దాల పాటు ఎక్కిపొయ్యాయో! అంత దూరం నేనాశించడం లేదు గానీ కనీసం ముప్పై కథలు చెప్పగల్గితే మన ఒకటి రెండు తరగతుల పిల్లలు ఎన్నో విలువలు నేర్చుకొంటారు. ఇతర సబ్జక్టులతో పాటు కథలకింత చోటివ్వగల్గితే ఎన్నో విషయాలు పిల్లలకు తెలుస్తాయి. మనం చెప్పే ఇతర పాఠ్యాంశాలు కూడా కావల్సినన్ని తెలుస్తాయి.

### కథలెక్కడ దొరుకుతాయి?

సాంప్రదాయిక కథలంటే ఏమిటి? వీటి ప్రాధాన్యత ఏమిటి? దీన్ని మనం పరిశీలించాలి. ఈ కాలపు కుర్ర టీచర్లను కథలు చెప్పమంటే పిల్లల పత్రికల్ని తిరగేస్తున్నారు. కామిక్స్‌ను, వాస్తవగాథల్ని, చివరికి పెద్ద పెద్ద జోక్స్‌ను సైతం పిల్లలకి కథలుగా చెప్పడానికి పూనుకొంటున్నారు. ఇవన్నీ కథల జాబితాలోనే వస్తాయి? వస్తే రావచ్చు. కానీ మన ఆరేడేళ్ళ పిల్లల్ని ఇవి మన పాత కథలంత ప్రభావితం చేస్తాయా అనేది మాత్రం అనుమానాస్పదం.

మన సాంప్రదాయక కథలకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. ఆ లక్షణాలు ప్రస్తుత పత్రికల్లో వస్తున్న కథల్లో కన్పించడం లేదు. మంచి కథకుండే లక్షణాలేమిటి? వీటిని తర్వాత పరిశీలిద్దాం. దీనికి ముందు ఇలాంటి మంచి కథలెక్కడ దొరుకుతాయో చూద్దాం.

పంచతంత్రం, జాతక కథలు, మహాభారతం, అరేబియన్ నైట్స్, విక్రమాదిత్య కథలు, వివిధ ప్రాంతాల జానపద కథలు మనకు ఎన్ని మంచి కథల్నయినా అందిస్తాయి. ఇదొక పెద్ద భాండాగారం. గులిస్తాన్, బోస్టన్, బీర్బల్, తెనాలి రామలింగడు, జానపదాలు లాంటివి కావల్సినన్ని దొరుకుతాయి. ఒక్క మన దేశానికే గాదు ప్రపంచమంతా మంచి కథలు కోకొల్లలు. 'ఇంత పరిశోధన మాకెక్కడ సాధ్యం' అని మీరనవచ్చు. కథలు చెప్పాలనే అనుకొంటే మంచి కథల్ని ఎన్నుకోవడం, వెతుక్కోవడం చాలా చిన్నపని అని నా అభిప్రాయం.

**మంచి కథ ఎలా ఉంటుంది? :**

ఏది మంచి కథ అని నన్నెవరైనా ప్రశ్నిస్తే పిల్లలు తరతరాల నుంచి దేన్ని అద్భుతంగా ఆస్వాదిస్తున్నారో అదే మంచి కథ అని నేను జవాబిస్తాను. ఇక్కడ న్యాయ నిర్ణేతలు పిల్లలే తప్ప మనం కాదని నా దృఢ విశ్వాసం. మన పంచతంత్రంలోని 'సింహం-కుందేలు' కథనే తీసుకోండి. దీన్ని మనం చాలా సీదాసాదా కథగా భావిస్తాం. కానీ లోతుల్లోకి వెళ్లితే ఇందులోని మంచి కథ లక్షణాల్ని మనం పసిగట్టవచ్చు. ఈ కథలోని మలుపుల్ని ఇప్పుడు కొంచెం పరిశీలిద్దాం.

మన బుజ్జి కుందేలు సింహానికి కవళంగా వెళ్ళాల్సిన దుర్దినం వచ్చింది. తీరిగ్గా కుందేలు సింహం గుహ దగ్గరకెళ్ళేటప్పటికి ఆకలితో సింహం నకనకలాడిపోతోంది. మిన్నూ మన్నూ తెలిసే స్థితిలో లేదది. ఇప్పుడు మన కుందేలు తన అబద్ధాల పురాణాన్ని ప్రారంభించాలి. సింహంతో కనీసం మాట్లాడ్డానికయినా తగిన సందర్భమేనాయిది? ఏ మాత్రం కాదని కథ వినే వాళ్ళందరికీ తెలుసు. అయినా కుందేలు తానెందుకు ఆలస్యంగా రావల్సి వచ్చిందో, దారిలో తనని మరో సింహం ఎలా అడ్డగించిందో ప్రాణాలకు తెగించి చెప్పింది. ఆకలి కంటే కోపం తీవ్రమైందని కుందేలుకు తెలుసు. సరిగ్గా ఆ పాయింటునే అది పట్టుకొంది. పెత్తందార్లకు అహంకారం ఎక్కువ. అది ఏ మాత్రం దెబ్బతిన్నా వాళ్ళు ఓర్చుకోలేరు. అందుకే సింహం ఆకల్ని అవతలబెట్టి శత్రువు సంగతి తేచ్చుకోవాలని కుందేలు వెంట నడిచింది. గుడ్డిగా బావి దగ్గరికి చేరింది.

మళ్ళీ ఇది కుందేలుకు కష్టకాలం (కథలో ఇదో మలుపు). ఇక్కడ కూడా కుందేలు తెలివిగా సింహం తెలివితక్కువ ఆవేశం మీదా, అసూయ మీద ఆధారపడింది. సింహం బావిలోకి చూసి తన బింబాన్ని శత్రుసింహం అనుకొని దూకి దిక్కులేని చావు చచ్చింది.

ఇన్నాళ్ళూ ఇంత ప్రచారం పొందిన ఈ కథను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. ఈ కథా వస్తువేమీ సామాన్యమైంది కాదు. దుర్మార్గమైన అధికార పిశాచం ముందు ప్రాణాల్ని ఉంచి బయటపడ్డం దాదాపు అసాధ్యమైన వేళ కుందేలు లాంటి బడుగు ప్రాణి పాపం ఏం చెయ్యాలి? అనేది ఇక్కడున్న సమస్య. నిజానికిది చాలా పెద్ద విషయం. సాధారణంగా ఇంత పెద్ద విషయాల్ని మనం పిల్లలకు దూరంగా ఉంచాలనుకొంటాం. విచిత్రమేమంటే పిల్లలు ఇంత పెద్ద విషయాన్నే ఇష్టపడతారు! ఎందుకిష్టపడతారు? దాన్ని తర్వాత పరిశీలిద్దాం.

ఇక్కడ మరో అంశం కూడా మనం పరిశీలించాలి. ఒక బక్క ప్రాణి మహా బలవంతుడైన ఒక శత్రువు బారిన పడి కష్టాల్లో చిక్కుకొన్న సందర్భమిది. ఇందులోంచి బయటపడ్డానికి ఈ బక్క జీవి ఒక ఎత్తుగడ వేసింది. ఈ ఎత్తుగడలో ఏ మాత్రం 'నీతి' లేదు. మరో సందర్భంలో ఇలాంటి అబద్ధాలు చెపితే మనం కుందేల్ని టక్కరి కుందేలు కింద లెక్కగడతాం. కానీ ఇక్కడ ఈ బడుగు ప్రాణి అసాధారణమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. అమోఘమైన ధైర్యాన్నీ, ఆత్మ విశ్వాసాన్ని చూపింది. చిట్టచివరి దాకా ఏ మాత్రం తొణక్కుండా నిలబడికార్యం సాధించింది. ఇందుకోసం ఒక పెత్తందారుతో సాధారణ బడుగు వ్యక్తి మాట్లాడినట్టే భయం భయంగా మాట్లాడింది. అనుకొన్న పని నెరవేర్చుకొంది.

ఈ కథ నడకను కూడా మనం పరిశీలించాలి. కథారంభంలో జంతువులు సింహంతో కుదుర్చుకొన్న ఒప్పందం ఫలితంగా ఒక వింత శాంతి నెలకొంటుంది. పైకి కాలం సజావుగా నడుస్తున్నట్లు కన్పించినా ఇది దినదినగండమే. ఉన్నట్టుండి కుందేలు వంతు రావడంతో అసలు కథ తెరమీదికి వచ్చేస్తుంది.

ఇక మన కథ ఒక్క క్షణం కూడా ఆగకుండా చకచకా సాగిపోతుంది. మన కుందేలు ఈ కష్టం నుంచి బయటపడాలంటే ఒక్క నిమిషం వ్యర్థం చేసినా కొంప మునుగుతుంది. అదొక ఎత్తుగడ వేసింది. ఆ ఎత్తుగడేమీ నల్లేరు మీద నడక కాదు. మహా ప్రమాదకరమైంది. అయినా కుందేలు దానికే పూనుకొంది. శ్రోతకిక్కడ గుక్క తిప్పుకొనే వీలుండదు. ఏ మాత్రం తటపటాయింపుకు అవకాశం ఉండదు. అతడిప్పుడు కుందేలు పక్షపాతి. అది ఏం చేసినా అతనికది ఎంతో న్యాయంగా ఉంటుంది! ప్రతిదీ మన శ్రోత కుందేలు వైపు నుంచే ఆలోచించడం మొదలు పెడతాడు!

ఈ కథని పిల్లలెందుకంతగా ఇష్టపడుతున్నారో గుర్తించడానికి ఈ పరిశీలన సరిపోతుందనుకొంటాను. తమను అందులో చూసుకొని మమైకం కాగల ఒక పాత్ర, ఒక హీరో ఈ కథలో వారికి చిక్కింది. అదే కుందేలు. పిల్లల రోజువారీ జీవితంలో కూడా కుందేలు ఎదుర్కొన్న సవాళ్ళ వంటివి ఎన్నో ఎదురవుతుంటాయి.

పిల్లలు చిన్నవాళ్ళు, బలహీనులు, ఎక్కువ సందర్భాల్లో వాళ్ళకిష్టం లేనిదాన్ని వాళ్ళు చెయ్యాల్సివస్తుంటుంది. అధికారం, శారీరకాధిక్యత గల వారి వల్ల వాళ్ళెప్పుడూ కష్టాల పాలవుతుంటారు. భయాందోళనలకు గురవుతుంటారు. కుందేలు ఎదుర్కొనే సవాళ్ళతో పిల్లలెదుర్కొనే సవాళ్ళకెంతో సామ్యం ఉంది. దీన్ని మనం ఎప్పుడూ గుర్తించం. మన పద్ధతిలో మనం అధికారమంతా మన చేతిలోనే పెట్టుకొని వాళ్ళతో నిత్యవ్యవహారాలు జరుపుతుంటాం.

హఠాత్తుగా ఒక బంధువో, మరొకరో చనిపోతే పిల్లల మీద అది ఎంత ప్రభావం కల్గిస్తుందో, వాళ్ళెంత ఆందోళనకు గురవుతారో మనం గుర్తించం. అలాగే వాళ్ళు తమ కంటే శక్తివంతులైన పెద్దలతో పడే ఘర్షణను కూడా మనం గమనించం.

అందువల్లనే కథా ప్రారంభంలోనే పిల్లలు కుందేలులో తమను చూసుకొంటారు. కథ నడిచే కొలదీ కుందేలు వారికి పెద్ద ఆకర్షణగా మారుతుంది. కుందేలు ఒక ఎత్తుగడ పన్నింది. అది ఫలించింది. దీంతో తన సమస్యనేగాదు అందరి సమస్యనూ కుందేలు పరిష్కరించింది. పిల్లలు ఇలాంటి పరిష్కారాన్నే ప్రేమిస్తారు. కుందేలు ఎత్తుగడలో పిల్లలకు నచ్చే మరో అంశం కూడా ఉంది. అదేమంటే ఏదో ఒక సాకు చెప్పి అది తప్పించుకొనజూడ్డం. ఎందుకు ఆలస్యమైంది? అని సింహం అడిగితే కుందేలు చెప్పిన సాకు పిల్లల్ని ఎందుకాకర్షిస్తుందో చెప్పగలరా? ఎందుకేముంది పిల్లలు కూడా ఇలా సాకులు చెప్పి 'కష్టాల్నించి' బయటపడేవాళ్ళే గదా! అందుకని ఈ ఎత్తుగడతో కుందేలు తనను కాపాడుకోవడమే గాదు సింహాన్ని అంతంచేసింది. శత్రువును హతమారిస్తే తప్ప పాపం కుందేలు ప్రమాదం నుంచి బయటపడలేదు. అంటే ఈ కథ మనుగడ కోసం సాహసంతో చేసే విధ్వంసాన్ని నాటకీయంగా మన ముందు పెడుతోంది. ఇందులో ఏమి నీతి ఉంది? మనుగడకోసం చేసే పోరాటం తప్ప ఇందులో ఏ నీతి లేదు. పిల్లల వైపు నుంచి చూస్తే తప్ప నిజానికి కథలో మనం అభినందించదగ్గది ఏదీ లేదు. పెద్దలుగా మనం చూస్తే ఈ కథ నీతిలేని కథ. కుందేలు చేసింది పచ్చి మోసం తప్ప మరేమీ కాదు.

### కథల ప్రయోజనం ఏమిటి? :

అంటే పిల్లలకు చెప్పడానికి ఎన్నుకొనే మంచి కథల్లో నీతి తప్పనిసరి కాదన్నమాట! అయితే 'సింహం - కుందేలు' కథలో ప్రత్యక్ష నీతి గాకపోయినా పరోక్షనీతి లేకపోలేదు. పిల్లల్ని భావోద్రేకానికి గురిచేసే అంశం ఇందులో ఒకటి ఉంది. ఒక ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఎంత నిబ్బరంగా నిదానంగా ఉండాలో అది చెపుతుంది. సరైన ఆలోచన చురుకుదనం అప్పుడే సాధ్యమని కూడా ఈ కథ చెపుతుంది.

కానీ సాంప్రదాయకార్థంలో ఇలాంటి పరోక్ష నీతిని కథా నీతిగా లెక్కించలేం. నీతి స్పష్టంగా ఉండాలి గానీ ఏదో డొంక తిరుగుడుగా వెతికి వెతికి చూస్తే తప్ప కనబడకుండేదిగా ఉండకూడదు.

ఈ చర్చా సారాంశం ఏమిటి? పిల్లల్లో నైతిక విలువల్ని పెంచడం మన సాంప్రదాయక కథల ప్రధానోద్దేశం కాదు. కథలు చెప్పడం వల్ల వచ్చే అసలైన లాభాలు వేరే ఉన్నాయి. ఇప్పుడు వాటిని చూద్దాం.

### మంచి శ్రవణం :

మంచి శ్రోత అంటే ఎవరు? చివరి దాకా వినేవాడే మంచి శ్రోత. కానీ చాలా మంది చివరిదాకా వినరు. మనం పిచ్చాపాటీ మాట్లాడేటప్పుడు కూడా చాలామంది మధ్యలోనే అడ్డం వస్తుంటారు. మనం చెప్పబొయ్యేది ముందే తెలిసి

వాళ్ళిలా చేస్తే కొంత అర్థం చేసుకోవచ్చు కానీ అసలు వీళ్ళకి అంతదూరం వినడానికే ఓపిక ఉండదు. పెద్ద పెద్ద మేనేజిమెంటు, పరిపాలనా కోర్సుల్లో సైతం ఈ రోజుల్లో ఓపిగ్గా వినడాన్ని ఓ నైపుణ్యంగానే గాక ఓ మంచి లక్షణంగా కూడా పరిగణిస్తున్నారు. కథలు చెప్పడం చాలా చిన్న వయస్సు నుంచే ఇలా జాగ్రత్తగా ఓపిగ్గా వినే లక్షణాన్ని పెంపొందిస్తుంది. పెద్దయ్యాక ఇది ఎంతో ఉపయోగపడుతుంది. కథలు చెప్పడం, వినడం ఒక మహత్తర సంప్రదాయంగా గల మన దేశంలో ఎదుటి వాడిని ఓపిగ్గా వినేవాళ్ళ సంఖ్య ఈ రోజుల్లో తగ్గిపోవడం చాలా విచిత్రంగా అన్పించవచ్చు. కానిది వాస్తవం. చిన్న వయస్సులో పిల్లలకు కథలు చెప్పకపోవడం దీనికొక ప్రధాన కారణమని నా అభిప్రాయం. నాగరికత పెరిగాక పిల్లలకు కథలు చెప్పడానికి మనకు తీరిక చిక్కడంలేదు. దీని ఫలితం మనల్ని ఈ దుస్థితికి తెచ్చింది.

**ఊహించడం, తర్కించడం :**

తమకు నచ్చిన కథను పిల్లలు మళ్ళీ మళ్ళీ వినాలనుకొంటారు. తమకు తెలియకుండా ఇలాంటి కథల పట్ల వాళ్ళు మక్కువ పెంచుకొంటారు. రెండోసారో మూడోసారో కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందో ముందే వాళ్ళు చెప్పగల్గుతారు. ఇలా జరగబొయ్యేది ముందుగా చెప్పగల్గడం ఒక సామర్థ్యం. మళ్ళీ మళ్ళీ ఒకే కథ వినడంవల్ల ఇలాంటి సామర్థ్యం పెరుగుతుంది. వాళ్ళ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వాళ్ళ సర్వతోముఖాభివృద్ధికిది దోహదపడుతుంది. మొదటి రెండు తరగతుల పిల్లలు చదవడం నేర్చుకొనేదశలో ఈ 'ముందుగా చెప్పగల్గడం' అనే సామర్థ్యం ఎంతైనా ఉపయోగపడుతుంది.

గణితం నేర్చుకోవడంలో కూడా ఈ సామర్థ్యం విలువ ఎనలేనిది. గణిత సూత్రాలన్నీ 'ముందుగా ఊహించి చెప్పగల్గడం' మీదనే కదా ఆధారపడతాయి. అందువల్ల గణిత అభ్యసనానికీ ఈ కథా శ్రవణ సామర్థ్యానికి మధ్య ఓ సామ్యం, సంబంధం ఉందని నా అభిప్రాయం. కథకు కూడా కొన్ని నిబంధనలు, పద్ధతులు ఉంటాయి. వాటిని పిల్లలు కథలు వినేకొద్దీ పట్టుకొంటారు. ఇలా పట్టుకొనే కొద్దీ వాళ్ళు ముందుగా ఏం జరగబొయ్యేదీ ఊహించి మరింత బాగా చెప్పగల్గుతారు. అలాంటి పిల్లలు గణిత సూత్రాల్ని కూడా ఇంతే బాగా పట్టుకోగలుగుతారు.

**మరో ప్రపంచం :**

పిల్లలు తమ చుట్టూ చూస్తున్న ప్రపంచాన్ని కథలు విస్తృతపరుస్తాయి. తాము ఎప్పుడూ పాల్గొనని సందర్భాలను, చూడని మనుషులను, పాత్రలను వాళ్ళు కథల్లో చూస్తారు. ఇలాంటి వాటితో మనకేం పని అని మీరనుకోవచ్చు. కానీ ఇవి కూడా మన జీవితంలో భాగాలు! వాటిని ఎప్పుడూ మనం చూడకున్నా అవి మనల్ని, మన ఆలోచనల్ని కదిలిస్తాయి. చిన్న వయస్సులో ఈ కదలిక మరింత ఎక్కువగా ఉంటుంది. జీవితాంతం ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుంది. తమ చుట్టూ ఒక్క చెడ్డమనిషి కూడా లేకున్నా పిల్లలు చెడ్డవాళ్ళను గురించి ఆలోచిస్తారు. అలాగే అసాధారణ ప్రతిభావంతుల్నీ, బుద్ధిమంతుల్నీ, అందగాళ్ళనూ కలుసుకొనే ఛాన్సు తమకెప్పుడైనా దక్కకపోతుందా అని ఆరాటపడతారు. ఆదర్శమూర్తుల్ని అభిమానించడం పిల్లల మనస్తత్వంలో ఒక భాగం. అలాగే ప్రమాదాలన్నా దుష్టశక్తులన్నా భయపడ్డం కూడా వాళ్ళ స్వభావంలో భాగం. మన సాంప్రదాయక కథలు పిల్లల ఈ మనస్తత్వాన్ని కనుగుణంగా ఉండటం వల్లనే ఇంత కాలం పిల్లల్నిలా ఆకర్షింపగల్గుతున్నాయి. అక్షర ప్రపంచంలోకి ఇంకా అడుగు పెట్టని బిడ్డ ఓ అమ్మమ్మ కథలో అద్భుతమైన మరో ప్రపంచాన్ని చూస్తుంది. అది తన వాస్తవ ప్రపంచం కంటే ఎంతో విస్తృతంగా ఉంటుంది. పిల్లలకు కథల్లో కన్పించే ఈ మరో ప్రపంచం గజిబిజిగా గందరగోళంగా ఉండదు. అందులో ఓ క్రమబద్ధత ఉంటుంది. ఆ క్రమబద్ధతలోనే కొన్ని నైతిక విలువలుంటాయి. కానీ ఆ విలువలు మనం నమ్మే సాంప్రదాయకార్థంలో ఉండవు. ఆ కథల్లో వంచితుడే గెలుస్తాడు. అయితే ఇలా గెలవడానికి వాడు కొన్ని పద్ధతులు పాటిస్తాడు. అవి అనైతికమైనవిగా మనకు సాంప్రదాయకార్థంలో కన్పించవచ్చు. ఆకలితో నకనకలాడే సింహానికి కుందేలు చెప్పిన అబద్ధాలు ఇలాంటివే.

**నూతన పదజాలం :**

కథలు చెప్పడం పిల్లల భాషా ప్రపంచాన్ని ఎలా విస్తృతం చేస్తుందో కూడా మనం చూడొచ్చు. మాటలు పూర్తిగా వ్యక్తిగత ఆస్తి, ఆ మాటలతో ప్రపంచానికి మనం పేర్లు పెట్టే తీరు కూడా వ్యక్తిగతమైనదే. కానీ ఇదే పదజాలం సామాజిక ఆస్తి కూడా. ఎందుకంటే మన అనుభవాల్ని ఇతరులతో పంచుకోవడానికి ఈ మాటలే ఆధారం. పదాలకున్న ఈ వ్యక్తిగత, సామాజిక లక్షణాలే పదాల అర్థాల్ని నిర్ధారిస్తాయి. ఉదాహరణకు పిల్లవాడికి 'ఆకలి' అంటే ఏమిటో అనుభవం నుంచి తెలుసు. దీన్నుంచే సింహం 'ఆకలి'తో ఉన్నప్పుడు ఎలా ఉండి ఉంటుందో పిల్లవాడు గ్రహించగలడు. ఇలా 'ఆకలి' అనే తనకు తెలిసిన పదం సింహానికి కూడా వర్తింప చేసుకునేలా ఈ కథ శ్రోతకు సహకరిస్తుంది. మరికొన్ని కథలు వినేకొలదీ మరికొన్ని పదాల సామాజికార్థాలు పిల్లలకు తెలుస్తాయి. తన స్వంత పదజాలాన్ని ఇతరులకు వర్తింపజేసుకొనే క్రమం వేగిరమవుతుంది. తర్వాత 'చదవడం'లోకి వెళ్ళే పిల్లలకు ఇది చాలా ఉపకరిస్తుంది.

పైన మనం చెప్పుకొన్న నాలుగు కథాప్రయోజనాల్లోని అంశాలు చదవడానిక్కూడా వర్తిస్తాయి. పిల్లలు చదివేకొలదీ భాషాసూత్రాలను, నిర్మాణాన్ని అర్థం చేసుకోగల్గుతారు. ముందుగా ఊహించి చెప్పగల్గడం పెరిగే కొలదీ చదవడంలో సామర్థ్యం పెరుగుతుంది. భాషా నిర్మాణంలో సూత్రాలతో పరిచయం పెరిగే కొద్దీ వాక్యంలో తర్వాత ఏమీ వచ్చేదీ పిల్లలు గ్రహిస్తారు. ఇలా చూస్తే కథలు చెప్పడం పిల్లల భాషా జ్ఞానాన్ని పెంచడానికి అమోఘంగా ఉపకరిస్తుంది!

**కథా నైపుణ్యం :**

కథలు చెప్పాలనుకొన్నప్పుడు మనకా కథ బాగా మనసుకు పట్టి ఉండాలి. అందులో తడబాటు ఏమీ ఉండకూడదు. తడబడితే మధ్యలో అతుకు కన్పిస్తే కథను ఖూనీ చేసినట్టే లెక్క. బాగా మనసుకు పట్టిన కథ అయితే మనం సాఫీగా చెప్పగలం. అలా చెప్పగల్గినప్పుడే కథ చెప్పేవాడికీ, వినేవారికీ మధ్య ఒక సజీవ సంబంధం ఉంటుంది.

అలాగే కథ బాగా మన మనసుకు పట్టి ఉంటే ఆ కథకు సంబంధించిన ఒక స్కెచ్ మన మనస్సులో ఉంటుంది. అప్పుడు శ్రోతల పరిస్థితిని బట్టి మనం ఇష్టం వచ్చినట్లు దాన్ని మార్చుకోగలం. ఒక్కోసారి కథను పెంచాల్సి వస్తుంది. ఒక్కోసారి తగ్గించాల్సి వస్తుంది. కుందేలు సింహం ముందు నిలబడ్డప్పుడు కథను మనం సాగదియ్యలేం. అక్కడే వేగంగా కథ నడవాలి. సింహం ఆకలితో నకనకలాడుతూ ఆలోచిస్తున్నప్పుడు కథను మనం నెమ్మదిగా చెప్పొచ్చు. అలాగే కుందేలు భయం భయంగా తన ఎత్తుగడను నెమరేసుకొంటూ అడవిలోంచి వస్తున్నప్పుడు కథను అంత వేగంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇదంతా మనకు కథ మీద ఉన్న పట్టునుబట్టి ఉంటుంది.

ఇక కథలోని సంభాషణల సంగతేమిటి? వాటినెలా చెప్పాలి అనే ప్రశ్నలున్నాయి. దీనికి మనం పలు మార్గాల్ని రెండు రకాల స్వరాలతో పలకొచ్చు. హావభావాల్ని ప్రదర్శిస్తూ చెప్పొచ్చు. చిన్నసైజు తోలుబొమ్మల్ని ఆడిస్తూ చెప్పడం వల్ల సంభాషణలు చాలా రక్తికడతాయి. ఒక్కో పాత్రను గురించి చెపుతున్నప్పుడు తరగతి గదికి ఈవైపు నుంచి ఆవైపునకు పచార్లు చేస్తూ చెప్పొచ్చు. ఇలా ఎన్నో సృజనాత్మక పద్ధతుల్ని పాటించవచ్చు. ఇవన్నీ పిల్లలకు చాలా ఉత్తేజాన్నిస్తాయి. ఒకే కథను ప్రతి సంవత్సరం చెప్పాల్సిరావచ్చు. ఒకే కథను ఒకే సంవత్సరంలో పలుసార్లు చెప్పాల్సి రావచ్చు. దీనికి తగ్గట్టుగా మనం తయారుకావాలి. ఒక కళగా కథాకథనాన్ని అధ్యయనం చెయ్యాలి. అలవరచుకోవాలి. ఇది ప్రతి టీచరుకూ ఒక తప్పనిసరి సవాలు.

కథలు చెప్పడం తన జీవితంలో విడదీయరాని భాగమైతే ఏ టీచరు జీవితమూ నిస్సారంగా ఉండదని నా గట్టి నమ్మకం. ఇది జరగాలంటే ప్రాథమిక పాఠశాలల పాఠ్యాంశాల పట్ల మన దృక్పథంలో కూడా తీవ్రమైన మార్పు రావాలని నా దృఢ విశ్వాసం.

## 6) పిల్లలూ - పుస్తక ప్రపంచం

*- కీర్తి జయరాం, ఢిల్లీ*

నాలుగైదేళ్ళ పిల్లల్లో వస్తున్న మార్పును మీరు జాగ్రత్తగా గమనించండి. ఈ మార్పు ఇంటి వాతావరణం నుంచి బడి వాతావరణంలోకి అడుగుపెట్టడమే గదా అని మీరనవచ్చు. కానీ ఈ మార్పులో అంతర్లీనంగా ఓ అంశం దాగి ఉంది. అదేమంటే ఈ వయస్సులోనే పిల్లలు తమ అభిప్రాయాల్ని, ఆసక్తుల్ని మౌఖిక పద్ధతి నుండి అక్షర పద్ధతిలో అభివ్యక్తీకరించడం ప్రారంభిస్తారు. బడికే రానిది అక్షరాలెక్కడివి? అక్షర పద్ధతిలో అభివ్యక్తీకరణ ఎక్కడిది అని మీరనవచ్చు..

### అక్షర ప్రపంచంలోకి తొలి అడుగు :

ఈ అంశం మీద చాలా పరిశోధనలు ఇటీవల జరిగాయి. భాషాతత్వవేత్తలు, మనస్తత్వవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేశారు. మాటల్లోంచి రాతల్లోకి మారే ఈ పరిణామక్రమాన్ని మనం పిల్లలు చేసుకొనే ఆటవస్తువుల్లో, వేసుకొనే బొమ్మల్లో, గీసుకొనే పిచ్చిరాతల్లో, ఏర్పరుచుకొనే గుర్తుల్లో, అమూర్తసంకేతాల్లో మనం గమనించవచ్చు.

పెద్దల్లాగా వ్యవహరించాలని పిల్లలకు అంతులేని ఉబలాటం ఉంటుంది. ఇందుకోసం పిల్లలు పై పద్ధతుల్ని కనిపెడతారు. కొత్త సమాచార వ్యవస్థను రూపొందించుకొంటారు. అక్షర ప్రపంచంలోకి ఇలానే వాళ్ళు అడుగిడతారని మనం గుర్తుంచుకోవాలి.

ఆటల్లో పిల్లలకు ఓ చిన్న పెట్టె ఇల్లుగా మారిపోతుంది. ఓ కర్రపుల్ల గుర్రం అయిపోతుంది. మట్టిలో చిన్నపుల్లతో వాళ్ళు రాసే గీతల్లో ఎక్కడెక్కడి ఊహలూ సాక్షాత్కరిస్తాయి. పెద్దలు చేసే పనులన్నీ వీళ్ళిలా చేస్తుంటారు. మనం కొంచెం జాగ్రత్తగా గమనిస్తే మనం చేసే చేష్టలన్నీ పిల్లలు కొత్త రూపాల్లో చేస్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది.

ఈ సంకేతాల్ని పిల్లలు ఎక్కడి నుంచి సంపాదించుకొంటారు? తమ వాతావరణం నుంచే సంపాదించుకొంటారు. మరి పల్లెటూరి పిల్లల వాతావరణం, పరిసరాలు వేరు. పట్టణ విద్యాధిక కుటుంబాల్లోని పిల్లల పరిసరాలు వేరు. సహజంగానే అక్షరాలు, చిత్రాలు, బొమ్మలు, దృశ్యాలు, గ్రామీణ పిల్లలకు అందుబాటులో ఉండవు. పుస్తకాలు వారికి దొరకవు. మౌఖికంగా అందే పాటలు. కథలు, జోకులు, వినోదాంశాలు కూడా ధనికుల పిల్లల కందుబాటులో వున్నట్టు పేదపిల్లల కందుబాటులో వుండవు. టి.వి.లో, అగ్గిపెట్టెల మీద, వస్తువుల ప్యాకెట్ల మీద కన్పించే అక్షరాలే వీళ్ళకి అక్షర ప్రపంచం! ఇక తమ తల్లిదండ్రులు కాగితాలతో, కలంతో పనిచెయ్యడం వీళ్ళ ఊహక్కూడా అందని విషయం, కనీసం క్యాలెండర్లు, ఫోటోలు, దృశ్యాలక్కూడా అవకాశం ఉండదు. బడిలో అడుగు పెట్టినప్పుడు మాత్రమే వాళ్ళవన్నీ చూస్తారు. బడిలో వున్నంతసేపు మాత్రమే వాళ్ళకీ అవకాశం ఉంటుంది.

### మన పద్ధతి - మన వాచకాలు :

ఇక పిల్లలు చదవడం, రాయడం ఎలా నేర్చుకొంటారో చూద్దాం. అక్షరాంటే ధ్వనుల సంకేత రూపాలు. అక్షర రూపానికీ ధ్వనికీ సంబంధం ఏమీ ఉండదు. ధ్వనులను పేర్చి పదాలు, పదాల్ని కూర్చి వాక్యాలు రూపొందించాలి. ఇదొక సంక్లిష్ట ప్రక్రియ. అయితే వాస్తవానికి వినడం, మాట్లాడడం కూడా ఇలాంటి ప్రక్రియే. వేల ధ్వనులుంటాయి. వేల పదాలుంటాయి. వస్తువుకీ పదాలకీ మధ్య సంబంధం ఏమీ ఉండదు. ఇక వాక్య నిర్మాణం సరేసరి. అయినా పిల్లలు అద్భుతంగా చెప్పింది అర్థంచేసుకొంటున్నారు. మాట్లాడుతున్నారు. ఇదెలా జరుగుతోంది?

భయం, జంకూ లేకుండా మాట్లాడనిచ్చినందువల్లే పిల్లలు మాటలు నేర్చుకొంటున్నారు. రాయడం కూడా అంతే! ఇష్టం వచ్చినవి - అవి అనుభవాలు కావచ్చు, ఊహలు కావచ్చు, పిచ్చిపిచ్చివి కావచ్చు. వాగడానికి వీలుండబట్టే పిల్లలు మాటకార్లుగా మారుతున్నారు. రాతలోనూ అంతే. అసలు పిల్లలకో లోకం ఉంటుంది. ఆ లోకాన్ని వ్యక్తీకరించుకొనే రూపంలోనే భాష వారికి పట్టుబడుతుంది. భాషలోని ఏ నైపుణ్యమైనా ఇలానే వంటబడుతుంది.

ఇప్పుడు మన స్కూళ్ళ దగ్గరకొద్దాం. అక్షరాలతో మనం ప్రారంభిస్తాం. ఈ అక్షరాలు కేవలం అమూర్త సంకేతాలు, ఆ అక్షరాలు కూడా ఒక క్రమంలోనే ఉంటాయి. ఆ క్రమంవల్ల పిల్లలకి వొరిగేదేమిటో ఎవ్వరికీ తెలియదు. పిల్లలక్కావల్సింది తమ ఆసక్తుల్ని వ్యక్తీకరించడం తప్ప అక్షరమాలలోని హ్రస్వదీర్ఘాల్ని, పరుష సరళాల్ని గుర్తించడం కాదు. వ్యాకరణ పాండిత్యం కాదు. దీన్ని మనం మరచిపోతాం.

అక్కడితో ఆగదు. ఈ అక్షరాలన్నిటినీ గుర్తుంచుకోవాలి. ఎప్పుడో ఏడాది తర్వాత వాడుకోవాలి (పదాలుగా!) ఇక అక్షరాల్ని వాడుకోవడంలో మనం పెట్టే ఆంక్షలు కోకొల్లలు. మూసపోసినట్టు పిల్లలందరూ ఒకే పదాలు వల్లించాలి. ఒకే వాక్యాలు చదవాలి. ఈ పదాలకీ పిల్లల అవసరాలకీ సంబంధం ఉండదు. వీళ్ళ లోకంతో అసలే సంబంధం ఉండదు. అంతా మనం బిగించిన చట్రంలోనే జరగాలి.

అక్షరమాలను దిద్దించే పద్ధతి ఎంత వికృతమైందో మన వాచకాలు కూడా అంతే వికృతంగా ఉంటాయి. వాచక నిర్మాణం ధ్వనుల క్రమాన్ని పరిచయం చెయ్యడంతో ముడిపడి వుండటం ఒక వికారమైతే అపరిచిత, అర్థరహిత, కృత్రిమ పదాలూ, వాక్యాలూ మరో వికారం. 'తమది' అని ఆనందించే అంశం వీటిలో పిల్లలకి ఒక్కటీ ఉండదు.

ఇవన్నీ చాలక తప్పులెక్కడా దొర్లకూడదని మనం గొంతు మీద కత్తి పెడతాం. కొత్త విషయాల్లోకి పోతే తప్పులొస్తాయి. అందువల్ల వాచకం వేదమవుతుంది. కంఠస్తం పరమార్థమవుతుంది. ఇక్కడితో పిల్లల ఊహలు ఖతం. ఆసక్తులు ఖతం. ఆలోచనలు ఖతం. అత్యున్నత వర్గాల స్కూల్లోనైనా, మామూలు ప్రభుత్వ స్కూల్లోనైనా సారాంశం మాత్రం ఇదే.

**పుస్తకాలూ - పిల్లలూ :**

పిల్లలు అక్షర ప్రపంచంలోకి ఎలా అడుగిడతారో మనం మొదట చూశాం. దీనికి కొనసాగింపుగా మన పాఠశాలల్లో ఏమైనా చెయ్యగలమా? పేదపిల్లలు ఇంట్లో అక్షర ప్రపంచానికి దూరమెలా అవుతారో మనం చూశాం. దీనికి పరిష్కారం మనం బడిలో ఏమైనా చూపగలమా? ప్రాథమిక స్థాయిలో అక్షరలోకంలోకి అడుగిడే మన పిల్లలకు పుస్తకాలు ఏమైనా సాధించిపెడతాయా అనేది ఇప్పుడు చూద్దాం. ఇందుకోసం నా అనుభవాలు కొన్ని చెపుతాను.

1990 ప్రారంభంలో ఎస్.సి.ఇ.ఆర్.టి. ఢిల్లీలో ఒక ప్రాజెక్టును ప్రారంభించింది. ఇది 12 మున్సిపల్ స్కూళ్ళలో అమలు జరిగింది. మూడవ తరగతి స్థాయిలో ఎక్కువమంది పిల్లలు బడి మానేస్తున్నారని గుర్తించి ఈ ప్రాజెక్టు చేపట్టారు. 3వ తరగతి పిల్లల్ని కొందర్ని గుర్తించారు. వీరికి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా 1,2 తరగతుల పిల్లల్ని నూతన పద్ధతిలో అక్షర ప్రపంచంలోకి అడుగిడేలా చెయ్యడం దీని లక్ష్యం.

ఈ ప్రాజెక్టులోకి ప్రవేశించగానే 1,2 తరగతుల పిల్లలకు వాచకాలు తప్ప ఎలాంటి పుస్తకాలు అందుబాటులో లేవని మాకు తేలిపోయింది. దాదాపు పిల్లలందరూ చదవాలన్నా, రాయాలన్నా సతమతమవుతున్నారు. వాచకాల్లోని వాక్యాల్ని కొంచెం తారుమారు చేస్తేచాలు వాళ్ళు చదవలేకపోతున్నారు. వాళ్ళర్థవంతంగా ఏమీ చదవడంలేదని, కేవలం వల్లిస్తున్నారని

మాకర్థమైపోయింది. అదే సమయంలో ఈ పిల్లలకి చదవాలనే తృష్ణ విపరీతంగా వుండటం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది.

మొదట మేం కథలు చెప్పడంతో మొదలెట్టాం. తెలిసిన కథలు, కొత్త కథలు లెక్కలేనన్ని పిల్లల ప్రపంచంలో పుట్టుకొచ్చాయి. ఆ తర్వాత కథను మధ్యలో ఆపేసి తర్వాత ఏం జరిగిందో చెప్పమన్నాం. ఒక్కొక్కరు ఒక్కోలా ముగించారు. తాము స్వతంగా కథలు అల్లినట్టు పిల్లలు ముచ్చటపడ్డారు. వాచకాల్ని వదిలేసి ఆ తర్వాత కథలు పెద్దగా చదివి విన్పించసాగాం. పిల్లలు స్వేచ్ఛగా ఆరుబయట ఎవరిష్టం వచ్చినట్టు వారు కూర్చునే వారు. కథలు వినేవారు. చిన్నపిల్లలు కోసం పెద్ద పిల్లలు పుస్తకాలు సేకరించారు. ఆదివారం దినపత్రికలు పట్టుకొచ్చారు. పిల్లలు వీటిలోని బొమ్మల్ని చూసేవారు. తమలో తాము మాట్లాడుకొనేవారు. విచిత్రం ఏమంటే మనం చాలా చిన్నవని, పనికిరానివనీ అనుకొన్నవి కూడా పిల్లల్లో మహా ఉత్సాహం కలిగించేవి. పిట్టలు, పురుగులు, జంతువులు, ఆకులు, పూలు కూడా వాళ్ళతో గుసగుసలాడేవి. ఇలా పుస్తకాల్ని 'చదవడం' పిల్లలు మొదలెట్టారు. ఈ 'చదవడం' విచిత్రంగా ఉండేది. ఓ సింహం బొమ్మ ఉందనుకోండి. 'నేను కూడా అడవికి వెళ్ళా, పెద్ద సింహాన్ని గుహలో చూశా' అని ఓ పిల్లతన ఉత్తుత్తి 'అనుభవాన్ని' దీనికి జోడించేది. ఓ పువ్వు కన్పిస్తే చాలు' ఇలాంటి పూలు మా ఊళ్ళో బోలెడు పూస్తాయి' అని మరో పిల్ల అనేది. అంటే పిల్లలీ బొమ్మలతో, కథలతో మమేకమై వాటిని స్వంతం చేసుకొనేవారు. ఆ స్కూళ్ళ టీచర్లు మొదట దీన్ని అర్థం చేసుకోలేక పోయారు. వాళ్ళ దృష్టిలో పలకలమీద రాయడమే అక్షరాలు నేర్చుకోవడం. ఇదంతా దండగమారి పని అనీ, వాళ్ళ సమయం వృథా అవుతోందనీ వాళ్ళ అభిప్రాయం. కానీ తర్వాత భాష నేర్చుకోవడంలో దీని ప్రాధాన్యత గుర్తించి వాళ్ళు కూడా క్లాసులో కథలు మొదలెట్టారు.

దీన్ని మేం మరికొంత విస్తృతం చేశాం. అక్షరాలతో, పదాలతో ఆటలాడ్డం, అంత్యానుప్రాసలు, స్వంతవాక్యాలు చెప్పడం నుంచి నచ్చిన పదాల్ని చూసి రాయడం దాకా దీనికి జోడించాం. పిల్లలకు అక్షరాలు, పదాలు, వాక్యాలు ఇలా పరిచయమయ్యాయి. అక్షరాల రూపాలతో పాటు కొన్ని అక్షరాలు ఎడమ నుంచి కుడికి వరుసగా పేరిస్తే పదాలుగా, పదాల్ని పేరిస్తే వాక్యాలుగా మారతాయనే సంగతీ వాళ్ళు పసిగట్టారు. వాళ్ళు బొమ్మలేసేటపుడు, పిచ్చిరాతలు కూడా వాక్యాల్లో వరుసగా వుండేవి. కొందరైతే పదాల్ని రాసేవారు. బొమ్మలకు పేర్లు పెట్టేవారు. బొమ్మలేసి అది చేస్తున్న పనిని చింకిరిబింకిరిగా రాసేవారు.

అన్నిటికంటే విశేషం గంటల తరబడి పిల్లలీ పుస్తకాలతో గడపడం. వాటిని తిప్పుతూ బొమ్మల్ని వేళ్ళు పెట్టి చూస్తూ, చేతులతో తడుముతూ, ముద్దు పెట్టుకొంటూ వాళ్ళు ఏమోమో చేసేవారు. వాళ్ళకి చాలామందికి చదవడం ఏమీరాదు. అయినా చదువుతున్నట్టే తల పుస్తకంలో పెట్టి ఏమేమో మాట్లాడేవారు. వాటి మీద రాసేవారు. కాపీ చేసేవారు. ప్రతి దానికీ తమ జీవితాన్ని, అనుభవాన్ని జోడించేవారు. స్వేచ్ఛగా వదిలినందువల్లనే ఇది సాధ్యమైంది. 'ఇలాకాదు ఇలా చెప్పాలి' అని ప్రతిసారీ తప్పులు వెతకడం లేనందువల్లే ఇది వీలైంది.

**ఒక్కో మెట్టు పైపైకి :**

ఈ ఉత్సాహం మాకు మరింత పనిపెట్టింది. మేం మరిన్ని సేకరించాల్సి వచ్చింది. సేకరించాం. చార్టులు, బొమ్మలు గోడకు వేలాడదీశాం. పిల్లల రాతల్ని కూడా గోడకు తగిలించాం. వాళ్ళ బొమ్మల్ని ప్రదర్శించసాగాం. ఇవన్నీ పిల్లలు చూడ్డానికి (చదవడానికి) అందుబాట్లో ఉండేంత ఎత్తులో ఉంచాం. ఇలా మాకూ కొత్త కొత్త ఆలోచనలు రాసాగాయి. గోడమీద రకరకాల సంజ్ఞలు రాయడం ఈ ఆలోచనల్లో ఒకటి. ఈ సంజ్ఞలు ఒక్క వాక్యంలో ఉంటాయి. ఉదాహరణకి

' మీచేతులు పైకెత్తండి', 'ఆడుకొందాంరండి', 'అదిగో ఆ చెట్టును తాకి పరిగెత్తిరండి' ఇలాంటి సంజ్ఞలన్నమాట. వీటిని పిల్లలు చదివి అలా చేసేవారు. చూస్తుండగానే ఇదొక ఆటలా మారిపోయ్యింది. పెద్ద పిల్లల్ని ఈ సంజ్ఞలు రాయమనేవాళ్ళం. వాళ్ళు పోటీ పడేవాళ్ళు. అలాగే ఆసక్తి కలిగించే శీర్షికలున్న బొమ్మల్ని తగిలించేవాళ్ళం. పుస్తకాల పేర్లు బోర్డు మీద రాసి ఆ పుస్తకాల్ని గుర్తించమనేవాళ్ళం. పొడుపు కథలు రాసేవాళ్ళం. ఇలా పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు మాస్టార్లయి పొయ్యారు!

దీన్ని ఇంకో మెట్టు ఎక్కించడానికి మరో ఆలోచన చేశాం. పిల్లల అనుభవాల్ని రన్నింగు బోర్డు మీద రాయించాం. మొదటి దశలో ఇవి చిన్న చిన్న ఆలోచనలే కావచ్చు. "నేనీరోజు ఒక పిట్టను చూశా', 'నిన్న మా ఇంటికి ఒక కుక్క వచ్చింది.' నా పుస్తకం చినిగిపొయ్యింది. నాకు ఏడుపొచ్చింది.' ఇలాంటి అనుభవాలన్నమాట. ఇలా రాయడంలో పిల్లలు చాలా తప్పులు రాసేవాళ్ళు. మాక్కావల్సింది ఆలోచనలేగాని వ్యాకరణం కాదుగా, ఇష్టారాజ్యంగా రాయమనేవాళ్ళం. పిల్లలు ఈ రాతలు చుట్టూ మూగేవాళ్ళు. చదివేవాళ్ళు. చర్చించుకొనేవాళ్ళు. చదవలేనివాళ్ళు చదవగలవాళ్ళ దగ్గర చెప్పించుకొనేవాళ్ళు. అక్షరాల్ని మెల్లమెల్లగా గుర్తించేవాళ్ళు.

ఇంకో తమాషా పని ఏమంటే చిన్న పిల్లల అనుభవాల్ని పెద్ద పిల్లలు రాయడం, చిన్న పిల్లలు ఏవేవో చెప్పేవాళ్ళు. పెద్ద వాక్యాలుగా, పిచ్చి పిచ్చి వాక్యాలుగా అవి ఉండేవి. వాటిని అలానే రాయమనేవాళ్ళం. వాటిని మళ్ళీ చదివి వాళ్ళకి విన్పించేవాళ్ళం. వాటిని గోడకు వేలాడతీసేవాళ్ళం. ఆ తర్వాత చిన్న పిల్లలు కూడా రాయసాగారు. అలా రాయడానికి వాళ్ళకంత భాషరాదుగదా అందుకోసం ఒక బొమ్మ వెయ్యమనేవాళ్ళం. ఆ బొమ్మకింద ఏదో ఒకటి రాయమనేవాళ్ళం లేదా పెద్ద పిల్లల చేత రాయించేవాళ్ళం. అయితే ఒక జాగ్రత్త తప్పకుండా తీసుకొనేవాళ్ళం. అదేమంటే ఏం రాసినా పిల్లల భాషలోనే ఉండాలి.

ఈ అనుభవాన్ని నేను మాటల్లో చెప్పలేను. పిల్లలు ఎంత ఆనందిస్తారో! ఎంత ఉబలాటపడతారో! కానీ మనం గమనిస్తే ఇందులో చదవడం, రాయడం నేర్చుకోవడంలోని ప్రాథమిక దశ ఉంది. అచ్చం ఇది వినడం, మాట్లాడ్డం నేర్చుకొనే దశలాంటిది.

## సంచీలో పుస్తకాలు :

కొంతకాలం నేనూ, మా పిల్లలు కలిసి ఒక గ్రామంలో ఒక గ్రంథాలయం నడిపాం. గ్రంథాలయం అంటే ఏమిటో అనుకొనేరు. ఒక సంచిలో పుస్తకాలు ... అంతే! వీటిని ప్రతి శుక్రవారం బడికి తీసుకెళ్ళేవాళ్ళం. ప్రశ్నలు వేసేవాళ్ళం. పిల్లలచేత ఆ కథల్ని పలురకాల ముగింపులతో తిరగచెప్పించేవాళ్ళం. కొంతకాలం తర్వాత పుస్తకాలు ఇంటికిచ్చి మళ్ళీ శుక్రవారం తీసుకొనేవాళ్ళం. ఎనభైశాతం పిల్లలు పుస్తకాలు ఏమాత్రం చించకుండా తెచ్చేవాళ్ళు. పుస్తకాలతో పాటు ఆటలు, పాటలు, పొడుపుకథలు, అక్షరాలతో క్రీడలు, స్వీయ కథనాలు, బొమ్మలు వెయ్యడాలు, కథలు రాయడాలు, పాటలు రాయడాలు కూడా చేశాం. ఇదంతా పెద్ద హంగామాగా మారిపొయ్యింది. శుక్రవారం వస్తోందంటే చాలు పిల్లలు ఎక్కడలేని సంబరాన్ని ప్రదర్శించేవారు. క్రమంగా ఇది పెద్ద పిల్లలకు, బడి మానేసిన అమ్మాయిలకూ పాకింది. వాళ్ళని సభ్యులుగా చేర్చుకుని పుస్తకాలు ఇవ్వసాగాం. ఆ చిన్న ఊళ్ళో మాకు 120 మంది సభ్యులయ్యారు. చినిగిపోయిన పుస్తకాల్ని అతికించడం, అట్టలు వేయించడం, మరీ చినిగిపోయినవి కత్తిరించి ఛార్టులుగా మార్చడం - ఇవన్నీ పిల్లలే చేసేవారు. ఈ అనుభవం మాకు నేర్పిందేమంటే పిల్లల ఉత్సాహానికి తగినన్ని పుస్తకాలు మా వద్దలేవు. ఈ దేశంలో చిన్నారి పిల్లల పుస్తకాల క్కూడా ఎంత దారిద్ర్యమో!

**భోజన విరామంలో పుస్తక పఠనం :**

నా మరో అనుభవం చెపుతా వినండి. మా స్కూల్లో మధ్యాహ్న విరామ సమయంలో నేను ఇలాంటి గ్రంథాలయాన్నే నడిపాను. పుస్తకాలు తీసుకెళ్ళడం ఒక రూంలో తాళ్ళకి వేలాడదీయడం నా పని. పిల్లలు మెల్లగా గుమిగూడ్డం ప్రారంభించేవారు. కొందరు దూరంగా నిలబడి చూచేవారు. కొందరు బొమ్మల్ని తిరగేసేవారు. మరికొందరు తీసుకొని చదివేవారు. ఇలా క్రమంగా నా లైబ్రరీ ‘ జనాదరణ’ పొందసాగింది. లంచ్‌టైంలో నేను స్టాఫ్‌రూంలో లేకుండా ఏమైపోతున్నానో నా తోటి టీచర్లకు కొన్నాళ్ళు తెలిసేది కాదు. ఆ తర్వాత వాళ్ళు అర్థం చేసుకొన్నారనుకోండి. క్రమంగా నేను పుస్తక మిత్రుల్ని తయారుచేసుకొన్నాను. వాళ్ళకి పుస్తకాలు ఇంటికివ్వడం మొదలుపెట్టాను. ఇక్కడ కూడా నన్ను వెంటాడిన సమస్య పుస్తకాల కొరత. మంచి పిల్లల పుస్తకాల కొరత.

చివరిగా ఒక్కమాట. పిల్లలకి పుస్తకాల్ని తమవిగా అన్పించేలా చెయ్యాలి. అంటే వాళ్ళు స్వంతం చేసుకోవాలి. అప్పుడు పిల్లలు పుస్తకాల వెంట పడతారు. పిల్లలు ఈ చిన్న లైబ్రరీల్ని అద్భుతంగా నిర్వహిస్తారు. రెండోది వాళ్ళ ప్రపంచం వాళ్ళకి అందులో కన్పించాలి. అలాంటి పుస్తకాలుండాలి. మూడోది స్వేచ్ఛగా వాళ్ళిష్టం వచ్చినట్లు వాళ్ళు పుస్తకాల్ని వాడుకోనివ్వాలి. చూడ్డం కూడా చదవడమే అని మనం గుర్తించాలి. నాలుగవది పుస్తకాల చుట్టూ మనం రకరకాల కృత్యాలు చేపట్టాలి. పిల్లల ఆసక్తులు, ఆనందాతిరేకాలు, అనుభూతులు రాబట్టాలి. వాటితో భాషను అనుసంధానం చెయ్యాలి. అప్పుడు వాళ్ళ స్వప్నలోకమంతా మన ముందు సాక్షాత్కరిస్తుంది. ప్రాథమికదశలో ఇలా చెయ్యడం భాష నేర్చుకోవడంలో (చదవడం, రాయడంలో) చాలా కీలకపాత్ర వహిస్తుందని మనం నమ్మితేనే ఇలా చెయ్యగలం. వాచకాలు వల్లించడమే భాష నేర్చుకోవడం కాదని మనం ఒప్పుకొంటేనే ఇది సాధ్యం!

*దేన్నించి బయటపడాలి?*

*“జిజ్ఞాస, ప్రశ్నించే స్వభావం ఉన్న తరగతి గదిలో ఉపాధ్యాయుడి పాత్ర ఎలాంటిది?” విజ్ఞానం, విలువలూ, ఆలోచనలూ అన్నీ తాను అందించేవనీ, విద్యార్థి వాటిని జీర్ణం చేసుకోవల్సినవాడు మాత్రమేనని భావించే ఉపాధ్యాయుడు జిజ్ఞాసను రేకెత్తించలేడు. ప్రశ్నించేగుణాన్ని పెంపొందించలేడు. ఉపాధ్యాయుడు విజ్ఞానం అందుకొనే మార్గాన్ని చూపించే సహకారి మాత్రమే. ఆలోచనల్లో వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని అంగీకరిస్తూ, ప్రోత్సహిస్తూ పిల్లలు తమకు తాముగా నిర్ధారణకు వచ్చేలా, విలువలను పెంచుకొనేలా ఉపాధ్యాయుడు తోడ్పడాలి. ఇలా చెయ్యాలంటే మొదటి పిల్లల్నించి ఒకే ప్రశ్నకు పలు సమాధానాల్ని వినడానికి టీచరు సిద్ధపడాలి. ఒకే ఒక్క ‘సరైన’ జవాబు కోసం తాపత్రయపడే అలవాటు నుండి బయటపడాలి”.*

*– డా॥ రోటి.జె.స్కీల్, జోసెఫ్*

# సార్వత్రిక గురువులు

## (Universal Teachers)

## రవీంద్రనాథ్ ఠాగూర్

**(07.05.1861 - 07.08.1941)**



**స్కూ**లంటే పెద్దపులి బోనులాగా, ద్వీపాంతరవాస శిక్షలాగా ఉందని తరచూ రవీంద్రుడు బాధపడేవాడు. బ్రిటిష్‌వారి గుమాస్తాలను తయారుచేసే విద్యా పరిశ్రమ పాఠశాలకు భిన్నంగా, శాంతినికేతన్, విశ్వభారతి విద్యా సంస్థలను స్థాపించి స్వేచ్ఛగా విద్యను ఎలా నేర్చుకోవాలో మనకు నేర్పించారు. మాతృభాషలో విద్యాబోధనను సమర్థించారు రవీంద్రకవి. కేవలం నాలుగు గోడల మధ్య చదువులూ - పరీక్షల ద్వారా సమగ్రజ్ఞానం రాదనీ, స్వయంకృషీ, ఆలోచన ద్వారా మాత్రమే జ్ఞానం సంపాదించాలని అన్నారు. బట్టీపట్టడం విద్యకాదనీ, నేర్చుకోవడంలో పొందే ఆనంద అనుభవమే నిజమైన విద్య అనీ తన శాంతినికేతన్ ద్వారా నిరూపించారు. శాంతినికేతన్‌లో రవీంద్రుని మార్గంలో చదువుకున్న సరోజనీ నాయుడు వంటి ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. విద్యపైన రవీంద్రుడి అద్భుత వ్యంగ్య రచన 'చిలకమ్మ చదువు' ప్రతి ఒక్కరూ చదివితీరాలి.

---

## గాంధీ

**(01.10.1869 - 30.01.1948)**



**ఇం**గ్లాండ్‌లో విద్యాభ్యాసం చేసిన గాంధీ భారతదేశంలో ప్రాతిపదిక విద్య ప్రయోజనాన్ని తన రచనల ద్వారా ప్రచారం చేయడమేకాదు, స్వయంగా తన కుమారుడికీ, ఇతరులకూ విద్యను నేర్పే బాధ్యతను కూడా చేపట్టారు. విద్యార్థులకు వ్యాయామంతోబాటు వృత్తివిద్యానూ నేర్పాలని, ప్రవర్తన వ్యక్తిత్వం, శీలం వంటి వాటి ద్వారా ఆత్మశిక్షణను పొందే విధంగా విద్యార్థులను తయారుచేయాలనీ చెప్పిన గాంధీ విదేశీ భాషలో విద్యాబోధనను తీవ్రంగా వ్యతిరేకించారు. 1937లో సేవాగ్రాంలో గాంధీ స్థాపించిన పాఠశాలలో మూడు గంటల వృత్తివిద్యా శిక్షణ, రెండు గంటలు పుస్తక పఠనమూ తప్పనిసరి. ఉపాధ్యాయులు కేవలం బోధించడమే కాదనీ పాఠాలలోని సారాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యపుస్తకాలకు బానిసల్లా మారకుండా, తమ సొంత అనుభవజ్ఞానంతో బోధించాలని గాంధీ భావించారు.

## మరియా మాంటిస్సోరి

**(31.08.1870 - 06.05.1956)**



ఉపాధ్యాయులే పిల్లల్ని అనుసరించాలనే మాంటిస్సోరి శిశుకేంద్ర విద్యకు ఆద్యురాలు. ఆట పాటలద్వారా విద్యబోధించే ఈ విధానం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమంలా మాంటిస్సోరి బడులు వెలిశాయి. బాలలకు కూడా తమదైన ఒక ప్రపంచం ఉంటుందనీ, అందులో హాయిగా జీవించేహక్కు వారికుందనీ, వారిని పువ్వుల్లా స్వేచ్ఛగా పెంచాలని ఆమె ప్రపంచాన్ని కోరేవారు. వెలుగునిచ్చే తరగతి గదులు. ఉత్సాహాన్ని కలిగించే బోధనోపకరణాలు వంటి కొత్త అంశాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మాంటిస్సోరి ఇటలీ దేశపు తొలి మహిళా డాక్టరు. స్త్రీవాది. ఆరేళ్ళలోపున్న పిల్లల గ్రహణశక్తి పెంచేందుకు, వికలాంగులకోసం నూతన బోధనోపకరణాలు తయారుచేశారు. ఇటలీలో ముసోలినీ ఈమె ఆధ్వర్యంలో స్కూళ్ళను నడిపినప్పటికీ ఆ పిల్లలకు జాతీయ ఉన్మాదాన్ని నూరిపోయడం సహించలేక ఆ బాధ్యత నుండి వైదొలిగారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో మన దేశంలో 6 సంవత్సరాలు జీవించిన మాంటిస్సోరి మన దేశంలో గిజూభాయి వంటి విద్యావేత్తలకు ఆదర్శంగా నిలిచారు

---

## ఎ.యస్.నీల్

**(17.10.1883 - 23.09.1973)**



ప్రస్తుతం అమలులోవున్న పెట్టుబడిదారీ విద్యావిధానంపై విసుగెత్తిపోయిన ఏ.ఎస్.నీల్ అనే స్కాట్లాండ్ ఉపాధ్యాయుడు ఇంగ్లాండులోని ఒక కొండపైన సమ్మర్‌హిల్ అనే స్కూలును ప్రారంభించారు. ఈ స్కూల్లో టైంటేబుల్ లేదు. పరీక్షలు అసలేలేవు. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఈ స్కూలును ప్రయోగాత్మకంగా నడిపారు. ఆడ, మగ పిల్లలకు కలిపి చదువు చెప్పడం ద్వారా వారి మధ్య చెడుప్రవర్తనా సమస్యలు ఉండవని రుజువుచేశారు. ఈ ప్రయోగాత్మక విద్యావేత్త. సహజంగా చురుకుగా, తెలివిగా జన్మించిన పిల్లల్ని నేటి స్కూళ్ళు తమ బట్టీ పద్ధతులతో ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజానికి విధేయుల్లా, బానిసల్లా తయారుచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు నీల్. కఠినమైన క్రమశిక్షణ పిల్లల్ని మేధావులుగా కాదు విలన్లుగా తయారుచేస్తుందంటారు. ఎవరికినచ్చిన అంశాన్ని వారు నేర్చుకునే అవకాశం కల్పిస్తే పిల్లలు స్వేచ్ఛగా ఎదుగుతారనే నీల్ అటువంటి నూతన బోధనాపద్ధతిని పాటించారు. టీచర్లకు మానసిక రుగ్మతలుంటే (ప్రాబ్లం టీచర్) అనే ఆయన రాసిన పుస్తకాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తప్పక చదవాలి.

## గిజూభాయి బగేకా

**(15.11.1885 - 23.06.1939)**



**పి**ల్లల విద్య, మానసిక వికాసాల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన గిజూభాయ్ బగేకా గుజరాత్‌లోని చిట్టల్‌లో జన్మించారు. పిల్లలు ఇతన్ని ఆప్యాయంగా 'మీసీల అమ్మ' అని పిలిచేవారు. 1922లో కస్తూర్బాగాంధీతో కలసి బాలమందిర్‌ను స్థాపించిన గిజూభాయి మాంటిస్సోరి విద్యా పద్ధతిని ప్రచారం చేసేందుకు పలు సభలు నిర్వహించారు. పిల్లల మానసిక వికాసం, పెంపకం వంటి అంశాలపై గిజూభాయి ఎన్నో పుస్తకాలు రాశారు. పిల్లల అభివృద్ధి ఆయా పౌర సమాజాలపై ఆధారపడి ఉంటుందని, ఏ దేశపు అభివృద్ధినైనా నిర్ధారించాలంటే ఆ దేశంలోని పిల్లల జీవితాల్ని ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పారు గిజూభాయి. ప్రాథమిక విద్యారంగంలో అమూల్యమైన మార్పులకు ఆద్యుడయ్యారు. పిల్లలలో ప్రేరణ కల్పించడం - నైతిక విలువలతో ఉండం, సామాజిక బాధ్యతను కలిగివుండడం. ఉపాధ్యాయుని కనీస అర్హతలుగా గిజూభాయి పేర్కొంటారు. "భారత విద్యా రంగానికి గిజూభాయి ఆదర్శం" అని పలువురిచే మన్ననలు అందుకున్న మహోన్నతుడు మన గిజూభాయి. తన అనుభవాలను క్రోడీకరించి 'పగటికల' వంటి పలు పుస్తకాలు రాశారు.

---

## మకరెంకో

**(13.01.1888 - 01.04.1939)**



**అ**ల్లరి పిల్లల్లో సైతం అద్భుత మార్పులు తీసుకువచ్చిన ఆచరణశీలి మకరెంకో. విప్లవానికి పూర్వం రష్యాలోని దోపిడీ వ్యవస్థలో దొంగలుగా తయారైన పిల్లల్ని, వేలాది యువజనుల్ని విద్యా శిక్షణ ద్వారా మేధావులుగా తయారుచేసే లోకాన్ని ఆశ్చర్యపరిచారు మకరెంకో. విద్యాబోధన శాస్త్రం అన్ని శాస్త్రాలకన్నా ప్రాముఖ్యమైనదనీ, ఉపాధ్యాయులు సమిష్టికృషి చేయడం ద్వారా మాత్రమే బాలబాలికలను ఆదర్శ పౌరులుగా తయారుచేయగలరనీ, నిజమైన విద్యాబోధన వ్యక్తిని సమిష్టిగా మారుస్తుందనీ అంటారు. సమిష్టి విద్యా బోధనలో వ్యక్తిగత శ్రద్ధ అంతర్భాగమనీ, విద్యను బోధించే సాధనాలన్నీ పరిస్థితులకు అనుకూలంగా మారుతూ ఉండాలనీ, నిరంతర అధ్యయనం, శిక్షణ, అనుభవం ద్వారా మాత్రమే మంచి విద్యాబోధనా నైపుణ్యం అలవడుతుందనే మకరెంకో మాటలు ఉపాధ్యాయ లోకానికి అనునిత్య ఆచరణ సూత్రాలు. విద్యపైన 100కు పైగా పుస్తకాలను మకరెంకో రాశారు.

## జ్యోతిబా పూలే (11.04.1827 - 28.11.1890)
## సావిత్రీబా పూలే (03.01.1831 - 10.03.1897)



**అం**బేద్కర్‌కి గురువైన జ్యోతిబాపూలే విద్యార్థి దశ నుంచే సమాజంలో అసమానతలకు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. శూద్రకులస్తుల కోసం దేశంలో మొట్టమొది పాఠశాల పూలే స్థాపించారు. అణగారిన ప్రజల కోసం ఎన్నో గ్రంథాలయాలనూ, పాఠశాలలనూ ప్రారంభించిచి గొప్ప రచనలు చేశారు. తన భార్య సావిత్రీబా పూలేకి చదువు నేర్పించి ఆమె చేత బాలికల పాఠశాల ప్రారంభించారు. ఆ పాఠశాలలోనే సావిత్రి టీచర్‌గా మారి దళిత బాలికలకు పాఠాలు నేర్పారు. మన దేశ మొదటి స్త్రీ ఉపాధ్యాయురాలు సావిత్రే. ఎన్నో అగ్రకుల, పెత్తందార్ల, రౌడీల పీడననూ, అవమానాన్ని ఎదుర్కొంటూ ఆమె ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. తమ కాలంలో దళిత, అణగారిన జనం అభ్యున్నతి కోసం ఈ దంపతులు తమ ఆస్తినీ, జీవితాన్ని త్యాగం చేసి విద్య నేర్పించడం ద్వారా దళిత, శూద్ర సమాజాలలో విప్లవాత్మకమైన ఆలోచనా విధానం చోటు చేసుకొనేందుకు ఆద్యులయ్యారు. విద్యను ఆయుధంగా అసమాన సమాజంపై ఎక్కుపెట్టిన ఘనులు ఈ దంపతులు.

---

## సొసాకు కొబయాషి
## (18.06.1893 - 1962)



**త**మకళ్ళముందు జరిగే విషయాలను చూసి పిల్లలు నేర్చుకొంటారని. అందుకు తగినట్లుగా వాస్తవికంగా బోధించాలనే కొబయాషి టోక్యోలో జన్మించారు. ఇందుకోసం టోక్యోలో ఏకంగా రైలుబడి అనే పాఠశాలను ప్రారంభించారు. 7 రైలు పెట్టెలే ఈ బడి తరగతి గదులు. రైతులు, కార్మికులు, చేతిపనివారు కూడ అధ్యాపకులే. ఏ రోజుకారోజు, ఏ పాఠ్యాంశాలు నేర్చుకోవాలో చెబుతారు. పిల్లలు ఇష్టం వచ్చిన సబ్జెక్టును నేర్చుకోవచ్చు. రోజూ షికార్లు, ఆట, పాటలూ, సంగీతం తప్పనిసరి. తిట్టం, కొట్టడం, అవమానించడం, ఒక బిడ్డతో ఇంకొకర్ని పోల్చడం నిషేధం. క్రమబద్ధమైన సంగీతంలా ఈ స్కూలు నడిచిన తీరును టెట్సుకో కురొయనాగి అనే రచయిత్రి 'రైలుబడి' అనే పుస్తకంగా రాశారు. ఈమె కూడా ఆ స్కూల్‌లో చదివిన విద్యార్థే. ఒక అజరామమైన విద్యావిధానాన్ని రైలుబడి ద్వారా ప్రవేశపెట్టిన కొబయాషి సంగీతపట్టభద్రుడు. 1945లో టోక్యోపై జరిగిన బాంబుదాడిలో ఈ పాఠశాల సర్వనాశనమైంది. మనకూ ఇటువంటి బళ్ళు ఉంటే మన పిల్లఉ అసలు ఇంట్లో నిలుస్తారా?

## పాలో ఫ్రేరి

**(19.09.1921 - 02.05.1997)**



ప్రస్తుతం అమలులో ఉన్న విద్యావిధానం బానిసలకు బానిసలనే తయారుచేస్తుందని నినదించి - పీడితతాడిత ప్రజల ముంగిటకి విద్యను నడిపించిన ఘనుడు ఫ్రేరి. పీడితులగు పేదలకు పాలక వర్గాల విద్య సరిపోదని - నిత్యమూ వారెదుర్కొంటున్న పీడనను సంఘటితంగా నిరోధించే విద్యను వారికందించారు ఫ్రేరి. ఈ భావాలతో ఫ్రేరి రాసిన 'పెడగాగి ఆఫ్ ది అప్రెస్ట్' 19 ప్రపంచ భాషల్లోకి (తెలుగులో 'పీడితుల విద్యాశాస్త్రం') అనువాదమై విద్యావేత్తల సంప్రదాయ ఆలోచనా పునాదుల్ని కదిలించింది. దీనితో ఫ్రేరిని బ్రెజిల్ నుంచి వెళ్ళగొట్టారు. పిల్లలు సమాచారాన్ని వల్లెవేసే యంత్రాలు కారనీ, ఉపాధ్యాయుడు సమాచారాన్ని నింపే పనివాడుకాదనీ, ఇదంతా బ్యాంకింగ్ విద్య అనీ అవహేళన చేస్తారు ఫ్రేరి. పీడితులకు చదువు అధ్యయనం నుంచే కాదు. పోరాటం ద్వారానే సాధింపబడుతుందని చెప్పే ఫ్రేరి విద్య గురించీ, సంస్కృతి గురించి చేసిన లోతైన పరిశోధనా విశ్లేషణలు ఈ దోపిడీ వ్యవస్థను పునాదులతో సహా కదిలించి పెకలించివేస్తాయి.

---

## ఎస్.ఏ.వార్నర్

**(17.12.1905 - 28.04.1984)**



మన దేశంలోని గిరిజనులకంటే వెనకబడిన జాతి న్యూసిలాండ్‌లోని 'మొయిరీ' జాతి. నిత్యమూ యూరోపియన్ దోపిడీ పదఘట్టన కింద నలిగిపోయే ఈ జాతి వారి బుర్రలకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన పద్ధతులు కనిపెట్టి వారిని విద్యావంతుల్ని చేసిన సృజనశీలి ఎస్.ఏ.వార్నర్. ఈ క్రమంలో ఆమె రూపొందించిన బోధనాపద్ధతే ఆర్గానిక్ టీచింగ్. ఈమె మెయిరీలపైన యూరోపియన్ పాఠ్యపుస్తకాలను రుద్దకుండా వారి ప్రకృతి జీవనంలోని వివిధ అంశాల నుండే సులభంగా వారికి విద్యను నేర్పించి వారికోసం ప్రత్యేకంగా ఎన్నో శిశుమందిరాలను స్థాపించారు. వారికి తెలిసిన పదాలతోనే అంచెలంచలుగా వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దింది. బోధనలో ఈమె ఆవిష్కరించిన సూత్రాల ఆధారంగానే ప్రముఖ విద్యావేత్త పాలోఫ్రెయిరీ అణచివేతకు గురవుతున్న పీడితులకోసం విద్యాబోధన సూత్రాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చి బ్రెజిల్ యువతను విద్యావంతుల్ని చేశారు. ప్రపంచ విద్యాబోధనలో వార్నర్‌కృషి అపురూపం. అనితరసాధ్యం.

## సుహోమ్లీన్స్కీ

**(1918 - 02.09.1970)**



**నే**టి చదువులు పిల్లలలోని సృజనాత్మకతను చంపే హింసా విధానంగా ఉన్నాయని చెప్పే సుహోమ్లీన్స్కీ నిస్సారమైన యాంత్రిక బోధనకు ప్రత్యామ్నాయంగా జీవశక్తిగల పద్ధతులను కనిపెట్టి ప్రచారంచేశారు. బోధన అంటే పిల్లల బుర్రల్లోకి విసయపరిజ్ఞానాన్ని బలవంతంగా చొప్పించడం కాదనీ, పిల్లలు బుద్ధితోనే కాదు హృదయంతో కూడా నేర్చుకుంటారనీ, పిల్లలు ఇళ్ళ దగ్గర కోల్పోయిన బాల్యాన్ని పాఠశాల వారికివ్వాలనే సుహోమ్లీన్స్కీ తన అనుభవాలను క్రోడీకరించి విద్యాబోధనపై 'పిల్లలకే నా హృదయం అంకితం' అనే అద్భుతపుస్తకాన్ని రాశారు. తన అనుభవసారమే బోధనా పద్ధతిగా 'సంతోషచంద్రశాల' అనే పిల్లలబడిని పల్లెప్రకృతిలో నడిపిన సుహోమ్లీన్స్కీ పిల్లల విద్యావేత్తేకాదు - రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ నాజీ సేనలపై వీరోచితంగా పోరాడి తన భార్యను, బిడ్డను పోగొట్టుకొన్ని యుద్ధ యోధుడు కూడా.

---

## జాన్ హోల్ట్

**(14.04.1923 - 14.09.1985)**



**వి**ద్యార్జనకు స్కూలే అవసరంలేదనే విప్లవాత్మక విద్యాబోధనా పద్ధతికి మార్గదర్శకులు జాన్ హోల్ట్, మన పిల్లలు బడి అంటే ఎందుకు భయపడతారు? చదవమంటే మొండికెందుకు వేస్తారు? లాంటి అనేక అంశాలపై జాన్‌హోల్ట్ చేసిన పరిశోధనలు ప్రస్తుత విద్యా విధానంలోని డొల్లతనాన్ని, దోపిడీ తత్త్వాన్ని నగ్నంగా మనముందు నిలబెడతాయి. ఈ దోపిడీ వ్యవస్థలోని పాలకులు తయారుచేస్తున్న సిలబస్ మూలంగా పిల్లలు ఎలా నాశనం అవుతున్నారో, ఉపాధ్యాయ శిక్షణ నిస్సారంగా ఎలా మారుతుందో, అంతిమంగా పాఠశాలలు మానసిక వ్యాకులత కలిగించే పిచ్చాసుపత్రుల్లా మారిపోయి బిడ్డల ఆత్మహత్యలకు ఎలా కారణమవుతున్నాయో తన రచనల్లో అద్భుతంగా వివరించారు హోల్ట్. నేర్చుకోవడం పిల్లల సహజనజం అనీ, తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ వారికి సహకరిస్తే చాలనే హోల్ట్ పిల్లల కుటుంబాలలో కలిసిపోయి వారికి అభద్రతలేని విద్యనూ, వివేకాన్ని బోధించిన అభ్యుదయ విద్యా పథగామి.

## నీల్‌బాగ్ డేవిడ్

**(18.08.1921 - 08.08.1984)**



గ్రామీణ తెలుగు విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూలును స్థాపించిన ఘనులు డేవిడ్ హార్స్బరో. ఈయన భారతీయ దంపతులకు ఇంగ్లాండ్‌లో జన్మించారు. భారతదేశంపై మమకారం పెంచుకున్న ఈయన బ్రిటిష్ కౌన్సిల్ ఉద్యోగిగా మద్రాసు కార్పొరేషన్ స్కూళ్ళ పిల్లలకోసం పాఠ్యపుస్తకాలు రూపొందించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ఋషివ్యాలి, నీలగిరి, బ్లూమౌంటెన్ స్కూళ్ళలో కొంతకాలం పనిచేశారు. ఆతర్వాత కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులలో 'నీల్‌బాగ్' పేరుతో స్కూలు స్థాపించారు. క్లాసుల వారీ విభజన లేకుండా పిల్లల నుండి ఇరవై సంవత్సరాల పెద్ద పిల్లల వరకు ఒకేచోట కలిసి చదువుకోవడం ఈ స్కూలు ప్రత్యేకత. నేర్చుకోవడానికి తమకంటే చిన్నవారికి పెద్ద పిల్లలు సాయపడతారు. ఉపాధ్యాయులు కేవలం పర్యవేక్షకులు మాత్రమే. సంగీతం, కవిత్వం, లలితకళలు, మట్టి బొమ్మలు చేయడం, కొయ్యపని వంటివి పిల్లల పాఠ్యక్రమంలో భాగాలు. శారీరక, మేధో(శ్రమలను ఏకం చేసి శ్రమ గౌరవాన్ని అనుభవ పూర్వకంగా అర్థం చేయించే విద్యావిధానం ఈ స్కూలు ప్రత్యేకత. తన కొడుకుతో కలిసి డేవిడ్ పిల్లల కోసం వందకు పైగా పుస్తకాలు రాశారు.

GRK